
భక్తులు

జీవిత చరిత్ర

భాగవత పంచ రత్నములు


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **ద్వారకాదీష్ వాస్తు** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **ద్వారకాదీష్ వాస్తు** వారి వెబ్ సైట్: http://dwarkadheeshvastu.com
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt


ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్:


http://dwarkadheeshvastu.com



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

श्रीमद् भागवत

पंचरत्न

(तेलुगु)

విషయసూచిక

భాగవత భక్తితత్త్వము

ఓం శ్రీ పరమాత్మనే నమః

శ్రీమద్ భాగవత పంచరత్నములు

(అనుబంధము - భాగవత భక్తితత్త్వము)

ఒకనాడు బ్రహ్మమానసపుత్రులైన సనక సనందాదులు త్రిభువనములు సంచరించుచు, ఐదారేండ్ల బాలకులరూపమున వైకుంఠములోని శ్రీహరి నివాసమందిరమున ప్రవేశించుచుండగా అచ్చట ద్వారపాలకులైన జయవిజయులనబడు విష్ణుసేవకులు వారినడ్డగించి, అవమానించగా, ఆ బాలఋషులు కోపగించుకొని ఇట్లు శపించిరి: “మీ వంటి దుశ్శీలురు వైకుంఠమున నుండనర్హులు కారు గనుక నారాయణ చరణ సన్నిధికి దూరులై అసురులై జన్మింతురుగాక!” అప్పుడు ఆ ద్వారపాలకులు తమ తప్పిదమును తెలుసుకొని మొఱపెట్టగా, ఆ ఋషిశ్రేష్ఠులు కరుణించి, “మూడు జన్మల విష్ణు వైరమనంతరం, మరల విష్ణుసాన్నిధ్యమును పొందగలరని అనుగ్రహించిరి. ఆ ప్రకారము వారు మొదట హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగను, రెండవ జన్మలో రావణ కుంభకర్ణులుగను, చివరి జన్మలో శిశుపాల దంతవక్త్రులుగను జన్మించి, విష్ణుద్వేషులై శ్రీహరిచే సంహరింపబడి శాపవిమోచనులైరి.

హిరణ్యాక్షుడు తన భుజబల గర్వమదాంధుడై, తన్నెదుర్కొనిపోరగల వీరాధివీరుడెవడైనా కలడాయని, భూలోకమును, వరుణలోకమును, స్వర్గలోక వైకుంఠములను వెదకి వెదకి, యెవ్వరినీ గానక వైకుంఠుడొక్కడే తనతో పోరగలవాడని విని, అతడప్పటికి పాతాళ లోకమునకు వెళ్లి యుండెనని తెలుసుకొని, క్రోధావేశుడై పాతాళమునకు పోయెను. అచ్చట శ్రీహరి వరాహరూపమున భూమిని తన కోరలపై నిడుకొని సముద్ర ఉపరితలమునకు కొనిపోవుచుండెను. హిరణ్యాక్షుడా వరాహరూప శ్రీహరి నెదుర్కొని నానా దుర్భాలషలతో వదురుచూ, యుద్ధమునకు రమ్మనెను. శ్రీహరి భూమిని నీటిపై స్థిరముగా నిలిపి, రాక్షసునితో యుద్ధము చేసెను. ఆ ఘోరయుద్ధములో హిరణ్యాక్షుడు శ్రీహరి చక్రాయుధమునకు బలి అయ్యెను. సోదరుని సంహరించిన శ్రీహరిపై హిరణ్యకశిపుడు, ద్వేషము, శత్రుత్వములను పెంచుకొని, తన అనుచరులను విష్ణువుయొక్క ఉనికి గురించి తెలుసుకొని రమ్మనెను. ఆ విష్ణువు, విప్రులుండే చోట్లలోనో, యజ్ఞస్థలములలోనో,

తపోవనములలోనో ఉండునని, వాటిని ధ్వంసము చేసినచో అతడు నశించునని, కనిపించిన దేవతలను, మునులను, బ్రాహ్మణులను, గోవులను హతమార్చవలెనని ఆదేశించెను. ఆ రాకాసి మూకలు ముల్లోకములలోను విధ్వంసక కాండను కొనసాగిస్తూ బీభత్సమును సృష్టించిరి. దేవతలకు నిలువనీడలేక ఇంద్రునితో సహా, ఎక్కడెక్కడికో పారిపోయిరి. హిరణ్యకశిపుడు మృత్యువును జయించునుద్దేశముతో నెవ్వరును చేసియుండనట్టి ఘోరతపస్సు నాచరించెను. ఆ తపశ్శక్తి యొక్క ఉగ్రతచే లోకములు తల్లడిల్లెను. సముద్రములు అల్లకల్లోలమయ్యెను. గ్రహతారకలు గతులు తప్పెను. దేవతలు భీతిజెంది, యీ ఉపద్రవమును నివారింపుమని బ్రహ్మదేవుని వేడుకొనిరి. బ్రహ్మ హిరణ్యకశిపుని, తపస్సు చాలించవలసినదిగా కోరెను. హిరణ్యకశిపుడు ఒక అద్భుతమైన వరము కోరుకొనెను. ఈ ముల్లోకములలో తానెక్కడికి వెళ్లినను విజయమే కలుగవలెను, బ్రహ్మచే సృష్టింపబడిన ఏ ప్రాణిచేతనైనను తనకు మరణం కలుగకూడదు. గాలిలోనుగాని, నీటిలోగాని, నింగిలోగాని, నిప్పులోగాని, నేలపైగాని, ఇంటా బయటా గాని, చీకటి వెలుగులలోగాని, అస్త్ర శస్త్రాలవలనగాని, దేవదానవ నర జంతునాగుల వలనగాని తనకు మరణం కలుగ కూడనట్టివరము కోరుకొనెను. అట్టి అపూర్వమైన వరమును దుర్వినియోగ పరచవద్దని హెచ్చరించి బ్రహ్మదేవుడు తథాస్తు చెప్పెను. వరమును పొందిన హిరణ్యకశిపుని అహంకారమునకు అవధులు లేకుండెను. మూడు లోకములలోని ప్రాణులను హింసింపసాగెను. దిక్పాలకులను తరిమివేసి వారి రాజధానుల నాక్రమించెను. దేవేంద్రుడు భయముతో పారిపోయెను. ఇంద్రుని సింహాసనమును, రాజమందిరమును ఆక్రమించెను. దేవతలు భయపడి, అతని ఆజ్ఞలను పాటింపసాగిరి. అతడు పెట్టు బాధలను భరింపలేక దేవతలు, శ్రీహరితో మొఱపెట్టుకొనిరి. అప్పుడు శ్రీహరి వాక్కు ఇలాగ వినబడినది: "దేవతలారా! భయపడవలదు. ధర్మము తప్పినవాడు, నన్ను, వేదములను నిందించువాడు, సాధుసజ్జనులను, గోవులను, హింసించువాడు, అచిరకాలములోనే పతనమైపోవును. సకల సద్గుణభూషణుడు, నా భక్తుడు అయిన ప్రహ్లాదునికి మితిమీరిన హింసలను పెట్టునప్పుడు ఆ దానవుని అంతమాసన్నమైనట్లు గ్రహించుడు. అంతవరకు ధైర్యము వహించుడు" అని వినిపించెను.

1. ప్రహ్లాద చరిత్ర (సప్తమ స్కంధము)

యుధిష్ఠిరునిచే చేయింపబడిన రాజసూయ యాగమునకు వచ్చిన నారదమహర్షి ధర్మనందనునకీ ప్రహ్లాదచరిత్ర నీవిధముగ చెప్పెను :

రాజా! హిరణ్యకశిపునకు నలుగురు పుత్రులుండిరి. వారిలో ప్రథముడు ప్రహ్లాదుడు. అతడు సాటిలేని హరిభక్తుడు, పరమభాగవతుడు, నారాయణ తత్త్వమును బాగుగ నెఱిగియున్నవాడు. ఇంకా ఎలాంటి వాడంటే -

సీ. తనయందు నఖిలభూతములందు నొకభంగి
సమహితత్వంబున జరగువాఁడు
పెద్దలఁ బొడగన్న భృత్యునికైవడిఁ
జేరి నమస్కృతుల్ సేయువాఁడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన
మాతృభావము సేసి మరలువాఁడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను
దీనులఁ గావఁ జింతించువాఁడు.

తే. సఖులయెడ సోదరస్థితిజరుపు వాఁడు
దైవతము లంచు గురువులఁ దలఁచువాఁడు
లీలలందును బొంకులు లేనివాఁడు
లలితమర్యాదుఁడైన ప్రహ్లాదుఁ డధిప.

రాజా! ప్రహ్లాదుడు సమస్తప్రాణులు, తనవంటివేనని వానియందు సమసుహృద్భావమును కలిగియుండెను. పెద్దలెదురైనచో సేవకునివలె నమస్కరించు వినయశీలి, పరస్త్రీ లెదురైనచో మాతృభావముతో తొలగిపోవు శీలవంతుడు, దీనులను తల్లిదండ్రులవలె ధర్మవత్సలతతోఆదరించ దలచువాడు, సాటివారిని సోదరభావముతో చూచు సహృదయుడు. గురువులను దైవ సమానులుగా భావించువాడు. వినోదము కొఱకైనను అసత్యము లాడనివాడు, ఇటువంటి ఉత్తమ సత్త్వగుణ సంపన్ను డీ ప్రహ్లాదుడు

సుమా! అతడు సుందరాకారుడును, చక్రవర్తి తనయుడును, విద్యావంతుడును, శ్రేష్ఠుడును అయి యున్నప్పటికినీ, గర్వాహంకారములకు లోనుగానివాడు. సకలవిషయ భోగభాగ్యముల మధ్య మసలుచున్నను, ఇంద్రియముల ప్రభావమునకు వశముకానట్టివాడు. యౌవన బలోపేతుడైనను కామక్రోధాదులను దరిజేరనివ్వనివాడు. స్త్రీ సంపర్కావకాశము లెంత సులభమైనను వానియందు ఆపేక్ష జూపనివాడు. ప్రాపంచిక శబ్దస్పర్శాది విషయములయందెట్టి వాంఛయు లేనివాడు. రాజా! ఈ దైత్యకుమారుడన్యమేమీ యెఱుంగక శ్రీహరి చింతనా మగ్నుడై యుండెను.

ఆ. సద్గుణంబు లెల్ల సంఘంబులై వచ్చి
యసుర రాజతనయునందు నిలిచి
పాసి చనవు విష్ణుఁ బాయనివిధమున
నెమ్మి దగిలి యుండు నిర్మలాత్మ.

ఓ నిర్మలాత్మా! ధర్మనందనా! ఈ అసురరాజపుత్రునియందు, సద్గుణములన్నీ సమూహముగ వచ్చి నిలిచిపోయినట్లున్నవి. అవి, విష్ణువును విడిచిపోలేని భక్తులవలె, ప్రహ్లాదునియందే ప్రీతితోడ విడిచివెళ్లకుండ నిలిచిపోయినవి. అసుర శత్రువులైన ఇంద్రాది దేవతలు కూడ తమ సభలలో, 'ప్రహ్లాదునితో సమమైన సుగుణోపేతులను మేమెన్నడు నెఱిగియుండము'' అని కవిశ్రేష్ఠులవలె పొగుడుచుండగా, ఓ మహారాజా! మీవంటి ఉత్తమ భగవద్భక్తులా రాక్షస రాకుమారుని కీర్తింపకుండ నుండగలరా? గుణనిధియైన ఆ ప్రహ్లాదుని గుణగణము లనేకములు కలవు. వాటిని లెక్కించుటకు వెయ్యితలల ఆదిశేషువునకు గాని దేవగురువైన బృహస్పతికిగాని, వాణీపతియైన బ్రహ్మదేవునికిగాని ఎంతకాలము ప్రయత్నించినా సాధ్యపడదు. ఇటువంటి సద్గుణభూషణుడైన ప్రహ్లాదునియందు వాసుదేవుని యెడల సహజభక్తి, నిరంతర ధ్యానరతి మెండుగనుండెను.

అట్టి ధ్యానమగ్నుడైయుండు తరుణమున, శ్రీహరి తన్నుజేరినట్లైన, తాను తన - స్నేహితులను చేరమఱచును, శ్రీహరి తనతో నాటలాడునట్లైన, తాను

తన స్నేహితులతో ఆటలాడ మఱచును, భక్తవత్సలుడైన శ్రీహరి తనతో సంభాషించి నట్లైన, తాను ఇతరుల మాటలకు బదులు చెప్పమఱచును. శ్రీహరి తన హృదయములోనికి చూచినట్లైన తాను సమస్తమును జూడమఱచును. శ్రీహరి పాదపద్మముల యందు చింతనామృతముచే నంతరంగము నిండినట్లైన అతడు ఆనందపూర్ణుడై సర్వమును మఱచి జడత్వములేని జడునివలె నుండును. మఱియును,

శా. పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాసలీ
లానిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీనారాయణపాదపద్మ యుగళీచింతామృతాస్వాదసం
ధానుండై మఱచెన్ సురారిసుతుఁ డేతద్విశ్వమున్ భూవరా

ఓ భూమీశా! ఆ ప్రహ్లాదుడు అన్నపానము లారగించుచున్నప్పుడును, వినోదించునప్పుడును, నిద్రకుపక్రమించునప్పుడును, తిరుగుచున్నప్పుడును, చూచుచున్నప్పుడును, శ్రీహరియొక్క పాదపద్మముల చింతనామృతమును, నిరంతరము గ్రోలుచున్నవాడై ఈ విశ్వమునే మఱచిపోవుచుండును.

సీ. వైకుంఠ చింతా వివర్జిత చేష్టుఁడై యొక్కఁడు నేడుచు నొక్కచోట
నశ్రాంతహరిభావనారూఢచిత్తుఁడై యుద్ధతుఁడై పాడు నొక్కచోట
విష్ణుఁ డింతియ కాని వేఱొండు లేదని యుత్తిలి నగుచుండు నొక్కచోట
నలినాక్షుఁడను నిధానముఁ గంటి నేనని యుబ్బి గంతులు వైచు నొక్కచోటఁ

ఆ. బలుకు నొక్కచోటఁ బరమేశుఁ గేశవుఁ
బ్రణయహర్ష జనితబాష్పసలిల
మిళితపులకుఁడై నిమీలితనేత్రుఁడై
యొక్కచోట నిలిచి యూరకుండు.

ఆ ప్రహ్లాదుడు విష్ణుమూర్తి చింతనలో మునిగి చేష్టలుడిగినవాడై, ఒక్కచోట ఒక్కడూ కూర్చొని ఏడ్చేవాడు. నిర్విరామమైన శ్రీహరి చింతనతో నిండిన మనస్సుతో గొంతెత్తి గానము చేసేవాడు వేఱొకచోట. అంతా విష్ణుమయమేగాని వేఱేమియును లేదని నొక్కివక్కాణించుచు నవ్వెడి

వాడింకొకచోట. "పద్మాక్షుడనే పెన్నిధిని కనుగొంటినేను" అని పొంగి గంతులు వేయును వేఱొకచోట. పరమేశ్వరుడైన కేశవునితో స్వగతముగ మాట్లాడు నొకచోట. ప్రేమపూరిత భక్తిపారవశ్యములో మైమరచి ఆనందబాష్పములు రాల్చుచు పులకిత శరీరుడై నిమీలితనేత్రుడై నిల్చొనియుండు నింకొకచోట.

ఈ విధముగ పూర్వజన్మలయందు సంప్రాప్తమైన పరమభాగవతుల సాంగత్యముచే లభించిన ముకుంద చరణారవింద సేవానిరతిచే వికసించిన మోక్షకాంక్షను పెంపొందించుకొనుచు, అసుర సంపర్కముచే, తన చిత్తమును అన్యాక్రాంతము కాకుండ నదుపు నందుంచుకొనుచు, సంసారబంధమును తొలగించుకొనుచునుండు బుధజనవిధేయుడును, సుగుణ మణిశ్రేష్ఠుడును, పరమభాగవతోత్తముడును, పవిత్రుడును అయిన సుపుత్రునితో శతృత్వము వహించి, రాక్షసరాజు కొంచెమైనను కరుణలేక చంపింప బూనుకొనెను - అని చెప్పిన నారదునితో ధర్మజు డిట్లనెను :

"నారదమునీంద్రా! పుత్రులు (తాము చెప్పెడి బుద్ధులను) నేర్చినను, నేర్వకున్నను తండ్రులు వారినెల్లప్పుడును పోషింపవలెను, మఱియు వారికి స్నేహభావముతో బుద్ధిజెప్పి చెడు ప్రవర్తనను నివారింపవలెనేగాని, యెన్నడును శతృత్వమును వహింపరాదుకదా! మరి యా సౌజన్యరత్నాకరుడును, లోకపవిత్రుడును అయిన పుత్రుని బాధలుపెట్టుటకు ఆతండ్రి యెట్లు పూనుకొనెనో! శ్రీహరిపాదపద్మ చింతనలోనే రమించువాడును, కృపాళువు, గురువులకు, సాధువులకు తలవంచి నమస్కరించు వినయశీలుడును, సజ్జనులచే నుతింపబడువాడును, మోహమును తొలగించుకొన్నవాడును, విశాలమైన కీర్తిగలవాడును అయిన ఆ బాలుని ఏ కారణముచేత తండ్రి చంపించదలచెనో నాకు చెప్పుడు" అనిన నారదుడిట్లు చెప్పెను:

ఒకనాడు హిరణ్యాకశిపుడు తన పుత్రుని గురించి యిట్లు తలపోసెను. "వీడు నాకు లభ్యమైన సురలోకాధిపత్యమును గురించి లక్ష్యపెట్టుటలేదు (గుర్తించుటలేదు). ఎల్లప్పుడును గృహమందే స్తబ్దుడై బలహీనునివలె జడునివలె నుంటున్నాడు. వీనిని విద్యాభ్యాసమునందు నియోగించినగాని వీని మతి చుఱుకు అవదు - అని తలంచి పుత్రుని దగ్గర చేర్చుకొని యిట్లనెను:

"నాయనా! చదువులేని వాడజ్ఞానియై యుండును. చదువుకున్నచో సదసత్ (మంచిచెడుల) వివేకము, చతురత కలుగును. అందుచేత అందరూ చదువుకొనవలెను. నిన్ను పెద్దలవద్ద చదివించెదను. చదువుకొనుము తండ్రీ! అని చెప్పి, అసురుల పురోహితుడైన శుక్రాచార్యుని పుత్రులైన చండామార్కులను రావించి, వారితో ఇట్లనెను: ఓ గురువర్యులారా! ఈ బాలుడంధునివలె ఉంటున్నాడు, మంచి వాక్కులేవీ చెప్పడు. (విద్యాగంధము లేని జడునివలె నున్నాడు). నా యొక్క శౌర్యప్రతాపముల ప్రభావమాతనిపై నేమియును లేదు. మీరు గురువులు, కరుణాచిత్తులు, గౌరవనీయులు, మా మాట మన్నించి, యీ బాలునకు చదువుచెప్పి, నీతులు నేర్పి, గ్రంథములు చదివించి, రక్షింపుడు అని పలికి, వారికి ప్రహ్లాదుని అప్పగించినంతనే, వారాబాలుని తోడ్కొనిపోయి, సమవయస్కులగు ఇతర బాలురతో చేర్చి, అతనికి మిక్కిలి శ్రద్ధతో పాఠ్యయోగ్యములైన అనేకశాస్త్రములను చదివింపించిరి. ఆ బాలుడు వాటినన్నిటినీ నిశ్చలమైన విష్ణుభక్తిగలవాడై నేర్చుకొనెను. గురువులేవిధమున నేర్పించిన, నా విధముగనే, యెట్టి అడ్డ ప్రశ్నలను వేయకుండ, అవియన్నియు మిథ్యాపాఠములే యని తెలిసియుండియు నేర్చుకొనెను. అంత, కొన్ని దినములపిదప, ఆ దానవ రాజు, పుత్రునికి గురువులేమేమి నేర్పిరో, బాలుడేమి నేర్చుకొనెనో, నెఱుంగగోరి రాజమహాసౌధములో ఆసీనుడై, మిక్కిలి సంతోషముతో ప్రహ్లాదకుమారుని పిలుపనంపెను. ఆ బాలుడు, ఎట్టివాడన - సంసారమహాసాగరమును తరింపజేయువాడును, కామక్రోధాది అరిషడ్వర్గమును రూపుమాపువాడును, పాపములనెడి అరణ్యమును నరికివేయు గొడ్డలివంటివాడును, అగు ఆ శ్రీహరిని గురించి కఠోరమైన ధ్యానమగ్నుడై హరి చింతనామృతము ఆస్వాదించుచుండువాడు. ప్రహ్లాదుడు వచ్చి చెంత జేరగానే వత్సా! రమ్మని దగ్గరకు చేరదీసి, సంపూర్ణమైన వాత్సల్యముతో తొడపై కూర్చుండబెట్టుకొని, దానవప్రభువు అత్యంత కుతూహలముతో పుత్రుని యిట్లడిగెను. "నాయనా! నీవు, గురువులనుండి, ఉత్సాహము, పట్టుదలతో కృషిచేసి, నేర్చుకొని, ప్రభుమంత్ర శక్తియుతుడవై జ్ఞానసంపన్నుడవైతివా? వేదములు శాస్త్రములు చదివితివా? నాయనా! పుత్రులతో సంభాషణములు, దినదినమూ ఉత్పన్నమగుచుండు కర్మజనిత శ్రమలు, తాపములు,

దుఃఖములను శోషింపజేయునవి, సంతోషము కలుగజేయునవి, తండ్రులకు కర్ణభూషణము లగును కదా! నాయనా! నీకు ఏది మిక్కిలి శ్రేష్ఠమనిపించు చున్నదో దాని గురించి నాకు జెప్పుమయ్యా! అని ప్రేమతో తండ్రి యడిగిన ప్రశ్నకు ప్రియనందను డిట్లు చెప్పెను:

ఓ దైత్యశ్రేష్ఠా! "ఇల్లు' యనబడు చీకటి నూతిలో పడి కొట్టుకొనకుండ, మీరు, మేము, అను భ్రమలోను, భేదభావముతోను ప్రవర్తింపక, సర్వమూ ఆ శ్రీహరియొక్క దివ్యలీలామయమనీ, యాతనిని మనస్సులో నిలుపుకొని, తాము అడవియందుండుట, శరీరధారులకు శ్రేష్ఠమైన మార్గమని నేను భావింతును తండ్రీ!

అని, కుమారుడాడిన శత్రుప్రశంసను విని, దానవేంద్రుడు పుత్రుని యొక్క జ్ఞానహీనతకు కోపగించుకొనక చిరునవ్వుతో నిట్లనియె :

శా. నాకుం జూడఁగఁ జోద్య మయ్యెడిఁగదా నా తండ్రి యీ బుద్ధి దా
నీకున్ లోపలఁ దోఁచెనో పరులు దుర్నీతుల్ పఠింపించిరో
యేకాంతంబున భార్గవుల్ పలికిరో యీ దానవశ్రేణికిన్
వైకుంఠుండు కృతాపరాధుఁ డతనిన్ వర్ణింప నీకేటికిన్.

నాయనా! ఆలోచించి చూడగా, నీ మాటలు నాకు మరీ విడ్డూరముగా నున్నవి. ఈ బుద్ధి నీకే మనస్సులో దోచెనా? లేక దుర్మార్గులైన పరులెవ్వరైన నేర్పించిరా? లేదా, నీ గురువులైన భార్గవులే నీకు రహస్యముగా ఈ వక్రబుద్ధినెక్కించిరా? తండ్రీ! నీకు తెలియదేమో, వైకుంఠుడు మనపట్ల అపరాధము చేసినవాడు. అతనిని వర్ణింపవలసిన అవసరము నీకేమున్నది?

మ. సురలం దోలుటయో సురాధిపతులన్ స్రుక్కించుటో సిద్ధులం
బరివేధించుట యో ముని ప్రవరులన్ బాధించుటో యక్షకి
న్నరగంధర్వవిహంగనాగపతులన్ నాశంబు నొందించుటో
హరి యంచున్ గిరి యంచు నేల చెడ మోహాంధుండవై పుత్రకా

పుత్రా! (మనకు కొన్ని కర్తవ్యములున్నవి. నీవు తెలుసుకొనుట మంచిది) సురలను తరిమివేయుటయో, సురశ్రేష్ఠులను నలిపి పారవేయుటయో, సిద్ధుల

ననేకవిధముల వేధించుటయో, మునిశ్రేష్ఠులను బాధించుటయో, యక్ష, కిన్నర, గంధర్వ, విహంగ (పక్షులను) నాగ శ్రేష్ఠులను నాశనము చేయుట మొదలైన కార్యములు చేయవలయును గాని, హరి, గిరి యనుకుంటూ మోహాంధుడవై చెడిపోరాదు.

అని తండ్రి చెప్పగా ఆ ప్రహ్లాదుడు, గురువువంక చూచుచు నిట్లనియె: ఎవ్వనియందు సంపూర్ణముగ మనస్సు నిల్పుకొనినచో యెఱుక గలిగి, తనవారు, పరులు యనెడి మాయాజనిత మిథ్యాభావములు కలుగక మోహనాశమగునో యట్టి పరమేశ్వరునకు నమస్కరించెదను.

అందరి యందు ఆత్మరూపునిగ వెలసియుండు సర్వాత్మకుని, కేవల ప్రజ్ఞద్వారానే తెలియబడు జ్ఞానస్వరూపుని కొందరు అజ్ఞానులు, "మేము, వారు" అను భేదభావముచే మాయావశులై, శుష్కవాద ప్రతివాదములచే నిరూపింప దలచువారు మూఢులు. ఏలనన, బ్రహ్మాదివేదవేత్తలే ఆ పరమాత్ముడైన విష్ణువును దర్శింపజాలరైరి, మరియితరుల కది సాధ్యపడునా?

బ్రాహ్మణోత్తమా, గురుదేవా! ఇనుము అయస్కాంతము సన్నిధిలో నేవిధముగ ఆకర్షితమై భ్రాంతమగునో, యా విధముగనే దైవయోగముచేత నా మనస్సు ఆ శ్రీహరి చెంత ఆకర్షితమై ద్రవించిపోవుచున్నది. ఎట్లన -

సీ. మందారమకరందమాధుర్యమునఁ దేలు మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీవీచికలఁ దూఁగు రాయంచ సనునె తరంగిణులకు
లలితరసాలపల్లవఖాదియై చొక్కు కోయిల సేరునే కుటజములకు
బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరకం బరుగునే సాంద్రనీహారములకు

తే. నంబుజోదరదివ్యపాదారవింద
చింతనామృతపానవిశేషమత్త
చిత్తమేరీతి నితరంబుఁ జేరనేర్చు
వినుతగుణశీల మాటలు వేయునేల

గురువర్యా! మందార పుష్ప తేనెల మాధుర్యములో తేలియాడే తేనెటీగ (తుమ్మెద) ఉమ్మెత్త చెట్ల చెంతకు జేరునా? నిర్మల మందగమన గంగానదీ

చిరు అలలపై తూగుచుండు రాజహంస, వడిగా ప్రవహించు నదుల వైపుకు వెళ్లునా? లేలేత మామిడి చిగుళ్లను ఆరగిస్తూ పరవశించే కోయిల, కొండమల్లె తుప్పలవైపు వెళ్లునా? నిండు పున్నమి వెన్నెలలో పరవశించి విహరించే చకోరపక్షి దట్టమైన పొగ మంచులో ప్రవేశించునా? లేదు, అట్లు చేయలేవు కదా! ఆ విధముగనే పద్మనాభుని దివ్యపాదపద్మ ధ్యానామృతమును గ్రోలి, మత్తెక్కిన నా చిత్తమెట్లు ఇతర విషయములపైకి పోగలదు? అది అసంభవము కనుక ఓ సుగుణశీలశ్రేష్ఠా! ఈ విషయముపై నింక వెయ్యిమాటలెందుకు?

అనిన విని, రాజసేవకుడైన పురోహితుడు (గురువు) కోపము తెచ్చుకొని, తిరస్కార భావముతో ప్రహ్లాదునితో నిట్లనెను :

ఓరీ బాలకా! ఐదేండ్ల వయస్సు వాడవు "ఇంత" అయినా లేవు. కాని తర్కభాష్యములు చేయుచుంటివి. మేము నీకు నేర్పిన అనేకమైన శాస్త్రములలోని ఒకించుకైనను చెప్పకుండా దానవేంద్రుని యెదుట మాకు తలవంపులు తెచ్చితివి. శత్రుప్రశంసలు చేస్తున్న నీవు వంశదూషణుడవు!

వీడు దానవ ప్రభువుకు పుత్రుడు గాడు, శత్రువు. దానవ చందనవనము నందుపుట్టిన ముళ్లమొక్కవలె పుట్టినవాడు. ఎల్లప్పుడును రాక్షససంహారియైన ఆ హరినే ప్రశంసించుచున్నాడు. తీవ్రమైన దండనములకుగాని సామాన్యమైన శిక్షలకు భయపడడు. వీనిని పట్టుకొని కఠినముగ కొట్టుడు అని రాజుతో నిట్లనెను : ఓ దానవేశ్వరా! నీ పాదముల సాక్షిగా నీ బాలుని చదివించెదము. ఇంకను ఎక్కువ నైపుణ్యముతో చదివించెదము. మేమితనిపై మిక్కిలిగా కోపించెదము, దండించెదము. నీవు మాపై కోపింపవలదు ప్రభో! అని చెప్పి, బాలకుని అనేకవిధముల బెదిరించుచు, అక్కడినుండి తోడ్కొనిపోయెను. గురువు, శిష్యునకు సామ దాన భేద దండోపాయములన్నియును బోధించి, అతడు నీతి కోవిదుడయ్యెనని నమ్మి, నిశ్చయించి, తల్లికి నెఱింగించి, ఆమెచే బాలుని చక్కగ నలంకరింపజేసి, బాలుని ఇట్లు వేడుకొనెను:

నాయనా, ప్రహ్లాదకుమారా! మేము నేర్పిన త్రివర్గపాఠములను తప్పులేకుండా చెప్పుమయ్యా నీ తండ్రికి. మేము చెప్పినట్లే ఏమీ మార్చకుండా నీతులను ఒప్పజెప్పుము నాయనా! నేడు నేను మన దానవచక్రవర్తి వద్దకుపోయి, నీ

చదువుగురించి నివేదించెదను. కుమారా! అక్కడ నీవు శత్రుప్రశంసమాత్రము చేయకు సుమా! దుష్టములైన ఆ విష్ణుచరిత్ర గాథల గురించి ఏమీ ప్రసంగించవద్దు అని బ్రతిమాలి, బుజ్జగించి, బాలుని, దానవేంద్రుని సన్నిధికి కొనిపోయెను.

ఆ బాలుండెట్టి వాడనగా - అడుగడుగునా మాధవానుచింతన సుధామాధుర్యమును గ్రోలి మేను మఱచువాడు. పద్మసంభవుడైన బ్రహ్మదేవుడు కూడ అభ్యసింపలేనట్టి హరిభక్తిభావము గలవాడు. మాతృగర్భములో ప్రవేశించినది మొదలుగా శ్రీహరియందే చిత్తమును నిలుపువాడు. ప్రపంచమంతా విష్ణుమయమే యని తనలోనే మననము చేసుకొనువాడు, వినయము, కరుణ, వివేకము, మొదలైన దైవగుణములకు నివాసస్థానమైనవాడు. బుద్ధిమంతులచే గౌరవింపబడునట్టి ఆ ఉత్తమ శిష్యుడైన ప్రహ్లాదుని, గురువు తోడ్కొని వచ్చి రాజు యెదుట నిలిపి తండ్రికి నమస్కరింపుమని ముందుకు త్రోసెను.

మఱియు, రాజుతో నిట్లనెను : ఓ రాక్షసవంశప్రభూ! నీ కుమారునికి చక్కని శిక్షణ నిచ్చితిమి. ఇక నీతడు విరోధి పక్షపు మాటలాడడు. నీతిపారగుడయ్యెను. ఇతని విద్యాబలమును పరీక్షింపుము. అనిన విని, తనకు ప్రణామము చేసి నిలుచున్న పుత్రుని దీవించి, రాక్షసరాజు, చేతులు చాచి, ఆలింగనము చేసి, తొడపై కూర్చుండబెట్టుకొని చెక్కిలి ముద్దాడి, ప్రేమాతిశయముచే బాష్పములు రాల్చి, మధురాలాపనతో నిట్లనెను : వత్సా!

శా. **చోద్యం బయ్యెడి నింతకాల మరిగెన్ శోధించి యేమేమి సం**
వేద్యాంశంబులు సెప్పిరో గురువు లేవెంటం బఠింపించిరో
విద్యాసార మెఱుంగఁగోరెద భవద్విజ్ఞాతశాస్త్రంబులోఁ
బద్యం బొక్కటి సెప్పి సార్థముగఁ దాత్పర్యంబు భాషింపుమా

నాయనా! ఆశ్చర్యముగా నున్నదే! నీవు చదువు ప్రారంభించి యింతకాలమైనది కదా! నీవు నేర్వవలసిన ఏయే యంశములను నీ గురువులు ఏర్చికూర్చి చెప్పిరో, ఏవిధముగ బోధించిరో, ఆ విద్యాసారమును నేనెఱుంగ గోరుచుంటిని. నీవు నేర్చుకొన్న శాస్త్రములలోని ఒక పద్యము జెప్పి దాని

అర్థతాత్పర్యములు చెప్పుమయ్యా! అని యడిగిన తండ్రికి ప్రియనందను డిట్లు చెప్పెను.

క. చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థముఖరశాస్త్రంబులు నేఁ
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్లఁ జదివితిఁ దండ్రీ! 428

తండ్రీ! గురువులు నాచే చక్కగా చదివించిరి. నేను ధర్మశాస్త్రము, అర్థశాస్త్రము, మొదలైన ముఖ్యశాస్త్రములను చదివితిని. నేను చదివినవి యనేకములున్నవి. చదువులలో సారమంతా చదివితిని తండ్రీ! అదేమనగా-

మ. తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బనునీతొమ్మిదిభక్తిమార్గముల సర్వాత్ముమన్ హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా!

దైత్యోత్తమా! శరీర హృదయ వాక్కుల యేకత్వము (త్రికరణశుద్ధి), భగవత్కథా శ్రవణము, భగవంతునియందు దాసభావము, భగవంతునికి పూజార్చనా వందనసంకీర్తనము లాచరించుట, భగవంతుని పరిచర్య (సేవ) చేయుట, ఆత్మలో నెఱుక (భగవంతుడే సర్వస్వమని సతతము గుర్తుంచు కొనుట) ఆత్మనివేదనము (ఆత్మార్పణము), చింతనము, అను నీ తొమ్మిది భక్తిమార్గములచే ఆ సర్వాత్ముడైన హరిని నమ్మి సజ్జనుడై యుండుటయే సత్యముగా శ్రేయస్కరమని భావింతును తండ్రీ! మఱియును, శ్రీహరియందు భక్తిలేనివారి బ్రతుకులెట్టివియన - అంధునకు పూర్ణచంద్రోదయము, చెవిటివానికి శంఖారావము, మూగవానికి సద్గ్రంథపఠనము నేర్పజూచుట, నపుంసకునికి భార్యాకాంక్షను కలిగింపజూచుట, కృతఘ్నులతో బంధుత్వము నెఱపుట, బూడిదలో నెయ్యి వేయుట, పరమలోభికి ద్రవ్యము లభించుట, పందిని సుగంధములను వాసన చూడమనుట వంటి వ్యర్థపు, నిరర్థకపు శూన్యపుబ్రతుకులే కదా!

సీ. కమలాక్షు నర్చించుకరములు కరములు శ్రీనాథు వర్ణించుజిహ్వజిహ్వ
సురరక్షకునిఁ జూచుచూడ్కులు చూడ్కులు శేషశాయికి మ్రొక్కుశిరము శిరము
విష్ణు నాకర్ణించువీనులు వీనులు మధువైరిఁ దవిలినమనము మనము
భగవంతు వలగొనుపదములు పదములు పురుషోత్తమునిమీఁదిబుద్ధి బుద్ధి

తే. దేవదేవునిఁ జింతించుదినము దినము
చక్రహస్తుని బ్రకటించుచదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడిగురుఁడు గురుఁడు
దండ్రి! హరిఁజేరుమనియెడితండ్రి తండ్రి. 431

ఇంకనూ, తండ్రీ! శ్రీహరిని పూజించే చేతులే చేతులు, శ్రీనాథుని వర్ణించే నాలుకే నాలుక, శ్రీపతిని జూచే చూపులే చూపులు, శేషశాయికి మ్రొక్కే శిరస్సే శిరస్సు, విష్ణుకథలను వినే చెవులే చెవులు; మధుసూదనుని తలంచే మనస్సే మనస్సు. భగవంతుని ప్రదక్షిణలు చేసే పాదములే పాదములు, పురుషోత్తముని యందు నిలిచే బుద్ధియే బుద్ధి; దేవదేవుని గురించి ఆలోచించే దినమే దినము, చక్రధారిని గురించి తెలియజేసే చదువే చదువు, గోవిందుని గురించి బోధించే గురువే గురువు; శ్రీహరినే చేరవలెనని చెప్పే తండ్రియే తండ్రి సుమా, దానవేంద్రా! ఏలనన, ప్రభూ!

సీ. కంజాక్షునకుఁ గానికాయంబు కాయమే? పవనగుంభితచర్మభస్త్రి గాక
వైకుంఠుఁ బొగడనివక్త్రంబు వక్త్రమే? ఢమఢమధ్వనితోడిఢక్క గాక
హరిపూజనము లేనిహస్తంబుహస్తమే? తరుశాఖనిర్మితదర్వి గాక
కమలేశుఁ జూడనికన్నులు కన్నులే? తనుకుడ్యజాలరంధ్రములు గాక

ఆ. చక్రిచింతలేని జన్మంబు జన్మమే?
తరళసలిలబుద్బుదంబు గాక
విష్ణుభక్తిలేని విబుధుండు విబుధుఁడే?
పాదయుగముతోడిపశువు గాక. 432

శ్రీహరికి అంకితము కాని శరీరము కేవలము గాలితో నిండిన కొలిమితిత్తిగాని, శరీరమవుతుందా! వైకుంఠుని స్తుతింపని నోరు, కేవలము

ఢమఢమ ధ్వనిచేసే ఢక్కగాని, నోరు అవుతుందా? హరిపూజ చెయ్యని చెయ్యి కేవలము కర్రతో చేయబడిన తెడ్డుగాని చెయ్యి అవుతుందా? కమలేశుని జూడని కన్నులు కేవలము శరీరమనే గోడలో నున్న రంధ్రములేగాని కన్నులవుతాయా? చక్రధారిని గురించి యాలోచింపని జన్మ కదులుచున్న నీటిలోని బుడగగాని జన్మ అవుతుందా? విష్ణుభక్తిలేని పండితుడు కేవలము రెండు కాళ్లున్న పశువేగాని పండితుడగునా! ఇంకా చెప్పాలంటే -

సీ. సంసారజీమూతసంఘంబు విచ్చునే చక్రి దాస్యప్రభంజనము లేక
తాపత్రయాభీలదావాగ్ని లాఱునే విష్ణుసేవామృతవృష్టి లేక
సర్వంకషాఘౌఘజల రాసు లింకునే హరిమనీషాబడబాగ్ని లేక
ఘనవిపద్గాఢాంధ కారంబు లడఁగునే పద్మాక్షనుతిరవి ప్రభలు లేక

తే. నిరుపమానపునరావృత్తినిష్కళంక
ముక్తినిధిఁ గానవచ్చునే ముఖ్యమైన
శార్ఙ్గకోదండచింతనాంజనము లేక
తామరసగర్భునకునైన దానవేంద్ర

సంసారమనే కారుమేఘ సమూహములు చక్రధరుని సేవలనే పెనుగాలులు వీచకుండా తొలగిపోవునా? తాపత్రయములనబడే దావాగ్నులు విష్ణుసేవామృత వర్షధారలు కురియకుండా చల్లారునా? అంతటా నిండియున్న పాపపు జలరాసులు హరిచింతనయనే బడబాగ్ని లేనిదే యింకిపోవునా? ఘోరవిపత్తులనే గాఢాంధకారములు కేశవుని కీర్తనలనబడే సూర్యకిరణములు లేనిదే మాయమగునా? నిరుపమానమైన పునర్జన్మలేని నిష్కళంకమైన ముక్తినిధిని కనుగొనుటకు విష్ణుచింతనమనే అంజనము లేనిదే ఆ బ్రహ్మ దేవునకైనా శక్యమగునా? ఆ శ్రీహరి యందు నిర్మల నిరుపమాన భక్తిలేనిదే యీ సంసారబంధము వీడదు, మోక్షము సిద్ధింపదు, దానవేంద్రా!

ఈవిధముగా బిడియము, భయములేకుండ బాలుడిచ్చిన భాషణము దానవేంద్రుని చెవులకు ములుకులవలె బాధింపగా నతడు గురువువంక క్రోధముతో జూచుచు నిట్లనెను :

"ఓయీ గురుపుత్రా! నీ వీ బాలుని సకల నీతిశాస్త్ర పారంగతునిగా చేసెదనని గొనిపోయి, వానికి నేర్వరాని శత్రుశాస్త్రములను కుటిలబుద్ధితో నేర్పితివి. నీవు ప్రసిద్ధమైన భృగువంశజుడవని నిన్ను నమ్మితిని. కటకటా! నీవు బ్రాహ్మణాకృతిలో నుంటివిగాని, నిజముగ బ్రాహ్మణుడవేనా?

ఓ బ్రాహ్మణుడా! అధర్మవర్తనులును, దుష్టబుద్ధులును అయిన వారి పాపములు కల్మష కర్మలు పొందునట్టి గుప్తరోగములకు పాల్పడజేయును సుమా!" అనిన రాజునకు పురోహితుడు (గురువు) ఇట్లనెను:

"ఓ దానవనాథా! మా వలన తప్పేమియును లేదు. మేమెన్నడును ఈ బాలునకు విరోధిశాస్త్రములు చెప్పలేదు. పరులెవ్వరూ చెప్పరు. నీ పాదములయాన! మీ బాలునకు ఈ భావములు సహజముగ వచ్చుచున్న వేమో! దీనికి ప్రతిక్రియను మీరే నేర్పుతో ఆలోచించవలెను. మేము పురోహితులము. అందరి మేలు కోరువారము. మీ కృపకు పాత్రులము, మీదు మిక్కిలి భార్గవవంశజులము. నీ పుత్రునీవిధముగ చెరచుటకు మేము నీ శత్రువులమా? దైత్యనాథా ఆలోచింపుము" అని గురువు పలుకగా, రాజు, వారిపై కోపము మాని, కుమారునితో నిట్లనెను:

"బాలకా! గురువులు నేర్పని యీ బుద్ధి నీకు మఱి యెవ్వరు చెప్పిరో పేర్కొనుమయ్యా!" అనిన తండ్రికి ప్రహ్లాదు డిట్లనెను.

ఉ. అచ్చపుఁజీఁకటిం బడి గృహవ్రతులై విషయప్రవిష్టులై
చచ్చుచుఁ బుట్టుచున్ మరలఁ జర్వితచర్వణులైనవారికిం
జెచ్చెరఁ బుట్టునే పరులు సెప్పిననైన నిజేచ్ఛనైన నే
మిచ్చిననైనఁ గానలకు నేఁగిననైన హరిప్రబోధముల్

గాఢాంధకారములో పడి గృహవ్యవహారములలో చిక్కుకొని, విషయ భోగములలో మునిగినవారై చచ్చుచు, పుట్టుచు, మఱల మఱల చచ్చుచు, పుట్టుచుండువారికి, స్వతహాగా గాని, ఇతరు లెవరైన చెప్పినగాని, యేమిచ్చినగాని, సన్న్యసించి యడవులకు పోయినగాని, అంత సులువుగా శ్రీహరిని గురించి బోధలు విని తెలుసుకొనుట బుద్ధిపుట్టునా?

ఉ. కాననివాని నూఁతగొని కాననివాఁడు విశిష్టవస్తువుల్
గాననిభంగిఁ గర్మములు గైకొని కొందఱు కర్మబద్ధులై
కానరు విష్ణుఁ గొంద ఱటఁ గందు రకించనవైష్ణ వాంఘ్రిసం
స్థానరజో భిషిక్తులగు సంహృతకర్ములు దానవేశ్వరా

దానవేశ్వరా! ఒక అంధుడు వేఱొక యంధుని ఊఁత తీసుకొని యేమియును గాంచలేనట్లు, కర్మలను చేపట్టి, కర్మలయందే మునిగియుండువారు కర్మబద్ధులై విష్ణువును గాంచలేరు. కాని, కర్మలను నశింపజేసుకొను కొందరు మాత్రమే విష్ణుపాదరజమును పొందినవారై విష్ణువును పొందగలరు. (అనగా, కర్మమార్గము కంటె భక్తిమార్గము ద్వారానే భగవంతుని పొందనగును అని భావము).

శా. శోధింపంబడె సర్వశాస్త్రములు రక్షోనాథ వే యేటికిన్
గాథల్ మాధవ శేముషీతరణిసాంగత్యంబునంగాక దు
ర్మేధన్ దాఁటఁగ వచ్చునే సుతవధూమీనో గ్రవాంఛామద
క్రోధోల్లోల విశాల సంసృతి మహాఘోరామితాంభోనిధిన్

రక్షోనాథా! అనేకమైన శాస్త్రములు, మాధవు చరిత్రలు, బుద్ధిమంతులచే శోధింపబడినవి. సంసారసాగరమును దాటుట సజ్జన సాంగత్యమువలననే సాధ్యమగునుగాని, దుర్మేధ (విపరీత, వక్ర బుద్ధి)చే సాధ్యమగునా? భార్యాపుత్రాదులయందు తీవ్ర మమకార, వాంఛలు, మదము, క్రోధము మొదలైన అలలతోకూడి యున్న ఈ విశాలమైన ఘోర సంసారసాగరము దాటనగునా తండ్రీ!

అని పలికిన పుత్రుని ధిక్కరించి, తన తొడలపై నుండి క్రిందికి త్రోసివేసి, కన్నులలో రోషజ్వాలలు చెలరేగగ రాజు తన మంత్రులతో నిట్లనెను:

"పినతండ్రిని చంపినవాడని ఆ హరిపై కొంచెమైనను మనస్సులో క్రోధము వహించకుండా, వీడు ఎట్టి సంకోచము లేకుండ నా శత్రువుకు బంటు వలె, భక్తుడై, నిర్భయుడై ఊపిరి పీల్చుచు బ్రతుకుచున్నాడు. నాతో వైరము బూనియున్న యీ పితృద్రోహిని చూడుడు. ఐదేండ్ల వాడైన వీడు, తండ్రినైన నన్ను నిందించి, కొంచెమైనను భయములేక నా శత్రువైన విష్ణుని

కీర్తించుచున్నాడు. వలదని యెంత చెప్పినను మానడు. పుత్రరూపమున, వీడు శరీరములో నొక తీవ్రమైన వ్యాధివలె, మాకు జన్మించెను. రాక్షసవీరులారా, మీరు మీ శక్తినంతయు జూపి, వీనిని వధించి రండు. శరీరాంగములలో నేదో యొక అంగము రోగముతో చెడిపోయినట్లైన, చికిత్సకుడు దానిని ఖండించి, ఇతర అంగములను కాపాడునట్లు, ఈ కులద్రోహిని, మూర్ఖుని, దుష్టసాంగత్యుని, అధముని, కేశవపక్షపాతిని జంపించి, కులమును దోషరహితముగజేసి గొప్పవీరుడనను ఖ్యాతిని బొందెదను. రాక్షసవీరులారా! వీడు నిశ్చయముగ జంపదగినవాడు, పునరాలోచించుటకుగాని, రక్షింపబడుటకుగాని తగనివాడు, యమ సదనమునకు నిక్కముగ చేరవలసినవాడు, పసిబాలుడని జాలిచెందక వీనిని వధించి రండు" అని దానవేంద్రు డాజ్ఞాపించగా, వాడి కోరలుగల పెక్కుమంది రాక్షసులు శూలముపట్టుకొని, నాలుకలు నోళ్లు చాచి, ఉత్సాహముతో కేకలువేస్తూ, పొగతో కూడిన యగ్ని జ్వాలలవలె కనిపించు కేశములు మెఱయ, కోలాహలము చేయుచు, ఆ పసిబాలునిపై బడిరి. అయ్యో! పాపము, సుకుమారుడైన రాజకుమారుడు, దయాశీలుడు, సాధుసత్తముడు, లోకులందరు మెచ్చుకొను సద్గుణములు గలవాడు, చంపదగనివాడీ బాలుడు అని యేమాత్రమూ సంకోచము లేకుండ ఆ రాకాసి మూకలు శూలముతో నతని యంగములను చితుకగొట్టిరి. అయినను, రాజు చాలునని, వారిని వారించలేదు. పలువురు రాక్షసులు శూలములతో పొడిచినను, బాలుని దేహము లేశమాత్రమైనను నలగలేదు. లోపల రక్తము గూడుకట్టదు, కండరములుబ్బవు, చర్మము కందదు, ఎముకలు నలిగి చూర్ణమవలేదు, అతని ఆకారము వికారము కాలేదు, ముఖచంద్రము మెఱుగు తగ్గలేదు, అలసట జెందలేదు, దీనభావము నొందలేదు.

ఉ. తన్ను నిశాచరుల్ పొడువ దైత్యకుమారుఁడు మాటిమాటి కో
పన్న గశాయి యో దనుజభంజన యో జగదీశ యో మహా
పన్న శరణ్య యో నిఖిలపావన యంచు నుతించుఁగాని తాఁ
గన్నుల నీరు దేఁడు భయకంప సమేతుఁడు గాఁడు భూవరా

(నారదుడు యుధిష్ఠిరునితో) ఓ ధర్మనందనా! ఆ ప్రహ్లాద కుమారుడు, తనను ఆ రాక్షసులు రెచ్చిపోయి పొడుచుచు చిత్రహింసలు చేస్తుంటే, మాటిమాటికి "ఓ పన్నగశాయీ, ఓ దనుజ భంజనా, ఓ జగదీశా, ఓ దీనశరణ్యా, ఓ పరమపావనా!" యని యా భగవంతుని స్తుతించేవాడేగాని, కన్నులనీరు తెచ్చుకోడు, భయకంపితుడు కాడు, ఇంకా

ఉ. పాఱఁడు లేచి దిక్కులకు బాహువు లొడ్డఁడు బంధు రాజిలోఁ
దూఱఁడు ఘోరకృత్యమని దూఱఁడు తండ్రిని మిత్రవర్గముం
జీరఁడు మాతృసంఘము వసించు సువర్ణ గృహంబులోనికిం
దాఱఁడు కావరే యనఁడు తాపము నొందఁడు కంటగింపఁడున్.

రాక్షసులు పొడుచుచుండగా లేచి యిటునటు దిక్కులకు పాఱిపోడు. చేతులతోనైన అడ్డుకొనడు, ఇది చాలా ఘోరకృత్యము సుమా యని తండ్రిని దూషింపడు. మిత్రులను పిలువడు, తల్లి, యితర స్త్రీజనులు నివసించే సువర్ణ యంతఃపురములోనికి పోయి తలదాచుకొనడు, నన్ను కాపాడరా యని కోరడు, పరితాపము, కోపము చెందడు, యెవ్వరిపైననూ మనస్సు కష్టపెట్టుకొనడు, యెవ్వరినీ ద్వేషింపడు.

ఈ విధముగా, సర్వాత్మకుడును, యిట్టిదట్టిదని నిర్దేశింప నలవిగాని బ్రహ్మంబును తానేయైన యా మహావిష్ణువునందు చిత్తమును చేర్చి తన్మయుడై పరమానందమును పొందియున్న ప్రహ్లాదుని యందు రాక్షస ప్రభువు చేయించుచున్న మారణ కర్మలన్నియు నెట్టి హానియు చేయలేకుండుట కేమి హేతువో యని విస్మితుడై ఆతడు యిట్లు తలపోసెను.

రాక్షసభటులు శూలములతో నిస్సంకోచముగ, కర్కశముగ దేహమును పొడుచుచుండగా బాలుడు నేలపై బడడు, పాఱిపోడు, చావడు, తండ్రినైన నా వద్దకు వచ్చి, హరిభక్తిని మానితిని అనుచు నా పాదములపై తన ఫాలము నాన్చి మ్రొక్కడు, మరి యిట్లు సురక్షితముగ నుండుట కేమి హేతువో! అని యోచించినవాడై, హిరణ్యకశిపుడు, మిక్కిలి యాగ్రహముతో నొకసారి దిగ్గజముల గుంపును బాలుని త్రొక్కించుటకు పంపించును. ఒక్కొక్కసారి భయంకరమైన విషసర్పములచే నాతనిని కఱిపింప బంపించును. వేఱొకమారు

ఘోరమైన యగ్నిజ్వాలలలో పడవేయించును. ఇంకొకసారి, బాగుగ మొత్తించి సముద్రములో పడవేయించును, విషము పెట్టించును. పెద్ద పర్వతములనుండి త్రోయించును, బాగుగా చీల్చివేయుడని ఆజ్ఞాపించును, బంధించి బాధించుడని భటులకు ఆజ్ఞాపించును. ఒకప్పుడు అభిచార హోమము (చంపించు నుద్దేశముతో చేయు హోమము) చేయించును. ఇంకొకప్పుడు మండుటెండల లోను, మంచుపైనను నిల్చుండబెట్టును, పెనుగాలులలోనికి త్రోయించును. ఒక్కొక్కప్పు డు నవరంధ్రములను మూయించి హింసించును. మాయాప్రయో గములు చేసి భయపెట్టును. ఒక్కొక్కసారి భూమిలో పాతిపెట్టించును. కొన్నిసార్లు అన్నము, నీరుపెట్టకుండ నలమటింపజేయును. గదలచే మొత్తించును, బండరాళ్లను అతనిపైకి ఉర్విం‍పచేయును, బాణములచే కొట్టించును, ఇంకెన్నెన్ని విధములుగనో ఆ చిన్నారి బాలుని చిత్రహింసలకు పాల్పడజేసెడివా డా రాక్షసరాజు. ఏమి చేసినా, ఎన్ని చేసినా, యా బాలుని రూపుమాపుటకు సాధ్యపడక, చింతాక్రాంతుడై యా రాక్షసేంద్రుడు తన మనంబున నిట్లు తలపోసెను.

ఉ. ముంచితి వార్ధులన్ గదల మొ త్తితి శైలతటంబులందు ద్రో
బ్బించితి శస్త్రరాజిఁ బొడిపించితి మీఁద నిభేంద్రపం క్తి ఁ ద్రొ
ప్పించితి ధిక్కరించితి శపించితి ఘోరదవాగ్నులందుఁ ద్రో
యించితిఁ బెక్కు పాట్ల నలయించితిఁ జావఁ డి దేమి చిత్రమో.

ఈ డింభకుని సముద్రములలో ముంపించితిని, గదలచే మొత్తింపించితిని, కొండ శిఖరములనుండి త్రోయించితిని, గొప్పగొప్ప శస్త్రములచే పొడిపించితిని, యేనుగుల బారును మీదనెక్కించి త్రొక్కించితిని, చంపెదనని ధిక్కరించితిని, శపించితిని, ఘోరమైన దావాగ్నులయందు పడవేయించితిని, యింకా ననేకమైన చిత్రహింసలు చేయించి బాధలు పెట్టించితిని. ఐనను వీడు చావడు. ఇదేమి చిత్రమో మరి!

చ. ఎఱుఁగడు జీవనౌషధము లెవ్వరు భర్తలు లేరు బాధలన్
దరలఁడు నైజతేజమునఁ దథ్యము జాడ్యము లేదు మిక్కిలిన్

మెఱయుచునున్న వాఁ డొక నిమేషము దైన్యము నొందఁ డింకనే
తెఱఁగునఁ ద్రుంతు వేసరితి దివ్యము వీనిప్రభావమెట్టిదో! 442

అయితే, వీడెటువంటి సంజీవనౌషధము లెఱుంగడు కదా! మఱి, వీనిని రక్షించి, ఆదుకొనే ప్రభువులు కూడ నెవ్వరులేరే. ఎన్నిబాధలు పెట్టినా చలింపడు, జంకడు. తనయొక్క శరీర తేజస్సు నిజముగా ఏమాత్రమును తగ్గలేదు సరికదా! ఇంకను మిక్కిలి ప్రకాశించుచున్నది. ఇన్ని బాధలు పడుచున్నను నొక్క నిముషమైన దైన్యత జెందడు. ఇక నేనేవిధముగ వీని నంతము చేయగలను? నేనలసిపోయితిని. నిజముగ వీనిలో నేదో యొక దివ్యప్రభావమున్నదేమో! నేను కోపముతో చేసిన దండనముల నెన్నడును పరులతో దండనములని చెప్పడు. వాటిని అనుగ్రహములుగ తలచును, మనస్సులోనైన కష్టపెట్టుకొనడు. అందుచేత నతడు మహాతపః సంపన్నుడు. వీనికి ఎచ్చటను భయములేదు. వీనితో విరోధము మంచిదికాదు. నాకు మృత్యువు సిద్ధించును. అని దిగులుపడి వ్యాకులుడైన రాజుతో చండామార్కులు (గురువులు) ఇట్లనిరి:

ఓ దైత్యేంద్రా! నీ ఖ్యాతి మచ్చలేనిది, నీ శోభ అత్యద్భుతమైనట్టిది. యుద్ధములందు కోపముతో నీ యొక్క భృకుటి కదలికలచేతనే దిక్పాలకు లందరినీ భయభ్రాంతులుగ చేసి విశ్వమును ఏలిన ప్రభువువు నీవు. ఈ బాలుడే పాటివాడు! గుణదోషములతో కూడియున్న వీని పొల్లుమాటలకు నీవింతగా చింతించవలెనా! వక్రమార్గము పట్టిన వ్యక్తి వృద్ధుల, గురువుల, సేవచేసి, వయస్సుతోపాటు వచ్చిన అనుభవ జ్ఞానముచే ప్రకాశించును. కావున రాజా! నీ కోపమును మాని, ఈ బాలునికి ఇంద్రద్వేషమును తలకెక్కించినచో శుక్రాచార్యుడు తిరిగివచ్చుసరి కీతడు సుశీలుడగును. అని గురు పుత్రులు చెప్పగా సరేనని, బాలుని కొనిపోయి, గృహస్థులైన రాజులకు నుపదేశింప దగిన ధర్మార్థ కామములను బోధింపుడని రాజు ఆదేశించెను. గురువులు ప్రహ్లాదునకు ధర్మార్థ కామముల గురించి యుపదేశింపగా నా బాలుడు, రాగద్వేషములతో కూడియున్న విషయాసక్తులకు, వ్యవహారములు నడుపుటకు ఆ శాస్త్రము లవసరమేమోగాని ఆత్మయందెట్టి భేదభావమును చూడని తనకు, అవి

అవసరము లేదనియు, అర్థము లేని విషయములయందు అర్థము కల్పించుటవలన భ్రమలు కలుగునని తలంచినవాడై వాటిని గ్రహింపక, గురువులు తమ గృహకర్తవ్యములలో మగ్నులై యున్న తరుణమున ఆటలకు పోదము రమ్మని రాక్షసబాలురు పిలిచినప్పుడు, వారితో గూడి వారికి జ్ఞానబోధ చేయుటకై యా రాజకుమారు డిట్లనియె:

ఉ. బాలకులార రండు మన ప్రాయపు బాలురు గొందఱుర్విపైఁ
గూలుట గంటిరే గురుఁడు క్రూరుఁ డనర్థచయంబునందు దు
శ్శీలత నర్థకల్పనముఁ జేసెడి గ్రాహ్యము గాదు శాస్త్ర మే
మే లెఱిఁగించెదన్ వినిన మీకు నిరంతరభద్ర మయ్యెడిన్

బాలకులారా! రండు, వినుడు. మన ప్రాయపుబాలురు కొందరు నేలగూలి చనిపోవుట మనము చూచుచుంటిమి కదా! దాని అర్థమేమిటో మనకు మన గురువు చెప్పకుండా, అర్థములేని పనికిమాలిన విషయాలకు ఏవేవో యర్థములను కల్పించి చెప్పుచుండును. అతడు చెప్పు శాస్త్రములు మనము నేర్చుకోనవసరము లేనట్టివి. మనకు మేలు కలిగించు విషయముల గురించి నేను చెప్పెదను. వాటిని విన్నచో మీకు సర్వదా క్షేమము కలుగును.

వినుడు : సృష్టిలోని అన్ని జన్మలలోను, ధర్మార్థాచరణ యోగ్యమైన మానవజన్మ అతి దుర్లభము. అందు, పురుషజన్మ ఇంకను దుర్లభము. అది, వంద సంవత్సరముల పరిమితితో లభించును. దానిలో సగభాగము రాత్రియందు నిద్రాది వ్యవహారములలో నిరర్థకమై గడిచిపోవును. మిగిలిన ఏబది వర్షములలో నిరువది వర్షములు బాల్యకిశోరాది లీలలలో గడిచిపోవును. మిగిలిన ముప్పది వత్సరము లెట్లు గడుచుననగా - ఇంద్రియములచేత పట్టుపడి, కామక్రోధ లోభ మోహ మద మత్సరములను పాశములచే కట్టబడి, విడివడుటకు శక్తిలేక, తృష్ణకు లోనై, సేవక, వాణిజ్య, చౌర్య కర్మలలో ప్రాణహానినైనా లెక్కచేయక, వస్తుసంచయము చేసుకొనుచు, సంభోగ, సౌందర్య, చాతుర్య నిధులైన భార్యలను, మంజుల మధురాలాపములు చేయు బిడ్డలను, రూపలావణ్యలగు పుత్రికలను, వివేక విద్యావంతులైన పుత్రులను, భ్రాతలను, ప్రేమ మమతలను జూపు తలిదండ్రులను, బంధువులను, ధనకనక

వస్తువాహన, గృహాది సంపదలను, సేవకులు, పశువులు, పాడిపంటలును, వంశపారంపర్యముగా వచ్చు ఆస్తులను, విడువలేక, సంసారమునుండి బయటపడునుపాయము గానక, గృహస్తుడు స్వయంకృత కర్మబద్ధుడై, కుటుంబపోషణ వ్యామోహములో పడి, విరక్తిమార్గము తెలియజాలక, తన, పర, యను భేదభావమును పెంపొందించుకొని యంధకూపమున ప్రవేశించి బయట పడలేకుండును, కావున, కౌమారదశలోనే సజ్జనశ్రేష్ఠుడై పరమభాగవతధర్మముల ననుసరింపవలెను. దుఃఖములు, కోరకున్నను వచ్చిచేరునట్లు, సుఖములును కాలానుసారముగ లభించును. కావున వృధాగా కోరికలను తీర్చుకొనుటకు ప్రయాసపడి, ఆయువును వ్యర్థము చేసుకొనరాదు. హరిభజన వలన మోక్షము సిద్ధించును. విష్ణువు సర్వభూతాంతరాత్ముడు. ప్రియుడు, ముముక్షువైన మానవునకు దేహావసాన పర్యంతము, నారాయణ చరణారవింద సేవనమే కర్తవ్యము.

మిత్రులారా! చూచితిరా! ఘనులైన మనవారు, గృహస్థులై, విఫలురై పొందిన వెఱ్ఱితనము? భద్రతను పొందగోరినను, దానిని పొందలేరు. సంసారపు చిక్కులో నిరుకుకొని, రక్త రజస్సులతో నున్న యోనులలో పడి, గర్భాది యవస్థలలో దేహమును ధరించి, పుట్టుచుందురు. తన్ను తానెఱుంగరు. కర్మతంత్రులై వందలాది జన్మలు ఎత్తినా ఈ సంసారపు అంతమును జేరలేరు. దీని యందు శుభములేదు. దివ్యకీర్తియును లేదు. జగతిలో పుట్టి పుట్టి చచ్చి చచ్చి, కొట్టుకొననేల? మనకు చావు పుట్టుకలు లేని మార్గమును వెదకు కొనుటయే శ్రేయస్కరము.

మహావిద్వాంసుడైనను, మదగర్వాంధుడై కాంతయొక్క శృంగార చూడ్కులకు లేడిపిల్లవలె వశుడై హీనస్థితిని చెందును. విషయాసక్తులైన వారితో మనకు చెలిమి వద్దు. పిన్ననాటినుండి, సంగదోషములేని సజ్జనులతో గూడి, ముక్తి కాంక్షతో ఆదిదేవుడైన యా విష్ణువునే ఆశ్రయించుదము. విషయములలో చిక్కుకున్న రాక్షసులకు హరిభజన సేయుటకు సాధ్యపడదు. సర్వభూతాత్మకుడును, కాలాతీత, త్రిగుణాతీతుడును, సర్వవ్యాపి, సర్వాంతర్యామియునైన, భగవంతుడు, పరమాత్మ, కేవలము అనుభవైక

వేద్యుడు. ఆయనకు రూపముగాని గుణములుగాని ఉండవు. కాని, తన మాయాశక్తిచే అనేకరూపాలలో గోచరించును. అందుచేత మనము అసుర భావమును విడిచి, సర్వభూతములయందును, దయ, సుహృద్భావములను కలిగియుండుట మన కర్తవ్యము. శ్రీహరి సంతసించును. అప్పుడు మనకు లభించని దేదీయుండదు. మనము కోరకుండానే జ్ఞానముదయించును. స్వపర భేదములు నశించును. సర్వము స్వప్నతుల్యములుగను, మిథ్యగను తెలియును. ఈ తత్త్వజ్ఞానమును, మొదట, నారాయణుడు నరునకును, పిమ్మట నారదాది మునులకును బోధించెను. హరిభక్తుల పాదరజము యొక్క పవిత్ర మాహాత్మ్యమును, నారాయణ తత్త్వమును, ఏకాంతభక్తులు, సర్వసంగ పరిత్యాగులు, పరతత్త్వజ్ఞులు మాత్రమే ఎఱుంగగలరు. నేను దివ్యదృష్టిగల నారదమహాముని వలన, యీ జ్ఞానమును, భాగవత ధర్మమును వినియుంటిని అని చెప్పగా నా దైత్యబాలు రాశ్చర్యచకితులై యిట్లనిరి : మిత్రమా! మనమందరము కలిసి చిన్ననాటినుండియు భార్గవ పుత్రులవద్దనే యనేక శాస్త్రములను వింటిమి. మనకు వేఱొక గురువెవ్వడును లేకుండెను. ఈ రాజప్రాసాదములోనికి ప్రవేశించుటకుగాని, ప్రవేశించి బైటపడుటకుగాని త్రినేత్రునకైనను సాధ్యపడదు కదా! మఱి నీకు నిరాటంకముగ బోధించుట కెవరికి ఎట్లు సాధ్యపడెనో చెప్పుమా! మేము నిన్నే మా రాజుగా భావింతుము, నిన్నే సేవింతుము, గౌరవింతుము కదా! నీకీ జ్ఞానమెట్లబ్బెనో మాకు చెప్పుము, అని యా బాలురడుగగా, నారదబోధలను మననము చేసుకుంటూ ప్రహ్లాదుడు వారికిట్లు బోధించెను:

పూర్వము నా తండ్రి మందర పర్వతముపై ఉగ్రతపస్సు చేయుచుండగా దేవతలు యుద్ధభేరీ దుందుభాదులైన రణగొణ ధ్వనులతో రాక్షసులపై దండెత్తి వెళ్లగా, వారి పటాటోపములచూచి రాక్షసులు భయపడి భార్యాబిడ్డలను విడిచి పాఱిపోయిరి. దేవతలు రాజవాసము చేరి క్రూరులై, సమస్తమును కొల్లగొట్టి ధనరత్నరాసులను దోచుకొనిరి. ఇంద్రుడు అంతఃపురములో దూరి ఎట్టి సంకోచమును లేక మా తల్లిని చెఱపట్ట నుద్యుక్తుడయ్యెను, ఆమె భయవిహ్వలయై విలపించుచున్నను ఆమెను యీడ్చుకొని పోవుచుండ

దైవయోగమున ఆమె ఆర్తనాదము నారదమునీంద్రునికి వినిపించగా ఆయన వచ్చి యింద్రునితో నిట్లనెను :

"ఓ స్వర్గాధినాథా! సురశ్రేష్ఠా! దేవతలలో పుణ్యమూర్తివి, నీతిమంతుడవు, ఈ మానవతి నేల గొనిపోవుచుంటివి? ఈమె గర్భిణి, మిక్కిలి ఆర్తిచే కంపించుచున్నది. నిర్మల మానసురాలు. రాక్షసరాజుపై నీకున్న దుర్భరవైరమును, కోపమును, నిలిపి యీమెను విడువుము" అనగా ఇంద్రుడు నారదునితో నిట్లనెను. "ఓ మహాత్మా! నారదా! ఈమె యొక్క గర్భమందు దేవతల పరమశత్రువు యొక్క బీజము వృద్ధిచెందుచున్నది. కావున నీమెను బందీచేసియుంచి యీమె ప్రసవించగనే బిడ్డడిని నా వజ్రాయుధమునకు బలిచేసి, నిశ్చింతుడనైన పిదప నీ దానవరాజపత్నిని విడిచిపెట్టెదను," అనిన నారదమహర్షి యిట్లనెను:

"దేవరాజా! ఈ దానవసాధ్వి గర్భమునందున్న బిడ్డడు ప్రశస్తమైన భాగవతుడు, ఎవ్వరికిని శత్రువుకాడు, ఎవ్వరికిని భయకారకుడు కాడు, జన్మజన్మాంతరాలలో శ్రీహరియొక్క శ్రేష్ఠమైన పాదభక్తుడు, ఈ బాలకుడు ఎట్టి ఉపాయములచే నైనను చంపబడడు సుమా!" అని చెప్పిన నారదవాక్యములను మన్నించి తానును హరిభక్తుడే గావున, ఇంద్రుడు, మా అమ్మను విడిచి, ప్రదక్షిణచేసి సురలోకమునకు బోయెను. నారదమునీంద్రుడు మా తల్లియందు పుత్రికా వాత్సల్యముతో నామె నూరడించి, తన యాశ్రమమునకు గొనిపోయి యిట్లనెను: తల్లీ! నీవు పతివ్రతవు. నీ గర్భమునందొక పరమభాగవతుడైన జీవుడున్నాడు. నీ భర్త తపోమహిమచే కృతార్థుడై యింటికి రాగలడు. అంతవరకు నీ విచ్చటనే యుండవచ్చును" అని చెప్పగా నామె సమ్మతించెను.

నారీ రత్నమైన మా తల్లి, మా తండ్రి రాకను నిరీక్షించుచు, ఎట్టిభయమును లేకుండ, ఎట్టిదోషము సోకకుండ మిక్కిలి సౌశీల్యముతో నారదమునీంద్రుని శుశ్రూషలు చేయుచు, గర్భరక్షణ చేసుకొనుచుండెను.

ఇట్లు తనకు పరిచర్యలు చేయుచున్న దానవరాజ పత్నికి నారదమహర్షి యభయమిచ్చి, గర్భమునందున్న నన్ను ఉద్దేశించి, ధర్మతత్త్వమును,

నిర్మలజ్ఞానమును యుపదేశించెను. నారదముని యనుగ్రహముచే, దైవయోగముచే, నేను జన్మించినప్పటినుండి, మునియొక్క ఉపదేశమంతయు, మఱుపులేకుండ నా మనస్సునందు ముద్రితమైయున్నది. మిత్రులారా! వినుడు. మీరు నా మాటలయందు విశ్వాసముంచినచో, స్త్రీలకైనను, బాలురకైనను, ఋషులచే చెప్పబడిన ఈ దేహేంద్రియ మనోబుద్ధ్యహంకారములను ఖండించు సాధన తెలియవచ్చును అని చెప్పి, నారదుడు బోధించిన తత్త్వజ్ఞానము నీవిధముగా దానవబాలురకు చెప్పెను:

దేహమునకే గాని, షడ్భావవికారము లాత్మకు లేవు. ఆత్మనిత్యుడు, క్షయములేనివాడు, శుద్ధుడు, క్షేత్రజ్ఞుడు, ఆకాశాది పంచభూతములకు ఆశ్రయుడు, క్రియాశూన్యుడు, స్వప్రకాశకుడు, సృష్టిహేతువు, సర్వవ్యాపకుడు, నిస్సంగుడు, పరిపూర్ణుడు, ఏకము అయినవాడు, ఈ పన్నెండు ఆత్మలక్షణముల నెఱుంగుచు, దేహాదులందు మోహమును కలిగించు అహంకార మమకారములను విడిచి, కార్యకారణముల నెఱింగెడి నేర్పరి బ్రహ్మభావమును పొందును. మూలప్రకృతి, మహదహంకారములు, పంచతన్మాత్రలు, ఇవి అష్టప్రకృతులు. సత్త్వరజస్తమములు ప్రకృతియొక్క త్రిగుణములనియు, వాక్పాణిపాద పాయూపస్థలను కర్మేంద్రియములనియు, శ్రవణ నయన రసన త్వక్ ఘ్రాణములు జ్ఞానేంద్రియములనియు, మనస్సు, మహీసలిలతేజఃగగనవాయువులు, స్థూలభూతములు. ఇవియన్నీ పదునాఱు వికారములనియు, కపిలాది పూర్వాచార్యులచే చెప్పబడినవి. ఈ యిరువది యేడు తత్త్వములతో సాక్షిగా ఆత్మయుండును.

గురుశుశ్రూష, సర్వసమర్పణము, సజ్జన సాధుసాంగత్యము, ఈశ్వర ప్రతిమార్చనము, హరికథాసక్తి, వాసుదేవునియందు ప్రేమ, నారాయణ గుణకర్మ నామకీర్తనము వైకుంఠ చరణకమల ధ్యానము, మొదలైన విజ్ఞాన వైరాగ్య సాధనములైన భాగవత ధర్మములపై రతి గలిగి, సర్వభూతములందు భగవంతుడు గలడని గౌరవించుచు, కామక్రోధాదులను జయించి, ఇంద్రియ వర్గమును బంధించి, భక్తి సేయుచుండ, విష్ణుదేవునియందు గతి సిద్ధించును. శ్రీహరియొక్క లీలావతార గాథలందలి శౌర్యకర్మలు, సద్గుణముల గురించి

విని భక్తుడైనవాడు, ఆనందముతో పులకించును, కన్నులనుండి ఆనంద బాష్పములు రాలుచుండ, కమలాక్ష వైకుంఠ, వరద, నారాయణ, వాసుదేవ, యనుచు గొంతెత్తి పాడును, ఆడును, ఏడ్చును, నవ్వును, చింతనము చేయును, మోహము చెందును, తనలో తాను మాట్లాడుకొనును, దేవత పూనిన వానివలె తిరుగును, బంధములు పోగొట్టుకొని, అజ్ఞాన సముదాయమును తొలగించు కొని చివరకు భక్తివివశుడై విష్ణువును పొందును. కావున రాగద్వేషములతో కూడియున్న మనస్సుగల జీవునకు సంసార చక్రనివర్తకమైన హరిచింతనయే, బ్రహ్మనిర్వాణ సుఖదాయకమని జ్ఞానులు తెలుసుకొందురు. హరిభజన కష్టసాధ్యముగాదు. హరి సకలప్రాణుల హృదయములయందును అంతర్యామియై ఆకాశమువలె వ్యాపించియుండును. విషయ సముపార్జనద్వారా ఇది సాధ్యపడదు, క్షణభంగుర ప్రాణులైన మానవులకు, మమకారమును కలిగించు అశాశ్వతములైన పుత్ర, మిత్ర, కళత్ర, బంధు, భృత్య, పశు, రాజ్య, కోశ, మణి, మందిర, మంత్రి, మాతంగ (ఏనుగులు) భూమి, మొదలైన వైభవములు నిరర్థకములు (ఎందుకూ పనికిరానివి). యాగములు, యోగముల నాచరించి పుణ్యమార్జించినచో ఆ పుణ్యము క్షీణించువరకు స్వర్గాది లోకములలో భోగములననుభవించవచ్చు. తదుపరి మళ్లీ జన్మలు కలుగును. మానవుడు శాస్త్రజ్ఞుడనని గర్వించి, కర్మలాచరించి, వాటి విపరీత ఫలమును పొందును. కర్మములు ఎట్టి కోరికలు లేకుండ చేయవలెను. కోరికలతో కర్మలు చేసిన దుఃఖములు ప్రాప్తించును. మానవుడు దేహము కొఱకు భోగముల నపేక్షించును. దేహము నిత్యము కాదు, మన తోడ రాదు, మృతుల దేహములను శునకాదులు భక్షించును. మనిషి కర్మలనాచరించి, కర్మబద్ధుడై, కర్మానుకూల దేహముల దాల్చును. అజ్ఞానముచే కర్మదేహములను విస్తరించును. ధర్మార్థకామములు అజ్ఞాన జనితములు. జ్ఞాన లభ్యమే మోక్షము. మోక్ష ప్రదాతయగు శ్రీహరి సకలభూతములకు నాత్మేశ్వరుడు, ప్రియుడు. నిష్కాములై హృదయగతుడైన శ్రీహరిని నిజభక్తిచే భజింపవలెను.

మానవ దానవ దైత్య గంధర్వ భుజంగమ, సుర సంఘములలో నెవ్వరైనను శ్రీహరి చరణ కమలముల ధ్యానముచే, ధన్యత నొందగలరు.

క. చిక్కఁడు వ్రతముల(గ్రతువుల(
జిక్కఁడు దానముల శౌచశీలతపములం
జిక్కఁడు యుక్తిని భక్తిని
జిక్కిన క్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ

మిత్రులారా! శ్రీహరి వ్రతములద్వారా గాని, క్రతువులద్వారాగాని, దానములు, శౌచములు, సత్శీలములవలనగాని తపములద్వారా గాని, యుక్తి తర్కములచేగాని, భక్తిద్వారా చిక్కినంత సులభముగా చిక్కడు. (భగవంతుని భక్తిద్వారానే సులభముగ పొందవచ్చును). శ్రీహరిని మెప్పించుటకు భక్తి చాలినంతగా బ్రాహ్మణత్వ విద్యాప్రక్రియలుగాని, దేవతల దివ్యత్వముగాని, యోగుల ప్రశాంత సాధనలుగాని చాలవు (సరిపడవు) (భక్తియే సర్వశ్రేష్ఠ సాధనము) దనుజులుగాని, దైత్యులుగాని, యక్షులుగాని, మృగములుగాని, సర్పములుగాని, పక్షులుగాని, స్త్రీలు గాని, గొల్లలుగాని, శూద్రులుగాని, శబరులుగాని, ఏ పాపజీవులైనగాని, సకలలోకములలో నెవ్వరైనా గాని శ్రీహరిని తలచినచో ముక్తికి పోవుదురు.

మన గురువులెప్పుడును, తమ కనువైన పద్ధతులనే చెప్పెదరుగాని, శ్రీహరి దివ్యపదమును చేరు మార్గములను చెప్పరు. అజ్ఞానాంధకారములో సాంసారిక విషయజ్ఞాన భారమును మనపై గురువులు పెంచనేల? మిత్రులారా!

మీ పుస్తకములను తెండు, గురువుల కిచ్చివేద్దాం. నావద్దకు రండు, ఏకైక నాథుని గురించి చెప్పెదను. ఇష్టములేనివారు కర్మఫలముల ననుభవించుటకు పొండు. రండు, మనమూ శ్రీహరియందు భక్తిప్రేమలను పెంచుకొందము, విష్ణువుయొక్క కీర్తిగాథలను, రక్షక చరిత్రలను పాడుకొందము. అసురసాంగత్యమును వీడుదము. గోవిందుని భక్తకోటిలో సూటిగ చేరుదము.

ధనము సంసారబంధమును కలిగించుపనిముట్టు. కామక్రోధాది శత్రు వర్గమును పారద్రోలుదము. మనచిత్తములను శ్రీహరికి సమర్పించుదము నిర్వాణ పథము నందు ప్రవేశించెదము. ఇట్లు చేసినచో మనకు శుభమగును.

ఈవిధముగ ప్రహ్లాదుడు రహస్యముగ సమయము చిక్కినప్పుడెల్ల రాక్షస బాలురకు మోక్షమార్గము గుఱించి బోధింపగా, వారు, గురువులు నేర్పిన

చదువులను మానివేసి, నారాయణభక్తిని మనస్సులలో నింపుకొనుటను చూచి గురువు వారి భక్తిభావమును తెలుసుకొని, భయభ్రాంతుడైవచ్చి, రాక్షసరాజుతో నిట్లు చెప్పుకొనెను:

"ఓ దైత్యశ్రేష్ఠా! నీ కొడుకు రాక్షస బాలురందరిని చేరదీసి, నాకు తెలియకుండ, నేను చెప్పిన చదువులన్నీ అసత్యములని, ఎత్తిపొడిచి, వారందరినీ మోక్షాసక్తులుగ చేసినాడు. మనందరికీ తీరని నష్టము కలిగినది. దీనిని నీవే స్వయముగ చక్కబెట్టవలెను. ఆకర్షణీయమైన విష్ణుకథల నీ గురువు మాకెన్నడును చెప్పడు అని ఆ బాలురు నా మాట నుల్లంఘించి, నేను చెప్పెడి విషయములను చదువుటకు ఒప్పుకొనుటలేదు దానవోత్తమా!

ప్రహ్లాదుడు విష్ణుభాషణము మానడు. వేఱుగా కూర్చొని జడునివలె నుండును, వాడి జ్ఞానవికాసమును గురించి వేమేమి చెప్పినను పట్టించుకొనడు. ఈ కుర్రవానికి చదువు చెప్పుటకు మాకు సాధ్యపడుటలేదు దానవోత్తమా! చక్కని స్వచ్ఛమైన రాక్షసకుటుంబములో నీ వికారము పట్టినవాడు జన్మించినాడు. విష్ణువును నిజమైన ప్రేమతో కొలిచెడి ఈ వెట్టివాని నెట్లు గంటివి రాక్షసరాజా!" అని గురుపుత్రుడు చెప్పగ నిజపుత్రుని శత్రుప్రవర్తన వాక్కులు కర్ణములకు ఖడ్గఘాతములుగ సోకగా, తొక్కత్రొక్కబడిన త్రాచువలె, పెనుగాలిచే రగుల్కొను దావాగ్నివలె, కఱ్ఱతో కొట్టబడిన మదపుటేనుగువలె, భీషణమైన క్రోధావేశముతో జ్వలించుచిత్తము గలవాడై, కంపించుచున్న శరీరముతో, నిప్పులు గ్రక్కు కండ్లతో, తత్క్షణమే కొడుకును రప్పించి, మేఘగర్జన వంటి స్వరముతో - శాంతగుణ ప్రధానుడును, పరిశుద్ధజ్ఞానియును, అజ్ఞానానికి గొడ్డలి పెట్టువంటి వాడును, సదా శ్రీనారాయణ పాదపద్మముల యందు ధ్యానమగ్నుడును అయిన పుత్రుని ధిక్కరించి దేవశత్రువైన హిరణ్యకశిపు డిట్లనెను.

"ఓరీ దుష్టుడా! నా యొక్క ఆజ్ఞలేనిదే సూర్యుడు ఆకాశమున ప్రకాశించుటకు భయపడును; అన్ని కాలములలోను వాయువు నాకు అనుకూలముగ తప్ప వేఱొక విధముగ వీచలేదు. నా యొక్క ప్రతాపాగ్ని యెదుట వెలవెలపోవునేగాని, అగ్ని తన ఇచ్ఛప్రకారము వెలుగలేడు. నా యొక్క

కఠినమైన యాజ్ఞల నుల్లంఘించి, యముడు ప్రాణులను చంపుటకు భయపడును. ఇంద్రుడు నా ఎదుట తలయెత్తుకొని నిల్చొనుటకు భయపడును. ఇక దేవతలు కిన్నరులు, గంధర్వులు, యక్షులు, పక్షులు, నాగులు, విద్యాధరులు అందరూ నేనంటే భయముతో బిగుసుకుంటారు. నీవేలరా భయపడవు? నీకేది దిక్కు?

ప్రజ్ఞావంతులైన లోకపాలురు, మూడులోకములవారు, నాయొక్క ఆజ్ఞనుల్లంఘించుటకు కంపించిపోవుదురు. మరి నీవుమాత్రము నా యాజ్ఞలనే సాహసముతో మీరుచుంటివిరా అహంకారీ! దుర్మతీ!

ఓరీ డింభకా! నీవు గొంతెత్తి మహాగాఢముగా కంఠశోషతో వైకుంఠుడు జయింప శక్యము కానివాడని వదరుచుంటివిగాని, నిజముగా వాడు వీరాగ్రేసరుడే అయితే, నేను దేవతలను దండించి ఖండించుచుండగా ముఖము చాటు చేసుకుంటాడేగాని, నేను చేసే యుద్ధములో వచ్చి ఎదుర్కొనడేమి?

శా. ఆచార్యోక్తముగాక బాలురకు మోక్షాసక్తిఁ బుట్టించి నీ
వాచాలత్వముఁ జూపి విష్ణు నహితున్ వర్ణించి మద్దైత్యవం
శాచారంబులు నీఱు సేసితివి మూఢాత్ముం గులద్రోహి నిన్
నీచుం జంపుట మేలు చంపి కులమున్ నిర్దోషముం జేసెదన్. 260

నీవు ఆచార్యులు చెప్పినవి కాదని, నీవాచాలత్వమును ప్రదర్శించుచు, మన దైత్య సాంప్రదాయములకు విరుద్ధముగ, శత్రువైన విష్ణుని వర్ణించి, రాక్షస బాలురలో మోక్షాసక్తి కలిగించుచుంటివట. నీవు మూఢాత్ముడవు, కులద్రోహివి, నీచుడవు. నిన్ను చంపి కులమును దోషములేకుండ చేసెదను.

క. దిక్కులు గెలిచితి నన్నియు
దిక్కెవ్వఁడురోరి నీకు దేవేంద్రాదుల్
దిక్కుల రాజులు వేఱొక
దిక్కెఱుఁగక కొలుతు రితఁడె దిక్కని నన్నున్. 261

దిక్కులన్నిటినీ గెలిచిన వాడిని నేను. దేవేంద్రాదులు, దిక్పాలకులూ, అందరు వేరే దిక్కులేక నేనే దిక్కు అని నన్నే కొలుచుచుందురురా! మరి నీకెవడురా దిక్కు?

క. బలవంతుఁడ నే జగముల
బలములతోఁ జనక వీరభావమున మహా
బలుల జయించితి నెవ్వని
బలమున నాడెదవు నాకుఁ బ్రతివీరుఁడవై

ఈ మూడు జగములలో బలవంతుడను నేనే. ఎలాంటి సైనిక సహాయమును తోడు తీసుకొనిపోకుండా నేనొక్కడినే మహావీరుడనై గొప్ప గొప్ప బలవంతులను జయించితిని. నీవు ఎవ్వడి బలసహాయముతో నన్నెదిరించుచుంటివిరా మూర్ఖుడా! అనియడిగిన తండ్రికి శాంతముతో వినయముగ పుత్రుడిట్లనెను:

క. బలయుతులకు దుర్బలులకు
బల మెవ్వఁడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బల మెవ్వఁడు ప్రాణులకును
బల మెవ్వం డట్టి విభుఁడు బల మసురేంద్రా

లోకములలోని బలవంతులకు, బలహీనులకు నెవ్వడు బలమో, నీకును, నాకును బ్రహ్మాదిదేవతలకును యెవ్వడు బలమో, సమస్త ప్రాణులకు నెవ్వడు బలమో ఆ యీశ్వరుడే నాకును బలము సుమా! దానవేంద్రా!

క. దిక్కులు కాలముతో నే
దిక్కున లేకుండుఁ గలుగు దిక్కుల మొదలై
దిక్కుగల లేనివారికి
దిక్కయ్యెడు వాఁడు నాకు దిక్కు మహాత్మా

ఓ మహాత్మా! దిక్కులు, కాలము లేనివాడు (దిక్కులకు, కాలమునకు అతీతుడు) ఏ ఒక్క దిక్కులోనో ఉండనివాడు (అంతటా నిండియున్నవాడు) దిక్కులకు (సర్వమునకు) మూలమైనవాడు, దిక్కుగలవారికి, దిక్కులేనివారికి దిక్కు (ఆశ్రయము) (ఎవ్వడో) ఏదియో, అదియె నాకు దిక్కు సుమా!

సర్వవ్యాపకుడైన ఆ ప్రభువు తన వినోదముకొఱకై అఖిల జగములను సృష్టించి, రక్షించి, లయింపజేయును. ఆ అవ్యయుడు (నాశములేనివాడు)

అన్ని రూపములందును గలడు. సమత్వములేని చిత్తమే మన శత్రువుగా ప్రవర్తించును, ఆ చిత్తమును వశముచేసుకొని నీ యహంభావముతో కూడిన అసురత్వమును వీడు మయ్యా, తండ్రీ! నీయాశ్రితజనులు నీకు శ్రేయస్కరమైన మాటలు నీకు చెప్పరయ్యా!

ఉ. లోకము లన్నియున్ గడియలోన జయించిన వాఁడ వింద్రియా
నీకముఁ జిత్తమున్ గెలువ నేరవు నిన్ను నిబద్ధుఁ జేయు నీ
భీకరశత్రు లార్వురఁ బ్రభిన్నులఁ జేసినఁ బ్రాణికోటిలో
నీకు విరోధి లేఁ డొకఁడు నేర్పునఁ జూడుము దానవేశ్వరా

దానవేశ్వరా! నీవన్నిలోకములను గడియలోనె జయించిన పరాక్రమశాలివి. అయినను, నీవు నీ యింద్రియములను, చిత్తమును (మనస్సును) జయింపలేకపోయితివి. నీలోనే యున్న నిన్ను దృఢముగ బంధించి యుంచిన ఆర్గురు భయంకరమైన శత్రువులుగలరు. (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనబడువారు). వారిని తొలగించినచో ప్రాణికోటిలో నీకొక్కడును విరోధియుండడు. వివేకముతో నీ విషయమును గ్రహింపుము తండ్రీ!

తండ్రీ! నీ బుద్ధికుశలతను పారింపుము. కర్మబంధములను తొలగింపుము. సమత్వముద్వారా సంసారబంధనమును చాలింపుము, హృదయమందు కేశవునియందు భక్తిని నెలకొల్పుము - అని పుత్రుడు చెప్పగా తండ్రి యిట్లనెను:

"ఓరీ కుమతీ! వదరుబోతా! చావునకు కూడ తెగించిన వానివలె వాగుచుంటివి. ఏ మాత్రమును భయములేకుండ, చంపిన చచ్చెదనులే యనునట్లు కఠినోక్తులచే నన్ను పొడుచుచుంటివి. నీకు చావుమూడినట్లున్నది.

శా. నాతోడం బ్రతిభాష లాడెదు జగన్నాథుండు నాకంటె నీ
భూతశ్రేణికి రాజు లేఁ డొకఁడు సంపూర్ణ ప్రభావుండు మ
ద్భ్రాతం జంపిన మున్ను నే వెదకితిం బల్మాఱు నారాయణుం
డేతద్విశ్వములోన లేఁడు మఱి వాఁ డెం దుండురా దుర్మతీ

ఓరీ దుర్మతీ! నాతో వ్యర్థప్రలాపనలతో వాదిస్తుంటివిగాని, నావంటి సంపూర్ణ శక్తి సంపన్నుడు, జగన్నాథుడు అయిన రాజు ఈ జీవకోటి కింకెవడున్నాడురా?

ఎవ్వడును లేడు. పూర్వము నా సోదరుని చంపిన ఆ హరిని రూపుమాపుటకు నేనీ విశ్వమంతటను పలుమారులు గాలించితిని. కాని వాడెచ్చటను గానరాలేదు. మఱి వాడెచ్చట నుండునురా చెప్పు. వాడెట్లు, ఏ స్థలమున సంచరించును? ఏమార్గమున వచ్చును? వాని సేవకునివలె మిక్కిలి ప్రేలుచుంటివి కదా, చెప్పు. వానిని, నిన్ను ముక్కలుముక్కలుగా ఖండించెదను.

అని రాక్షసరాజు గద్దించి గర్జించగా, నా హరిసేవకుడు ఏ మాత్రమును కోపగించుకొనక, హర్ష పులకాంకితుడై హృదయమందు శ్రీహరిని స్మరించి, నమస్కరించి, గంతులు వేయుచు నిట్లనెను:

మ. కలఁ డంభోధిఁ గలండు గాలిఁ గల డాకాశంబునం గుంభినిం
గలఁ డగ్నిన్ దిశలం బగళ్ల నిశలన్ ఖద్యోతచంద్రాత్మలం
గలఁ డోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలింగవ్యక్తులం దంతటం
గలఁ డీశుండు గలండు తండ్రి వెదకంగా నేల నీ యా యెడన్

తండ్రీ! ఆ పరమేశ్వరుడు సముద్రములోనున్నాడు. గాలియందున్నాడు, ఆకాశము నందున్నాడు. భూమి యందున్నాడు, అగ్ని యందున్నాడన్ని దిశలలోనున్నాడు, పగటియందున్నాడు, రాత్రియందున్నాడు, సూర్యచంద్రుల యందున్నాడు, ఆత్మయందును ఓంకారమునందును యున్నాడు, త్రిమూర్తుల యందున్నాడు, స్త్రీ పురుషలింగములలో నున్నాడు, అంతటనున్నాడు తండ్రీ! ఇక్కడ అక్కడయని వెదకనేల?

క. ఇందుఁ గలఁ డందు లేఁడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే గలడు దానవాగ్రణి! వింటే

తండ్రీ! ఇంకా చెప్పవలెనన్న, ఆ భగవంతు డిక్కడనుండు అక్కడ నుండడను సందేహముంచుకొనరాదు. విష్ణుమూర్తి అంతటనున్నాడు. ఎక్కడెక్కడ వెదకి చూచిన, అక్కడక్కడనే గానవచ్చునని తెలుసుకొనుడు. దానవశ్రేష్ఠా! అని, ఈ విధముగ:

మ. హరిసర్వాకృతులం గలం డనుచుఁ బ్రహ్లాదుండు భాషింప స
త్వరుడై యెందును లేఁడు లేఁడని సుతున్ దైత్యుండు తర్జింప శ్రీ
నరసింహాకృతి నుండె నచ్యుతుడు నానాజంగమస్థావరో
త్కర గర్భంబుల నన్నిదేశములనుద్దండ ప్రభావంబునన్

హరి, అన్నిరూపములలో (జీవరాసులలో) నుండునని ప్రహ్లాదుడు చెప్పుచుండగ, వెంటనే తండ్రి యెక్కడను లేడు లేడని గద్దించుచుండగ, విష్ణువు శ్రీనరసింహాకారమును దాల్చి, సమస్త చరాచర జీవవస్తుజాలములలో నన్ని ప్రదేశములలో భీకరతేజోమయుడై వ్యాపించి, ప్రత్యక్షమగుటకు సిద్ధముగ నుండెను.

అప్పుడు దానవేంద్రుడిట్లనెను:

క. డింభక సర్వస్థలముల
నంభోరుహనేత్రుఁడుండు ననుచు మిగుల సం
రంభంబునఁ బలికెద వీ
స్తంభంబునఁ జూపఁ గలవె చక్రిన్ గ్రిక్రిన్

క. స్తంభమునఁ జూపవేనిం
గుంభిని నీ శిరముఁద్రుంచి కూర్పఁగ రక్షా
రంభమున వచ్చి హరి వి
స్రంభంబున నడ్డపడఁగ శక్తుండగునే

ఓరీ డింభకా! ఆహరి, అన్ని స్థలములందు నుండునని ఎంతో సందడిగ చెప్పుకొనుచుంటివికదా! నీ చక్రిని, గ్రిక్రిని ఈ స్తంభములో చూపగలవేని చూపుము. నీవట్లు చూపలేనిచో నీ శిరమును ద్రుంచి నేలగూల్చెదను, అప్పుడా హరి నీయందు ప్రీతిచే నిన్నెట్లు రక్షింపగలుగునో చూచెదను. అప్పుడా పరమభక్త శ్రేష్ఠుడైన ప్రహ్లాదుడిట్లు బదులుచెప్పెను.

శా. అంభోజాసనుఁ డాదిగాఁగఁ దృణపర్యంతంబు విశ్వాత్ముఁడై
సంభావంబున నుండు ప్రోడ విపుల స్తంభంబునం దుండఁడే

స్తంభాంతర్గతుఁ డయ్యు నుండుటకు నే సందేహమున్ లేదు ని
ర్దంభత్వంబున నేఁడు గానఁబడుఁ బ్రత్యక్షస్వరూపంబునన్,

తండ్రీ! పద్మాసనుడైన బ్రహ్మదేవుని నుండి, గడ్డిపరకవరకు, విశ్వమంతా తానేయై వ్యాపించియున్న యా సర్వేశ్వరు డింత పెద్ద స్తంభములో నుండకుండునా? ఈ స్తంభములో కూడ నున్నాడనుట కెట్టి సందేహమును లేదు. దంభము లేకుండ చూచిన, ప్రత్యక్ష రూపమున ఇక్కడే ఇప్పుడే దర్శింపవచ్చును.

అనిన, విని, ఆసనమునుండి దిగ్గునలేచి క్రిందికి ఉఱికి, ఖడ్గమును దూసి, జళిపించుచు ప్రహ్లాదుని ధిక్కరింపుచు, దానవరాజిట్లనెను:

మ. వినరా డింభక! మూఢచిత్తగరిమన్ విష్ణుండు విశ్వాత్మకుం
డని భాషించెద వైన నిందుఁ గలఁడే యంచున్ మదోద్రేకియై
దనుజేంద్రుం డఱచేత వ్రేసెను మహోదగ్రప్రభాశుంభమున్
జనదృగ్భీషణదంభమున్ హరిజనుస్సంరంభమున్ స్తంభమున్. 457

వినరా, డింభక! మూఢుడా! విష్ణువు విశ్వాత్మకుడని గొప్పగా వదరుచుంటివి. నీ మాటయే నిజమైనచో వాడీ స్తంభమునందుండునేమో జూపుము - యని, మదోన్మత్తుడై యుద్రేకమున ఆ దానవచక్రవర్తి ఉగ్రతేజస్సుతో నత్యంత దంభమును ప్రదర్శించుచు, హరిభక్తునకు (ప్రహ్లాదునకు) మిక్కిలి ఆనందము కలుగునట్లుగ, తన యఱచేతితో ఆ స్తంభమున కొక్క వేటు వేసెను.

శ్రీనరసింహ స్వామి ఆవిర్భావము

ఇట్లు దానవేంద్రుడు తమోగుణావేశుడై విష్ణుద్వేషముచే రోషపూరితుడై హుంకరించి, బాలుని ధిక్కరించి, రత్నఖచిత స్వర్ణకంకణభూషితమైన హస్తముతో సభామంటప స్తంభముపై నొక్క వేటు వేయగా, నా స్తంభరాజము చిట్లి, పెటిలి ఛటఛట ధ్వనులతో విస్ఫులింగముల విరజిల్లుతూ విరిగిపడినది. భయంకరమైన ధ్వనులు ఆకాశమంతయు ఆవరించినవి. ఆ స్తంభమునుండి ఆవిర్భవించిన వింతమూర్తి ఎట్లుండెనన చక్రము, ధనుస్సు, హలము, అంకుశము మొదలైన దివ్యచిహ్నములుగల పాదపద్మములతోను, ఐరావతము

యొక్క కాళ్లవంటి తొడలతోను, మణిమయ చిరుగంటల మొలత్రాడుచే చుట్టబడి, పీతాంబరము కట్టబడి శోభించు, కటితలముతోను, పిడికిపాటిదైన సన్నని నడుముతోను, విశాలవక్షస్థలముతోను, వజ్రాయుధములవంటి నఖములతోను, శంఖచక్ర గదాది ఆయుధములు ధరించిన హస్తములతోను, మణిమయ రత్నఖచిత మంజుల హార కేయూర కంకణ కిరీట మకర కుండలాది భూషణములతోను, పర్వతమువంటి స్థిరమైన కంఠముతోను, పారిజాత పుష్పమువంటి మనోహరమైన పెదవులతోను, విద్యుల్లతవలె మెరయు దంతములతోను, ప్రళయకాలమందు సకలభువనములను నశింపజేయు అగ్నిజ్వాలలవంటి ఎర్రని నాలుకతోను, సూర్యగోళముల వంటి నేత్రములతోను, తారకాగ్రహ సంయుత అంతరిక్షమువంటి భృకుటితోను, కమనీయమైన గండభాగముతోను భీతిపుట్టించు జూలుతోను, లోకములను భయకంపితము చేయు గర్జనలతోను ప్రకాశించు ధవళదేహముతోను, ప్రహ్లాదుని రక్షించునట్టి కరుణారసదృక్కులతోను, హిరణ్యకశిపుని సంహరించు వీరరసముతోను శ్రీనరసింహ భగవానుడు ఆవిర్భవించెను. ఆ యద్భుత రూపమును చూచిన హిరణ్యకశిపుడిట్లు తలపోసెను.

క. నరమూర్తి గాదు కేవల
హరిమూర్తియుఁ గాదు మానవాకారముఁ గే
సరియాకారము నున్నది
హరిమాయారచిత మగు యథార్థము చూడన్

"ఇది నరరూపముగాదు, సింహరూపమునుగాదు, యథార్థముగ చూడగ రెండును కలసియున్న మాయావి హరిరూపముగ తోచుచున్నది.

ఉ. తెంపున బాలుఁ డాడిన సుధీరత సర్వగతత్వముం బ్రతి
ష్ఠింపఁ దలంచి యిందు నరసింహశరీరముఁ దాల్చి చక్రి శి
క్షింపఁగ వచ్చినాఁడు హరిచే మృతి యంచుఁ దలంతునైననా
సొంపును బెంపు నందఱును జూడఁజరింతు హరింతు శత్రువున్

సాహసముతో బాలుడు తెగించి చెప్పిన మాటను నిలిపి, తనయొక్క

సర్వవ్యాపకత్వమును నిరూపించుటకు విష్ణువు ఈ స్తంభమునందు నరసింహ రూపమునుదాల్చి, నన్ను శిక్షించుటకు వచ్చినాడు. ఈ హరిచేతనే నా మృతి సంభవింపనున్నట్లు అనిపించుచున్నది. అయినను, అందరు చూచుచుండగా నా యొక్క బలపరాక్రమ శోభలను ప్రదర్శించి, యీ శత్రువును హతమార్చెదను" అని అహంకారముతో బిర్రబిగుసుకొని, గదను ధరించి, వేగిఅపాటుచే నొగర్చుకొనుచు, సింహమును సమీపించు మత్తగజమువలె, రాక్షసవీరుడు నరసింహదేవుని కెదురుగా నడచి, ఆయన యొక్క దివ్యతేజోజ్వాలలకు దావాగ్నియందు ప్రవేశించిన మిణుగురుపురుగువలె, కర్తవ్యాకర్తవ్యములు తెలియని మూఢునివలె తేజోవిహీనుడై చేరెను.

చేరి, ఆ దానవేంద్రుడు తన గదను గిరగిర త్రిప్పి, ఆ నరసింహమూర్తిని కొట్టగా ఆ స్వామి, సర్పము నొడిసిపట్టిన గరుడునివలె హిరణ్యకశిపుని పట్టుకొనగ, ఆతడు గిలగిల కొట్టుకొని, తన బలమంతా ప్రయోగించి, పట్టుతప్పించుకొని, ఎగిఱి గంతువేసి తన శక్తివలన నరసింహుడు బలహీను డయ్యెనని భావించి, మిట్టిపడుచు, ఖడ్గ కవచములను ధరించి, భయంకరముగ గంతువేయుచు, యిటునటు దర్పముతో కదను ద్రొక్కుచుండగా -

సీ. పంచాననోద్ధూతపావకజ్వాలలు భూనభోంతర మెల్లఁ బూరితముగ
దంష్ట్రాంకు రాభీలధగధగాయితదీప్తి నసురేంద్రు నేత్రము లంధములుగఁ
గంటకసన్నిభోత్కట కేసరాహతి నభ్రసంఘము భిన్నమై చలింపఁ
బ్రళయాభ్రచంచలా ప్రతిమభాస్వరములై ఖరనఖరోచులు గ్రమ్ముదేర

తే. సటలు జళిపించి గర్జించి సంభ్రమించి
దృష్టి సారించి బొమలు బంధించి కెరలి
జిహ్వ యాడించి లంఘించి చేత నొడిసి
పట్టె నరసింహుఁ డా దితిపట్టి నధిప

(నారదుడు యుధిష్ఠిరునితో చెప్పుచుండెను) రాజా! అప్పుడేమి జరిగెననగా: శివుని తృతీయనేత్రాగ్ని వంటి భీషణ అగ్నిజ్వాలలు ఆ నరసింహస్వామినుండి వెలువడి, భూమ్యాకాశములను నింపివేసెను. ఆస్వామిదంతముల (కోరల)

ధగధగ మెఱుపులు అసురేంద్రుని కండ్లకు మిఱుమిట్లు గొలిపి అంధత్వము కలిగించెను, ముండ్లవలె అతిశయించిన కేసరముల కదలిక మేఘములను ఛిన్నాభిన్నము చేసెను. కఠినమైన వజ్రములవంటి గోళ్ల మెఱుపులు విద్యుల్లతలవలె ప్రకాశించెను. జూలు విదిలించి, గర్జించి, విజృంభించి, దృష్టిని అసురునిపై సారించి, బొమలు ముకుళించి, జిహ్వాయాడించి, నరసింహస్వామి అసురునిపై లంఘించి, వాని నొడిసి పట్టుకొనెను. పామునోట బడి కొట్టుకొను మూషికమువలె ఆ దనుజుడు ప్రాణభయముతో కొట్టుకొనెను. ఆ ఉగ్రనరసింహమూర్తికి అసురాధిపతి లోబడిపోయెను. అప్పుడు నరసింహు డత్యాగ్రహముతో, దుస్సహుడును, వజ్రమువంటి కఠిన శరీరుడును, అచంచలమైన ఉత్సాహము గలవాడును, బలమైన బాహువులు గలవాడును, ఇంద్రుని అగ్నిని యముని యందు భయము కలిగించువాడును, ఘోరకృత్యములను చేయువాడును, దైత్యవంశలక్ష్మీకరుడును, అయిన ఆ రాక్షసేంద్రుని పట్టి, తన తొడలపై నిడుకొని, తన వాడియైన నఖములతో, గరుత్మంతుడు సర్పమును చీల్చునట్లు, ఆ దానవుని చీల్చివేసెను. స్వామి యారక్కసుని హృదయకమలమును చించివేసి, భూమిపై అతని రక్తమును వర్షింపజేసెను, రక్తనాళములను త్రెంచివేసెను. అతని విశాల వక్షమును బ్రద్దలుచేసెను, మాంసమును ముక్కలు ముక్కలుగా త్రుంచివేసెను, దుష్టుడైన ఆ అసురుని చీల్చి సంతోషించెను, ప్రేవులను మెఱయుచున్న నఖములతో కంఠమాలికలుగ చేసెను. ఆ నరసింహస్వామి నఖము లెట్లుండెననగా: వక్షస్థలమును ముక్కలు చేయునప్పుడు అవి గొడ్డళ్లవలె నుండెను. హృదయ కమలమును భేదించునప్పు డవి త్రవ్వెడి పనిముట్లుగ కనిపించెను, నాడులను త్రెంచునప్పుడవి కొడవళ్లవలెపనిచేసెను, ఉదరమందలి ప్రేవులను త్రెంచునప్పుడవి ఱంపములవలె పనిచేసెను; తొడ మీదనున్న దైత్యుని ఎట్టి శస్త్రములనుపయోగింపక సంహరించిన నరసింహుని నఖము లతి విచిత్రమైన ఆయుధములై పనిచేసినవి, రాజా!

ఈ విధముగ మానవరూపముగాని, మృగరూపముగాని కాకుండ నరసింహ రూపమును, రాత్రిగాని, పగలుగాని, కాకుండ సంధ్యా సమయమును, బయటగాని, లోపలగాని, కాని ద్వారస్థలమునను, భూమి యాకాశములుకాని

యూరువులపైన, సజీవముగాని, నిర్జీవముగాని, కాని నఖములతోడను, దానవవీరుని వధించి, మహాగ్నికీలలతోను, భయంకరమైన ముఖముతోను, సర్పమువంటి చాచియున్న నాలుకతోను, రక్తముతో తడిసిన కేసరములతోను, కంఠమాలలుగ ధరించిన ప్రేవులతోను, ఏనుగు కుంభస్థలమును కొట్టివచ్చుచున్న సింహమువలె కనబడుచున్న ఉగ్రనరసింహమూర్తిని గాంచి సహింపలేక రాజభృత్యులైన రాక్షసులు ఆయుధముల నెత్తుకొని యుద్ధమునకు సిద్ధపడి ఎదిరింపగా, స్వామి వారినందరిని, ఒక్కడైనను మిగలకుండ, చక్రాయుధముతో సంహరించెను.

రాక్షసవీరులందరిని అంతముచేసి, రణోత్సాహమునుచాలించి, భయంకరమైన దృక్కులతో, సింహాసనము నధిష్ఠించినవాడై శమింపని ఆగ్రహావేశుడై నరసింహస్వామి భీకరముగ నుండెను. ఆయనను చూచుటకు కూడ దేవతలు భయపడి దాగుకొనిరి. దేవతలు, చారణులు, విద్యాధరులు, గరుడులు, సర్పములు, యక్షులు, సిద్ధులు, ఇతర గణములలో నే యొక్కడైనను ఆ నరహరిని సమీపించుటకు సాహసింపరైరి. ఆకాశవీధులలో దేవతాంగనలు ప్రీతితో నరసింహునిపై పుష్పములు కురిపించి, ఉత్సవములు చేసుకొనిరి. ఈ సందర్భమున ఆకాశమునందు అనేకమైన దేవతావిమానములు కన్పించెను. గంధర్వగానములు, దివ్యవాద్యములు, అప్సరసల నృత్యములు వినిపించెను. విష్ణుపార్షదులు, మహేశ్వర బ్రహ్మ, ఇంద్రాది దేవతలు, మునులు, మనువులు, ప్రజాపతులు ఆ నరసింహస్వామి దర్శనార్థం విచ్చేసిరి.

బ్రహ్మాదిదేవతలు స్వామియొక్క ఉగ్రమూర్తిని చూచి భయభ్రాంతులై ఆయనను సమీపింపకుండా, చేతులు మోడ్చి శిరస్సులు వంచి, స్తుతించిరి. బ్రహ్మదేవుడిట్లు స్తుతించెను.

మ. ఘనలీలాగుణచాతురిన్ భువనముల్ గల్పించి రక్షించి భే
దనముం జేయు దురంతశక్తికి ననంతజ్యోతికిం జిత్రవీ
ర్యునికిన్ నిత్య పవిత్రకర్మునికి నే నుత్కంఠతో నవ్యయా
త్మునికిన్ వందన మాచరించెదఁ గృపాముఖ్యప్రసాదార్థినై

మహాద్భుత లీలాగుణవిశేషచైతన్య స్వరూపునికి, భువనములను సృష్టించి, రక్షించి లయింపజేయు అమోఘశక్తి సంపన్నునకు, అనంతజ్యోతికి, విచిత్ర పరాక్రమశాలికి, నిత్యమును పవిత్రకర్మలనే చేయువానికి, అవ్యయాత్మునకు, నేనత్యంతాసక్తితో, కృపానుగ్రహముల నర్థించుచు, నమస్కరించుచున్నాను. రుద్రుడిట్లు ప్రార్థించెను:

దేవదేవా! నీ కోపమున కిది సమయముకాదు. ఇంకా సహస్రయుగములు గడిచినగాని ప్రళయము రాదుకదా! దేవతలను హింసించిన తామసికుడైన దైత్యుని యుద్ధమున వధించితివి. ఇక చాలును. అతని పుత్రుడైన ఈ బాలుడు నిర్మలచిత్తుడు, నీ భక్తుడు, పవిత్రుడు. వీనిని కావుము, భక్తవత్సలా! ఇంద్రుడిట్లు ప్రార్థించెను:

ఓ ప్రభూ! ప్రాణికోట్ల హృదయ పద్మమధ్యమున నివసించి ప్రకాశించు నీవే సర్వమునెఱుగుదువు కదా! ఈ రాక్షసుని జంపి ఇంతకాల మీ దానవునిచే బాధలుపడుచు చిక్కియున్న ఆపన్నజనులను మమ్ములను రక్షించితివి, ఈ రాక్షసుని జంపి ఇప్పుడు క్రతుహవ్యములు మాకు మఱల లభించును. దేవా! నీ సేవ చేయుటను మరగినవారు కైవల్యవైభవమును గూడ కాంక్షించరుకదా! ఇక నితర సుఖములను కోరుకొందురా, అవి అస్థిరములు కావా! నిన్ను అనంతభక్తిచే కొలువనిమ్ము ఓ దైత్యభయనివారకా, నరసింహా!

ఋషులిట్లనిరి :

నీకుక్షియందు లయించి యున్న లోకములనుత్పాదించి, రక్షించి నే డవి, ఈ రాక్షసునిచేత పీడింపబడి కుంచించుకు పోయి యుండ, నీవు ఈ దుర్నీతిపరుని నరసింహరూపమున సంహరించి, వేదవిధులనుద్ధరించితివి కదా! ఓ ధర్మసంస్థాపకా!

పితృదేవతలిట్లనిరి :

ఈ దానవుడు మిక్కిలి నీచుడై క్రోధముతో మా పుత్రులర్పించు తిలోదక పిండములను మాకు చేరనీయకుండా తానే గైకొనుచుండెను. వీడిప్పుడు నీయొక్క నఖములచే చీల్చబడి హతుడై పడియున్నాడు. ఓ ఆత్మేశ్వరా! నీకివే మా ప్రణామములు.

సిద్ధులిట్లనిరి :

ఓ ప్రభూ! నరసింహా! కోపముతోడ యీ దైత్యుడు మా యొక్క సిద్ధులన్నిటిని అపహరించెను. నీవీ దుష్టుని సంహరించి ఎంతో కృపతో మా సిద్ధులను మా కిప్పించితివి. నీకు నమస్కృతులు.

విద్యాధరులిట్లనిరి :

నరసింహా! ఈ దానవుని జంపి, మా యొక్క అంతర్ధానాది విద్యలను మాకు మఱల వచ్చునట్లు చేసితివి. నీ యొక్క నిరుపమ వైభవము నేమని కొనియాడగలము దేవా!

భుజంగులిట్లనిరి :

ఓ ప్రభూ! మా యొక్క రత్నములను, కాంతారత్నములను కొనిపోయిన యీ రక్కసుని చీల్చిచెండాడి మా రత్నములు, మా పత్నులు మాకు దక్కునట్లు చేసిన నీకు వందనములు.

మనువు లిట్లనిరి :

దేవా! జయింపశక్యముకాని ఈ రాక్షసునిజంపి, భ్రష్టము చేయబడిన వర్ణాశ్రమ ధర్మవర్గమును మఱల పరిపూర్ణము చేసితివి, నీకు ప్రణామములు.

ప్రజాపతులిట్లనిరి :

ప్రభూ! ప్రజోత్పత్తి చేయుటకు మమ్ము సృజించి నియమించితివి. కాని, ఈ దైత్యుని యాజ్ఞచే మా ధర్మము నెఱవేర్చలేకపోయితిమి. ఇప్పు డీతనిని జంపితివి గాన ఇక నెట్టి భయములేక, మా కర్తవ్యములను నిర్వహించెదము.

గంధర్వు లిట్లనిరి :

ఈ రాక్షసుడు మా చేత రేయింబవళ్లు నిర్దయుడై ఆడించుచు పాడించుచు బంధించెడివాడు. ఇప్పుడు నీ చేత యమపురికి పంపించబడెను కావున బ్రతికి పోతిమి.

చారణులిట్లనిరి :

ముల్లోకముల ప్రజలను బాధించెడి ఈ యింద్రశత్రువు నేడు నీ చేత హతుడైనాడు గనుక ఓప్రభూ! భవరోగమును నివారించు నీ పాదపద్మముల నాశ్రయించి ఇక బ్రతికెదము దేవా!

యక్షులిట్లనిరి :

నీవు లేనే లేవని, ప్రచారము చేయుచు, నీ భక్తులకు భంగపాటు చేయుచుండు వీనిని నిర్మూలించి మా ఆపదలను తీర్చితివికదా! మోక్షప్రదాతా, జగన్నివాసా!

కింపురుషులిట్లనిరి :

ప్రభూ! సకలసజ్జనుల హృదయములను కర్కశుడై బాధించెడి యీ దుష్టుని జంపి జగమును రక్షించితివికదా! అల్పులము మేము నిన్ను స్తుతింపగలమా! పురుషోత్తమా!

వైతాళికులిట్లనిరి :

త్రిభువనముల శత్రువైన రాక్షసుడు పడిపోయెను. ఇక మేము ఎట్టి భయమును లేక యాగములందును, సభలయందును నీ శుభగీతములను పాడుచు సంచరించెదము ఆర్తశరణ్యా!

కిన్నరు లిట్లనిరి :

ఈ పాపాత్ముడు ధర్మవిరుద్ధముగ మాచే నీచకర్మలను చేయించెడివాడు. ఈ కలుషాత్ముని నీవు అంతము చేసితివి గనుక ఇకపై మేము ఉత్తమకర్మలను చేయుచు నీ యొక్క పాదపద్మములను కొలుచుచు తరించెదము శ్రీహరీ!

విష్ణుసేవకులిట్లనిరి :

సనకాదిమునుల శాపముచే చండరాక్షసుడై పుట్టిన వీనినీవిధముగ శిక్షించి శాపవిమోచనము గావించితివి ప్రభూ! అది నీ యొక్క కృప. భక్తితో సేవించుట కంటె వైరముతో నిన్ను శీఘ్రముగ జేరవచ్చునేమో కదా! పూజనీయమైన నీ నరసింహ రూపమతి యద్భుతముగ నున్నది. అందరును ఆపద బాసిరి శ్రీహరీ!

ఈ విధముగ బ్రహ్మాదిదేవతలు స్తుతించినను స్వామియొక్క ఉగ్రత శమింపనందున, వారు లక్ష్మీదేవిని పిలిచియిట్లు వేడుకొనిరి.

క. హరికిం బట్టపుదేవివి
హరిసేవా నిపుణమతివి హరిగతివి సదా
హరిరతివి నీవు సని నర
హరి రోషము డింపవమ్మ హరివరమధ్యా.

తల్లీ! శ్రీహరికి పట్టపుదేవివి, హరిసేవచేయుటలో నిపుణురాలివి, హరిచే ఎల్లప్పుడును కోరబడుదేవివి. ఎల్లప్పుడును హరిని రమింపజేయు సతివి. ఓ సింహమధ్యా! నీవు పోయి, ఆ నరహరి రోషమును శాంతింపజేయుమమ్మా.

అనిన, ఆమె వారి కోరికను మన్నించి, మహా ఉత్సాహముతో నరహరి సమీపమునకు పోయి, ఆ రూపమును జూచి, ఆశ్చర్యచకితయై యిట్లు తలపోసెను: "ఇదేమిటి, నా స్వామి రూపమిట్లున్నది!

సీ. ప్రళయార్క బింబంబుపగిది నున్నది గాని నెమ్మోము పూర్ణేందునిభము గాదు
శిఖిశిఖాసంఘంబు చెలువు సూపెడుఁగాని చూడ్కి ప్రసాదభాసురము గాదు
వీరరౌద్రాద్భుతావేశ మొప్పెడుఁగాని భూరికృపారసస్ఫూర్తిగాదు
భయదదంష్ట్రాంకుర ప్రభలు గప్పెడుఁగాని దరహసితాంబు జాతంబు గాదు

తే. కఠిననఖర నృసింహవిగ్రహముగాని
కామినీజనసులభవిగ్రహము గాదు
విన్న దియుఁగాదు తొల్లి నే విష్ణువలనఁ
గన్నదియుగాదు భీషణాకార మనుచు,

ఫాలభాగము ప్రళయకాల ప్రచండ సూర్యగోళము వలె తపించుచున్నది గాని, ఎల్లప్పుడు నుండు చల్లని పూర్ణచంద్రప్రకాశముతో లేదేమి? చూపులు అగ్నిజ్వాలలవలె నున్నవి గాని ప్రసన్నముగ శోభించుటలేదు. మోము వీరరౌద్ర అద్భుత ఆవేశపూరితముగ నున్నదిగాని ఎప్పటివలె మిక్కిలి కృపారస ముట్టి పడుటలేదు, పెదవులు ఆ భయంకరమైన కోరల దీప్తిని కప్పిపుచ్చుచున్నవేగాని పద్మము వంటి స్వచ్ఛమైన చిరునవ్వుల చిందించుటలేదు. విగ్రహమైనను, కఠినమైన వజ్రనఖములతో కూడిన నరసింహ రూపమేగాని మగువలు మెచ్చు సుందర సుశీల సౌమ్య విగ్రహముగాదు. నేనిటువంటి భీకరరూపము గురించి

మునుపెన్నడును వినియుండలేదు, చూచియుండనులేదు" ఆమె స్వామితో మాట్లాడవలెనని ప్రయత్నించును, మరి ఆయన కోపగించుకొని పలుకడేమోయని వెనుకాడును. చనువుతో మాట్లాడినను తిరస్కరించునని భయపడును. ఈ విధముగ నామె, స్వామి శాంతించిన పిమ్మట మాట్లాడుటకు నిశ్చయించుకొని మిన్నకుండెను.

అప్పుడు బ్రహ్మదేవుడు యోచించి, ఆ దేవదేవుని రోషమును నివారించుటకు ఒక్క ప్రహ్లాదుడే సమర్థుడని గుర్తించి అతనితో నిట్లనెను :

"నాయనా, ప్రహ్లాదా! నీ తండ్రిని శిక్షించు నిమిత్తము శ్రీహరి తీవ్రముగ రోషావేశుడై యింతవరకును శాంతింపకున్నాడు. నీవు పోయి, యతని కోపతాపమును శాంతింపజేయుమయ్యా" అని కోరగా ఆ మహాభాగవత శ్రేష్ఠుడు సరే యని, చేతులు జోడించి, వినయ వివేకశీలుడై మందగమనముతో స్వామి సన్నిధికి పోయి, సాష్టాంగ దండప్రణామములు చేయగా భక్తపరాధీనుడైన ఆ భగవంతుడు శాంతుడై, కరుణాపూర్ణచిత్తుడై... బాలుని దగ్గరగా తీసుకొని, కృపాదృక్కులతో చూచుచు, నతని శిరస్సుపై తన దివ్యహస్తమునుంచి తలనిమిరెను. శ్రీహరి కరస్పర్శచే ఆ బాలుడు, భయరహితుడై, బ్రహ్మజ్ఞాన సహితుడై పులకిత దేహుడై, ఆనందబాష్ప ప్రవాహపూర్ణుడై, ప్రేమాతిశయమున రుద్ధకంఠుడై, వినయ వివేక చేతసుడై, ఏకాగ్రచిత్తుడై, భక్తిపరాయణుడై, ఆ పరమేశ్వరుని చరణకమలములను తన హృదయమందు నిలుపుకొన్నవాడై చేతులు జోడించి, యిట్లు స్తుతించెను:

ప్రహ్లాద స్తుతి

దేవదేవా! దేవతలు, సిద్ధులు, యతీశ్వరులు, బ్రహ్మాదులు, భావసహిత చిత్తములతో నిన్ను అనేకవిధముల నిత్యము చింతించుచు, సంసారసాగరపు ఆవలి యొడ్డు చేరుటకు నిన్ను స్తుతింప గోరినను, సంపూర్ణముగ నిన్ను స్తుతింపలేరట. మఱి నేను రాక్షస వంశజుడను, జడుడను, గర్వమద, ఉద్రిక్తతలతో గూడియున్నవాడను, బాలుడను, నిన్ను వర్ణింపగలనా స్వామీ!

తపము, వంశము, తేజము, శాస్త్రజ్ఞానము, అంగసౌందర్యము, ఉన్నతపదవి, నైపుణ్యము, ప్రతాపము, పౌరుషము, నిష్ఠబలము, ప్రజ్ఞ (జ్ఞానము)

జపయోగము, ఇవి ఏవియును నిన్ను సంతుష్టునిగా చేయుటకు చాలవుకదా! స్వామీ! నిన్ను సంతోషింపజేయుటకు గజేంద్రునివలె భావయుక్తముగ భక్తి చేయవలెను.

నిర్మలజ్ఞానము, దానధర్మనిరతి, సత్యవ్రతము, క్షాంతి (క్షమాగుణము) మత్సరము లేకుండుట, యజ్ఞ, తపస్సులను చేయుట, అసూయలేకుండుట మొదలగు సదాచారములు గలవని గర్వించు బ్రాహ్మణోత్తముని కంటెను, కర్మలచేతను, వాక్కులచేతను మనస్సు భావములచేతను, ప్రాణముచేతను సమమైన నిష్ఠతో నిన్ను ప్రార్థించునట్టి చండాలుడే శ్రేష్ఠుడు. అట్టివాడు, చివరకు తన వంశమునకు శ్రేయస్కరుడగును.

కావున నో యనంతా! అల్పుడనైన నేను సంకోచము లేక నిన్ను సంస్తుతించెదను. నీ వర్ణనము చేసిన వాడు అవిద్యను జయించి ముక్తికి బోవును కదా!

సర్వాత్మకుడవైన ఓ సర్వేశ్వరా! నీ భీషణాకృతిని చూచి, నీ యాజ్ఞలను శిరసావహించి నెరవేర్చువారైన బ్రహ్మాదిదేవతలు భయభ్రాంతులగుచున్నారు. నీ యొక్క సుందర రూపములు, కల్యాణకరములుగాని భీతికరములు కావు, కావున రోషంబు మానుము. అందరినీ భయపెట్టిన అసురుని అంతమొందించితివి కదా! నీ అవతారకార్యము తీరినది. ఇక అలుక యేల ప్రభూ! ఇప్పుడు సాధుసంతోషమైనది. లోకులందరు నిన్ను కలుషహారివని, సంతోషకారివని స్తుతించుచున్నారు నిర్మలాత్మా! ఈశ్వరా! నీ యొక్క భయంకరమైన కోరలు, భృకుటి, జూలు, నఖములు, ఉగ్రమైన ధ్వనులు, రక్తముతో తడిసిన కేసరములు, హారములవలె వ్రేలాడు ప్రేవులు జ్వలించుచున్న నేత్రములు, వీటితో కూడియున్న నీ భయంకర నరసింహాకృతిని జూచి, నేను భయపడుటలేదు, ఏలనన వీటికంటె క్రూరమైనది, తప్పింప శక్యముకానిది, భరించలేనట్టిది అయిన సంసార దావాగ్నికి నేను మిక్కిలి భయపడుచుంటిని. నీ పాదములచెంత నాకు ఆశ్రయము ననుగ్రహింపుము. దేవా! నేను అనేక యోనులనుండి జన్మించి, సుఖవియోగము దుఃఖసంయోగముల వలన కలుగు శోకాగ్నిలో దహింపబడినవాడనై ఇంకా

దుఃఖమును కలిగించునట్టి దేహాభిమానముచే మోహితుడనై భ్రమించుచుంటిని. ఇకనుండి నాకు అత్యంత ప్రియతముడవు, సఖుడవు, పరమదేవతవు, నైన నీ యొక్క లీలావతార కథా విశేషములను పఠించుచు, రాగద్వేషాది వికారము తొలగించుకొని దుఃఖములను దాటివేసి, నీ యొక్క పాదసేవలో నిపుణులైన భక్తుల సాంగత్యము చేసెదను. బిడ్డలను తలిదండ్రులు రక్షించునట్లును, రోగిని వైద్యుడిచ్చిన ఔషధము రక్షించునట్లు, సముద్రము నందు మునుగుచున్న వానిని నావ రక్షించునట్లు, ఇతరులెవ్వరును రక్షింపలేని విధముగ సంసార తాపములో నీ చేత వుపేక్షింపబడి, దహించుకు పోవుచున్న వాని నుద్ధరించుటకు నీవు తప్ప నన్యులెవ్వరును సమర్థులు కానేరరు. జగద్రక్షకుడవైన నీ యొక్కయంశమైన మానవునకు నీ యొక్క యనుగ్రహముచే మనస్సు కలిగెను. ఈ మనస్సును నీ యొక్క సేవచేసిననే తప్ప జయించుట యెవ్వరికిని సాధ్యపడదు. ప్రభూ ఈ సంసార దావాగ్నిలో దహించుకుపోవుచున్న ఈ దీనుని రక్షింపుము. జనులు, దేవతల నాశ్రయించి, సంపదలను, దీర్ఘాయువును, వైభవములను, అవియే కోరదగినవనిగా భావించి కోరుకొందురు. కాని అవియన్నియును నా తండ్రియొక్క రోషముచేతగాని, అట్టహాసముచేతగాని, ఆవులింతచేగాని, బొమముడి (ముకుళించిన భృకుటి) మాత్రముచేగాని పొందబడుచుండెను. అట్టి శక్తిమంతుడైన వీరుడే నిముషమాత్రమున నీచేత అంతమయ్యెనుకదా! కావున అట్టివి కోరదగినట్టివికావు. బ్రహ్మాదిదేవతల సిరి, వైభవములు, జీవితములు కూడను కాలునిచేత నపహరింపబడునట్టివేగాని, నిలిచియుండవు. నాకేమియును వలదు. నీయందు నాకుగల కొద్దిపాటి ఎఱుకచే నిన్ను సేవకునివలె కొలిచెదను స్వామీ!

మానవుడు, ఎండమావులవంటి యీ మిథ్యా సంపదలన్నీ నిజములేయని భ్రమించి, రోగభూయిష్టమైన శరీరము పట్ల విరక్తుడు గాక, మిక్కుటమైన కామాగ్నిలో నెల్లప్పుడు దహించుకొనిపోవుచు, ఇంద్రియ సుఖములలో మునిగిపోవుచు, నెన్నడును సంసారసాగరమును దాటిపోజాలడు.

ప్రభూ! శ్రీదేవి, బ్రహ్మ, మహేశ్వరులకైనను నీ యొక్క దివ్యహస్తముచే

అభయదానము చేసియుండని నీవు, బాలుడను, దానవవంశజుడను, రజోగుణోపేతుడను అయిన నా శిరస్సుపై అపరిమితమైన దయతో నీ యొక్క కరకమల ముంచుట అత్యంత ఆశ్చర్యకరము కాదా!

మహాత్మా! సుజనులైన బ్రహ్మాదిదేవతల యందును, దుర్జనులమైన మావంటి దైత్యులయందును ఎట్టి పక్షపాతమును జూపక కల్పవృక్షమువలె కర్మఫలప్రదానము చేయుదువు. సంసార కూపమునపడి కొట్టుకొనుచున్న మూఢజనులతో గూడి మ్రగ్గుచున్న నేను, నీ యొక్క సేవకుడైన నారదమహర్షి యనుగ్రహముచే నీ కృపకు పాత్రుడనైతిని. నన్ను రక్షించుటకై మా జనకుని వధించుట నా యందు పక్షపాతము గాదు. దుష్టశిక్షణము, శిష్టరక్షణము, ధర్మోద్ధరణము, అనబడునవి నీ యొక్క నైజగుణములు. నీవే విశ్వమువు. త్రిగుణాత్మకమైన విశ్వమును సృజించి, అందు ప్రవేశించి, కార్యకారణ గుణయుక్తుండవై రక్షక భక్షకాది నానారూపముల ధరింతువు. నీ మాయచే స్వ, పర యనెడి భేదబుద్ధి కన్పించునుగాని, నీ కంటే వేఱేమియును లేదనునదియే సత్యము. విశ్వమునకు నీ యందె సృష్టి స్థితి ప్రకాశలయములు కలుగును. నీవు తొల్లి ప్రళయకాలమున శేషతల్పమున యోగనిద్రలో నుండగ, కాలశక్తిచే మేల్కొలుపబడి, త్రిగుణములను స్వీకరించి, నాభినుండి కమలము నుద్భవింపజేయగా దానినుండి చతుర్ముఖ బ్రహ్మ ఉద్భవించెను. తన జన్మకు ఉత్పత్తిస్థానము నన్వేషింప దలచిన బ్రహ్మదేవుడు జలమునందు ఒక వంద దివ్యవత్సరములు వెదకి యేమియు గానలేక తిరిగివచ్చి కమలముపై ఆసీనుడై చిరకాలము తపస్సుజేసి, తన హృదయమునందే పురుషోత్తముడవైన నిన్ను దర్శించెను.

ఈశ్వరా! నీవు హయగ్రీవునిగ మధుకైటభులను రాక్షసులను వధించి, వేదములను గైకొని బ్రహ్మకు ఇచ్చిన ఘనుడవు. ఈ విధముగ నీవు కృత త్రేతా ద్వాపరయుగములలో, జంతు, మానవ, ముని, జలచరాకారంబులలో అవతరించి, లోకములనుద్ధరింపుచు, ధరియింపుచు, హరియింపుచు, యుగానుకూల ధర్మంబులను ప్రతిష్ఠింపుచునుండుదువు, దేవదేవా!

సీ. కామహర్షాదిసంకలితమై చిత్తంబు భవదీయచింతనపదవి సొరదు
మధురాదిరసముల మరఁగి చొక్కుచు జిహ్వ నీ వర్ణనమునకు నిగుడ నీదు
సుందరీముఖములఁ జూడఁగోరుచుఁ జూడ్కి తావకాకృతులపైఁ దగులువడదు
వివిధ దుర్భాషలు వినఁగోరు వీనులు వినవు యుష్మత్కథావిరచనములు

తే. ఘ్రాణ మురవడిఁ దిరుగు దుర్గంధములకు
దవులు గొలుపదు వైష్ణవధర్మములకు
నడఁగి యుండవు కర్మేంద్రియములు పురుషుఁ
గలఁచు సవతులు గృహమేధిఁ గలఁచునట్లు.

దేవాదిదేవా! కోరికలతోను, హర్షశోకములతోను, కలుషితమయి, చిత్తము నీ యందు ధ్యానమగ్నమవదు. మధురాది షడ్రుచులను తిన మరగిన నాలుక, నీ యొక్కదివ్యలీలా వర్ణమువలను చేయుటకు నిచ్చగించదు. సుందర వనితల వదనముల నెల్లప్పుడు జూడగోరెడు చూడ్కులు, నీ యొక్క దివ్యమోహనా కృతులయందు దృష్టి నిలుపదు. నానారకములైన దుర్భాషలను వినగోరు చెవులు నీ యొక్క దివ్యమధుర గాథలను వినగోరవు. దుర్గంధముల కలవాటుపడిన నాసికలు, విష్ణుపూజల సుగంధములతో తృప్తిజెందునా? విషయభోగముల కలవడిన యింద్రియములు వైష్ణవధర్మాచరణకు ఇష్టపడక; సవతులు గృహస్థుని వేధించునట్లు అలజడి చేయును.

ప్రభూ! ఈ విధముగ నింద్రియములచేత చిక్కుపడి, ఇతర ప్రాణుల యందు స్వ, పర, భేదభావములను జూపుచు, జనన మరణముల పొందుచు సంసార వైతరణీ పంకిలములో మునిగియున్న లోకము నుద్ధరించుట, సృష్టి, స్థితి లయ కారకుడవైన నీకే తగియున్నది, కర్తవ్యము కూడను. నీ సేవకులమైన మా యందు ప్రియభక్తులనుద్ధరించు రీతిగ నుద్ధరింపుము.

సర్వేశ్వరా! నీయొక్క దివ్యగుణానుకూల వర్తనముచే కలిగిన అమృతపాన చిత్తుడనైన నేను ఈ భయంకర సంసార వైతరణికి భయపడుచుంటిని. దీనికి వ్యతిరేకులై నీ యొక్క గుణస్తోత్రములను చేయుటకు విముఖులై మిథ్యాసౌఖ్య భావములతో సద్గతిని గాంచలేని మూఢులగురించి నేను శోకించెదను.

దేవా! మునీంద్రులు మోక్షాపేక్షులై, నిర్జన స్థలములలో తపస్సు చేసెదరు. కోరికలను నిరాకరించువారికి నీ కంటెను వేఱు శరణ్యములేదు. నేను నిన్ను సేవించెదను ప్రభూ! కొందరు కాముకులు పశుపక్ష్యాదులవలె తుచ్ఛమైన మైథున క్రియలలోను, గృహస్థ సుఖములలోను, తగుల్కొని కడు దుఃఖితులగుదురు. నీ యనుగ్రహమును పొందిన నుగుణుడు కోరికలులేనివాడై యుండును. భక్తిలేనిదే నీ గురించిన జ్ఞాన మబ్బదు. నీవు సగుణుడవు, నిర్గుణుడవు కూడను.

సీ. నీగృహాంగణభూమి నిటలంబు మోవంగ మోదించి నిత్యంబు మ్రొక్కఁడేని
నీమంగళస్తవనికరవర్ణంబులు పలుమాఱు నాలుకఁ బలుకఁడేని
నీయధీనములుగా నిఖిలకృత్యంబులు ప్రియభావమున సమర్పింపఁడేని
నీపదాంబుజముల నిర్మలహృదయుఁడై చింతించి మక్కువఁ జిక్కఁడేని

తే. నిన్నుఁ జెవులార వినఁడేని నీకు సేవ
సేయ రాఁడేని బ్రహ్మంబుఁ జెందఁగలఁడె
యోగియైనఁ దపోవ్రత యోగియైన
వేదియైన మహాతత్త్వవేదియైన.

దేవదేవా! నీ మందిరప్రాంగణ భూమిపై నుదుటిని మ్రోయించుచు ఆనందపారవశ్యముతో నిత్యము మ్రొక్కనివాడు, నీ దివ్యమంగళ స్తవవర్ణనలను పలుమార్లు నాలుకపై నుచ్చరింపని వాడు, తనయొక్క సర్వకర్మలను ప్రేమభావముతో నీకు సమర్పించి, నీ యధీనము చేయనివాడు, నీ దివ్యపాదపద్మములను నిర్మల హృదయుడై స్మరించుచు ప్రీతితో పట్టుకొననివాడు, నీ దివ్యచరిత్రలను చెవులార విననివాడు, నీ పాదపద్మముల సేవ చేయుటకు రానివాడు, ఎంతటి యోగియైనను, తపోధనుడైనను, వేదవేత్తయైనను తత్త్వవేత్తయైనను, బ్రహ్మమును జెందగలడా? స్వామీ! కావున ఓ ప్రభూ! నీ యొక్క పాదసేవా, దాస్య, భాగ్యమును నాకు అనుగ్రహింపుము.

అని ప్రణతుడైన ప్రహ్లాదుని వాక్కులకు సంతసించి శ్రీహరి సౌమ్యముగ నిట్లనెను:

శా. సంతోషించితి నీ చరిత్రమునకున్ సద్భద్ర మౌగాక నీ
యంతర్వాంఛితలాభ మెల్లఁ గరుణాయత్తుండనై యిచ్చెదం
జింతం జెందకు భక్త కామదుఁడ నే సిద్ధంబు దుర్లోక్యుఁడన్
జంతుశ్రేణికి నన్నుఁ జూచినఁ బునర్జన్మంబు లే దర్భకా.

బాలకా! నీ యొక్క సత్‌చరిత్ర సత్శీలములకు సంతోషించితిని. నీకు సర్వశుభములు కలుగుగాక! నీ మనోవాంఛితములన్నిటిని కరుణతో నీకు ప్రసాదించెదను. చింతింపవలదు. నేను నిశ్చయముగ భక్తుల మనోభీష్టములను తీర్చువాడను. నా దర్శనము దుర్లభము. అయినను నా దర్శనమొకసారి లభించిన, జీవులకిక పునర్జన్మ యుండదు. సాధులు, విద్వాంసులు, సకలశుభములను ప్రసాదింపగల ప్రభువునైన నన్ను అనేక విధములుగ కోరుచుందురు. నేనిచ్చెదను, నీవు కూడ ఏదియైనను కోరుకొనుము - అని పరమేశ్వరుడా బాలుని మనస్సు నెఱుంగుటకు అనెను. నిష్కాముడును, ఏకాంత భక్తుడును అయిన ప్రహ్లాదుడు, కోరికలు భక్తియోగమునకు అంతరాయములని తెలిసియున్నవాడు గనుక యిట్లు బదులు చెప్పెను:

"ప్రభూ! నన్ను పరీక్షింపదలచి వరమిచ్చెదనంటివా? కోరికలు సంసారమునకు బీజములును, బంధకారకములును గనుక కామములకు భయపడి, ముముక్షువునై క్షేమముకొఱకై నిన్నాశ్రయించితిని. కోరికలవలన మనశ్శరీర ధైర్యములు, మానవ ధర్మములు, లజ్జ, స్మృతి, సంపద, సత్యము, తేజస్సులు నశించును. అందుచేత నాకు కోరికలు లేవు, వరములును వలదు. దేవా! నాకు వరమివ్వ సంకల్పించినచో కోరికలు చేరకుండగ వరమునిమ్ము. కోరికలు లేని వాడు భగవంతునితో సమానుడగును కదా! ఓ నరసింహా, పురుషోత్తమా, పరమాత్మా" యని ప్రణామము చేసి నమస్కరించిన బాలునితో శ్రీహరి యిట్లనెను:

ప్రహ్లాదకుమారా! నీ వంటి ఏకాంతభక్తులు, జ్ఞానశ్రేష్ఠులు నా నుండి యెటువంటి కోర్కెలను కోరరు. ఐనను, అనుగ్రహింపుచున్నాను. నీవు అసురుల ప్రభువువై కొనసాగి, మన్వంతరకాలము సకలభోగముల ననుభవించెదవు. శుభచింతనతో నా చరిత్రలు వినుచుండుము. సకలభూతములందు

సంపూర్ణముగ నుండి, యజ్ఞేశ్వరుడను, ఈశ్వరుడను అగు నన్ను నీ యాత్మయందు నిలుపుకొని, కర్మసముదాయమును తొలగించుకొని, ఈశ్వరార్పణముగ పూజలాచరింపుము. భోగానుభవముచే పుణ్యములు నశించును, వ్రతములచే పాపములు నశించును. ఆపైన, నీవు కాలగమనమున, ముల్లోకములలో యశస్సుపొంది, దేహమును విడిచి, బంధముక్తుడవై నన్ను చేరెదవు. మఱియును

ఏ మానవుడు ప్రియముతోడ నా అవతారగాథను, నీ యొక్క ఉత్తమ పుణ్య చరిత్రనువిని, మననము చేయునో వాడు, కర్మబంధమును త్రెంచుకొని, ఈ లోకమున మఱి జన్మింపడు. అనిన ప్రహ్లాదుడిట్లనెను.

ప్రభూ! తొల్లి తన సోదరుడైన హిరణ్యాక్షుని నీవు వరాహరూపమున జంపుటచేత శతృత్వము బూని నా తండ్రి, నీవు పరమేశ్వరుడవని గుర్తింపలేక, నీ భక్తుడనైన నన్నొక శత్రునివలె భావించి యపకారము చేయదలంచెను. నీ యొక్క శాంతదృష్టిచే నేడతడు నిర్మలత్వమునొందెను. కావున అతడు పాప పుంజములను పోగొట్టుకొని పరిశుద్ధాత్ముడగునట్లుగా నాకు వరమునిమ్ము ఓ పద్మనేత్రా!

అనిన భక్తవత్సలుడైన శ్రీహరి యిట్లనెను :

ఓ దానవశ్రేష్ఠా! నీవు నాకు ప్రియభక్తుడవు. నిన్ను గన్న సుకృతముచేత నీ తండ్రి యిరువది యొక్క పూర్వజులతో సహా పవిత్రుడై శుభగతిని పొందును సుమా! నా భక్తులు నివసించు ప్రదేశాలలో నుండుచు, వారి ప్రేమకు పాత్రులైన దుర్జనులు కూడ పరిశుద్ధులవగలరు. ఓ పుణ్యశీలుడా! కోరికలన్నిటిని విరమించుకొని నీవలె నన్నెవరైనను సేవించినచో నా భక్తులగుదురు. అట్టివారికి నీవు ఆదర్శప్రాయుడవైతివి. ఇప్పుడు వైదిక విధులతో, నా యందు చిత్తమును నిలిపి, నీ తండ్రికి అంతిమ సంస్కారములను ప్రీతితో నెరవేర్చుము. అతడు నాతో యుద్ధముచేసి నా యొక్క స్పర్శచే నిర్మల దేహుడై పాపకల్మషములను పోగొట్టుకొన్నవాడై పుణ్యలోకముల కేగును -

స్వామి ఆనతిప్రకారము ప్రహ్లాదుడు తండ్రి దేహమునకు సంస్కారములు చేయించెను. భూసురోత్తములతనిని రాజ్యాభిషిక్తుని చేసిరి. శాంతించిన నరసింహస్వామిని చూచి బ్రహ్మ యిట్లనెను :

దేవాదిదేవా! నాచే సృష్టింపబడిన ఏ ప్రాణిచేతను తనకు చావురాకూడదను వరము నీ దానవుడు నా నుండి పొంది గర్వమదాంధుడై లోకకంటకుడై భాగ్యవశమున నేడు నీచేత హతుడయ్యెను ప్రభూ! ఇప్పుడు లోకకల్యాణ మయ్యెను. ఈ భాగవతశ్రేష్ఠుని రక్షించి, వరము నిచ్చితివి. నీ యొక్క యీ నరసింహావతార గాథను నిష్ఠతో విని, మననము చేయువారు మృత్యుభయము లేనివారగుదురు. అనిన నరసింహస్వామి యిట్లనెను.

పద్మాసనా! దయజేసి, దేవశత్రువులకెన్నడు నిటువంటి వరము లివ్వవలదు. పాపాత్ముల కిట్టి వరములిచ్చుట పాముల కమృతమిచ్చు నట్లగును కదా! అనిన,

బ్రహ్మాదిదేవతలు ఆ దేవదేవుని పూజింపగా శ్రీహరి నిష్క్రమించెను. బ్రహ్మదేవుడు ప్రహ్లాదునిచే పూజింపబడి, యతనిని దీవించి, దేవతలను వెంట నిడుకొని వెడలిపోయెను.

ఇట్లు విష్ణుదేవుడు తన పార్షదులైన జయవిజయులు మునులశాపమువలన ప్రథమజన్మమున దితిపుత్రులైన హిరణ్యాక్ష హిరణ్యకశిపులను వరాహ నారసింహ రూపముల నవతరించి, వధించెను. ద్వితీయజన్మమున రావణ కుంభకర్ణులై జన్మించిన వారిని శ్రీరామరూపమున వధించెను. తృతీయ జన్మమున శిశుపాల దంతవక్త్రులుగ జన్మించిన వారిని, శ్రీకృష్ణావతారమున సంహరించెను. ఈ విధముగ మూడు జన్మముల గాఢవైరముచే వారు నిరంతర శ్రీహరి అవతారరూప ధ్యాసలో నుండి కల్మషముక్తులై శ్రీహరిని చేరిరి, అని నారదుడు యుధిష్ఠిరునకు చెప్పి యిట్లనెను:

ఉ. శ్రీరమణీయమైన నరసింహవిహారము నింద్రశత్రుసం
హారముఁ బుణ్యభాగవతుఁడైన నిశాచరనాథపుత్రసం
చారము నెవ్వఁడైన సువిచారత విన్నఁ బఠించినన్ శుభా
కారముతోడనే భయముఁ గల్గని లోకముఁ జెందు భూవరా.

ధర్మనందనా! మనోహరము శుభప్రదమునైన యీ నరసింహవిహారము ఇంద్రశత్రువైన హిరణ్యకశిపుని సంహారము, పరమభాగవతుడైన ప్రహ్లాదుని

సంరక్షణమును, ఎవ్వరైన శ్రద్ధగా వినినను, పఠించినను, సర్వశుభములతో పుణ్యలోకమును పొందెదరు.

రాజా! బ్రహ్మాదిదేవతలైనను, మనస్సులో మననం చేయుటకుగాని, భాషాజ్ఞానముచే వర్ణించుటకు గాని వలను పడనట్టి పరబ్రహ్మమైన ఆ జనార్దనుడు నీ యింటిలో సఖుడై, మేనమఱదియై, సలహాదారుడై ప్రియతముడై మహాఫలప్రదాతయై మీతో నుండుట మహాభాగ్యము కదా! రాజేంద్రోత్తమా!

ప్రథమరత్నమైన ప్రహ్లాదచరిత్ర సమాప్తం.

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

2. గజేంద్రమోక్షణ కథ (అష్టమ స్కంధము)

శ్రీశుకమహర్షి పరీక్షిన్నరేంద్రున కిట్లు చెప్పెను : రాజా! పూర్వము నాల్గవ మన్వంతరమున, విష్ణువు, హరిమేధునకు హారిణియందు "హరి"యై జన్మించెను. అఖిలలోకేశ్వరుడును, దయాసాగరుడును యైన యా హరి మకరిచే బద్ధుడైన యొక గజరాజును ప్రాణభయమునుండి కాపాడి రక్షించెను. అని చెప్పగా, జలచరమైన ఆ మకరి, వనచరుడైన యా గజరాజుతో నెందుకు యెట్లు పోరాడుట సంభవించెనో, ఆ గజరాజును పురుషోత్తముడెట్లు రక్షించెనో వినుటకు మిక్కిలి కోరికగా నున్నది. శ్రీహరిని గూర్చి చెప్పబడు గాథలన్నియు నతి పుణ్యగాథలు కదా! మునీంద్రా నాకు వినిపింపుడు.

అనిన, శుకయోగీంద్రుడు పరీక్షిత్తున కిట్లు చెప్పెను.

రాజేంద్రా! క్షీరసముద్రమునందు త్రికూటమనబడు పర్వతమున్నది. అది, మూడు శృంగములతోను, ఒక యోజనము పొడవు, వెడల్పు, ఎత్తులతోను, సువర్ణ బహురత్నమయముగను మెఱయుచుండెను. అనేకమైన వృక్షలతాకుంజములతోను, నురకలు వేయుచు ప్రవహించు సెలయేరులతోను, మనోహరముగ విహంగములవలె విహరించు దివ్యవిమానములతోను, క్రీడలాడుచుండు కిన్నరులతోను శోభాయమానముగ నుండెను. ఆ పర్వత సానువులు మాదీఫల,లవంగ, మామిడి, జీడి, పనస, వెలగ, మట్టి, ఖర్జూర, అరటి, ఉసిరిక, కదంబాది నానావిధ ఫలవృక్షములు, పలాశ, నాగ, పున్నాగ, చంపక, శతపత్ర, మల్లికాది యనేక పుష్పవృక్షలతలతోను, ఉద్యానవనముల తోను శుకపికాది నానావిధపక్షి సమూహములతోను, వజ్రవైఢూర్య పుష్యరాగ, నీలగోమేధికాది మణులతోను, విద్యాధర సిద్ధచారణ గంధర్వ గరుడ కిన్నర కింపురుషాది స్వేచ్ఛావిహారి మిథునముల ఆటపాటలు, గాననృత్యాది వినోదవిలాసములతోను, నిత్యము నేత్రపర్వముగ నొప్పుచుండెను. ఆ వనమునందు అనేక రకముల భయంకర క్రూరమృగములు, సర్పములు సంచరించుచుండెను. చూడభయంకరమగు కొన్ని అడవి యేనుగుల సమూహమొకటి, కొండగుహలనుండి బయల్పడి, మదించిన శరీరములతో నాడు యేనుగులతో గూడి విహారార్థమై వచ్చి, చల్లని గాలిని, జలమును పొంద

కాంక్షతో, నీట మునిగి, ప్రీతితో జలక్రీడల నాడుటకు నొక పెద్ద మడుగులో ప్రవేశించెను. సూర్యకాంతికి తట్టుకొనలేని అంధకారము, కొండగుహలలో దాగుకొని, సూర్యరశ్మి తగ్గగనే, మళ్లీ (ఆ యంధకారము) గుహలనుండి బైటకు వచ్చుచున్నదా యన్నట్లు, ఈ యేనుగుల మందలు బైటకు వచ్చుట కనిపించెను. ఆ యేనుగు గున్నలు కొండలను త్రోసివేయుటకైనను వెనుకాడవు. ధైర్యసాహసములతో, సింహములనైన నెదుర్కొనుటకు భయపడవు. ఆ బలసంపన్నమైన కుంజరములు పిడుగుపాట్లకైనను కలతజెందవు. భీకరములైన ఈ యేనుగుల మందలను జూచి పులులు భయపడి పొదరిండ్లలో దూరి తలదాచుకొనెను. భల్లూకములు గుహలలో దాగుకొనెను. అడవిపందులు నేల బొఱియలలో దూరిపోయెను. లేళ్లమంద లతాకుంజములలో దాగుకొనెను. కారుగేదెలు మడుగులలోమునిగి దాగెను, వానరమూకలు కొండలపైకి ఎగబ్రాకెను. అడవి సర్పములు బిలములందు చొరబడెను. నెమళ్లు ఎగిరి పారిపోయెను. చమరీ మృగములు భయముచే తమ చామరములవంటి తోకలతో, విలాసముగ విహరించి అలసిపోయిన భద్రగజములకు, విసరి సేద దీర్చుచుండెను. తుమ్మెదలు ఆ ఏనుగులయొక్కమదజల సుగంధమును బాగుగ నాఘ్రాణించి ఝంఝుంమనుచు గానముచేసెను.

ఏనుగు గున్నలు గాలికి కదిలియాడు పొదలను వాసనజూచుచు, త్రొక్కి వేయుచు, ఫలవృక్షములకు ఒడలు రాయుచు లేత చిగుళ్లను మేయుచు, పులులను, కారు ఎనుబోతులను, ఇతర మృగములను, పోనీయక అల్లరి చేయును. కొలనులో జొచ్చి నీటిని కలచివేయుచు, పర్వతమునెక్కి పేడముద్దలను వేయుచు, మదజలము కారుచున్న చెక్కిళ్ళు తొండములతోను కుంభములు, ఆపిడి చేయుచు, కొండలు తలక్రిందై పడునేమో, దిక్కులు పెల్లగిల్లునేమో, లోకములు భయభీతములగునేమో యనిపించుచుండెను. ఆ ఏనుగులమందలో ఒక గజరాజు మాత్రము విడిపోయి, ఆడ యేనుగులచే, సేవింపబడుచుండెను. ఆ కరిరాజు మోహావేశములో బడి, దారితప్పి, ఆడు ఏనుగులు పరివేష్టించగా, దారిలో కనబడిన లేతకొమ్మలను త్రుంచుచు, చెలియలకు తినిపించుచు, తన చెవులతో విసరుచు, చెలియల తాపమును

1803 भा० पंचरत्नमुलु (तेलुगु)—3 B

చల్లార్చుచు, వాటి మెడలను మృదువుగా నిమురుచు, పిఱుదులచెంత జేరి ప్రేమతో వాసన జూచి, క్రీడించుచు, ఆ మాతంగ వీరుడు విశ్రమించెను. ఈ విధముగ ననేకమైన శృంగార క్రీడలలో మైమరచి, తన బృంధముతో పోయిపోయి దాహము తీర్చుకొనుటకై యొక కొలను చెంతకు చేరెను. అచ్చట ఆ కరిరాజు, అప్పుడే విచ్చిన తెల్లకలువలు, తుమ్మెదల గుంపులు, తాబేళ్లు, చేపలు, నిరోధింపశక్యముగాని మొసళ్ళు, వటవృక్షములు, తాటిచెట్లు, మామిడి, సాలవృక్షములు మనోహరమైన పుష్పలతలు, మెఱుపుతీగలవలె తళతళ మెఱయు హంసలు చక్రవాకములు, కొంగలను, జూచెను.

ఇట్లితర పురుషసంచారములేని నిర్మలమైన సరోవరమునుజూచి, దానినుండి వీచు కమలముల సుగంధము మేనుసోకగ సేదదీరి, తామర తూడులను ప్రీతితో నారగించుచు వీనులవిందుగ రవముల జేయుచుండు కలహంసలను జూచుచు, పద్మముల సుగంధము నాసికను, ఆహ్లాదపరుపగా, నిర్మల జలములు వదనమునుల్లాస పరుపగా, మూడులోకముల సౌభాగ్య శోభ కన్నులకు విందుజేయ, ఇంద్రియ వ్యాపారములను మఱచి, ఆ కుంజర యూధము కొలనులో జొచ్చెను. తొండములను ఆ నిర్మల జలములచే పూరింపుచు, చెక్కిళ్లను తడుపుకొనుచు, గళగళ శబ్దములు చేసుకొనుచు, నా కరిబృందము కడుపులు నిండ నీరు ద్రావెను. అప్పుడు ఆ గజేంద్రుడు తొండము నిండ నీరెక్కించి, తొండము నాకాశమువైపున కెత్తి యిటునటు కదిలించి, నీరు చిమ్మగా ఆ నీటితోబాటు తాబేళ్లు, చేపలు, పీతలు, మొసళ్లు పైకెగసి క్రిందికి పడుచుండగ, వాటిని గజరాజు పట్టుకొనుట జూచి దేవతలును ఆశ్చర్యచకితులైరి.

ఆ గజరాజుయొక్క నిరాటంకమైన జలవిహారములో, గజకాంతలు యిచ్చు తెల్లని మెఱయుచున్న పద్మముల మధ్యనతడు వెయ్యికనుల యింద్రునివలె కనిపించెను. ఏనుగుగున్నలు వెదజల్లు సౌగంధికాపుష్పపరాగము ఆ కనకాచలమునకే శోభతెచ్చెను. హస్తినులు తెచ్చిన కలువకాండములు ఆదిశేషునకే అలంకారప్రాయము అనిపించెను. మదగజములు విరజిమ్ము ముత్యములవంటి నీటి తుంపరలు, మేఘమండలమంతా నిండిపోయెను.

ఎదురులేని శక్తితో నా గజశ్రేష్ఠుడు ఆ కొలనులో జలకేళి చేయుచుండ, ఆ సరోవరలక్ష్మి, మత్తగజముల వివిధ విహార కేళులతో చెదిరి, చెదిరిన ఇసుకతిన్నెలతో, మరల క్రొత్తశోభను తెచ్చుకొని విలసిల్లెను.

సీ. భుగ భుగాయితభూరిబుద్బుదచ్ఛటలతోఁ గదలుచు దివికి భంగంబు లెగయ
భువనభయంకరఫూత్కారరవమున ఘోరనక్రగ్రాహకోటి బెగడ
వాలవిక్షేపదుర్వారఝుంఝూనిలవశమున ఘుమఘుమావర్త మడరఁ
గల్లోలజాలసంఘట్టనంబులఁ దటీతరు లమూలంబులై ధరణిఁ గూల

తే. సరసిలోనుండి పొడగని సంభ్రమించి
యుదరి కుప్పించి లంఘించి హుంకరించి
భానుఁ గబళించి పట్టుస్వర్భానుపగిది
నొక్కమకరేంద్రుఁడిభరాజు నొడిసిపట్టె

అట్టితరి, భుగభుగ (బుడబుడ) ధ్వనులతో పెద్దపెద్ద నీటిబుడగల ప్రవాహమును కలిగించుచు, ఆకాశము నంటునట్లు అలలను రేపుచు, భువనములకు భయము కలిగించునట్టి ఫూత్కార శబ్దములు చేయుచు, ఇతర మొసళ్లు కూడ హడలిపోవుచుండ, తోక కదలికలచే కలుగు ఝుంఝూనిల సుడిగాలు లుద్భవింపగా ఆ తాకిడికి యొడ్డుననున్న వృక్షములు సమూలముగ కూలిపోవ, కరిరూపమును గాంచి, యూపిరి బిగబట్టి, హుంకరించి, సరస్సునుండి శీఘ్రముగలంఘించి, సూర్యుని కబళించిన రాహువువలె నొక మకరేంద్రుడు వచ్చి గజేంద్రునొడిసి పట్టుకొనెను.

క. వడిఁ దప్పించి కరీంద్రుడు
నిడుదకరం బెత్తివ్రేయ నీరాటంబుం
బొడ వడఁగినట్లు జలములఁ
బడి కడువడిఁ బట్టెఁ బూర్వపదయుగళంబున్.

అప్పుడా గజేంద్రుడు వడిగా తప్పించుకొని, తన పొడవైన తొండమునెత్తి ఒక్క వ్రేటు వేయుగా ఆ మకరి చచ్చినట్లు జలమందుపడి, వెంటనేలేచి యేనుగు యొక్కముందరి కాళ్లను పట్టుకొనెను.

చ. పదములఁ బట్టిన ం దలఁకుఁబా టొకయింతయు లేక శూరతన్
మదగజవల్లభుండు ధృతిమంతుఁడు దంతయుగాంతఘట్టనం
జెదరఁగఁ జిమ్మె నమ్మకరిచిప్పలు పాదులు దప్ప నొప్పఱన్
వదలి జలగ్రహంబు కరివాలముమూలముఁ జీరె గోఱలన్

మకరి తన కాళ్లను పట్టుకున్నను ఎంతమాత్రము తడబడక ధృతిమంతుడును, శూరుడునైన ఆ గజరాజు తప్పించుకొని, తన దంతములతో ఆ మకరియొక్క ముడుకు చిప్పలను, పాదములను పొడిచి పొడిచి, చెదరగొట్టగా, ఆ మకరి, కరియొక్క కాలును విడిచి, తన కోఱలతో దాని తోకమూలమును చీల్చెను.

క. కరిఁ దిగుచు మకరి సరసికిఁ
గరి దరికిని మకరిఁ దిగుచుఁ గరకరి బెరయన్
గరికి మకరి మకరికిఁ గరి
భర మనుచును నతలకుతలభటు లదురుపడన్

కరిని మకరి తనవద్దకు (సరస్సులోనికి)లాగును; మకరిని కరి తన వద్దకు (ఒడ్డుకు) లాగును, ఇట్లు కరిమకరులు పరస్పరము భయముతోను బరువైన మనస్సుతోను, నతలకుతల మగుచు, తమతమ భృత్యులు భయముచే నదిరిపోవునట్లుగా పోరాడుచుండిరి.

ఇట్లు కరిమకరములు, సమానశక్తి శౌర్యములతో హోరాహోరీగా పోట్లాడుచు లోకములకు భయము కలిగించుచుండెను. ఒకరికొకరు తీసిపోవని విజయకాంక్షతో పట్టుదలతో, జలాశయమునొక భీకర రణరంగము చేసివేసినవి. చిన్నమొసళ్లు, తాబేళ్లు, ఎండ్రలు, చేపలు, కప్పలు వంటి యనేకమైన జలచరములు, వీటియొక్క పాదముల క్రిందపడి నలిగి నశించినవి. ఈ విధముగ రేయింబవళ్లు కరిమకరులు ఘోరయుద్ధము జేసినవి. కరిరాజు, ఆడు ఏనుగుల యెదుట తన ఆడంబరమును ప్రదర్శించుచు, తొండముతో నీరు జిమ్ముచు, వజ్రముల వంటి తన దంతములతో మకరిని పొడుచుచు, తొండముతో దానిని కొట్టుచు మాటిమాటికి నీట ముంచుచు, తన ప్రతాపము

జూపుచుండెను. ఆడు ఏనుగులు, మకరితో పోరాడుచున్న తమ నాథుని ఒక్కనిని విడిచిపోవలేకను, ఏమియు చేయలేకను, అచ్చటనే చూచుచు ఉండిపోయినవి, మగువలకు మగలు విడువడని అనుబంధము కదా! అప్పుడు.

ఆ. జీవనంబు దనకు జీవనంబై యుంట
నలవు చలము నంతకంత కెక్కి
మకర మొప్పె డస్సె మత్తేభమల్లంబు
బహుళపక్షశీతభానుపగిది

జలమే తనకు జీవనమై యుండుటచేత, మకరికి స్థానబలముచే శక్తి, యుక్తి, సులువు, అంతకంత కెక్కువై ధైర్యము పెరిగెను. కరికి మాత్రము నిలకడ తప్పి, అలసట వచ్చి, కృష్ణపక్ష చంద్రునివలె శక్తి సన్నగిల్లెను.

మ. ఉఱుకుం గుంభయుగంబుపై హరి క్రియన్ హుమ్మంచుఁ బాదంబులన్
నెఱియం గంఠము వెన్ను దన్ను నెగయున్ హేలాగతిన్ వాలముం
జఱచున్ నుగ్గుగఁ దాఁకు ముంచు మునుఁగున్ శల్యంబులు దంతముల్
విఱుగన్ వ్రేయుచు బొంచి పొంచి కదియున్ వేదండయూథోత్తమున్

మఱియు, ఆ మకరి, హుంమనుచు గజేంద్రుని కుంభస్థలముపైకి కోతివలె నుఱుకును, పాదముల మధ్యను ఇఱుకును, కంఠమును, వెన్నును తన్నుటకై విలాసముగ నెగురును; తోకను చఱచును, ముంచును, మునుగును, ఎముకలు, దంతములు విరుగునట్లు కొట్టును, పొంచిపొంచి కుంజరయూథనాథుని చెంతజేరును. కంటికి కనపడకుండ దాగును, బైటకు పోకుండ అడ్డువచ్చి కనబడును. కాళ్లకు పెనవేసుకొని కదులుటకు వీలులేకుండ చేయును. భయపడునట్లు నేలపడద్రోయును, లేచినచో "లం" మనుచు గొంతెత్తి కేకలు వేయును, తొలగించును, మరలించును, తటాలున పట్టుకొనును, వేధించును, కోపగించుకొనును, ఈ విధముగ నతివిచిత్రముగ ప్రవర్తించుచు నా మకరి, మిక్కిలి ధైర్యముగ, సాహసముతో -

రెండు పాదముల నేలమోపి, ప్రాణవాయువును నియంత్రించి, ఇంద్రియ వ్యాపారముల నరికట్టి, బుద్ధిని లగ్నముచేసి, శోకరహిత బ్రహ్మానందమున

రమించు యోగీంద్రునివలె, ఆ మకరి, కరిపాదముచే అణచబడియున్నను, నిర్భయముగ విజృంభించెను.

ఊహ సరిగా పనిచేయక బ్రతుకు ప్రలోభములో పడి కొట్టుకొనుచు, శరీరశక్తి చివరిదశకు చేరుకొనగా, సంసారమోహబంధములచే చుట్టబడి, విడిపించుకొనలేక, నూగిసలాటలో పడిన జీవునివలె, కరిరాజు, మకరిదాడి నెదుర్కొనలేక చిక్కి శల్యమయ్యెను. ఈ విధముగ ఆ గజేంద్రుడు, అలసటను మూర్ఛిల్లుటను, విసుగుదలను జేరనీయక, మకరితో భయంకరముగ దివారాత్ర సంధ్యలలో ఘోరపోరాటమొక వెయ్యి సంవత్సరములు సల్పెను.

మ. పృథుశక్తిన్ గజ మా జల గ్రహముతోఁ బెక్కేండ్లు పోరాడి సం
శిథిలంబై తనలావు వైరిబలముం జింతించి మిథ్యామనో
రథ మింకేటికి దీని గెల్వ సరి పోరం జాలరా దంచు స
వ్యథమై యిట్లనుఁ బూర్వపుణ్యఫలదివ్యజ్ఞానసంపత్తితోన్

గొప్పశక్తితో, ఆ గజరాజు ఘోరమకరితో ననేక సంవత్సరములు పోరాడి, బాగుగ శిథిలమై తనబలము, శత్రుబలమును సరిపోల్చుకొని, మకరిని గెల్చెదననెడి మిథ్యా వాంఛ యికనేల, దీనిని గెల్వలేను సరికదా, దీనితో పోరాటమునుగూడ కొనసాగించలేను యని భావించి, వ్యథతో కూడిన మనస్సుతో, పూర్వజన్మల పుణ్యవిశేషముచే కలిగిన దివ్యజ్ఞానమువలన నిట్లు తలపోసెను.

శా. ఏ రూపంబున దీని గెల్తునిట మీఁ దేవేల్పుఁ జింతింతు నె
వ్వారిం జీరుదు నెవ్వ రడ్డ మిఁక నివ్వారిప్రచారోత్తమున్
వారింపం దగువార లెవ్వ రఖిల వ్యాపారపారాయణుల్
లేరే మ్రొక్కెద దిక్కు మాలిన మొఱాలింపం బ్రపుణ్యాత్మకుల్

అయ్యో! దీనినే విధముగ నేను గెల్వగలను? ఇక నేనే దేవుని గొల్చెదను? ఎవరిని బిల్చెదను? ఈ యాపదలో నా కడ్డపడే వారెవ్వరున్నారు? ఈ జలచర శ్రేష్ఠు నెదుర్కొను సమర్థులెవ్వరు? నావంటి దిక్కుమాలిన వారి మొఱల నాలకించు శరణాగత రక్షకులెవ్వరును లేరా?

అనేకములైన కుంజరయూధములు వనములో నన్ను చిరకాలమునుండి ప్రభువుగా మన్నించుచుండ, అసంఖ్యాకములైన ఆడు యేనుగులకు నేను నాథుడనై యుండ, ఈ సుందర వనములో దట్టముగ పెరిగియున్న చందనాది వృక్షలతా కుంజముల చల్లని నీడయందు, నేను సంతుష్టుడనై యుండక జలక్రీడ కాంక్షతో నీ మడుగులో నేల జొచ్చితిని? ఈ ప్రమాదమెట్లు నివారణ మగునో కదా, యీశ్వరా!

ఉ. ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరు డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వముఁ దానయైనవాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్.

ఈ విశ్వమెవ్వనివలన నుద్భవించెనో, యెవ్వనియందు లయించునో, లయించి, మఱి యెవ్వనియందు లీనమైయుండునో, పరమేశ్వరుడెవ్వడో, మూలకారణమైన వాడెవ్వడో, ఆది, మధ్య, అంతములు లేని వాడెవ్వడో, సర్వమునూ తానే యై యున్న వాడెవ్వడో, అట్టి స్వయంభువునై ఆ యీశ్వరునే నేను శరణువేడుచున్నాను.

క. ఒకపరి జగములు వెలి నిడి
యొకపరి లోపలికిఁ గొనుచు నుభయముఁ దానై
సకలార్థసాక్షి యగు న
య్యకలంకుని నాత్మమూలు నర్థిఁ దలంతున్

లోకముల నొకమారు తననుండి వెలుపలకు నెట్టి (ఉద్భవింపజేసి), వేఱొకమారు ఆ లోకములను తనలోనికి తీసుకొనుచు, వెలుపలను, లోపలను, తానేయై యుండుచు, సర్వమునకును సాక్షియై యుండు, పవిత్రుడును, నిర్మలుడును యైన ఆ యాత్మమూలమైన పరమాత్మని నేనాసక్తితో ధ్యానింతును.

క. లోకంబులు లోకేశులు
లోకస్థులుఁ దెగినఁదుది నలోకం బగుపెం

జీఁకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుఁగు నతని నే సేవింతున్

ఈ లోకములు, లోకులు, లోకపాలకులందరును అంతమైన పిమ్మట, చివరకు అలోకమైన (లోకము లేవియును లేని) స్థితిలో, పెంజీకటి (శూన్యస్థితి యందు గాఢాంధకార తమస్సు) కవతల నెవ్వడు ఏకైక పరంజ్యోతియై వెలుగుచుండునో ఆ పరమాత్మను నే సేవింతును.

క. నర్తకుని భంగిఁ బెక్కగు
మూర్తులతో నెవ్వఁడాడు మునులున్ దివిజుల్
గీర్తింప నేరరెవ్వని
వర్తన మొరు లెఱుఁగ రట్టి వాని నుతింతున్

నటునివలె ననేకులైన రూపములతో నెవ్వడు లీలానాటకము లాడుచుండునో, యెవ్వనిని ఋషులైనను, దేవతలైనను, సంపూర్ణముగ కీర్తింపజాలరో, యెవ్వని వర్తనములను (చేష్టితములు) గురించి యితరులెవ్వరు నెఱుంగజాలరో యట్టి ప్రభువును నేను స్తుతించెదను.

ఆ. ముక్తసంగులైన మునులు దిదృక్షులు
సర్వభూతహితులు సాధుచిత్తు
లసదృశవ్రతాఢ్యులై కొల్తు రెవ్వని
దివ్యపదము వాఁడు దిక్కు నాకు

సంగమును వీడిన మునులు, దివ్యదర్శనకాంక్షులు, సకలప్రాణికోటికి హితము కోరు సజ్జనులు, సాధుచిత్తులైనవారు, సాటిలేని దృఢనిష్ఠగలవారై, యెవ్వని దివ్యపాదములను కొల్చెదరో ఆ దేవదేవుడే నాకు దిక్కు.

సీ. భవము దోషంబు రూపంబుఁ గర్మంబు నాహ్వాయమును గుణము లెవ్వనికి లేక
జగములఁ గలిగించు సమయించుకొఱకునై నిజమాయ నెవ్వఁడిన్ని యునుదాల్చు
నా పరేశునకు ననంతశక్తికి బ్రహ్మ కిద్ధరూపికి రూపహీనునకును
జిత్రచారునికి సాక్షికి నాత్మ రుచికిని బరమాత్మునకుఁ బరబ్రహ్మమునకు

ఆ. మాటల నెఱుకల మనముల(జేరంగ(
గాని శుచికి సత్త్వగమ్యు(డగుచు
నిపుణు(డైనవాని నిష్కర్మతకు మెచ్చు
వాని కే నొనర్తు వందనములు

వాస్తవముగ నెట్టి సంసారబంధముగాని, దోషముగాని, రూపముగాని, నామముగాని, గుణముగాని, ఏదియును ఎవ్వనికి లేవో, అయినను జగములను సృష్టించుటకు, లయింపజేయుటకు ఎవడు తన మాయ నుపయోగించి, వీటన్నిటిని దాల్చునో, ఆ పరమేశ్వరునకు, అనంతశక్తి స్వరూపునకు, తేజోమయునకు, విచిత్ర యద్భుత చరిత్రునకు, బ్రహ్మమునకు సర్వసాక్షికి, ఆత్మానందునకు, పరమాత్మునకు, పరబ్రహ్మమునకు, మనస్సుచేగాని, మాటచేగాని యెఱుకచేగాని జేర శక్యముగాని వానికి, పరిశుద్ధునకు, సత్త్వగుణము ద్వారానే తెలియబడువానికి, నిపుణుడైనవాని నైష్కర్మ్యమునకు ప్రసన్నుడగు వానికి, నేను వందన మాచరించెదను.

సీ. శాంతున కపవర్గ సౌఖ్యసంవేదికి నిర్వాణభర్తకు నిర్విశేషు
నకు ఘోరునకు గూఢునకు గుణధర్మికి సౌమ్యున కధికవిజ్ఞానమయున
కఖిలేంద్రియద్రష్ట కధ్యక్షునకు బహుక్షేత్రజ్ఞునకు దయాసింధుమతికి
మూలప్రకృతి కాత్మమూలున కఖిలేంద్రియజ్ఞాపకునకు దుఃఖాంతకృతికి

ఆ. నెఱి నసత్య మనెడి నీడతో వెలు(గుచు
నుండు నెక్కటికి మహోత్తరునకు
నిఖిల కారణునకు నిష్కారణునకు న
మస్కరింతు నన్ను మనుచుకొఱకు

శాంతుడును, మోక్షసౌఖ్యము ననుగ్రహించువాడును, మోక్షప్రదాతయు, ద్వైతాద్వైత (సాకారనిరాకార) భేదము లేనివాడును, దుష్టభయంకరుడును, నిగూఢ తత్త్వముగలవాడును, గుణధర్మములతో నున్నవాడును, విజ్ఞానమయుడును, సౌమ్యుడును, ఇంద్రియ వ్యాపారములకు ద్రష్టయు, సర్వాధ్యక్షుడును, సకల జీవరాసులకు క్షేత్రజ్ఞుడును, దయాసాగరుడును,

ఆత్మమూలమును, మూలప్రకృతియు, దుఃఖమునంతము చేయువాడును, మిథ్యాజగత్తే ప్రతిబింబమై వెలయువాడును, మహోత్తముడును, సర్వమునకు మూలకారణుడును, తన యునికికెట్టి కారణము లేనివాడును, అయినట్టి ఆ పరమేశ్వరునకు, నన్ను బ్రతికించుమని వేడుకొనుచు నమస్కరించుచున్నాను.

క. యోగాగ్నిదగ్ధకర్ములు
యోగీశ్వరు లే మహాత్ము నొండెఱుఁగక స
ద్యోగవిభాసితమనముల
బాగుగ నీక్షింతు రట్టిపరము భజింతున్

జ్ఞానాగ్నిచే కర్మబంధములను దగ్ధము గావించుకొన్న యోగీశ్వరులు అన్యమేమీ యెఱుగనివారై యుత్తమ యోగాభ్యాసముచే భాసించిన మనస్సులతో నే మహాత్ముని దర్శింపగలరో యట్టి పరమాత్ముని నేను భజించెదను.

సర్వాగమ శాస్త్రనిధియు, మోక్షనిలయుడును, పరమధాముడును, స్వతేజో విరాజితుడును, దిక్కులేని నావంటి పశుజీవుల పాపములను శమింపజేయువాడును, సర్వాంతరాత్ముడై వెలుగువాడును, ఏకమును, అనేకము చేయబడనివాడును, దారాపుత్ర క్షేత్ర యందాసక్తులకు అందజాలనివాడును, అయిన భగవంతునకు నేను వందనముల నాచరింతును. మఱియును,

ధర్మార్థ కామ కాంక్షలు లేని బుద్ధిమంతులు ఎవ్వనిసేవించి, యిష్టగతిని పొందుదురో, మఱియు, ధర్మార్థకామములను కాంక్షించువారికి కరుణతో అంతులేని దేహపరంపరల నెవ్వడు ప్రసాదించునో, ముక్తాత్ములెవ్వని పాదములపైబడి యానంద సాగరములో మునుగుదురో, ఏకాంతిక భక్తులు ఏమియును కోరక, ఎవ్వని పుణ్యచరిత్రములను పాడుచుందురో, ఆ మహేశ్వరుని, ఆదిమూర్తిని, అవ్యక్తుని, అధ్యాత్మ యోగగమ్యుని, పరిపూర్ణుని, ఉన్నతాత్ముని, బ్రహ్మమైన వానిని, పరుని (పరమాత్మను) అతీంద్రియుని (ఇంద్రియములకు గోచరింపనివానిని) స్థూలసూక్ష్మములు రెండునూ అయిన వానిని నేను భజించెదను. అని, మఱియు నిట్లు తర్కించెను.

అగ్నిదేవుడు మంటలను, సూర్యుడు వెలుగులను ఏవిధముగ వ్యాపింపజేసి అణచివేయుదురో యట్లు తనయొుక్క తీక్ష్ణతచే నెవ్వడు బ్రహ్మాదిదేవతలను అఖిల జీవరాసులను, గజములను, వివిధ నామరూపములతో ప్రకాశింపజేసి యణచునో, యెవ్వడు మనోబుద్ధీంద్రియములు తానెయై త్రిగుణములను ప్రవర్తింపజేయునో, ఎవ్వడు స్త్రీ నపుంసక పురుషమూర్తియుగాక, దేవ మానవ జంతుమూర్తియుగాక, కర్మ గుణభేదములు గాని సత్ అసత్‌ల ప్రకాశము గాని కాడో, కాని, వీటన్నిటికి ఆధారముగ తానె అన్నియునైయున్న యా విభుని స్మరించెదను.

క. కలఁడందురు దీనులయెడఁ
గలఁడందురు పరమయోగిగణములపాలం
గలఁడందు రన్ని దిశలను
గలఁడు కలండనెడువాఁడు గలఁడో లేఁడో

ఇంతగా స్తుతించినను, భగవంతునకు నా మొఱవినబడలేదా, వినబడిందో లేదో! మరి, ఆ భగవంతుడు దీనులయెడల దయగలిగి యుండునని యందురు కదా! పరమయోగుల పాలిట నుండునని యందురు కదా! అతడు అంతటను, అన్నిదిశలందును ఉండునని చెప్పెదరుకదా! మరి "ఉన్నాడున్నా" డని అందరూ చెప్పే ఆ భగవంతుడు నిజముగా నున్నాడో, లేడో!

సీ. కలుగఁడే నాపాలికలిమి సందేహింపఁ గలిమి లేములు లేక కలుగువాఁడు
నా కడ్డపడ రాఁడె నలి నసాధువులచేఁ బడినసాధుల కడ్డపడెడువాఁడు
చూడఁడే నా పాటుఁ జూపులఁ జూడక చూచువారలఁ గృపఁ జూచువాఁడు
లీలతోనామొఱాలింపఁడే మొఱఁగుల మొఱ లెఱుంగుచుఁదన్ను మొఱఁగువాఁడు

తే. అఖిలరూపులు దనరూప మైనవాఁడు
ఆదిమధ్యాంతములు లేక యడరువాఁడు
భక్తజనముల దీనులపాలివాఁడు
వినఁడె చూడఁడె తలఁపడె వేగ రాఁడె

అయ్యో! ఆయన ఉనికిని సందేహింపనేల? కలిమి లేములు లేక (కలడో లేడో యను సందేహము లేక, లేదా, కలవారు లేని వారు యను విచక్షణలేక) అంతటా, అందరిపట్ల కలిగియుండు ఆ భగవంతుడు నా పట్ల నుండడా? దుష్టులపాలబడి మిక్కుటముగ హింసింపబడు సాధువుల కడ్డపడి రక్షించువాడు, నా కడ్డపడి రక్షింపకుండునా? పైపై చూపులు జూడక అంతర్దృష్టితో జూచువారలపై కృపజూపు నా సర్వసాక్షి, నా యొక్క పాట్లను చూడకుండునా? దీనజనుల మొఱలను వినుచు తన్నుతాను మఱచిపోవు ఆ దయామయుడు, నా మొఱనాలకింపరాడా? సకల ప్రాణుల రూపములు తన రూపముగనె వెలసియున్నవాడును, ఆది, మధ్య, అంతములులేక నంతటను వ్యాపించియున్నవాడును, భక్తులకు, దీనులకు, దిక్కైన వాడును అయిన ఆ కరుణామయుడు నా మొఱవినడా, (వినియుంటే) నా బాధను చూడడా, (చూచియుంటే) నా యందు దయతలపడా, (దయతలచినవాడైతే) నన్ను రక్షించుట కింకను రాడేమి?

క. విశ్వకరు విశ్వదూరుని
విశ్వాత్మని విశ్వవేద్యు విశ్వు నవిశ్వున్
శాశ్వతు నజు బ్రహ్మప్రభు
నీశ్వరునిం బరమపురుషునే భజియింతున్

విశ్వమును సృష్టించినవాడును, విశ్వమునకు దూరముగ నుంటూ, దానిచే నంటబడనివాడును, విశ్వమే తానై యున్నవాడును, విశ్వమును తెలిసియున్న వాడును, తాను విశ్వుడును, విశ్వము కానివాడును (ఒకప్పుడు విశ్వముగ కన్పించునది, పిమ్మట లేకుండునట్టిది). శాశ్వతుడును, పుట్టుకలేనివాడును, బ్రహ్మమును, ఈశ్వరుడును (ప్రభువు) అయియున్న ఆ పరమపురుషుని ప్రార్థించెదను. అని భావించి, ఆ గజరాజు భగవంతుని సాన్నిధ్యమును ఊహించుకొని, యిట్లు పలికెను.

శా. లా వొక్కింతయు లేదు ధైర్యము విలోలం బయ్యెఁ బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమం బయ్యెడిన్

నీవే తప్ప నితః పరంబెఱుగఁ మన్నింపందగున్ దీనునిన్
రావే యీశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా

ఓ భగవంతుడా! నాశక్తి అంతయునశించినది, ఒక్కింతైనను మిగిలి యుండలేదు. ధైర్యము చెదిరిపోయినది. ప్రాణములు తమ తమ తావులను విడిచినవి. మూర్ఛ వచ్చినది. శరీరము శిథిలమైనది. మిక్కిలి అలసటగ నున్నది. ఇక నీవే నన్ను కాపాడవలెను. నీవు తప్ప నా కింకేమియును తెలియదు. ఈ దీనుని యార్తిని మన్నించి నీవే యాదుకొనుట సరియగును. ఓ యీశ్వరా! రావా! ఓ వరములిచ్చు ప్రభువా! నన్ను కావవా! ఓ శుభంకరా! నా భయమును బాపి, నన్ను రక్షింపవా ప్రభూ!

క. వినుదఁట జీవులమాటలు
చనుదఁట చనరానిచోట్ల శరణార్థులకో
యనుదఁట పిలిచిన సర్వముఁ
గనుదఁట సందేహమయ్యెఁ గరుణావార్ధీ

ఓ కరుణాసాగరా! జీవుల మనస్సులోని మాటలను నీవు వినెదవట! శరణార్థులను రక్షించుట కొఱకు ఎటువంటి వెళ్లరాని (శక్యముగాని) చోట్లకైనను వెళ్లెదవట. ఆర్తులెవ్వరు పిలిచినను వెంటనే "ఓ" యనెదవట! అంతయును చూచుచు సర్వమును గ్రహించెదవట! కాని, ఇదియంతయు నిజమేనా యని నాకు సందేహము కలుగుచున్నది స్వామీ!

ఉ. ఓ కమలాప్త యో వరద యో ప్రతిపక్షవిపక్షదూరకు
య్యో కవియోగివంద్య సుగుణోత్తమ యో శరణాగతామరా
నోకహ యో మునీశ్వరమనోహర యో విమలప్రభావ రా
వే కరుణింపవే తలఁపవే శరణార్థిని నన్నుఁ గావవే

ఓ కమలప్రియా! ఓ వరదాతా! శత్రువులయందును శత్రుత్వములేని ఓ దయామయా! (నా బాధ దుర్భరమై పోవుచున్నది) కుయ్యో! కవులు, యోగులచే పూజింపబడు ఓ స్వామీ! ఓ సుగుణభూషణా! శరణాగతుల యెడల కల్పవృక్షమా! ఓ మునిమానసచోరా! ఓ యనంతప్రభావా! రావా! నన్ను

కరుణింపవా! నా యార్తిని గురించి తలంపవా! శరణార్థినైన నన్ను గావవా? యని ఆక్రోశించి, రక్షణలేని దీనులకు రక్షకుడైన యీశ్వరుడు ఆపదలోనున్న నన్ను గాచుగాక యని, నింగివైపు నిక్కి చూచుచు, నిట్టూర్పుచు గజేంద్రుడు మొఱ సేయుచుండగా, వినియును, బ్రహ్మాది దేవతలు, తాము సర్వశక్తిమంతులు కారు గనుక నేమియు చేయలేక మిన్నకుండిరి, అప్పుడు విశ్వమయుడు, విభుడు, విజయశీలుడైన విష్ణువు భక్తుడైన గజేంద్రుని రక్షింపదలచి....

మ. అలవైకుంఠపురంబులో నగరిలో నా మూలసౌధంబుదా
పల మందారవనాంతరామృతసరఃప్రాంతేందుకాంతోపలో
త్పలపర్యంకరమావినోది యగు నాపన్న ప్రసన్నుండువి
హ్వలనాగేంద్రము పాహి పాహి యనఁ గుయ్యాలించి సంరంభియై

ఆ వైకుంఠధామములో, రాజప్రాసాదములో, చివరి సౌధము ప్రక్కనున్న మందార వనమునందున్న అమృతసరస్సు ఒడ్డున నున్న చంద్రకాంతశిలా వేదికపై కలువ పుష్పముల ప్రక్కపై (శయ్యపై) రమాదేవితో వినోదించుచుండు ఆపన్నప్రసన్నుడు (ఆపద యందున్నవారి నాదుకొనువాడు) భయకంపితుడైన గజేంద్రుడు "పాహి పాహి" యని మొఱవెట్టుచుండగ ఆ మొఱాలించి, అతి శీఘ్రముగ....

మ. సిరికిం జెప్పడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁడే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై

(గజేంద్రుని రక్షింపవలెనను ఉత్సాహముతో ఆ శ్రీహరి...) శ్రీదేవికైనను చెప్పడు, శంఖచక్రములనైనను చేతుల ధరింపడు. అనుచరుల నెవ్వరిని పిలువడు, పక్షిరాజైన గరుడుని సిద్ధపడుమని చెప్పడు. చెవులవరకు జాలువారిన జుత్తులనైనను సవరించుకొనడు. అంతేకాదు, వినోదమున కంతరాయము కలిగినందుకు వచ్చిన ప్రణయ కోపముచే లేచి వెళ్లిపోవుచున్న శ్రీదేవియొక్క

పైట చెంగు తన వ్రేళ్లకు చుట్టుకొని యుండ, దానిని విడిచిపెట్టకుండ, తొందరలో వడివడిగ ఆకాశమార్గమున నడచి వెళ్లిపోవుటకుద్యుక్తుడయ్యెను.

ఇట్లు భక్తజన రక్షణపరాయణుండును, సకలజీవరాసుల హృత్కమల నివాసియునగు శ్రీమన్నారాయణుడు, గజేంద్రుని యొక్క నానావిధ దీనాలాప, విజ్ఞాపనల నాలకించినవాడై కరిరాజు రక్షణ బాధ్యతను వహించి, గగనమునకు దిగి పయనమగునప్పుడేమి జరిగెననగా:-

మ. తనవెంటన్ సిరి లచ్చి వెంట నవరోధవ్రాతమున్ దానివె
న్కను బక్షీంద్రుఁడు వానిపొంతను ధనుఃకౌమోదకీశంఖచ
క్రనికాయంబును నారదుండు ధ్వజినీకాంతుండు రా వచ్చి రొ
య్యన వైకుంఠపురంబునం గలుగువా రాబాలగోపాలమున్

శ్రీహరివెంట శ్రీదేవి, ఆమెవెంట నంతఃపుర స్త్రీ జన సమస్తము, వారివెనుకను గరుడుడు, నాతనితో సహా సారంగధనుస్సును, కౌమోదకీగద, సుదర్శనచక్రము, పాంచజన్య శంఖ సముదాయము, ఆ వెనుకను నారదుడు, పార్షదుడైన ధ్వజనీకాంతుడు, బయలుదేరగా, వారివెంట వైకుంఠములోని వారెల్లరు, నాబాలగోపాలము తిన్నగా వెంటబడిరి.

గోవిందుని కరకమలములో చిక్కుబడి, లాగబడుచున్న తన పైటచెంగును రక్షించుకొనుచు, ఆయన వెంట పరుగెత్తవలసివచ్చిన లక్ష్మీదేవి యిట్లు తలపోసెను.

మ. తన వేంచేయుపదంబుఁ బేర్కొనఁ డనాథ స్త్రీ జనాలాపముల్
వినెనో మ్రుచ్చులు మ్రుచ్చిలించిరొ ఖలుల్ వేదప్రపంచంబులన్
దనుజానీకము దేవతానగరిపై దండెత్తెనో భక్తులం
గని చక్రాయుధుఁ డేఁడి చూపుఁ డని ధిక్కారించిరో దుర్జనుల్

స్వామి, తాను వెళ్లుచున్న దెచ్చటికో, యెందులకో, చెప్పకుండా ఇంత వడివడిగా వెళ్లుచుండెనేల? ఎవ్వరైన అనాథ స్త్రీ జనుల నార్తనాదము వినెనేమో! దుర్మార్గులైన చోరులేమైన దొంగిలించిరో, లేక దుష్టులెవ్వరైన వేదముల నపహరించిరో! రాక్షసిమూకలు, దేవతల నగరముపై దండెత్తిరో! దుర్జనులైన

దైవద్వేషులెవరైన "విష్ణువేడి? చూపుడని" భక్తులను ధిక్కరించి హింసింపు చుంటిరేమో! యని తర్కించు కొనుచు, నా సిరులసుందరి,

శా. తాటంకాచలనంబుతో భుజనటద్ధమ్మిల్లబంధంబుతో
శాటీముక్తకుచంబుతో నదృఢచంచత్కాంతితో శీర్ణలా
లాటాలేపముతో మనోహరకరాలగ్నో త్తరీయంబుతోఁ
గోటీందుప్రభతో నురోజభరసంకోచద్విలగ్నంబుతోన్

క. అడిగెద నని కడు వడిఁజను
నడిగినఁ దను మగుడ నుడుగఁడని నడ యుడుగున్
వెడవెడ చిడిముడి తడఁబడ
నడు గిడు నడుగిడదు జడిమ నడుగిడునెడలన్

కదలాడు చెవికమ్మల (లోలాకుల) తోను, ముడివేయబడిన శిరోజముల తోను, ఆచ్ఛాదన తొలగిన కుచములతోను, మారుచున్న ముఖకాంతితోను, కుంకుమ చెదిరి, లేపనములు వెలిసిన ముఖముతోను, మనోహరుని చేతిలో చిక్కుకున్న ఉత్తరీయముతోను, కోటిచంద్రుల శోభతోను, కుచభారముతో వంగిన వక్షముతోను, ఆమె శ్రీహరి ననుసరించుచు, ఎక్కడికి, యెందుకీ దౌడు యని అడుగవలెనని వడివడిగా నడుచును, అడిగినా చెప్పడేమో యని సంకోచించుచు అడుగక నూరుకొనుచు, చిరుకోపము తెచ్చుకొనుచు వడి తగ్గించి మందగమనము చేయుచు, ఆ దేవి పతిదేవుని వెంట నడచుచుండెను. అప్పుడేమి జరిగె ననగా:-

మ. వినువీథిం జనుదేరఁ గాంచి రమరుల్ విష్ణున్ సురారాతిజీ
వనసంపత్తినిరాకరిష్ణు గరుణావర్ధిష్ణు యోగీంద్రహృ
ద్వనవర్తిష్ణు సహిష్ణు భక్తజనబృందప్రాభవాలంకరి
ష్ణు నవోఢోల్ల సదిందిరాపరిచరిష్ణున్ జిష్ణు రోచిష్ణునిన్

అసురుల జీవనముల హరించువాడును, కరుణాసాగరుడును, యోగీంద్రుల హృదయసీమలయందు విహరించువాడును, సహనశీలి, భక్తుల హృదయముల నుత్కృష్టపరచువాడును, నిత్యనవయౌవనియైన ఇందిరాదేవి

పరిచర్యలు చేయువాడును, విజయశీలుడును, తేజోమయుడును నగు విష్ణుమూర్తి ఆకాశవీధులలో వచ్చుచుండగా దేవతలు చూచిరి. ఆయన వెనువెంటనే వచ్చుచున్న వారిని చూచి తమలో తాము యిట్లు ముచ్చటించుకొనిరి.

మ. చనుదెంచెన్ ఘనుఁ డల్ల వాఁడె హరిపజ్జం గంటిరే లక్ష్మి శం
ఖనినాదం బదె చక్ర మల్లదె భుజంగధ్వంసియున్ వాఁడె క్ర
న్నన యేతెంచె నటంచు వేల్పులు నమో నారాయణాయేతి ని
స్వనులై మ్రొక్కిరి మింట హస్తిదురవస్థావక్రికిం జక్రికిన్

అడుగో మహనీయుడగు శ్రీహరి వచ్చుచుండె, ఆ వెనుకనే వచ్చుచున్న లక్ష్మిని జూచితిరా! అదిగో శంఖనాదము, సుదర్శన చక్రమదిగో, అదిగో సర్పశత్రువైన గరుత్మంతుడు వెంటనే వచ్చుచుండె. చూడుడీ దివ్యదర్శనము - ఆహా! "ఓం నమో నారాయణాయ" యని దేవతలు, కరిరాజు దురవస్థను బాపుటకై తొందరపడు విష్ణువుకు మ్రొక్కిరి.

గజేంద్రుని రక్షించు ధ్యాసయందున్న శ్రీహరి, దేవతల నమస్కారములను గుర్తించలేదు. మనోవేగముతో పోయిపోయి, కొంతదూరమున శింశుమార చక్రమును బోలునట్టిదియు, కిన్నరేంద్రుని భాండాగారము వంటిదియు, భాగ్యవంతుని ఐశ్వర్యము వంటిదియు వైకుంఠపురమునందుండు కమలములతో నున్నట్టిదియు, సంసారచక్రమువలె ద్వంద్వములతోను, పాపపంకిలముతోను కూడియున్నదియునైన, యా కలువల సరస్సును గాంచి,

మ. కరుణాసింధుఁడు శౌరి వారిచరమున్ ఖండింపఁగాఁ బంపెస
త్వరితాకంపితభూమిచక్రము మహోద్యద్విస్ఫులింగచ్ఛటా
పరిభూతాంబరశుక్రమున్ బహువిధ బ్రహ్మాండభాండచ్ఛటాం
తరనిర్వక్రముఁ బాలితాఖిలసుధాంధశ్చక్రముం జక్రమున్

కరుణాసాగరుడైన శ్రీహరి మకరిని ఖండించుటకు తన సుదర్శన చక్రమును పంపెను. ఆ చక్రమెట్టిదన : సాధుజనులను రక్షించునట్టిది, భూమండలమును కంపింప జేయగలవేగము గలది, తననుండి వెలువడే

అగ్నికణములతో ఆకాశమును చుట్టివేయుగలది, పెక్కు బ్రహ్మాండ భాండములను కాంతిపుంజములతో నింపివేయగలది, తిరుగులేనట్టిది.

ఆ దివ్యచక్రము సూర్యకాంతితో సరస్సులో ప్రవేశించి, నీటిని కలచివేసి బుడబుడ ధ్వనులు నిండిపోవగా, దుష్టజలచరమైన మకరముండు తావునకు శీఘ్రముగ చేరెను.

శా. భీమంబై తలఁ ద్రుంచి ప్రాణములఁ బాపెం జక్ర మాశుక్రియన్
హేమక్ష్మాధరదేహముం జకితవన్యేభేంద్రసందోహముం
గామక్రోధన గేహమున్ గరటిరక్తస్రావగాహంబు ని
స్సీమోత్సాహము వీతదాహము జయశ్రీమోహమున్ గ్రాహమున్

ఆ చక్రము, భయంకరముగ, బాణమువలె పోయి, ఆ మకరితలను ద్రుంచి ప్రాణములను పోగొట్టెను. ఆ మకరము మేరు పర్వతమువంటి దేహము గలదియై, కామక్రోధాదులకు నిలయమై, ఏనుగుల మందకు భీతిని కల్పించునట్టిదై, గజేంద్రుని రక్తస్రావముతో నిండిన మడుగులో మునిగి తాపమును చల్లార్చుకొని, యంతులేని ఉత్సాహముతోను, విజయకాంక్షతోను విజృంభించినట్టిదై యుండెను. అట్టి మకరిని చక్రము ద్రుంచెను. అప్పుడు,

మ. తమముం బాసినరోహిణీవిభుక్రియన్ దర్పించి సంసారదుః
ఖము వీడ్కొన్న విరక్తచిత్తునిగతిన్ గ్రాహంబు పట్టూడ్చి పా
దము లల్లార్చి కరేణుకావిభుఁడు సౌందర్యంబుతో నొప్పె సం
భ్రమదాశాకరిణీకరోజ్ఝి తసుధాంభస్స్నా నవిశ్రాంతుఁడై

రాహువుచే విడిచిపెట్టబడిన చంద్రునివలెను, వైరాగ్యమును పొంది, సంసారదుఃఖమునుండి విడుదలను పొందిన గృహస్థుని వలెను, మొసలి పట్టునుండి విడుదల పొందిన కరిరాజు పాదము నిటు నటు కదిలించి స్వస్థుడై, సుఖియై, సుందర వదనుడై, యాడు యేనుగులు స్నానము చేయించి సేవలు చేయగా విశ్రాంతుడయ్యెను.

శా. పూరించెన్ హరి పాంచజన్యముఁ గృపాంభోరాశిసౌజన్యమున్
భూరిధ్వానచలాచలీకృతమహాభూత ప్రచైతన్యమున్
సారోదారసితప్రభాచకితపర్జన్యాదిరాజన్యమున్
దూరీభూతవిపన్న దైన్యమును నిర్ధూతద్విషత్సైన్యమున్

అప్పుడు శ్రీహరి పాంచజన్య శంఖమును పూరించెను. ఆ శంఖము, ఆయనయొక్క కరుణారస సముద్రమునుండి సౌజన్యమును స్రవింపజేయు నట్టిది దానియొక్క గొప్ప ధ్వనిచే పంచమహాభూతములు చైతన్యవంతములై చలనము పొందును, దాని యొక్క దివ్యతేజస్సు, ఇంద్రవరుణాది లోకములను కూడ ఆశ్చర్యపరచును, ఆపదలోనున్నవారి భయమును తొలగించును, శత్రుసేనలను పారద్రోలును.

మ. మొరసెన్ నిర్జరదుందుభుల్ జలరుహామోదంబులై వాయువుల్
దిరిగెం బువ్వులవానజల్లు గురిసెన్ దేవాంగనాలాస్యముల్
పరఁగెన్ దిక్కులయందు జీవజయశబ్దధ్వానముల్ నిండె సా
గర ముప్పొంగెఁ దరంగ చుంబితనభోగంగాముఖాంభోజమై

దేవదుందుభులు మ్రోగినవి, కమలములు తల లాడించు నట్లుగా వాయువులు వీచినవి, పువ్వులవాన జల్లు కురిసినది, అప్సరసలు నృత్యము చేసిరి, జయజయధ్వనులతో దిక్కులు నిండినవి, అలలు ఆకాశమునంటు నట్లుగ సముద్రముప్పొంగినది.

క. నిడుదయగు కేల గజమును
మడువున వెడలంగఁ దిగిచి మదజల రేఖల్
దుడుచుచు మెల్లన పుడుకుచు
నుడిపెన్ విష్ణుండు దుఃఖ మూర్వీనాథా

పరీక్షిన్మహారాజా!

ఆ మహాభాగ్యశాలి యైన గజేంద్రుని పొడవైన తొండమును పట్టుకొని, శ్రీహరి, ఆ గజమును మడుగునుండి వెలికితెచ్చి దాని చెక్కిళ్లపై కారిన మదజలచారలను తుడిచి, చేతితో నెమ్మదిగ నిమురుచు, దాని బాధను దుఃఖమును పోగొట్టెను.

శ్రీహరియొక్క కరస్పర్శచే దేహతాపము తొలగినవాడైన గజేంద్రుడు కరిణుల (ఆడుయేనుగుల) సమూహముతో ఫీంకార శబ్దములతో కలుసుకొనెను. తొండముతోకరిణులను నిమురుచు, శ్రీహరి యనుగ్రహముచే, గజపతి, మునుపటివలె అనురాగముతో క్రీడించెను.

మహారాజా! దేవల ఋషియొక్క శాపమునుండి విముక్తుడైన మకరము తన మొసలి రూపమును విడిచి, తన పూర్వపు హూహూ నామగంధర్వ రూపమును పొంది, నిర్మలుడై, శ్రీహరికి నతిభక్తితో మ్రొక్కి, కీర్తించి, గీతములు పాడి, ఆ భగవంతుని కృపను పొంది, పాపములను పోగొట్టుకొని, తనలోకమునకు వెళ్లెను. ఆ గజేంద్రుడు శ్రీహరి కరస్పర్శచే అజ్ఞానరహితుడై విష్ణురూపుడై వెలసెను. ఈ గజేంద్రుడు పూర్వజన్మమున ఇంద్రద్యుమ్ను డనబడు ద్రవిడదేశపు రాజైయుండెను. అతడత్యంత పుణ్యశీలుడు, వైష్ణవశ్రేష్ఠుడు, ఒక మహాపర్వతశిఖరముపై కూర్చొని, మౌనవ్రతము స్వీకరించి సర్వాత్ముడైన నారాయణుని విశేషముగ పూజించుచుండెను. ఒకనాడతడు మహావిష్ణువును ధ్యానించుచుండగా నచ్చటికి అగస్త్యముని వచ్చెను. రాజు, మునిరాకను గమనించలేక, లేచి నిల్చొని అతనిని పూజింపని కారణమున ముని క్రుద్ధుడై "నీవు గజమువై జన్మించెదవుగాక!" యని శపించెను. అట్లే ఇంద్రద్యుమ్నుడు కుంజర గర్భమున జన్మించెను. రాజా! ఎట్టి పరిస్థితుల యందైనను విప్రుల కోపమునకు గురియగుట ప్రమాదకరము. ఆ రాజు గజరాజయ్యెను. అతని అనుయాయులందరును కుంజర యూథమైరి. అతని పూర్వపుణ్యవిశేషముచే, విష్ణుభక్తిచే, నతడు కరియైనను ఉత్తమ సద్గతినే పొందెను.

ఆ. కర్మతంత్రుఁడగుచు కమలాక్షుఁ గొల్చుచు
నుభయనియతవృత్తి నుండెనేనిఁ
జెడును గర్మ మెల్ల శిథిలమై మెల్లన
ప్రబలమైన విష్ణుభక్తి సెడదు

రాజా! కర్మలు చేయుచుండ కర్మతంత్రుడైనను, శ్రీహరిని భక్తిశ్రద్ధలచే కొలుచుచు, కర్మ, భక్తి ఉభయనిష్ఠలను ఆచరించుచున్నచో సాధకుని

కర్మమంతయు క్రమముగ శిథిలమై నశించును. కాని ప్రబలమైన విష్ణుభక్తి మాత్రము నశింపదు.

క. చెడుఁ గరులు హరులు ధనములుఁ
జెడుదురు నిజసతులు సుతులుఁ జెడుచెనఁటులకున్
జెడక మనునెఱసుగుణులకుఁ
జెడని పదార్థములు విష్ణుసేవానిరతుల్

రాజా! బుద్ధిహీనులకు (దుష్టులకు) ఏనుగులు గుఱ్ఱములు, ఇతర ధనసంపదలు ఎన్నియున్నను నశించును. నిజసతులు, సుతులు కూడ నశింతురు. కాని, సంపూర్ణ సుగుణవంతునకు (నిష్కారణముగ) ఏమియును నశింపవు. ఈ నశించు ప్రపంచములో నశింపనివి కేవలము విష్ణుసేవా నిరతులు మాత్రమే.

భక్తరక్షణ కార్యము ముగిసిన పిమ్మట ఆ పరమేశ్వరుని దృష్టి జగజ్జనని యైన లక్ష్మీదేవివైపు మరలి, ఆమెతో నిట్లు పరిహాసమాడెను:

క. బాలా నావెనువెంటను
హేలన్ వినువీధినుండి యే తెంచుచు నీ
చేలాంచలంబుఁ బట్టుట
కాలో నేమంటి నన్ను నంభోజముఖీ

బాలా! నీపైట చెంగును చేతితో పట్టుకొని, విడువకుండ ఆకాశమార్గాన నేను విలాసముగా వెళ్లిపోవుచుండ, నీవు నా వెంట పరుగెత్తుకొంటూ వచ్చుచున్నప్పుడు నీవు నా గురించి ఏమనుకొంటివో కదా, పద్మవదనా! అని పలికిన, అరవింద మందిర యగు నా యిందిరాదేవి మందస్మిత వదనారవింద యగుచు ముకుందునకిట్లనెను:

క. దేవా దేవరయడుగులు
భావంబున నిలిపి కొలుచుపని నాపని గా
కో వల్లభ యే మనియెద
నీవెంటను వచ్చుచుంటి నిఖిలాధిపతీ

ఓ దేవా! నీ యడుగులనే (పాదపద్మములనే) నా చిత్తమునందు నిలుపుకొని కొలుచుట నా ధర్మముకాదా ప్రాణేశా! నేను నిన్నేమనగలను సర్వేశ్వరా! మఱియు

క. దీనుల కుయ్యాలింపను
దీనుల రక్షింప మేలు దీవనఁ బొందన్
దీనావన నీ కొప్పును
దీనపరాధీన దేవదేవ మహేశా

ఓ ప్రభూ! దీనపరాధీనా! దీనులయొక్క మొఱలనాలకించుటకును, వారిని రక్షింపుటకును, వారి స్తుతులను పొందుటకును, ఓ దీనావనా! నీకే తగియున్నది కదా! ఓ దేవదేవా! మహేశ్వరా!

శ్రీదేవియొక్క సముచిత సంభాషణములకు సంతసించిన శ్రీహరి, ఆమెను మందహాస పూర్వకముగ, ప్రేమతో నాలింగనము చేసుకొని, సపరివారముగ, గంధర్వసిద్ధ విబుధగణములు స్తుతించుచుండగ శ్రీమన్నారాయణుడు గరుడారూఢుడై నిజధామమునకు వెడలెను. అని చెప్పి శుకయోగీంద్రు డిట్లనెను :

సీ. నరనాథ నీకును నాచేత వివరింపఁబడిన యీ కృష్ణానుభావమైన
గజరాజమోక్షణకథ వినువారికి యశము లిచ్చును గల్మషాపహంబు
దుస్స్వప్న నాశంబు దుఃఖసంహారంబు బ్రొద్దున మేల్కాంచి పూతవృత్తి
నిత్యంబుఁ బఠియించు నిర్మలాత్మకులైన విప్రులకును బహువిభవ మమరు

తే. సంపదలు గల్గుఁ బీడలు శాంతిఁ బొందు
సుఖము సిద్ధించు వర్ధిల్లు శోభనములు
మోక్ష మఱచేతిదై యుండు ముదము సేరు
ననుచు విష్ణుండు ప్రీతుఁడై యానతిచ్చె

(శ్రీశుకుడిట్లు చెప్పెను:) నరనాథా! మహావిష్ణువు నిజధామమునకు మరలిపోవు నప్పుడిట్లు చెప్పెను. ఈ గజరాజ మోక్షణకథ, వినువారికి కీర్తినిచ్చును, కల్మషమును హరించును, దుస్స్వప్నములు నివారించును, దుఃఖమును తొలగించును. ప్రాతఃకాలమున మేల్కొని పుణ్యాకర్మలు చేసుకొని

నిత్యము పఠించు నిర్మలాత్ములకు అనేకమైన వైభవములు కలుగును, సంపదలు కలుగును, పీడలు శాంతించును, సుఖము సిద్ధించును, శోభనములు వర్థిల్లును, సంతోషము కలుగును మోక్షము సిద్ధించును. మఱియును, ఎవ్వరైనను వేకువజామున మేల్కొని, నిశ్చలమనస్కులై - శ్వేతద్వీపమును, నాకు ప్రియమైన సుధాసాగరమును, మేరుపర్వతమును, ఆ పర్వత గుహలను, వనములను, లతా, కుంజ, దేవతా వృక్షములను, నేనును బ్రహ్మ శివులును నివసించు పర్వత శిఖరములను, సుదర్శన పాంచజన్య కౌమోదకి, కౌస్తుభములను, శ్రీదేవిని, శేష, వాసుకి, గరుడులను, ప్రహ్లాద నారదాది భక్తులను, ఋషులను, మత్స్య కూర్మ వరాహాద్యవతారములను, ఆ యవతార కార్యములను, సూర్యచంద్రాగ్నులను, ప్రణవమును, వేదవేదాంగ, శాస్త్రములను,ధర్మ తపః సత్యములను, గో, బ్రాహ్మణ, సాధు, పతివ్రతా జనములను, గౌరీ, గంగా, సరస్వతీ, కాళిందీ సునందాదిప్రముఖ నదులను, దేవతలను, కల్పవృక్షములను, ఐరావతమును, అమృతమును, ధృవుని, బ్రహ్మర్షి సముదాయమును, పుణ్యమూర్తులైన మానవులను, నిశ్చలచిత్తులై స్మరించువారికి, ప్రాణావసానకాలమందు నా యొక్క నిర్మల పవిత్ర స్థితిని అనుగ్రహించెదను' - అని శ్రీహరి నిర్దేశించి, శంఖము పూరించి, పక్షిరాజైన గరుడునిపై నెక్కి నిష్క్రమించెను. బుద్ధిమంతులందరు జయజయ ధ్వనులు చేసిరి. అని శుకయోగి పరీక్షిత్తునకు చెప్పి మరల ఇట్లనెను:

క. గజరాజమోక్షణంబును
 నిజముగఁ బఠియించునట్టి నియతాత్ములకున్
 గజరాజవరదుఁ డిచ్చును
 గజతురగస్యందనములుఁ గైవల్యంబున్

ఈ గజేంద్ర మోక్షణకథను శ్రద్ధగ పఠించునట్టి నిష్ఠాపరులకు కరిరాజవరదుడు (శ్రీహరి) రథగజతురగాది సకలసంపదలే కాక కైవల్యమును కూడ ప్రసాదించును.

గజేంద్రమోక్షణ కథ సమాప్తము
హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

3. వామనచరిత్ర

పరీక్షిన్మహారాజు అడిగిన ప్రశ్నకు బదులుగ శుకయోగీంద్రుడిట్లు చెప్పెను. రాజేంద్రా! మనువులు, మునులు, మనుపుత్రులు, ఇంద్రులు, దేవతలు, అందరును ఆ శ్రీహరి యాజ్ఞ ప్రకారము నడచెదరు. వారు విష్ణు తేజోంశసంభూతులు. హరియొక్క సహాయశక్తులను పొంది జగముల నడుపుదురు. నాల్గు యుగములనంతరము కాలముచే కబళింపబడిన వేదములను మునుపటివలె ఋషులు తమతమ తపోబలముచే మరల దర్శింతురు. ధర్మము మరల నాలుగు పాదములను కలిగి వర్తించును, మనువులు మహావిష్ణువు ఆజ్ఞల ప్రవర్తించెదరు, రాజులు భూమిని విభజించి తమతమ కాలములలో నేలుదురు. మఱియు, వారి వారి ప్రాప్తముల ప్రకారము దేవతలకు ఇంద్రాది పదవులను శ్రీహరి యిచ్చును, వారు, విహితకర్మలచే మూడులోకములను పరిపాలించెదరు. లోకములు సుభిక్షముగ నుండును. ఆ లోకములలో శ్రీహరి, యోగీశ్వరుని రూపమున యోగము దెల్పును, మునిరూపమున కర్మమార్గమును దెల్పును, ప్రజాపతి రూపమున సృష్టిని గావించును, ఇంద్రుడై యసురుల మదమణచును, సిద్ధుని రూపమున జ్ఞానము బోధించును, కాలరూపమున నాశనము చేయును, నానావిధాకార నామరూపులలో వెలసినను జ్ఞానములేని కర్మిష్ఠులకు కానబడడు. భూత భవిష్య వర్తమాన మూడు కాలముల యందును, అవ్యయుడైన విష్ణువు యనేక రూపములతో వివిధ కార్యములలోను ప్రవృత్తుడైయుండును. అని చెప్పగా రాజిట్లడిగెను : మునీంద్రా!

విష్ణువు బలిచక్రవర్తిని, యెందుకొఱకు మూడడుగుల నేలను యాచించెను? ఆయన పరిపూర్ణుడు, లక్ష్మీపతి, నిశ్చలుడు, కోరికలు లేనివాడు, అయి యుండియు, ఒక దీనునివలె వెళ్లి కొద్దిపాటి నేల గురించి యాచింపనేల, మఱి, తప్పేమియు చేయని, నిర్మలుడైన బలిని బంధించెనేలకో, వినుటకు మిక్కిలి కుతూహలముగ నున్నది. చెప్పుడు. అనిన శుకయోగిట్లు చెప్పెను:

రాజా! దేవాసుర సంగ్రామములో బలి, యింద్రునిచేత బాగుగ దెబ్బతిని ఓడిపోయి, పారిపోయి, శుక్రాచార్యులచే బ్రతికింపబడి, అతిభక్తి శ్రద్ధలతో నాతని

శిష్యుడై గురువులను మెప్పింపగా, యా గురువులు సంతసించి, అతనిచే విశ్వజిత్ యాగమును శాస్త్రోక్తముగ చేయించిరి. అప్పుడు హోమగుండము నుండి, అగ్నిహోత్రుడు, బంగారు రథమును, సూర్యాశ్వముల వంటి గుఱ్ఱములు, సింహధ్వజము, దివ్యధనుస్సు రెండు పూర్ణ తూణీరములు, కవచమును బహూకరించెను. వాడిపోని పద్మమాలను తాత యిచ్చెను, చంద్రకాంతి వంటి శంఖమును శుక్రాచార్యుడిచ్చెను.

క. పాణియు రథియుఁ గృపాణియుఁ
 దూణియు ధన్వియును స్రగ్వి తురగియు దేహ
 త్రాణియు ధిక్కృతవిమత
 ప్రాణియు మణికనకవలయపాణియు నగుచున్

రథమునెక్కినవాడును, ఖడ్గమును ధరించినవాడును, అమ్ములపొదులను ధరించినవాడును, శంఖమును చేతబట్టినవాడును, దేవతలచే నిగ్రహింపబడిన వాడును, మణిమయ కనక హారములను ధరించినవాడును, అయిన యా బలిదైత్యేంద్రుడు.

బ్రాహ్మణులకు పెక్కు దానములనిచ్చి వారి శుభాశీస్సులను పొంది పెద్దలకు మ్రొక్కి ప్రత్యేకమైన ఇష్టదైవములను అంతరంగమున పూజించి, పవిత్రుడైన ప్రహ్లాదునికి వినమ్రుడై నమస్కరించి, రథరాజము నెక్కి ఆ దానవరాజు పర్వత శిఖరముపై ప్రజ్వలించు దావాగ్నివలె తేజస్సుతో వెలిగిపోవుచుండెను.

అణచబడిన యమభటాదులు, పీడింపబడిన సురసిద్ధసాధ్య గంధర్వాదులు, లొంగదీయబడిన దిక్పాలకులు, అసురనాయకులు, హితులు, ఆ దానవరాజును కొలవగా, చూపులతోనే ఆకాశమును ఆక్రమించి, భూలోక స్వర్గలోకములను తల్లక్రిందులు చేయుచు, ఆక్రమించుచు, ఆ దానవేంద్రుడు దేవతానగరముపైకి దారితీసెను. ఇట్లు బలవంతుడైన బలి, ఇంద్రుని జయింప సమకట్టి, దండయాత్ర చేయుటకై పోయి, పోయి,

పుణ్యజనులుండు లోకమును, రోగములు, స్వప్నపీడలు, అన్నఖాద్యముల వలన కలుగు దుఃఖములు లేని లోకమును, ఫలపుష్పాదులతో నిండియున్న

వృక్షములను ఎత్తుగా నెగురుచున్న పతాకమును, మిక్కుటముగ సంచరించు విమాన సమూహమును పవిత్రజలములతో నున్న నదులను, ఇంద్రునితో గూడియున్న స్వర్గలోకమును, గాంచెను.

ఆ రాక్షసరాజు అట్లు పోయి, ఆ స్వర్గలోకపు శోభను తిలకించి ఆశ్చర్య పోయెను. వృక్షములు మొగ్గలతోను పుష్పములతోనూ పిందెలు, కాయలు, పండ్లతోను మోయలేక తలలు వంచుకొనియున్నవి. జుమ్మని ఎగురుచు, పుష్పతేనెలను కడుపునిండ పీల్చుకొని ఎగురలేక సాటి తేటులతో సమావేశమగు తుమ్మెదలతోను, సమృద్ధిగ లభించు చిగురుటాకులను మేయలేక గొంతెత్తి కూయలేని కోయిల సమూహములతోను, వివిధమైన స్వరములతో కూయు చిలుకలు, పావురములతోను, కొలనులందలి తామరలను చించి త్రుంచి, కర్ణికలను తూడులను యారగించు హంసలను, గాలికి గర్వముగ తలల నాడించుచు, ఇందిరామందిరములనబడు కలువలతో నిండియున్న సరస్సులను, గాలికి ఎగసి, గగనములనంటెడి, పలువర్ణముల పుష్పపరాగ ములను, పచ్చని గఱిక చిగుళ్లను మేయుచు, నెమరువేయుచు, పొదుగులు నింపుకొని, దూడల క్రీడలను వీక్షించుచు ఇళ్లకు చేరి అమృతమును కురిపించు కామధేనువులను, కామధేనువులకు నీడలనిచ్చుచు, అడిగినవారి కోర్కెలను దీర్చుచు ధనములను కురిపించు కల్పతరువులను, కల్పతరువుల కొమ్మలను విరుచుచు, గున్నలను మేపుచు, సుందరీమణులకు గజగమనము నేర్పుచున్నవా యనిపించునట్లు విహార పర్వతములకు నడచిపోవు యేనుగులను, అందముగ నలంకరింపబడిన మకరతోరణ స్తంభములను, స్తంభములవద్ద నిల్చొనియున్న మెఱుపుతీగలవంటి చూపులతో మోహింప జేయునట్టి, విమానములలో వచ్చు సత్‌చరిత్రులను ఆహ్వానించుటకు నియమింపబడినట్టి అప్సరసలను, ఆకాశమున కెగసి క్రిందికి ప్రవహించు గంగను, గంగయందలి తేట నీటిలో జల్లులాట లాడుకొను దివ్య కన్యకలను, పెద్దపెద్ద అరుగులు గోపురములు, కవాటములు గల భవనములను, నవరత్నములు పొదగబడిన కవాటములను, ఇంద్రనీల గంభీర స్తంభములను, భటులచేతను ద్వారపాలకులచేతను కాపలాకాయబడిన అంగళ్లను, కాలక్షేపముకొఱకు, దేవదానవ యుద్ధ గాథలను ముచ్చటించుకొను రక్షకభటులను, గొప్ప ఎత్తైన, శుద్ధస్ఫటిక సుకుమార

సోపానము రజత దీపస్తంభములతో వెలిగింపబడిన అగడ్తలను, ఆ అగడ్తల ప్రక్కన ఎత్తైన వజ్రపు గోడలు, తారకలనంటు శిఖరములు, చంద్రకాంత శిలల నేలలతో, బంగారు జలతారు తెరలతో ఎత్తైన ప్రాకారములతో శోభిల్లు సౌధములను, శత్రుసేనలను హతమార్చగల ఫిరంగులు, రథములు, రమణులతో నిండిన రాజసౌధములు, కర్పూర కుంకుమ అగరుధూపములతో నిండిన గదులను, ఆ ధూపముల జూచి మేఘములని భ్రమపడి నృత్యము చేయు నెమళ్లను, వీరభటుల సమూహములను, రథములను, అశ్వములను, ఆహ్లాదకరమైన వీధులతో నున్న రాజమార్గములను, వాయువేగ మనోవేగములతో నెచ్చటికైనను ఎగురగల విమానములను, విమానవిహారము చేయు సుందర సుందరీమణులుంచుకున్న భేరీ, వీణా, పణవ, మృదంగ, శంఖాది వాద్యవిశేషములను, అశోక, పున్నాగ కదళీ వృక్షాదులతో కూడిన సుందర ఉద్యానవనములతో శోభిల్లుచుండు అమరావతీ నగరమును గాంచి బలిదైత్యేంద్రుడు దేవనగరిచుట్టును సేనలను పెట్టి, మార్గములనరికట్టి, సావధానముగ నుండెను.

ఈ అమరావతిలోని స్త్రీ జనమెన్నడు కళావిహీనులు కారు, చిరునవ్వును వీడరు, కాలవశులై చనిపోవరు, ముసలితనము నొందరు, దుష్టులదరిజేరరు, పుణ్యాత్ముల సాంగత్యమును విడిచిపెట్టరు. అట్టితరి,

దానవుల శంఖములనుండి వెలువడిన భయంకర ధ్వనులు దేవనగరిని నింపివేయుగా, దేవతాస్త్రీల గర్భములు పగిలి, యందలి బిడ్డలావురావురని ఆక్రోశించిరి.

అంతట, బలిదానవుడు అమరావతిని ముట్టడించుటను తెలుసుకొని, కోటకు గట్టిగా రక్షణ ఏర్పాటుచేసి, దేవేంద్రుడు, దేవవీరులను సమావేశపరచి, దేవగురువైన బృహస్పతిని రావించి యిట్లనెను : ఈ బలిదైత్యుడు మనపై దండెత్తి వచ్చినాడు. ప్రళయకాల దావాగ్నివలె వెలుగుచున్నాడు. ఘోరరాక్షసులతో గూడివచ్చినాడు. ఇదివరకు మనచే ఓడింపబడి పారిపోయిన వాడిప్పుడు తిరిగివచ్చెను. వీనికి ఏ తపస్సువలన ఇంత శక్తి వచ్చెనో మరి! ఈ దురాత్మునకు ఎవ్వడు తోడయ్యెనో! ఇప్పుడు వీనిని గెల్చుటెట్లు? ఏమి

చేయుదము? మనకు శక్తి యెక్కడున్నది? వీని నెదుర్కొనుటకెవ్వరికి సాధ్యపడును?

వీడు ఆకాశమునే మ్రింగివేయునట్లున్నాడు. అమరాద్రికంటెను పొడవెదిగి పోయి నట్లున్నాడు. కాలాంతకునివలె మ్రింగివేయునట్లున్నాడు. మనము వెనుదిరిగినచో బ్రహ్మదేవునికూడ ఓడించునట్లున్నాడు.

వీనికి రాజ్యమెన్నటికిని ఇవ్వరాదు. వీనితో యుద్ధము చేయుటకు పోరాదు. పోయినచో గెలువకుండ తిరిగి రారాదు. ఈ దానవునిచేత నిక నోడిపోరాదు. మహాత్మా! గురువర్యా! మార్గాంతర మేమిటో తెలవిండు.

అనిన సురేంద్రునకు ఆచార్యుడిట్లు చెప్పెను:

దేవేంద్రా! వినుము. ఈ దానవున కింతటి శక్తిసంపదలు బ్రహ్మవేత్తలైన భృగుశ్రేష్ఠులిప్పించిరి. వీనినిప్పుడెదిరించుటకు గాని వారించుటకుగాని, యీశ్వరుడైన హరికి తప్ప నీకుగాని, నీ సములకుగాని అధికులకుగాని, అన్యులకెవ్వరికిని సాధ్యపడదు. ఇంతవరకు 'నీవనుభవించిన రాజ్యము చాలు. నీవీ దేవలోకమును ప్రస్తుతమునకు విడిచిపోవుటయే కర్తవ్యము. శత్రువు బలహీనుడగు సమయముచూచి, మరలివచ్చి జయించుట మేలని నా మతము. బ్రాహ్మణులచే వీని కీ బలమువచ్చినది. వారియెడల శ్రద్ధ తగ్గినంతనే వీనిశక్తి చెడును. అంతవరకు నీవు శత్రువుగురించి తలంచకుండ వేచియుండుము. శత్రువును గెలువవలెను, కానిచో, తీవ్రముగ పోరవలెను. కానిచో చావవలెను. జయించుటగాని మరణించుటగాని కుదరనప్పుడు, సరసముగ ముందే తొలగి పారిపోవలెను. సుమా!

అని బృహస్పతి చెప్పగా, దేవతలు కామరూపులై (ఇచ్ఛారూపులై) దేవలోకమును విడిచి, తమకు లభించినచోట్లకు వెడలిపోయిరి. ఎదిరించువారు లేని కారణమున బలి, దేవరాజధానియైన అమరావతి నాక్రమించి, మూడు లోకములను తనవశము చేసికొని, విశ్వవిజయుడై చాలాకాలము రాజ్యమేలుచుండెను. గురువులైన భృగ్వాదులతనిచే నూరు అశ్వమేధ యాగములు చేయించిరి. అప్పుడా అసురచక్రవర్తి రాజ్యములో కోరుకొను వారే లేకపోయిరి. దానములిచ్చి చెడినవారెవ్వరును లేరైరి. సకల కామ్యకర్మ

క్రతువులు ఫలించెడివి. విరోధులు లేరు. దేవాలయములు మహోత్సవములను నిర్వహించెడివి. పూర్ణకాములైన బ్రాహ్మణులు ఏ కాలమున ఏ యాగములు చేయనగునో వానిని చేయుచు, వర్షములు కురిపించుచు, భూమిని సుసంపన్నము చేయగ భూమి సకలార్థముల నిచ్చుచుండెను ఆ అసురేంద్రుని రాజ్యపాలనమప్పుడు.

అంత, నొకనాడు, సురమాతయైన అదితి, తన పుత్రుల స్థానమును దనుజులు లాక్కొనుటచే, వారు ఎక్కడికో పోయి తలదాచుకొనుటను భరించలేక అనాథవలె శోకించుచుండగా నామె భర్తయైన కశ్యపప్రజాపతి సమాధిని చాలించి, అదితి గృహమునకు వచ్చి, ఆమె యొక్క సేవా సపర్యలను పొంది, ఆమె యొక్క కృశించియున్న దీనవదనమును, అశ్రుధారలను చూచి, వగచి, బుజ్జగించి, శోకకారణమడిగెను.

"ఓ పుణ్యశీలా! నీ యొక్క యీ దైన్యతకు కారణమేమిటి? బ్రాహ్మణులు సరిగా ఆదరింపబడి సంతుష్టులై యుండిరా? దేవతార్చనాదులన్నీ సక్రమముగ జరిగినవా? గృహస్థులు సకాలమున సక్రమముగ హోమాదిక్రతువులు చేసిరా? పుత్రులు ధర్మానుష్ఠాన పరులైయుంటిరా? అభ్యాగతులకు సరిగా అన్నపానము లివ్వబడినవా? యాచకులకు సేవకులకు సుజనులకు గౌరవాదరము లివ్వబడినవా? ఓ దేవమాతా! అన్నమైనను జలమైనను, పైకమైనను, శాకమైనను (కూరలైనను) తనకు జరుగునంతవరకు అతిథి జనులకు లేదనకుండ ఇవ్వనివారు, కలిగియున్నవారైనను, లేనివారే సుమా!

వనితా! విష్ణువునకును, సకల దేవతలకును అగ్నిదేవుడు, బ్రాహ్మణులే నోరు (వారి ద్వారానే అర్పణలు దేవతలచే నారగింపబడును గనుక) వారు సంతృప్తులైనచో శ్రీహరిసంతృప్తుడగును. శ్రీహరి సంతృప్తుడైన జగములన్నియు సంతృప్తులగును.

ప్రియసతీ! నీ బిడ్డలు నీతో వక్రముగ మాటాడుటకు భయపడుదురా! నీ కోడండ్రు నీతో ఎదురుప్రశ్నలు వేయక సౌమ్యముగ ప్రవర్తించెదరా? నీకు నీయింట నీమాటకు అడ్డము కలుగుచున్నదా? అనిన విని అదితి యిట్లనెను:

హృదయేశ్వరా! ఇంచుకైనను ప్రేమలేనివారై, దితి బిడ్డలు, మనుమలు, మహాభయంకర బలాఢ్యులై, నా బిడ్డలందరిని త్రోలివేసి, దుస్సాహసముతో అమరావతి నేలుచుండిరి. నా వారి బాధలను నీకేమని విన్నవింతును, మేలుదలంచి చూడుము. మేము అక్కాచెల్లెండ్రమైనను, దితి నాతోటి వైరము మానదు సరికదా రక్కసులు సురలను మొత్తుచుండగ, అక్కటా! మొత్తవద్దని తనవారిని వారింపదు. చూచుచు భళిభళియని ఆమోదించును.

సీ. ఎండకన్నెఱుఁగని యింద్రునియిల్లాలు పలుపంచలను జాలిఁబడియె నేఁడు
త్రిభువనసామ్రాజ్యవిభవంబుఁ గోల్పోయి దేవేంద్రుఁ డడవులఁ దిరిగె నేఁడు
గలిమి గారాబుబిడ్డలు జయంతాదులు శబరార్భకులవెంటఁ జనిరి నేఁడు
నమరుల కాధారమగు నమరావతి యసురుల కాటపట్టయ్యె నేఁడు

ఆ. బలి జగముల నెల్ల బలియుచు నున్నాఁడు
వాని గెలువరాదు వాసవునకు
యాగభాగ మెల్ల నతఁ డాహరించుచుఁ
గడఁగి సురల కొక్కకడియు నీఁడు

నాథా! అంతఃపురమునుండి యెన్నడును బయటకు వచ్చియుండని యింద్రసతి, జాలిగా పలుపంచలలో తలదాచుకుంటున్నది. ముల్లోకముల సామ్రాజ్య వైభవమును పోగొట్టుకొని, దేవేంద్రుడు అడవుల పాలయ్యెను. ఐశ్వర్యముతో తులతూగుచుండెడి యింద్రసంతతి వారైన జయంతాదులు అడవులలో శబరబాలురతో తిరుగుచున్నారు. అమరుల స్థానమైన అమరావతి యిప్పుడసురులకు ఆటపట్టయి పోయినది. బలి యిప్పుడన్ని జగముల నేలుచు, నింకను శక్తివంతుడయ్యెను. వానినిప్పు డింద్రుడు గెలవలేడు. దేవతలకు చెందిన యజ్ఞహవిర్భాగములను బలియే ఆరగించుచు దేవతల కేమియు నిచ్చుటలేదు.

మహాత్మా! నీవు ప్రజలందరిపట్లను సముడవు. ప్రజలను కన్న బ్రహ్మవు నీవు. ప్రజలలోని దుష్టులను నీవు శిక్షింపవలెను కదా! స్వామీ!

స్వామీ! దేవతలను, ప్రజలను, ఆర్తిలోనున్నవారిని, మునులను, వారి

శోకమును బాపి దేవరాజధానిని రక్షించి, రాక్షసులను శిక్షించునట్టి సత్కార్యము నే రీతిని, ఏ ఉపాయముచే చేయునగునో ఆ విధమును శీఘ్రముగ నాలోచించవలసినదిగా వేడుచున్నాను, ఓ కల్యాణ సంధాయకా! నీ యొక్క కరుణాకటాక్షమును ప్రవహింపజేయుము.

అనిన ధర్మపత్ని వాక్కులను విని, క్షణకాలము యోచించి, చేయగల కార్యమును విచారించి కశ్యపబ్రహ్మ యిట్లనెను :

మ. జనకుం డెవ్వఁడు జాతుఁ డెవ్వఁడు జవస్థానంబు లెచ్చోటు సం
జననం బెయ్యది మేను లే కొలఁది సంసారంబు లే రూపముల్
వినుమా యంతయు విష్ణుమాయ దలఁపన్ వే ఱేమియున్ లేదు మో
హనిబంధంబు నిధాన మింతటికి జాయా విన్నఁబో నేటికిన్.

దేవీ! నీకెందుకీ యావేదన? జీవునికి తండ్రి యెవ్వడు, తనయుడెవ్వడు? (అనేకమైన జన్మలలో ననేకమైన తండ్రులుందురుకదా!) వాని జన్మస్థాన మెక్కడున్నది? జననమనగా నేమిటి? ఈ శరీరము లేపాటివి? (ఎన్నాళ్లుండునవి?). ఈ సంసారముల యొక్క వాస్తవ స్వరూపములెట్టివి? వినుము. బాగుగ యోచించినచో, నిదియంతయు విష్ణుమాయ, తప్ప వేఱేమియును లేదు. కేవలము మోహబంధనమే యీ మమకారమున కాధారము. కావున ఓ సతీమణీ! నీవీ విషయమున ఖిన్నురాలవనేల?

అయినను, కాలోచితమైన కార్యమును చెప్పెద విని, ఆచరింపుము: భగవంతుడు, పరమాత్ముడు, జనార్దనుడు, కృపాపూర్ణుడు, సర్వాత్మకుడు, జగదీశుడు, అయిన శ్రీహరిని సేవింపుము. అతడు సంతుష్టిని పొంది, నీ యొక్క ఇష్టకామ్యార్థములన్నిటిని అనుగ్రహించును. నీకు సకలార్థములు చేకూరును. భగవత్సేవచే బహుసౌభాగ్యములు పొందవచ్చును కదా! ప్రేయసీ!

అనిన ఆమె యిట్లనెను : స్వామీ! పరమేశ్వరుడైన నారాయణుని నేను ఏ విధముగా ధ్యానించవలెను, ఏ మంత్రమును జపింపవలెను, ఆ విధానము లెట్టివి, ఎంతకాల మారాధింపవలెను? నాకు తెలవిండు. అనగా ఆ కశ్యపప్రజాపతి భార్యకు పయోభక్షణము అను వ్రతమునుపదేశించి, ఆ

మంత్రమును, విధానమును, ఉపవాస భోజనాది నియమములను తెలియజేసెను. అదితి, ఫాల్గుణమాస శుక్లపక్ష ప్రథమ దివసమునుండి పంద్రెండు దినములు శ్రీహరి సమర్పణముగ వ్రతముచేసి, వ్రతాంతమున నియమ నిష్ఠలతో నుండగా, శ్రీమన్నారాయణుడు చతుర్బాహుడై పీతవస్త్రధారియై శంఖచక్ర గదాధారియై ప్రత్యక్షమవగా నామె చూచి, కన్నులనుండి రాలిన సంతోషాశ్రువులు చన్నులను తడుపగా, శరీరము పులకాంకితమవగా, ఉత్తమరీతిని నమస్కారములు స్తుతులు చేసి చేతులు జోడించి నుదుట నిడుకొని, చూపులతో శ్రీపతి రూపమును తనివితీరక త్రావిత్రావి, హర్షముప్పొంగగ, మందమధురా లాపములతో లక్ష్మీనాథుని, యిట్లు స్తుతించెను.

సీ. యజ్ఞేశ విశ్వంభరాచ్యుత శ్రవణమంగళనామధేయ లోకస్వరూప
యాపన్నభక్తజనార్తివిఖండన దీనలో కాధార తీర్థపాద
విశ్వోద్భవస్థితివిలయ కారణభూత సంతతానంద శశ్వద్విలాస
యాయువు దేహంబు ననుపమలక్ష్మియు వసుధయు దివముఁ ద్రివర్గములును

తే. వైదికజ్ఞానయు క్తియు వైరిజయము
నిన్నుఁ గొలువని నరులకు నెఱయఁగలదె.
వినుతమందార గుణహార వేదసార
ప్రణుతవత్సల పద్మాక్ష పరమపురుష

ఓ యజ్ఞేశ్వరా! (యజ్ఞపురుషా)! విశ్వంభరా! (విశ్వమంతట నిండియున్న వాడా) అచ్యుతా! శ్రవణమాత్రమున మంగళము కలిగించు నామము గలవాడా! లోకమే నీ స్వరూపమై యున్నవాడా! ఆపన్నులైన భక్తజనుల ఆర్తిని హరించువాడా! దీనజనులకు ఆధారమైనవాడా! పదమే (పాదజలమే) తీర్థమైనవాడా! విశ్వముయొక్క సృష్టిస్థితి లయములకు కారణభూతమైనవాడా! నిత్యానందుడా! శాశ్వతలీలా విలాసుడా! నిన్ను భక్తితో కొలుచువారికి ఆయుస్సు, దేహారోగ్యము, ఐశ్వర్యము, ఇహము, పరము, ధర్మార్థకామములు, వేదవిజ్ఞానము, యుక్తి శత్రు విజయము, అన్నీ సిద్ధిస్తాయి కదా! (నిన్ను కొలవని

వారికి ఇవియేవియైన లభించునా?) ఓ భక్తమందారా! సుగుణభూషణా! వేదస్వరూపా! శరణాగత వత్సలా! పద్మాక్షా! పరమపురుషా! అని స్తుతించి, మఱల నామె యిట్లనెను:

ఆ. అసురవరులు సురల నదలించి బెదరించి
నాక మేలుచున్న నా(టినుండి
కన్న కడుపుగాన కంట(గూరుకు రాదు
కడుపు(బొక్కు మాన్పి కావవయ్య.

ప్రభూ! ఈ యసురులు స్వర్గము నాక్రమించి యేలుచున్నప్పటినుండి, దేవతలను అదరించి, బెదరించి, నానాబాధలు పెట్టుచుండిరి. కన్న కడుపు గావున, నా కంటికి ఒక్క కునుకైనను పట్టుటలేదు నా కడుపుమంటను మాన్పి మమ్ములను కాపాడుమయ్యా!

అనిన విని, ఆ యాశ్రిత వత్సలుడైన పరమేశ్వరుడు మందహాసముతో నిట్లనెను: ఓ దేవమాతా! నీవు, నీ నాధుడు, నీ పుత్రులు, కోడండ్రు, నన్ను స్తుతించుటచే, నే సంతసించి, దేవతలు వారిసతులును, సుఖించుటకునై, నేను రాక్షసులను శిక్షించి శోకింపజేయుటకునై, నీ గర్భవాసమున తేజోమూర్తినై జన్మించెదను. నీ సుతునిగా నుండి, వర్తించుటకు నాకును వేడుకగ నున్నది.

మ. బలిమిన్ దైత్యుల(జంపరాదు వినయోపాయంబునంగాని సం
చలనం బొందకు నేను నీనియతికిన్ సద్భక్తికిన్ మెచ్చితిన్
బలివిద్వేషియు నా నిలింపగణముం బౌలోమియున్ మెచ్చదై
త్యులరాజ్యంబు హరింతు నింద్రునికి నిత్తున్ దుఃఖ మిం కేటికిన్

అదితీ! దానవుల నిప్పుడు బలప్రయోగముచే చంపవలను పడదు. వినయముతోను, ఉపాయముచేతను మాత్రమే వారిని సాధింపవచ్చును. కావుననీవు అలజడి చెందవలదు. నీ యొక్క నియమనిష్ఠలకు, సద్భక్తికి నేను సంతసించితిని. ఇంద్రుడు, ఇంద్రాణి, దేవగణములు మెచ్చునట్లుగా నేను దైత్యుల రాజ్యమును హరించి, ఇంద్రునకిచ్చెదను. ఇంక నీకు దుఃఖమెందులకు?

నీవు, నా రూపమును మనసులో నుంచుకొని, నీ పతిని సేవింపుము. నేను నీ గర్భమున ప్రవేశించెదను. నన్ను నీవు కరుణతోను ప్రేమతోను సాకుము.

క. ఏలింతు దివము సురలను
బాలింతు మహేంద్రయువతి భాగ్యశ్రీలన్
దూలింతు దానవుల ని
ర్మూలింతు రిపుప్రియాంగముల భూషణముల్

స్వర్గలోకమును మఱల దేవతలచే నేలించెదను. ఇంద్రాణి తిరిగి పూర్వపు సిరిసౌభాగ్యములు పొందునట్లు చేసెదను, దానవుల అంగములను, భూషణములను తొలగించి, వారిని నిర్మూలింతును అని చెప్పి, ఆ భక్తజన పరతంత్రుడైన పురుషోత్తముడు నిష్క్రమించెను. కృతకృత్యయైన దేవమాత మిక్కిలి సంతోషముతో పతిని సేవించుచుండెను. అప్పుడొక నాడు కశ్యపుడు ఘనసమాధినందుండగ శ్రీహరి అంశమతనియందు ప్రవేశించెను. అతడు తన వీర్యమును అదితి యందుంచెను. కశ్యపుని తపశ్శక్తిచే నిండిన ఆ వీర్యము అదితి గర్భమున దినదిన ప్రవర్ధమానమై నెలలు నిండవచ్చెను. జగములను తన కడుపున నిడుకొన్న జగన్నాథుడు, దేవమాత కడుపున నిముడుకొని బిడ్డడై పెరిగెను. అదితికి గర్భము దుర్భరమయ్యెను. అంగన లామెకు శుభమగుటకు విభూతిని నుదుటపెట్టిరి, గర్భమునకు రక్షను కట్టిరి.

అంతట చతుర్ముఖ బ్రహ్మ వచ్చి అదితి గర్భస్థుడైయున్న విశ్వగర్భునిట్లు స్తుతించెను.

సీ. త్రిభువనజయరూఢ దేవ త్రివిక్రమ పృథులాత్మ శిపివిష్ట పృశ్నిగర్భ
ప్రీతత్రినాభ త్రిపృష్ఠ జగంబుల కాద్యంతమధ్యంబు లరయ నీవ
జంగమస్థావరజననాది హేతువు నీవ కాలంబవై నిఖిల మాత్మ
లోపల ధరియింతు లోనిజంతులనెల్ల స్రోతంబులోఁ గొని సుందరతను

తే. బ్రహ్మలకు నెల్ల సంభవభవన మీవ
దివమునకుఁ బాసి దుర్దశ దిక్కు లేక

శోకవార్ధి మునింగిన సురల కెల్లఁ
దేల నాధారమగుచున్న తెప్ప వీవ

ఓ దేవా! త్రివిక్రమా, శిపివిష్ఠ, పృశ్నిగర్భ, ప్రీతత్రినాభా! త్రిపృష్ఠ, త్రిభువనరూపా, సర్వవ్యాపీ, జగములకు నీవే ఆది మధ్యాంతములైన వాడా! స్థావర జంగమాదుల జన్మహేతువు నీవె, నీవె కాలమువై సర్వమును నీలోనే ధరింతువు. సర్వజీవులను లయమప్పుడు నీలోనికే తీసుకొను సుందరుడవు, బ్రహ్మలందరికి నీధామమె జన్మస్థలము, స్వర్గలోకమును పోగొట్టుకొని, దుర్దశలో, దిక్కుమాలిన వారై శోకసముద్రమున మునిగియున్న దేవతలకు తెప్పవంటి ఆధారమువు నీవు.

అదితిగర్భమునుండి శీఘ్రమే వెలువడి విచ్చేయుము మహాత్మా! చాలకాలమునుండి స్వేచ్ఛను పోగొట్టుకున్న దేవతలకు ఆనందమునందింప వలెను ప్రభూ! అని యిట్లు బ్రహ్మదేవుడు ప్రార్థింపగా:

మ. రవి మధ్యాహ్నమునం జరింప గ్రహతారాచంద్రభద్రస్థితిన్
శ్రవణద్వాదశినాఁడు శ్రోణ నభిజిత్సంజ్ఞాతలగ్నంబునన్
భువనాధీశుఁడు పుట్టె వామనగతిం బుణ్యావ్రతోపేతకున్
దివిజాధీశ్వరుమాతకుం బరమపాతివ్రత్యవిఖ్యాతకున్

శ్రావణ ద్వాదశీ అభిజిత్ నక్షత్ర శుభలగ్నమందు, గ్రహతార చంద్ర స్థితులు శుభప్రదముగ నుండగా, మధ్యాహ్న సమయమున జగదీశ్వరుడైన శ్రీహరి పుణ్యావ్రతోపేతయు, పరమ పతివ్రతయు, దేవేంద్రాదుల మాతయైన అదితికి వామనరూపుడై యుదయించెను. మఱియు, నా దేవుడు శంఖచక్ర గదాపద్మ ధారియైన చతుర్భుజుడును, మకరకుండల, కనక కంకణ, కౌస్తుభ, నూపుర, వనమాలా లంకృతుడును, సకలజన మనోహరుండును అయి, యవతరించెను.

శా. చింతం బాసిరి యక్షతార్క్ష్యసుమనస్సిద్ధోరగాధీశ్వరుల్
సంతోషించిరి సాధ్యచారణమునీశబ్రహ్మవిద్యాధరుల్
గాంతింజెందిరి భానుచంద్రములు రంగద్గీతవాద్యంబులన్
గంతుల్ వైచిరి మింటఁ గింపురుషులున్ గంధర్వులుం గిన్నరుల్

శ్రీహరి యవతరించిన కారణముచే యక్షులు, తార్క్ష్యులు, సిద్ధులు, సుమనులు, సర్పరాజములు చింతను పోగొట్టుకొనిరి, సాధ్యులు, చారణులు, మునులు, బ్రహ్మవేత్తలు, విద్యాధరులు సంతోషించిరి, సూర్యచంద్రులధిక కాంతితో ప్రకాశించిరి, కింపురుషులు, గంధర్వులు కిన్నరులు, వినువీధులలో నృత్యగీత వాద్యములతో గంతులువేసిరి.

దిక్కులలో మబ్బులు విరిసెను; సముద్రములు నిర్మలత నొందెను. ధరణి వాస్తవముగ నిలకడ పొందెను. తారల గమనము బ్రాహ్మణులకు అనుకూలమయ్యెను.

పుష్పవృష్టులు వెల్లువలై కురిసెను; గాలులు పుష్పమధువులను తుంపరలుగ జల్లులు కురిపించెను, పుష్పపరాగములతో భూమి నిండిపోయెను.

అంతట, ఈ మహానుభావుడింతకాలము నా ఉదరములో నెట్లు ఇమిడి యుండగలిగెనో కదా యని యాశ్చర్యపోవుచుండగ, కశ్యపుడు ఆనందాతి శయముతో జయజయధ్వనులు చేయుచు స్తుతించుచుండగ, ఆ యద్భుత ప్రభువు తన సాయుధ, అలంకృత రూపమును విడిచి, మాయావటునిగ మారి, ఉపనయన వయస్కునిగ కనిపించుచు, తల్లిచెంత బాలాలాపనలాడుచు, క్రీడించుచుండ, నా తల్లి పరవశించి పోయి యిట్లనెను:

ఆ. నన్నుఁ గన్న తండ్రి నాపాలిదైవమ
నా తపఃఫలంబ నా కుమార
నాదు చిన్నవడుగ నా కులదీపక
రాఁగదయ్య భాగ్య రాశివగుచు

నాయనా! నన్ను గన్నతండ్రీ, నా పాలిదైవమా, నా తపఃఫలమా, నాకుమారా, నా చిన్నివడుగ (ఉపనయన యోగ్యుడు), నా కులదీపకా! నీవు నా భాగ్యరాశివి గదయ్యా! రావయ్యా, రమ్ము.

క. అన్నా రమ్మని దగ్గఱఁ
జన్నులపాలేఁటువాఱ సంశ్లేషిణియై
చిన్నారి మొగము నివురుచుఁ
గన్నారం జూచెఁ గన్న కడుపై యుంటన్

నాయనా! రమ్మని దగ్గరగా చేర్చుకొని, చన్నులనుండి పాలు ఏఱులై ప్రవహింపగ, బాలుని కౌగలించుకొని, చిన్నారి మోమును నివురుచు, కన్న కడుపగుటచేత బాలుని కన్నారజూచి, ఆ తల్లి ఆనందించెను.

అప్పుడు మహర్షులు వచ్చి ఆ బాలునకు సముచితమైన ఉపనయన కర్మలను చేయించిరి. సూర్యుడు సావిత్రి నుపదేశించెను. బృహస్పతి యజ్ఞోపవీతమును, కశ్యపుడు దర్భలమొలత్రాడును, అదితి కౌపీనమును, భూదేవి జింక చర్మమును, చంద్రుడు దండమును, గగనదేవత ఛత్రమును, బ్రహ్మ కమండలమును, సరస్వతి అక్షమాలికను, సప్తఋషులు కుశపవిత్రములునుఇచ్చిరి. కుబేరుడు అక్షయం అని చెప్పి భిక్షాపాత్రనివ్వగా, భవాని పూర్ణభిక్షను ఇచ్చెను. అని శుకుడు చెప్పెను. శుద్ధబ్రహ్మర్షులు విహితమంత్ర రాజములను చదువగా, పురాతనాచారము ప్రకారము వటుడు అగ్నులను వ్రేల్చెను.

ఇట్లు ఉపనయన కర్మను చూడవచ్చిన దేశదేశాంతరాగత బ్రాహ్మణులను చూచి వామను డిట్లడిగెను:

క. వత్తురె విప్రులు వేఁడఁగ
స్నిత్తురె దాతలును వేడ్క నిష్టార్థములం
దెత్తురె మీరును సంపద
లిత్తెఱఁగున దానవీరుఁడెవ్వఁడొ సెపుఁడా

ఓ బ్రాహ్మణోత్తములారా! దానముల నడుగుటకు బ్రాహ్మణులు వచ్చుచుందురా? అడిగినంతనె సంతోషముగ నిష్టార్థములను (కోరబడినవి) యిచ్చు దాతలున్నారా? మీరుకూడ నీవిధముగ దానములను స్వీకరించి తెచ్చుచుందురా? అట్టి దానముల నిచ్చే దానవీరుడెవ్వడున్నాడో నాకు చెప్పుడు.

అనిన వివిధ దేశీయులైన బ్రాహ్మణు లిట్లనిరి:

మ. కలరున్ దాతలు నిత్తురున్ ధనములుం గామ్యార్థముల్ గొంచు వి
ప్రులు నేతెంతురు గాని యీవిని బలిం బోలన్ వదాన్యుండు లేఁ

డలఘుండై యొనరించె నధ్వరశతం బా భార్గవానుజ్ఞచే
బలి వేఁడం బడయంగవచ్చు బహుసంపల్లాభముల్ వామనా

ఓ వామనమూర్తీ! దాతలనేకులు గలరు. వారు ధనములను కామ్యార్థములను (కోరికలను) విరివిగానే ఇత్తురు. వాటిని స్వీకరించి విప్రులనేకులు కొనివచ్చుచుందురు. కాని యీవినిగురించి (దానశీలత) చెప్పవలెనన్న బలిచక్రవర్తికి సమమగు వదాన్యుడు (దాత) ఎవ్వడును లేడు. ఘనతవహించిన యతడు గురువైన భార్గవుని యనుజ్ఞతో, శతాధికముగ యజ్ఞయాగాదులను చేయించెను. ఆ బలిని వేడినచో బహుసంపద లాభములను పొందవచ్చునయ్యా!

అని చెప్పిన బ్రాహ్మణుల వాక్కులను విని, లోకములకు ప్రీతికలిగించుటకై పెద్దల ఆశీర్వచనములను పొంది, తల్లిదండ్రుల వద్ద శెలవు తీసుకొని, శుభముహూర్తమున బయలుదేరి, క్షీణించిన దేవరాజును రక్షింప సంకల్పించిన శ్రీహరి, యాచకుడై బలి యింటికి భిక్షాటనము చేయ పయనించెను.

క. హరిహరి సిరి యురమునఁగల
హరి హరిహయుకొఱకు దనుజు నడుగన్‌జనియెన్
బరహితరతమతియుతులగు
దొరలకు నడుగుటయు నొడలితొడవగుఁ బుడమిన్

హరిహరీ! (అయ్యోపాపం, ఎంతవింత!) సాక్షాత్తు సిరుల తల్లియైన లక్ష్మీదేవియే తన వక్షమున వసించుచుండ శ్రీహరి, హరిహయుని (ఇంద్రుని) కొఱకు, నింద్రశత్రువైన దానవుని కడకు యాచించుటకు వెడలెను. పరహితము చేయుటయందే ఆనందించు దొడ్డప్రభువులకు ఈవిధముగ నడుగుటయును ఒక అలంకారమే కదా!

సర్వలోకముల భారమును మోయువాడు గనుక, అతడు వేయు వడివడి యడుగుల తాకిడికి పృథివి క్రుంగెను, ఆదిశేషువు ఒరిగిపోయెను.

అట్లు పోయి పోయి యమదండమునుండి తప్పించునట్టిదియు, అతిజటిలమైన ముక్తికాంత మనసులోని మర్మమును (ముక్తిమార్గమును)

తెలియజేయునదియు, సంతోషమునిచ్చునదియు, నగు నర్మదానదిని త్రోవలో నాతడు దాటెను.

సూర్యునివలె మెఱయుచున్న ఆవటుడు నర్మదానదిని దాటి ఉత్తరతటమున ఆహుతులైన అనేకమంది ఉద్దండులైన మునీశ్వరులను, సిద్ధుల సమూహములను, అనేక గజ తురగ సైన్య సమూహములను, బాగుగ పైకెగురు పొగచే కప్పబడిన సూర్యునివలె కన్పడు గుఱ్ఱములతో నున్న రథములను చూచెను. బలిదైత్యుడు చేయు యజ్ఞవాటికను దాటి దానవేంద్రుని దరిజేరునప్పుడు, అతనిని జూచి,

శా. శంభుండో హరియో పయోజభవుఁడో చండాంశుడో వహ్నియో
దంభాకారత వచ్చెఁగాక ధరణిన్ ధాత్రీసురుం డెవ్వఁడీ
శుంభద్యోతనుఁడీ మనోజ్ఞతనుఁ డంచున్ విస్మయభ్రాంతులై
సంభాషించిరి బ్రహ్మచారిఁగని తత్సభ్యుల్ రహస్యంబుగన్

ఇతడెవ్వడు? శివుడో, విష్ణువో, బ్రహ్మయో, సూర్యుడో, అగ్నియో, మారువేషమున వచ్చియుండునా! ఏమో! లేనిచో నీ ప్రపంచమున ఇంతటి తేజోమయుడు, సుందర శరీరుడైన బ్రాహ్మణుడెక్కడ నున్నాడు? అని తలచుచు, ఆ బ్రహ్మచారిని చూచి అచ్చటి సభాసదు లాశ్చర్యభ్రాంతులై తమలో తాము గుసగుసలాడుకొనిరి. ఈ పొట్టివడుగు బాలుని చూచి, ఆ సభాస్థలిలోని ప్రజలందరు గుసగుసలాడుకొనుచు, కొందరు గజిబిజిపడుచు, కొందరు కలకలపడుచు నుండిరి.

అప్పుడు వామనుడు:

సీ. చవులుగాఁ జెవులకు సామగానంబులు సదివెడు హోతలచదువు వినుచు
మంత్రతంత్రార్థసంబంధభావములు గొనియాడు యాజులు గూడికొనుచు
హోమకుండంబులందున్న త్రేతాగ్నుల వెలిఁగించు యాజకవితతిఁ గనుచు
దక్షులై బహువిధాధ్వరవిధానంబులు సెప్పెడు సభ్యులఁ జేరఁ జనుచు

తే. బెట్టు గోరెడు వేడుక పట్టుపఱుప
నదితిపుట్టువు లచ్చికి నాటపట్టు
గోరి చరియించె సభలోనఁ గొంతదడవు
పుట్టు వెన్నఁడు నెఱుఁగని పొట్టివడుగు

చెవులకు చవులు పుట్టునట్లుగా సామగానములను చదివెడి హోతల చదువు వినును, వేదములందలి మంత్రతంత్రముల అర్థతాత్పర్యభావములను విశ్లేషించు యాజులతో గూడును, హోమకుండములందలి త్రేతాగ్నులను వెలిగించు యాజకబృందమును జూచును, సర్వసమర్థులైన అధ్వర్యులు చెప్పెడి విధివిధానముల నాలకించును ఈ లక్ష్మీదేవి ఆటపట్టును, అదితియొక్క బిడ్డడును అయిన వామనుడు ఋత్విక్కులతో వేడుకగ వాదించి, వారిని ఓడించి, విజయగౌరవమును కోరును. పుట్టుకయేలేని పురుషోత్తముడైన యీ పొట్టివడుగు ఈ విధముగ యజ్ఞ సభాస్థలిలో కొంతసమయము చరించి,

క. వెడవెడ నడకలు నడచుచు
నెడనెడ నడు గిడఁగ నదరి యిల దిగఁబడఁగా
బుడిబుడి నొడువులు నొడువుచుఁ
జిడిముడి తడఁబడఁగ వడుగు సేరెన్ రాజున్

మందమందమైన నడకలు నడచుచు, అప్పుడప్పుడు ఆగిపోవుచు, ఆగినచోట్ల భూమి దిగబడుచుండ, చిన్నచిన్న దాటులు దాటుచు, తడబడు అడుగులతో వడుగు రాజు కడకు జేరి, యిట్లనెను.

మ. ఇతఁడే దానవచక్రవర్తి సురలో కేంద్రాగ్ని కాలాదిది
క్పతిగర్వాపనయప్రవర్తి గతలోభస్ఫూర్తి నానామఖ
వ్రతదానప్రవణానువర్తి సుమనోరామామనోభేదనో
ద్ధతచంద్రాతపకీర్తి సత్యకరుణాధర్మోల్లసన్మూర్తి దాన్

ఓహో! ఇతడేనా ఆ దానవచక్రవర్తి, యెవడైతే ఆ దేవేంద్ర, అగ్ని, యమాది దిక్పాలకుల గర్వమును తొలగించిన ధీరుడు? ఇతడేనా లోభమును, కోరికను పారద్రోలిన వీరుడు? ఇతడేనా అనేకమైన యజ్ఞయాగ వ్రతదానాది

సత్కర్మలను జేయు పుణ్యమూర్తి? ఇతడేనా దేవతాసతుల మానససాగరములో కల్లోలమును (వైధవ్య భయమును) కల్గించు శూరుడు? ఇతడే నా సత్యము, దయ, ధర్మములతో విలసిల్లే సజ్జనమూర్తి? యని, కుశదర్భ, పవిత్రములు, అక్షతలు పట్టుకున్న దక్షిణహస్తము చాచి, ఆశీర్వదించుచు నిట్లనియె:

ఉ. స్వస్తి జగత్రయీభువనశాసనకర్తకు హోసమాత్రవి
ధ్వస్తనిలింపభర్తకు నుదారపదవ్యవహర్తకున్ మునీం
ద్రస్తుతమంగళాధ్వరవిధానవిహర్తకు నిర్జరీగళ
న్యస్తసువర్ణ సూత్రపరిహర్తకు దానవలోకభర్తకున్

ముల్లోకములను శాసించు దానవచక్రవర్తికి స్వస్తి (శుభమగుగాక!) దేవేంద్రుని అవలీలగ నణగద్రొక్కి మహోన్నత పదవి నలంకరించి నిర్వహించు వానికి స్వస్తి! మునీంద్రులచే స్తుతింపబడి మంగళకరమగు యాగములను జరిపించువానికి స్వస్తి! దేవతా సతుల మంగళసూత్రములను పోగొట్టువానికి స్వస్తి! అని దీవించి, మూర్తీభవించిన వేదరాశివలెను, దండము, ఛత్రము, కమండలము, భిక్షాపాత్రలను ధరించినవాడై, మనోహర చంద్రవదనుడై యున్న ఆ మాయావటుని జూచి పురోహితులైన భృగువులు తమ ఆసనములనుంచి లేచి నిల్చొని సేమంబడిగి ప్రియవచనములతో నాదరించిరి. బలిచక్రవర్తియు, నమస్కరించి తగిన ఆసనమిచ్చి, భార్య బంగరు కలశతో జలము పోయ పాదములను కడిగి తడియొత్తి, పాదజలమును శిరస్సున చల్లుకొనెను. మఱియు నిట్లనెను:

మ. వడుగా యెవ్వరివాఁడ వెవ్వఁడవు సంవాసస్థలం బెయ్యది
య్యెడకున్ నీ వరుదెంచుటన్ సఫలమయ్యెన్ వంశమున్ జన్మముం
గడు ధన్యాత్ముఁడనైతి నీ మఖము యోగ్యంబయ్యె నాకోరికల్
గడతేఱెన్ సుహుతంబులయ్యె శిఖులుం గల్యాణ మిక్కాలమున్

ఓ బ్రాహ్మణకుమారా! నీకు స్వాగతము. నీ వెవ్వరివాడవు? నీ వెవ్వడవు? నీ నివాస స్థలమేది? నీ విచ్చటికి వచ్చుటచే నా జన్మము, వంశము సఫలత చెందినవి. మేము ధన్యులమైతిమి. నీ రాకచే ఈ యజ్ఞము పవిత్రమైనది. నా

కోరికలు ఈడేరినవి. అగ్నులు బాగుగ వ్రేల్వబడినవి. ఈ సమయము మిక్కిలి మంగళకరమైనది.

మ. వరచేలంబులొ మాడలో ఫలములో వన్యంబులో గోవులో
హరులో రత్నములో రథంబులొ విమృష్టాన్నంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో భూములో
ధరణీఖండమొకాక యే మడిగెదో ధాత్రీసురేంద్రోత్తమా

ఓ భూసురోత్తమా! నీకేమి కావలయును? మేలైన పట్టువస్త్రములా? సువర్ణ ముద్రలా? ఫలములు వనసంపదలా? గోవులు, గుఱ్ఱములు, రథములా, రత్నములా? మృష్టాన్న భోజనములా? గృహములు, భూములు, రాజ్యములా? యేనుగులా? కన్యలా? లేదా నీవేమి కోరినను దానిని నేనిచ్చెదను.

అని, ధర్మయుక్తముగ పలికిన బలిచక్రవర్తి మాటలకు శ్రీహరి సంతసించి యిట్లనెను: దానవేంద్రా!

సీ. ఇది నాకు నెలవని యేరీతిఁ బలుకుదు నొకచో టనక నిండియునేర్తు
నెవ్వనివాఁడ నం చేమని పలుకుదు నాయంతవాఁడనై నడవనేర్తు
నీ నడవడి యని యెట్లు వక్కాణింతుఁ బూని ముప్పోకలఁ బోవనేర్తు
నది నేర్తునిది నేర్తునని యేల చెప్పంగ నేరుపులన్నియు నేన నేర్తు

ఆ. నొరులు గారు నాకు నొరులకు నేనౌదు
నొంటివాఁడఁ జుట్ట మొకఁడు లేడు
సిరియుఁ దొల్లి గలదు చెప్పెద నాటెంకి
సుజనులందుఁదఱచు సొచ్చియుందు

దానవేంద్రా! "ఇది" నా చోటని నేనెట్లు చెప్పగలను, ఒక్కచోటనక నేనంతటను నిండియుందును. ఎవ్వనికి చెందినవాడనని నేనెట్లు చెప్పగలను, నాకు చెందిన వాడనై నేను మెలగుచుందును. "ఇది" నా నడవడి యని (సంచరించుతావు అని) నేనెట్లు చెప్పగలను, కోరి మూడు పోకడల పోవంగలను (ముల్లోకముల లోను సంచరింపగలను (లేదా) జాగ్రత్స్వప్న సుషుప్తి యను

మూడు అవస్థలలోనుండు వాడను). "అది" నేర్చుకొంటిని "ఇది" నేర్చుకొంటినని చెప్పనేల అన్నివిద్యలను నేనే నేర్చుకొంటిని. ఎవ్వరును నాకు పరులుకారు, అందరికి నే నాత్మీయుడను (లేదా, అజ్ఞానముచే నితరులు నన్ను కాదనినను, నేనందరివాడ నౌదును) నేనొంటరివాడను. నాకు చుట్టమొక్కడును లేడు. (నేనే ఉన్నాను - అద్వితీయుడను - ఇతర మంతయు లేనిది. నాకెవ్వరియందును సంగములేదు). ఒకప్పుడు నాకు "సిరి" యుండెను. (ఇప్పుడు శ్రీదేవి నావద్దను లేదు). నా యొక్క నివాసస్థానము చెప్పెదను వినుము - నేనెల్లప్పుడును సజ్జనుల మధ్యనుందును. (ఉత్తముల హృదయమందు లేదా సజ్జన సత్సంగములయందు ఉందును). అది యట్లుండనిమ్ము -

దానవరాజా! నీ మాట సత్యము సుమా. ధర్మయుతమైనట్టిది, మీవంశమునకు తగియున్నట్టిది, కీర్తిప్రదమైనట్టిది. మీ వంశమందు, కరుణ సత్యగుణములేనివారు కలుగలేదు. యుద్ధము చేయుటకుగాని, దానమిచ్చుటకు గాని, వెనుదీయువారులేరు. దానము తీసుకొన్నవారు పొగడునప్పుడు మీ ప్రత్యర్థులు అతిశయించి తమదానశీలతను కోడివలె ప్రచారము చేసి తృప్తి చెందెదరు. కాని మీ వారట్లు చేయరు. మీ తాతలందరు గొప్ప పురుషులు. మీ వంశములో ప్రకాశించు మీ తాతగారైన ప్రహ్లాదుడు, ఆకాశముననుండు చంద్రునివలె కాంతులీనుచుండెను. ప్రసిద్ధమైన కీర్తితో మీ వంశము అతిశయించుచుండెను.

తొల్లి మీ ముత్తాతయైన హిరణ్యాక్షుడు విశ్వవిజయముచేసి, భూతలమున తనతో గదాయుద్ధము చేయుటకు సరియైన ప్రతివీరుని గానక పాతాళమున సంచరింపుచుండగ విష్ణువు వరాహరూపమున అతనితోపోరి హతమార్చెను. ఆ కారణమున అతని అన్నయైన హిరణ్యకశిపుడు హరిపై శత్రుత్వము వహించి హరిని అంతముచేయ నుద్దేశించి హరి సదనమునకు పోయెను. శూలమును ధరించి కాలునివలె వచ్చుచున్న దనుజుని గాంచి హరి యిట్లు తలచె :-ఈ రాక్షసునితో ఎదురువెళ్లి పోరి, జయింప సాధ్యపడదు. ఇంకెక్కడికి పోయినను మృత్యువువలె వెంటపడును, అని భావించి సూక్ష్మరూపమును ధరించి దైత్యుని

నిశ్వాస మార్గమున నతని హృదయములో ప్రవేశించెను. అప్పుడా దైత్యనాథుడు హరి గృహముజొచ్చి వెదకి వెదకి హరిని గానక, మిన్ను మన్ను గాలించి, మూడు లోకములు చూచి, దిశలందు జూచి, సముద్రములు, వనములు, పాతాళ లోకములను పరిశోధించి, హరిని యెందును గానక, అన్వేషణ చాలించి, యిట్లు తలంచెను. నా శత్రువైన ఆ హరి, చనిపోయి యుండవచ్చును. లేనిచో నే వెదకిన చోట్ల యందెక్కడైనను కనబడియుండును. చనిపోయిన వారితో పగపెంచుకొనరాదు గావున ఇక నన్వేషింపనేల? యని విరమించెను. అతడు మీ ముత్తాతకదా! అతనికి చాలా మంచి గుణములుండెను.

దానవరాజా! అది యట్లుండనిమ్ము. నీ తండ్రి వైరోచనుడు మాత్రము సామాన్యుడా! పురుహూతాదులు వేడినంతనె, తన ఆయువు నిచ్చివేయలేదా? నీవు మాత్రమీ లోకమున నీ తండ్రికేమాత్రము తీసిపోనివాడవు కదా! మూడు జగముల నేలినవాడవు, ఇంద్రాదులను పారద్రోలితివి. ఈ రాక్షసులను సంరక్షింపగలిగినవాడవు. ఇక దానగుణములో నీ పూర్వుల పోలియున్నవాడవు. అదీకాక,

క. రాజ్యంబు గలిగెనేనియుఁ
బూజ్యులకును యాచకులకు భూమిసురులకున్
భాజ్యముగ బ్రదుకడేనియు
ద్యాజ్యంబులు వానిజన్మధనగేహంబుల్

దానవేశ్వరా! రాజ్యము (ఐశ్వర్యము) కలిగినచో పూజ్యులకు, బీదలకు, బ్రాహ్మణులకు కొంత భాగమివ్వకుండ అంతయు తానే యనుభవించువాని జన్మయు ధనమును, గృహములన్నియును నిరర్థకములే (ఉంచుకోదగినవి కావు). దానములు కోరువారు, చిరకాలము నుండి, దానములకొఱకు పీడించుచు, త్రిభువనేశ్వరుడవైన నిన్నే దాతలలో అగ్రగణ్యునిగా నెన్నుకొందురు. అయినను, నాకేమి కావలయును?

ఆ. ఒంటివాఁడ నాకు నొకటి రెండడుగుల
మేర యిమ్ము సొమ్ము మేర యొల్ల

గోర్కి దీర బ్రహ్మకూఁకటి ముట్టెద
దానకుతుకసాంద్ర దానవేంద్ర

ఓ దానవేంద్రా! నీవు ఘనమైన దాన కాంక్షగలవాడవు. నే నొంటరివాడను. (ఎట్టి గృహస్థావరములు లేనివాడను). నా కొకటి రెండడుగుల చోటు నిమ్ము. ధనము, గౌరవము వంటివేవియు నాకు వలదు. నేకోరిన చోటు నిచ్చినచో, నేను బ్రహ్మ శిఖరమునే పొందినట్లానందించెదను. (అత్యున్నత పదమును పొందినట్లు భావించెదను) అనిన యా దివ్యయాచకునకు దొడ్డ దాత యిట్లనెను:

ఓ విప్రబాలకా! నీవు చెప్పిన మాటలన్నీ సత్యములే, పెద్దలు సమ్మతించు నట్టివే, అయినను, నాయనా! నీవు అడిగి అడిగి ఇంత స్వల్పమైనది అడిగితి వేమిటి? దాతయొక్క గొప్పతనము, దానశీలతయైన ఆలోచింపవలెను కదా!

మ. వసుధాఖండము వేఁడితో గజములన్ వాంఛించితో వాజులన్
వెస నూహించితో కోరితో యువతులన్ వీక్షించి కాంక్షించితో
పసిబాలుండవు నేర వీ వడుగ నీ భాగ్యంబు లీపాటిగా
కసురేంద్రుండు పదత్రయం బడుగ నీ యల్పంబు నీ నేర్చునే

బ్రాహ్మణకుమారా! నీవు పసిబాలుడవు. పాపం, అడగడమైనా రాదు. నీవు, రాజ్యభాగమైన అడుగుము, ఏనుగులనైన కోరుకొనుము. గుఱ్ఱములనైన కోరుకొనుము లేదా అందకత్తెలనైన ఎంచుకొని కోరుకొనుము. నీ భాగ్యము ఈ పాటిదేయని, నీవు ఈ స్వల్పమే కోరుకొంటివని, ఈ యసురేంద్రుడు ఈ కొద్దిపాటి దానము నిచ్చి తృప్తి జెందునా?

అనిన ఆ రాజుతో మేధావి బాలుడిట్లనెను :

మ. గొడుగో జన్నిదమో కమండలువొ నాకున్ ముంజియో దండమో
వడు గే నెక్కడ భూము లెక్కడ కరుల్ వామాక్షు లశ్వంబు లె
క్కడ నిత్యోచితకర్మ మెక్కడ మదాకాంక్షామితంబైన మూఁ
డడుగుల్ మేరయ త్రోవ కిచ్చుటయె బ్రహ్మాండంబు నాపాలికిన్

దానవరాజా! బ్రహ్మచారినైన నేనెక్కడ, భూములు, ఏనుగులు, అశ్వములు, అందాలభామలు, అలాంటి వన్నీ ఎక్కడ? వానితో నాకేమి పని? గొడుగో, జంధ్యమో, కమండలమో, దర్భల మొలత్రాడో, దండమో, యిలాంటివే నా నిత్యకర్మలకు పనికి వచ్చునవి. (ఇవికూడను నా వద్ద నున్నవిగాన, నాకు వలదు). నేను కోరిన మూడడుగుల మేర నిచ్చిన నా పాలికదియే బ్రహ్మాండము. అదియును గాక,

క. వ్యాప్తిం బొందక వగవక
ప్రాప్తం బగులేశమైనఁ బదివే లనుచుం
దృప్తిం జెందనిమనుజుఁడు
సప్తద్వీపముల నయినఁ జక్కంబడునే

ఏదైనను లభించినదని అతిశయింపక, స్వల్పమని కించపడక, లభించినదెంత తక్కువదైనను అదియే పదివేలని తృప్తిజెందని మనుజుడు, సప్తద్వీపములలో నెక్కడికి పోయినను బాగుపడునా?

శా. ఆశాపాశము దాఁ గడున్ నిడుపులే దంతంబు రాజేంద్ర వా
రాశిప్రావృత మేదినీవలయసామ్రాజ్యంబు సేకూడియుం
గాసిం బొందిరిగాక వైన్యగయభూకాంతాదులు న్నర్థకా
మాశం బాయఁగ నేర్చిరే మును నిజాశాంతంబులం జూచిరే

దానవేశ్వరా! ఆశాపాశము మిక్కిలి పొడుగైనది. దాని కంతమేలేదు. సముద్రముచే చుట్టబడిన భూమండలమంతయు తమదే యైయున్నను కొందరు భూమీశులు ఈ ఆశాపాశముచే కట్టబడినవారై వ్యర్థమైన యాతనలనే పొందిరిగాని, తమ యొక్క అర్థకామముల యందాశను తొలగించుకొన గల్గిరా? మఱి తమ ఆశయొక్క అంతమును చూడగల్గిరా?

సీ. సంతుష్టుఁ డీ మూఁడుజగములఁ బూజ్యుండు సంతోషి కెప్పుడు జరుగు సుఖము
సంతోషి గాకుంట సంసారహేతువు సంతసంబున ముక్తిసతియు దొరకుఁ
బూఁటపూఁటకు జగంబుల యదృచ్ఛాలాభతుష్టిని దేజంబు తోన పెరుఁగుఁ
బరితోషహీనతఁ బ్రభ సెడిపోవును జలధార ననలంబు సమయునట్లు

ఆ. నీవు రాజవనుచు నిఖిలంబు నడుగుట
దగవు గాదు నాకుఁ దగిన కొలఁది
యేను వేఁడికొనిన యీ పదత్రయమును
జాలదనక యిమ్ము చాలుఁ జాలు

అందుచేత, రాజా! మనుజునకు సంతుష్టి అత్యవసరము. ఏలనన, సంతుష్టి గలవాడు ఈ మూడు జగములందు పూజ్యుడగును. అతనికెల్లప్పుడు సుఖముండును. సంతుష్టుడు కాని వానికి సంసారబంధము పెరుగును. సంతుష్టిని పెంచుకొనువానికి ముక్తి సులభసాధ్యమగును. ఎప్పటికప్పుడు ప్రయత్నము లేకుండ ఏది లభించిన, దానితోనే సంతుష్టి జెందినచో తేజస్సు, శక్తి పెరుగును. సంతుష్టి లేకపోయినచో, జలధారచే నగ్నిహోత్ర మణగిపోవునట్లు తేజస్సు క్షీణించును. నీవు రాజువును, ప్రసిద్ధమైన దాతవును, అని సకలమును అడుగుట ఉచితము కాదు. నేను కోరుకొనిన మూడడుగుల చోటును, చాలదు అనక యిమ్ము, అదియే చాలా ఎక్కువనాకు.

అని పలికిన బ్రహ్మచారికి దానవచక్రవర్తి, దానమిచ్చుటకు సిద్ధపడగా మేధావియు, రాక్షసుల గురువునైన శుక్రాచార్యుడు రాజుతో నిట్లనియె :

సీ. దనుజేంద్ర యీతఁడు ధరణీసురుఁడు గాఁడు దేవకార్యంబు సాధించుకొఱకు
హరి విష్ణుఁ డవ్యయుం డదితిగర్భంబునఁ గశ్యపసూనుఁడై కలిగె నకట
యెఱుఁగ కీతనికోర్కి నిచ్చెద నంటివి దైత్యసంతతి కుపద్రవము వచ్చు
నీ లక్ష్మిఁ దేజంబు నెలవు నైశ్వర్యంబు వంచించి యిచ్చుఁదా వాసవునకు

ఆ. మొనసి జగములెల్ల మూఁడుపాదంబుల
నఖిల కాయుఁడగుచు నాక్రమించు
సర్వధనము విష్ణు సంసర్జనము సేసి
బడుగుపగిది నెట్లు బ్రదికె దీవు

దానవేంద్రా! ఇతడు బ్రాహ్మణ బ్రహ్మచారికాడు సుమా! దేవకార్యమును సాధించుటకు వచ్చిన హరి, అవ్యయుడైన విష్ణువు, అదితి గర్భమున కశ్యపుని పుత్రునిగ జన్మించినవాడు. అయ్యో! తెలియక, నీవతనికి కోరిన దానము

నిచ్చెదనంటివి. దీనివలన దైత్యసంతతికి తీరని ఉపద్రవమొచ్చి పడును. నీయొక్క సిరిసంపదలు తేజస్సు రాజ్యము, ఐశ్వర్యము, అన్నియును, నిన్ను వంచించి ఇతడా యింద్రుని కిచ్చివేయును. ఇతడు సామాన్యుడు కాడు. మూడు పాదములలో, విరాట్ రూపము ధరించి, అన్ని జగముల నాక్రమించగలడు. నీకున్న సర్వసంపదలను ఇతనికి దానముచేసి, శక్తిహీనుడవై నీవెట్లు బ్రతుకగలవు?

క. ఒక్కపదంబున భూమియు
నొక్కటఁ ద్రిదివంబుఁ ద్రొక్కి యున్నతమూర్తిన్
దిక్కులు గగనముఁ దానై
వెక్కసమైయున్న నెందు వెడలెదు చెపుమా

ఒక్కపాదముతో భూమిని, ఇంకొక్క పాదముతో మూడు ఊర్ధ్వలోకములను త్రొక్కి మహోన్నతమూర్తిగా నెదిగి, దిక్కులు, ఆకాశము అంతయు తానేయై ఆశ్చర్యకరముగ నాక్రమించినచో, నీవెట్లు బయటపడగలవో చెప్పుము.

సీ. ఇచ్చెదనని పల్కి యీకున్న నరకంబు ద్రోవ నీవును సమర్థుఁడవె దేవ
యే దానమున నాశ మే తెంచు నదియును దానంబుగా దండ్రు తత్త్వవిదులు
దానంబు యజ్ఞంబుఁ దపము గర్మంబులు దా విత్తవంతుఁడై తలఁపవలయుఁ
దనయింటఁ గల సర్వధనమును నైదుభాగములుగా విభజించి కామమునకు

ఆ. నర్థమునకు ధర్మయశముల కాశ్రిత
బృందములకు సమతఁ బెట్టునట్టి
పురుషుఁ డిందు బూర్ణుఁడై మోదించుఁ
దన్ను మానిచేఁత దగవు గాదు

దానవాధీశా! (ఈ దానము నిచ్చుట మిక్కిలి హానికరము గావున ఇవ్వవద్దు). ఇచ్చెదనని చెప్పి, ఇవ్వనందున ప్రాప్తమగు నరకమును తిరస్కరించుటకు నీవు సమర్థుడవే. ఏ దానము వలన నాశనము సంభవించునో యది దానము కాదని తత్త్వవిదులు చెప్పెదరు. దానము, యజ్ఞము, తపము,

కర్మములు, తాను ధనవంతుడై యున్నప్పుడే చేయవలెను. తన వద్దనున్న ధనమంతటిని ఐదు భాగములు చేసి, ఒక్కొక్క భాగమును కోర్కెలను తీర్చుకొనుటకును, నర్థసంచయమునకును, ధర్మకార్యములకొఱకును, కీర్తిని సంపాదించుకొనుటకును, ఆశ్రితజనుల కొఱకు వెచ్చించుటకును, వినియోగింపవలెను. అట్లు చేయు వ్యక్తి ఇహపరములందు పరిపూర్ణుడై సుఖించును. తన్ను మాని యేమి చేసినను యది తగినపనికాదు.

ఇంతేకాదు రాజా! బహ్వృచ గీతలోనేమున్నదో తెల్పెద వినుము.

ఇచ్చుట కంగీకరించినను, అట్లిచ్చుటవలన సర్వము పోవుచో, పిదప లేదనినను అది అసత్యమవదు (అనృతముకాదు). ఇచ్చుట వలన నష్టము, లోటు, క్షీణించుట, జరుగకుండ ఇచ్చినచో, అట్టి పురుషుడు చెడకుండును. అట్లు కాక సత్యమును పాటించెద ననుచు తన ధనము నిచ్చివేసిన వాడు ఏమియు మిగులకుండ చెడిపోవును.

రాజా! ఇంకొక విషయమున్నది తెలుసుకొనుము.

ఆ. వారిజాక్షులందు వైవాహికములందుఁ
ప్రాణవిత్తమానభంగమందు
జకితగోకులాగ్రజన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము వొందఁ డధిప

స్త్రీలను ఒప్పింపవలసినప్పుడు, పరిహాసము లాడునప్పుడును, వైవాహిక వినోదవేడుకలయందు, ప్రాణాపాయ సమయమప్పుడును, ధననష్టము కలుగనున్నప్పుడును, మానభంగము (గౌరవహాని) కలుగనున్నప్పుడును, భయాతురులైన గోవులను, బ్రాహ్మణులను రక్షింపవలసి వచ్చునప్పుడును, అసత్యమాడినను పాపమంటదు. (ఇది రాక్షసులకు వర్తించు శుక్రనీతి యని కొందరి అభిప్రాయము).

మ. కులమున్ రాజ్యముఁ దేజమున్ నిలుపుమీ కుబ్జుండు విశ్వంభరుం
డలఁతిం బోఁడు త్రివిక్రమస్ఫురణవాఁడై నిండు బ్రహ్మాండముం
గలఁడే మాన్ప నొకండు నా పలుకు లాకర్ణింపు కర్ణంబులన్
వల దీ దానము గీనముం బనుపుమా వర్ణిన్ వదాన్యోత్తమా

ఓ మహారాజా! నీ యొక్క దైత్యకులమును, రాజ్యమును, తేజమును కాపాడుకొనుము. ఈ గుజ్జువాడు సామాన్యుడుకాడు. అంతసులువుగా (మూడడుగులనేలతో) విడిచిపోడు. విశ్వమంతయు నిండిపోగలవాడు. త్రివిక్రమునివలె బ్రహ్మాండ మంతయు నిండి పోగలవాడు. ఇతని నెవ్వడును ఆపలేడు. నీ చెవులార నామాటల నాలకింపుము. ఈ దానము గీనము ఇవ్వవలదు. ఈ బ్రహ్మచారిని పంపించివేయుము.

అని పలికిన గురుదేవుని మాటలు విని క్షణమాలోచించి కీర్తిమంతుడైన బలి యిట్లనెను.

సీ. నిజమానతిచ్చితి నీవు మహాత్మక మహిని గృహస్థ ధర్మంబు నిదియ
యర్థంబుఁగామంబు యశమును వృత్తియు నెయ్యది ప్రార్థింపనిత్తుననియు
నర్థలోభంబున నర్థిఁ బొమ్మనుటెట్లు పలికి లేదనుకంటెఁబాపమెద్ది
యెట్టి దుష్కర్ముని నే భరించెదఁ గాని సత్య హీనుని మోవఁ జాలననుచు

తే. బలుకదే తొల్లి భూదేవి బ్రహ్మతోడ
సమరమందడ్గు తిరుగక చచ్చుకంటె
బలికి బొంకక నిజమునఁ బరఁగుకంటె
మానధనులకు భద్రంబు మఱియుఁ గలదె

మహాత్మా! గురుదేవా! నీవు నిజమానతిచ్చితివి. ఈ భూమిపై నీవు చెప్పిన మాటలే గృహస్థులకు ఆచరణీయ ధర్మములు. కాని అర్థ కామ కీర్తి వృత్తులలో నేది కోరినను యిచ్చెదనని మాట యిచ్చి, అర్థలోభముచే నిప్పుడు అర్థిని (అడిగినవానిని) పొమ్మనుటెట్లు? ఇచ్చెదనని పలికి లేదనే కంటె ఘోరమైన పాపమేది? ఎటువంటి పాపాత్ముడైనను నేను భరించెదను గాని సత్యహీనుని మాత్రము మోయజాలనని తొల్లి భూదేవి బ్రహ్మదేవునితో చెప్పలేదా? యుద్ధమందు వెనుదిరగక చచ్చుటకంటె, మాటచెప్పి అసత్యమాడకుండ సత్యమునే పాటించుట కంటె, మానధనులకు శ్రేయస్కరమింకేదియైన నున్నదా? హాలికునకు (సేద్యము చేయువానికి) మంచి క్షేత్రము, మంచి బీజములు (విత్తనాలు) ఎట్లు మంచి పంటలనిచ్చునో అట్లే దాతకు ఈవి (దానగుణము) సత్పాత్రుడైన గ్రహీత, లభించు భాగ్యమింకేమైననున్నదా?

శా. కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే
వా రేరీ సిరి మూట గట్టికొని పోవం జాలిరే భూమిపైఁ
బేరైనం గలదే శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా

ఆచార్యదేవా, భార్గవా! ఆదినుండి యెందరెందరో రాజులు కాలేదా? ఎన్నెన్నో సామ్రాజ్యములు స్థాపింపబడలేదా? ఆ రాజ్యాధీశు లెంతెంత గర్వాహంకారములను జూపలేదా? మరి వారందరూ ఏరి? ఇప్పుడెక్కడ నున్నారు? ఈ భూమిపై వారి పేరైనను మిగిలియున్నవా? శిబిచక్రవర్తి వంటి మహాదాతలు కీర్తికాములై ప్రేమతో, అడిగినవారి కోర్కెలను తీర్చలేదా? వారిని నేటివరకు యెవ్వరైనను మఱచిపోగల్గిరా?

క. ఉడుగని క్రతువుల వ్రతములఁ
బొడగనఁ జననట్టిపొడవు పొడవునఁ గుఱుచై
యడిగెడి నఁట నను బోఁటికి
నిడరాదె మహానుభావ యిష్టార్థంబుల్

మహానుభావా! తెంపులేని వ్రతములు, క్రతువులు చేసినను, ఎవ్వని రూపమైనను గాంచవలను పడదో, అట్టి దొడ్డవాడు కుఱుచవాడై నా వంటి సామాన్యుని కడకు వచ్చి యడిగినచో నతని ఇష్టార్థమును (కోరికను) ఎందుల కివ్వరాదు?

ఆహా! ఇంకా వినుము:

శా. ఆదిన్ శ్రీసతికొప్పుపైఁ దనువుపై నంసోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపైఁ గపోలతటిపైఁ బాలిండ్లపై నూత్నమ
ర్యాదం జెందుకరంబు గ్రిందగుట మీఁదై నా కరం బుంట మేల్
గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే

గురుదేవా! మొదట శ్రీదేవియొక్క కురులను సవరించుచు, శరీరము నిమురుచు పైటచెంగును లాగుచు, పాదపద్మములను పట్టుకొనుచు, చెక్కిళ్లను స్పృశించుచు, పాలిండ్లతో (స్తనములతో) నాడుచు, నిత్యమూ

ఆరాధింపబడుచుండు, ఆ శ్రీహరి చెయ్యి నన్ను యాచించుచు, క్రింది దగుటయు, దానమిచ్చు నా చెయ్యి మీదిదగుటయు, ఆహా! ఎంతటి అదృష్టమో కదా! ఎంత శ్రేయస్కరమోకదా! ఈ రాజ్యము, గీజ్యము యేమైనా శాశ్వతమైనట్టివా యేమి? ఈ శరీరము మాత్రముపోవకుండా ఉండిపోవునా? అందుచేత,

మ. నిరయంబైన నిబంధమైన ధరణీనిర్మూలనంబైన దు
 ర్మరణంబైనఁ గులాంతమైన నిజమున్ రానిమ్ము కానిమ్ము పో
 హరుఁడైనన్ హరియైన నీరజభవుం డభ్యాగతుండైన నాఁ
 దిరుగన్ నేరదు నాదుజిహ్వ వినుమా ధీవర్య వేయేటికిన్

ధీవర్యా! నాకు నరకమే ప్రాప్తించినను, నేను బంధింపబడినను, భూమండలము నిర్మూలమైనను, నాకు దుర్మరణము సంభవించినను, కులాంతరమైనను, నిజానికేది రానున్నదో అది రానిమ్ము, ఏది జరుగనున్నదో అది జరుగనిమ్ము, ఇప్పుడభ్యాగతుడై యడుగ వచ్చినవాడు శివుడైనను, విష్ణువైనను, బ్రహ్మయైనను, యింకెవ్వడైనను, కానిమ్ముమాటయిచ్చిన నా జిహ్వ మరి వెనుకకు మరలదు. ఈ విషయమై యింక వెయ్యిమాటలేల?

ఆ. నొడివినంతవట్టు నుసలక యిచ్చుచో
 నేల కట్టు విష్ణుఁడేటిమాట
 గట్టెనేనిఁదాన కరుణించి విడుచును
 విడువ కుండనిమ్ము విమలచరిత!

ఓ విమలచరితా! అడిగినంత మేర మాటతప్పకుండ ఇచ్చినచో విష్ణువు నన్నేల బంధించును? ఒకవేళ బంధించినను అతడే కరుణించి విడిచి పెట్టును. ఒకవేళ విడిచిపెట్టకున్నను పోనీలెమ్ము.

క. మేరువుదలక్రిందైనను
 బారావారంబు లింకఁబాటిన లోలో
 ధారుణి రజమైపోయినఁ
 దారాధ్వముబద్ధమైనఁదప్పక యిత్తున్

మేరుపర్వతము తలక్రిందులైనను, సముద్రము లింకిపోయినను, భూమండలము లోలోపలనే చూర్ణమైపోయినను, మిన్నువిరిగి మీదపడినను నేనీదానము నిచ్చితీరెదను. మఱియును,

మత్తకోకిల. ఎన్నఁడుంబరు వేఁడఁబోడఁట యేకల బఁటకన్నవా
రన్నదమ్ములునైన లేరఁట యన్ని విద్యల మూలగో
ష్ఠి న్నెఱింగిన ప్రోడగుజ్జఁట చేతులొగ్గి వసింప నీ
చిన్నిపాపనిఁద్రోసిపుచ్చఁగఁజిత్త మొల్లదు సత్తమా!

గురుశ్రేష్ఠా! ఈ చిన్నపాప డెన్నడు నితరులనెవ్వరిని అడుగలేదట. ఏకాకియుట. కన్నవారుగాని అన్నదమ్ములుగాని లేరట. అన్నివిద్యల మూలసారము నెఱింగిన నేర్పరియుట, యీ గుజ్జుబాలుడు, చేతులొగ్గి యాచించిన యీ చిన్నవాని నెట్లు కాదనగలను చెప్పుము!

ఇట్లు సత్యపదమునందనురక్తుడును, దానమిచ్చుటకు మిక్కిలి వేగిర పడువాడును, నిర్మలకీర్తిచంద్రుడును, దృఢమనస్కుడును, సత్యసంధుడును, అర్థించువారి కోర్కెలను తీర్చువాడును అయిన బలిచక్రవర్తిని చూచి, శుక్రాచార్యుడు కోపించి, తన శాసనము నుల్లంఘించుట చేత పదభ్రష్టుడవు కమ్మని శపించెను. గురుశాపతప్తుడైనను, బలి సత్యమార్గమునే అనుసరించు టకు పూనుకొనెను.

ఆ. బ్రదుకవచ్చుఁగాక బహుబంధనములైన
వచ్చుఁగాక లేమి వచ్చుఁగాక
జీవధనము లైనఁజెడుఁగాక పడుఁగాక
మాటఁ దిరుగలేరు మానధనులు

అనేకమైన బంధనములచే చుట్టబడినను బ్రతుకవచ్చును. సంపదలన్నీ పోయి, లేమివచ్చినను బ్రతుకవచ్చును. ధనము నష్టమైనను అగుగాక, జీవనము కష్టములపాలైనను అగుగాక! మానధనులు మాత్రము ఇచ్చిన మాటను తప్పలేరు.

దానవచక్రవర్తి యొక్క రాణి, వింధ్యావళి, భర్త భావము తెలుసుకొని, బ్రహ్మచారి కాళ్లుగడుగుటకు బంగరు కలశముతో జలముతెచ్చెను. అప్పుడు బలి, ఆ కపట వటువుతోనిట్లనెను.

క. రమ్మా మాణవకోత్తమ!
లెమ్మా నీ వాంఛితంబు లేదన కిత్తుం
దెమ్మా యడుగుల నిటు రా
నిమ్మా కడుగంగవలయు నేఁటికిఁదడయన్

ఓ బాలకశ్రేష్ఠమా! లెమ్ము, ఇటురమ్ము నీ వాంఛితమును (కోరిన కోరికను) లేదనక యిచ్చెదను. నీ పాదములను కడుగవలెను గావున నీ యడుగుల నిటు రానిమ్ము. ఇక నాలస్యము చేయనేల?

మ. బలిదైత్యేంద్ర కరద్వయీకృత జలప్రక్షాళన వ్యాప్తికిన్
జలజాతాక్షుఁడు సాఁచె యోగిసుమన స్సంప్రార్థిత శ్రీదముం
గలితానమ్ర రమాలలాట పదవీ కస్తూరికా శాదమున్
నళినామోదము రత్ననూపురితనానావేదముం బాదమున్

బలి దైత్యేంద్రుడు తన రెండు చేతులతో జలప్రక్షాళనము చేయుటకొఱకై శ్రీహరి తన పాదములను ముందుకు చాచెను. ఆ పాదము లెట్టివనగా - యోగులు, దేవతలును, నిత్యము పూజించుచుండునట్టివి, సిరులను కురిపించునట్టివి, రమాదేవి వంగి నమస్కరించునప్పుడు, ఆమె లలాటమున పూయబడిన కస్తూరీ చందనము లంటుకొనునట్టివాస్వామి పాదములు, కలువలవలె మృదుమనోహరములై, రత్నఖచిత నూపురములతో నలంకరింప బడినట్టివి, సాక్షాత్తు వేదస్వరూపము లైనట్టివి.

క. సురలోక సముద్ధరణము
నిరత శ్రీకరణ మఖిల నిగమాంతాలం
కరణము భవసంహరణము
హరిచరణము నీటఁగడిగె నసురోత్తముఁడున్

సురలోకము నుద్ధరించునట్టివియును, మిక్కిలి కరుణాపూర్ణములును, సర్వవేదాంతాలంకృతములును, సంసార బంధచ్ఛేదకములును అయిన ఆ శ్రీహరి చరణకమలములను ఆ దానవేంద్రుడు కడిగెను.

ఇట్లు ఆ బ్రాహ్మణ వటువు దక్షిణచరణమును కడిగి, పిమ్మట వామచరణమును కడిగి, ఆ పావన జలము శిరమున జల్లుకొని, ఆచమించి, దేశకాలాది పరిగణనము చేసి,

శా. విప్రాయ ప్రకటవ్రతాయ భవతే విష్ణుస్వరూపాయ వే
దప్రామాణ్య నిదే త్రిపాదధరణీం దాస్యామి యంచుం గ్రియా
క్షిప్రుండై దనుజేశ్వరుండు వడుగుం జేసాఁచిపూజించి బ్ర
హ్మప్రీతమ్మని ధారవోసె భువనం బాశ్చర్యముం బొందఁగన్

"బ్రాహ్మణోత్తముడవు, ప్రసిద్ధమైన వ్రతనిష్ఠుడవు, విష్ణుస్వరూపుడవు, వేదములచే నిరూపింపబడిన వేదవిదుడవు, అయిన నీకిదే మూడడుగుల భూమిని దానము చేయుచున్నాను" అని దానవేశ్వరుడు వెంటనే కార్యోన్ముఖుడై, చెయ్యిచాచి, పూజించి, "పరమాత్మ ప్రీతిజెందుగాక" యని చెప్పి, భువనములన్నీ ఆశ్చర్యపోవునట్లుగా ధారపోసెను. అప్పుడు -

ఆ. నీరధారఁ బడఁగనీక యడ్డంబుగాఁ
గలశరంధ్రమాఁపఁగాను దెలిసి
హరియుఁ గావ్యునేత్ర మటుఁగుశాగ్రంబున
నడువ నేకనేత్రుండయ్యెనతఁడు

నీటిధార పడకుండ, శుక్రుడు (సూక్ష్మరూపమున కలశయందు ప్రవేశించి అడ్డుకొని) కలశరంధ్రమును మూసివేయగా, శ్రీహరి కుశాగ్రముచే కలశ రంధ్రములోనికి పొడవగా నడ్డు తొలగి జలధార వచ్చి దానము సంపూర్ణముగా సిద్ధించెను. అట్టు పొడుచుటచే శుక్రాచార్యుని ఒక కన్ను పోయెను. అంత,

మ. అమరారాతి కరాక్షతోజ్ఝిత పవిత్రాంభః కర శ్రేణికిం
గమలాధీశ్వరుఁ డొడ్డె ఖండిత దివౌకస్స్వామిజిన్మస్తముం

గమలాకర్షణ సుప్రశస్తము రమా కాంతా కుచోపా స్తమున్
విమల శ్రీకుచశాతచూచుకతటీవిన్యస్తమున్ హస్తమున్

ధారపోయునపుడు దైత్యనాథుని చేతినుండి జారుచున్న పవిత్రజలము, అక్షతలను విష్ణువు తన హస్తముతో స్వీకరించుటకు సిద్ధముగ నుండెను. ఆ హస్తమెట్టిదనగా - అనేకులైన అసురులను అంతమొందించినట్టిది, లక్ష్మీదేవి కుచములను లాలించునట్టిది. అట్టి హస్తమును వామనుడు చాచగా, బలిచక్రవర్తి పవిత్రజలాక్షతలను విడిచి ధారపోసెను. శ్రీహరి స్వీకరించెను.

ఆ. కమలనాభు నెఱిఁగి కాలంబు దేశంబు
నెఱిఁగి శుక్రు మాట లెఱింగి నాశ
మెఱిఁగి పాత్ర మనుచు నిచ్చె దానము బలి
మహి వదాన్యుఁడొరుఁడు మఱియుఁగలడె

రాక్షస శత్రువైన విష్ణువే దానమడుగ వచ్చెనని తెలిసి, తనకు కష్టకాలము రానున్నదని తెలిసి, ఇక నీ దేశము తనది కాదని తెలిసి గురుదేవుడైన శుక్రాచార్యుడు చేసిన హెచ్చరిక నెఱిగి, సర్వనాశనమగునని యెఱింగి, దానమిచ్చుటయే శ్రేష్ఠమని దలంచి దానమిచ్చెను బలి. ఈ పృథివిలో నిట్టి దాతశ్రేష్ఠు డింకెవ్వడైన గలడా?

క. క్షితి దానమిచ్చు నతఁడును
నతికాంక్షఁ బరిగ్రహించు నతఁడును దురిత
చ్యుతులై శతవత్సరములు
శతమఖ లోకమునఁ గ్రీడ సలుపుదు రెలమిన్

భూమిని దానము చేయువాడును, భూదానమును మిక్కిలి యాసక్తితో స్వీకరించువాడును, పాపమోచనుడై శతవర్షములు ఇంద్రలోకమందు భోగము లనుభవించుదురు అని చెప్పి వామనుడిట్లనెను:

ఏ దానమైనను, భూమిదానమునకు సరితూగదు. గావున భూమిదానమిచ్చి ఉభయలోకములలోను కీర్తి సుకృతములను పొందుము. మఱియు,

క. ఇది యేమి వేఁడి తని నీ
మది వగవక ధారవోయుమా, సత్యము పెం
పొదవఁగఁ గోరిన యర్థం
బిది యిచ్చుట ముజ్జగంబు లిచ్చుట మాకున్

దానవేంద్రా! నేనింత చిన్న దానమును కోరితినని నీవు కించపడకుండ ధారపోయుము, సత్యమతిశయింపగ నేను కోరిన కానుక యిది. దీనిని నీవిచ్చుట మూడు జగముల నిచ్చినట్లు నేను భావించెదను.

అని పలికిన పలుకులకు బలిచక్రవర్తి మిక్కిలి సంతసించినవాడై యిట్లనెను:

ఆ. పుట్టి నేర్చు కొనెనొ పుట్టకనేర్చెనో
చిట్టి బుద్ధు లిట్టి పొట్టి వడుగు
బొట్టనున్న వెల్ల బూమెలు నని నవ్వి
యెలమి ధరణిదాన మిచ్చెనపుడు

ఈ పొట్టి బుడుతడు ఇటువంటి చిట్టిబుద్ధులను పుట్టి నేర్చుకొనెనో, పుట్టకమునుపే నేర్చుకొనెనో గాని యితని పొట్టలోనున్నవన్నీ అద్భుతములే అని ఆ దానవేంద్రుడు ముసిముసిగ నవ్వుకొని సంతోషముగ భూమిదానము చేసెను.

క. బలిసేసినదానమునకు
నలినాక్షుడు నిఖిల భూతనాయకుఁడగుటం
గలకలమనె దశదిక్కులు
భళిభళియని పొగడె భూత పంచక మనఘా

బలిచేసిన దానమునకు, శ్రీహరియే సకల భూతనాయకుడగుటచేత, పంచభూతములు భళిభళీ యని పొగడినవి. దిక్కులు సంతోషముతో కలకలలాడి వెలసినవి.

గ్రహములు, మునీంద్రులు, సిద్ధులు, గంధర్వులు, కిన్నరులు, కన్నిరులు, యక్షులు, పక్షులు, దేవతలు, సర్పములు, సర్వులు, బలియొక్క గొప్పతనమును

పొగడిరి. పుష్పవర్షములు కురిసెను. దేవదుందుభులు మ్రోగెను. ఈ విధముగ దానమును గ్రహించిన వామనుడు.

శా. ఇంతింతై వటుఁడింత యై మఱియుఁ దా నింతై నభోవీథిపై
నంతై తోయద మండలా గ్రమున కల్లం తై ప్రభారాశిపై
నంతై చంద్రునికంత యై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంతసంవర్థియై

దానమును స్వీకరించిన వామనమూర్తి, కొద్దికొద్దిగా ఎదగసాగెను. ఇంతచిన్న వాడింత వాడయ్యెను, ఇంతవా డంతవాడయ్యెను; అంతవాడు మఱి యంతవాడై, ఆకాశవీధిపై నంతయై, మేఘమండలోపరి స్థలికల్లంతవాడై, తేజోమండలముపై మఱియంతై, చంద్రుని కంతయై, ధ్రువతారపై నంతయై, మహర్లోకము పైన నంతయై, సత్యలోకము కంటె నున్నతుడై, బ్రహ్మాండ మంతయు నిండి, తానే యై పెరిగిపోయెను.

మ. రవిబింబం బుపమింపఁ బాత్ర మగు ఛత్త్రం బై శిరోరత్నమై
శ్రవణాలంకృతమై గళాభరణమై సౌవర్ణ కేయూర మై
ఛవిమత్కంకణ మై కటిస్థలి నుదంచద్ఘంట యైనూపుర
ప్రవరం బై పదపీఠ మై వటుఁడు దా బ్రహ్మాండమున్ నిండుచోన్

స్థిరముగ నిలిచియున్న సూర్యబింబముతో పోల్చిచూడ, నెదిగిపోవుచున్న ఆ వామనమూర్తికి సూర్యబింబము, మొదట సరియైన ఛత్రమువలెను, పిమ్మట కంఠాభరణము వలెను, అటుపిమ్మట సువర్ణభుజకీర్తిగను, తరువాత కాంతులీను కంకణముగను, పిమ్మట మొలకు కట్టబడిన గంటగను, పిదప మేలైన కాలియందె వలెను, చివరకు పాదపీఠమువలెను కనిపించెను. (క్రిందినుంచి యెదుగుచున్న వామనమూర్తియొక్క పెరుగుదలను ఆకాశమున స్థిరముగ నిలిచియున్న సూర్యబింబముతో కలిపి చూడగ సూర్యబింబమే క్రిందికి దిగివచ్చుచున్నట్లు కనిపించుటను, అద్భుతముగ చిత్రింపబడినది.) ఈ విధముగ వామనుడు త్రివిక్రముడై బ్రహ్మాండమంతయు నిండెను.

అది యెట్లనిన :-

ఆ ఆదివిష్ణువు త్రిగుణాత్మకమైన విశ్వరూపమును ధరించి, భూమి ఆకాశ స్వర్గములును, చరాచర అఖిలభూత సమూహములును, తానేయై, క్రమక్రమముగ భూలోకమును మించి, భువర్లోకము నతిక్రమించి, సువర్లోకమును దాటి, మహర్లోకమును మించి, జనోలోకమునకు మీదై తపోలోకంబునకు ఎదిగినవాడై సత్యలోకముకంటె నున్నతుడై, ఏ మాత్రము సందులేకుండ నిండినవాడై, మహాదేహుడై, పాదతలమున రసాతలమును పాదములపైన భూమియు, పిక్కల స్థానమున పర్వతములును, తొడల స్థలమున ఇంద్రసేన, మరుత్తులు, ఆసన స్థలమున సంధ్యయు, గుహ్యమున (రహస్యస్థలమున) ప్రజాపతులును, పిఱుదుల కడ దనుజులు (అసురులు)ను, నాభిస్థలమున అభ్రమును, ఉదరమున సప్తసముద్రములును, రొమ్ము స్థలమున తారకలును, స్తనభాగమున ఋతము, సత్యములును, హృదయమున ధర్మమును, మనస్సున చంద్రుడును, వక్షమున లక్ష్మీదేవియు, కంఠమున వేదములును, భుజములందు ఇంద్రాదిదేవతలును, చెవులందు దిశలును, శిరమున ఆకాశమును, శిరోజములందు మేఘములును, నాసికయందు వాయువులును, కండ్లయందు సూర్యుడును, వదనమున అగ్నియు, వాక్కునందు సకలచ్ఛంద సముదాయమును, రసనమునందు (జిహ్వా) జలాధిపతియును, కనుబొమలకడ విధినిషేధములును, కనురెప్పలకడ రాత్రింబవళ్లును, లలాటమున కోపమును, అధరమున లోభమును, స్పర్శయందు కామమును, రేతస్సునందు జలమును, పృష్ఠమున అధర్మమును, నడకయందు యజ్ఞమును, ఛాయవలన మృత్యువును, నవ్వువలన మాయావిశేషములును, రోమములందు ఓషధులును, నాడీ ప్రదేశమున నదులును, నఖములందు శిలలును, బుద్ధియందు బ్రహ్మయు, ప్రాణములలోన దేవర్షి గణములును, శరీరమున స్థావర జంగమ సమూహములును, గలవాడై శంఖ, సారంగ, సుదర్శన, గదాదండ, ఖడ్గ, అక్షయ, బాణ, తూణీరములను ధరించినవాడై, మకర కుండల, కిరీట, కేయూర, హార, కటక, కంకణ, కౌస్తుభ, మణిమేఖల, అంబర, వనమాలికా, అలంకృతుడును,

సునంద, నంద, జయ, విజయ, ప్రముఖ పరిచర పరివృతుడును, అసమాన తేజోవిలాసుడును, బ్రహ్మాండ మంతయు నిండి, విజృంభించి,

మ. ఒకపాదంబున భూమిఁగప్పి దివి వేఱొంటన్ నిరోధించి యొం
డొకటన్ మీఁద జగంబు లెల్లఁదొడి నొండొంటిన్ విలంఘించి ప
ట్టిక బ్రహ్మాండకటాహముం బగిలి వేంద్రం బై పరుల్ గానరా
కొకఁడై వాగ్దృగలభ్యుఁడై హరి విభుం డొప్పారె విశ్వాకృతిన్

ఒక పాదముతో భూమినంతటిని ఆక్రమించి, రెండవ పాదముచే మీదిలోకములన్నింటిని నొక్కొక్కటిగ నాక్రమించును, ఇంకను పట్టక (చోటుచాలక) బ్రహ్మాండ కటాహము (పైకప్పు)ను ఛేదించుకొని, పైకెగసి, వాక్కుకు, చూడ్కులకు అతీతుడైన హరి, విభువుడై విశ్వరూపముతో విలసిల్లెను.

అప్పుడు ఆ త్రివిక్రముని ఒక పాదముక్రింద భూమి, పద్మమునకు అంటుకున్న ఒక చిన్న మట్టిముద్దవలెను, ఇంకొక పాదము క్రింద, ఆకాశము (ఊర్ధ్వలోకములు) పద్మముపై వ్రాలిన తేనెటీగలవలె వెలసినవి. అప్పుడు, అన్ని జగములను దాటివెళ్ళిన త్రివిక్రముని పాదముయొక్క నఖముల తేజస్సుకు సత్యలోకమునగల బ్రహ్మ తేజస్సు సూర్యునిముందు దీపమువలె వెలవెలపోయెను.

సీ. భవబంధములఁ బాసి బ్రహ్మలోకంబునఁ గాఁపురంబులుసేయు ఘనులు రాజు
లా మరీచ్యాదులు నా సనందాదులు నా దివ్యయోగీంద్రు లచట నెపుడు
మూర్తి మంతంబు లై మ్రోయు పురాణ తర్కామ్నాయ నియమేతిహాస ధర్మ
సంహితాదులు గురు జ్ఞానాగ్ని నిర్దగ్ధ కర్ములై మఱియును గలుగునట్టి

ఆ. వారలెల్లఁజొచ్చి వచ్చి సర్వాధిపు
నంఘ్రిఁజూచి మ్రొక్కి రధికభక్తి
దమ మనంబులందుఁ దలఁచు నిధానంబుఁ
గంటి మనుచు నేఁడు మంటి మనుచు

సంసార బంధములను తొలగించుకొని బ్రహ్మలోకమునందు కాపురము చేయు పుణ్యాత్ములు, ఘనులునైన, ఆ మరీచ్యాదులు, సనకసనందాదులు,

దివ్యయోగీంద్రులును, ఆ లోకములో రూపమును ధరించి, నిత్యము మ్రోగు పురాణ, తర్క, ఆమ్నాయ, నియమ, ఇతిహాస, ధర్మ, సంహితాదులును, గురువుల బోధలచే జ్ఞానాగ్ని దగ్ధకర్ములై యున్నవారును, ఇతరులును, సత్యలోకమునకు చొచ్చివచ్చిన సర్వేశ్వరుని పాదమును జూచి, మిక్కిలి భక్తితో మ్రొక్కి, తమ మనస్సులలో నెంతకాలము నుండియో కాంక్షించుచుండు భాగ్యమును నేడు గంటిమి, పొందితిమి, అని సంతసించిరి.

మ. తన పుట్టి ల్లిదె పొమ్మటంచు నజుఁడుం దన్నాభి పంకేరుహం
బు నిరీక్షించి నటించి యున్నతపదంబుం జూచి తత్పాదసే
చనముం జేసెఁ గమండలూదకములం జల్లించి తత్తోయముల్
వినువీథిం బ్రవహించె దేవనదినావిశ్వాత్ము కీర్తిప్రభన్

విష్ణుపాదము సత్యలోకమును జొచ్చినపుడు ఆ విరాట్ స్వరూపుడు బ్రహ్మలోకముతో సహా బ్రహ్మాండమంతటా వ్యాపించినప్పుడు, బ్రహ్మదేవుడు శ్రీహరి నాభిస్థలమును జూచి అదియేతన జన్మస్థలమని గుర్తించి, తన కమండలములోని జలముతో, ఆ శ్రీహరి పాదమును ప్రక్షాళించి పూజించెను. ఆ పరమేశ్వరుని మహిమచే ఆ జలమే దేవనదియై ప్రవహింపసాగెను. అప్పుడు

ఆ సత్యలోకవాసులు యోగశక్తిచే శ్రీహరి రాకను గ్రహించినవారై, నానావిధ పుష్పములచే శ్రీపాదమునకు పూజచేసి, దివ్యగంధములను సమర్పించి, ధూపదీపములను చూపి, అక్షతలను చల్లి, ఫలములను నివేదించి, కీర్తనలచే స్తుతించి, శంఖతాళాదులచే జయజయధ్వనులను చేసి, త్రివిక్రమా, కరుణాసాగరా, యని పిలిచి, బ్రహ్మదేవుడు, లోకపాలురు, స్తుతించిరి. వనచరేశ్వరుడైన జాంబవంతుడు అన్నిదిశలకును పోయి శ్రీమహావిష్ణువు యొక్క విజయము యెలుగెత్తి చాటిచెప్పెను. అన్ని జగములందు తానెయై నిండియున్న జగన్నాథుని గాంచి, ఆనందముతో నిండిన మనస్సులతో, బలి, తదితర వ్యక్తులు సన్నుతులు చేసిరి. అంత తిరిగి పూర్వపు వామనరూపమును ధరించిన విష్ణువునుగాంచి అసురేంద్రుని భృత్యులైన విప్రచిత్తి, రాహు, హేతి ప్రహేతి మొదలగు రాక్షసగణముఖ్యులు, యిట్లు తలపోసిరి: "ఈ పొట్టివాడు మూడడుగుల మేరను దానమడిగి సకల మహీమండలము నాక్రమించెను.

వీడు కపటబ్రహ్మచారి రూపమున వచ్చిన శత్రువైన విష్ణుడని యెఱుంగని సత్యసంధుడైన మనరాజు, మాటకు కట్టువడి యిచ్చెను. అతనితప్పేమియును లేదు. ఈ గుజ్జు వాడు ఎదిరింప శక్యముకాని తేజఃప్రభావముచే నీ జగములను పరిగ్రహించి, ఇంద్రాదులకు ఇచ్చివేయదలచినాడు. వీనిని పోనివ్వకుండ పట్టుకొని బంధించుటయే కర్తవ్యము" అని తమలో తాము చర్చించుకొని, గర్జించుచు, యుద్ధమునకు సిద్ధపడిన వారై ఆయుధములను ధరించి, చుట్టుముట్టుటను గాంచి, విష్ణు పరిచరులైన సునంద, నంద, జయ, జయంత, విజయ, ప్రబలోద్బల, కుముద, కుముదాక్ష, తార్క్ష్య పుష్పదంత, విష్వక్సేన, శ్రుతదేవ, సాత్త్వతులనబడు దండనాథులు తమ తమ సేనలతోను ఆయుధములతోను గూడుకొని, రాక్షసమూకల నంతము చేయుటకు సిద్ధపడుచుండగా, శుక్రశాపమును గుర్తుకు తెచ్చుకొని ఆ దానవేశ్వరుడు, తన భృత్యులతో నిట్లనెను:

రాక్షసోత్తములారా! దేవతలతో పోరాడక యిటురండు. పోరాడుటకు ఇది సమయము కాదు. సర్వభూతములకు, సర్వసంపదలకు ప్రభువైన దైవము ఇప్పుడు మనలను తిరస్కరింప, ఆయననెదిరించగలమా మనము? మొదట మనకు రాజ్యమునిచ్చి, సురలకు నాశము చేసిన ప్రభువు యిప్పుడు తారుమారు చేసినచో మన మేమనగలము? మనయొుక్క భాగ్యము వక్రించినదని గుర్తించాలి కదా! అనేకమాఱులు మనతో పోరుటకు భయపడి పారిపోవుచుండు విష్ణుభటులు, ఇప్పుడు మిమ్ములను గెల్చుట దైవచేష్టితముగాదా? అందుచేత వీరులారా! మనకు ఎప్పుడు దైవము అనుకూలముగ నుండునో, అప్పుడే మనము గెలిచెదము. నేడు మనము పోరవలదు, అంతేకాకుండ, అనేకమైన కోటలు, మంత్రులు, సేనలు, ఉపాయములు, తెలివితేటలు, గలిగి యున్నప్పటికిని, కాలమును (అవకాశమును) తెలుసుకొని, సామోపాయముచే రాజు, శత్రువుతో పోరుట సముచితమగును. అందుచేత శత్రువును ఎదుర్కొనుట ఇప్పుడు మంచిపనికాదు. మనకు అనుకూల సమయమున మనము జయింతము. కావున మీరు కోపగించుకొనక తొలగిపొండు అని దానవరాజు చెప్పగా అందరును రసాతలమునకు పారిపోయిరి. అప్పుడు

గరుడుడు శ్రీహరి భావమెఱిగి, అసురప్రభువును వరుణపాశముచే బంధించెను.

బాహువులు, పాదములు, బంధించుట శ్రీహరి కృపయే గనుక నేనేమి చెయ్యగలను అని ఏ మాత్రము సందేహింపక, భయపడక, బలి నిలిచెను. దిశదిగంతములలో హాహాకారములు నిండెను.

తనయొక్క సర్వ సిరిసంపదలు నష్టమైనను, దైన్యము, భయము లేక మునుపటి కంటెను శ్రేష్ఠత, ఔదార్యము, ధైర్యము, ఎఱుకయు, నేమాత్రము తగ్గని దానవశ్రేష్ఠుని జూచి వామనమూర్తి యిట్లనెను:

ఓ దానవధీరా! నాకు మూడు పాదముల మేర నిత్తునంటివి కదా! భూమితో సహా సూర్యచంద్రులుండు స్థలము వరకు నాకొక్క పాదమైనది, స్వర్గాది ఊర్ధ్వలోకము లింకొక చరణమైనది. నీది యైన దంతయును రెండు పాదములకే సరిపోయినది. ఇక మూడవ పాదమునకు నీదియైన దేదియును లేదు గావున, యిచ్చెదనని చెప్పి, ఇవ్వని పాపమునకు, నీకు నిశ్చయముగ నరకప్రాప్తియగును, కదా! కావున దుర్గతి కలుగుటకు ముందే, సత్వరముగ నిప్పుడే, నాకివ్వవలసిన మూడవ పాదమునకు స్థానము జూపుము. ఏలనన బ్రాహ్మణునకు చెందినదానిని తిరస్కరించుటకు బ్రహ్మదేవునికికూడ వశముగాదు.

అని యిట్లు వామనుడు పలుకగా, సత్యభంగదోషము తగులరాదని నిశ్చయించినవాడై శోకమునకు లోనుగాక, నా దానవశ్రేష్ఠుడు ప్రసన్న వదనముతో నా చిన్నివటునితో నిట్లనెను :

ఆ. సూనృతంబు గాని నుడియదు నాజిహ్వ
బొంకఁజాల నాకు బొంకు లేదు
నీ తృతీయపదము నిజము నా శిరమున
నెలవుసేసి పెట్టు నిర్మలాత్మ!

ఆ. నిరయమునకుఁ బ్రాప్త నిగ్రహంబునకును
బదవిహీనతకును బంధనమున

కర్థభంగమునకు నఖిలదుఃఖమునకు
వెఱవ దేవ! బొంక వెఱచినట్లు

ఓ నిర్మలాత్మా! సత్యవాక్కులేగాని వేఱొకపలుకు నా జిహ్వ పలుకజాలదు. నేనెన్నడును బొంకజాలను. నా మనస్సులో బొంకుకు తావులేదు. నీ మూడవ పాదమును నిజముగ నా శిరమున నిలుపుము బ్రాహ్మణోత్తమా! ఓ దేవా! నేను అసత్యమాడుటకు భయపడు నంతగా నరకమునకుగాని, ప్రాప్తమగు భాగ్యమున కడ్డమైనను (అవరోధమైనను) గాని, పదభ్రష్టతకుగాని, బంధింపబడుటకు గాని, ధననష్టమునకు గాని, సకలమైన దుఃఖములు సంభవించినగాని, భయపడను.

ఓ ఆనందమూర్తీ! తల్లిదండ్రులు, అన్నదమ్ములు, స్నేహితులు, గురువులు, శిక్షించినచో మేలు కలుగునే గాని, నష్టమే మీలేదు కదా! రాజ్యమదాంధులును, రాక్షసులును యగు మావంటివారికి బుద్ధి చలించి వక్రమార్గమున పోవునప్పుడు సరియైన సమయమున వచ్చి, గురువులలో నాది గురువువైన నీవు బంధించినచో నది దండనయో, అవమానమో, నష్టమో, బాధయో యని తలంచనగునా? తొల్లి కొందరసురులు వైర భక్తులై నిన్నెదిరించి పోరాడి, అసువులు బాసి, గొప్పయోగీంద్రులు పొందినట్టి ఉన్నత పదమునే పొందియుంటిరి కదా!

ఓహో! ఎంత దౌర్భాగ్యము! మూఢుడు సత్యము, దానగుణము, కరుణ, ధర్మవర్తనాది సద్గుణములకు దూరుడై, ఈ మిథ్యాప్రపంచమే నిజమని, జీవితము దృఢమైనదని నమ్మి, జీవితము గడిచిపోవుటను గుర్తించక, చెలియ (భార్య) మృత్యు సమానమని, చుట్టములు యమునివంటివారని, పరిచారకులు యమకింకరుల వంటివారని యెఱుంగక సంసారసాగరములో కొట్టుకొను చుండును.

సీ. చుట్టాలు దొంగలు సుతులు ఋణస్థులు కాంతలు సంసార కారణములు
ధనము లస్థిరములు దను వతి చంచల కార్యార్థు లన్యులు గడచుఁగాల
మాయువు సత్వర మతిశీఘ్రు మని కాదె తమతండ్రి నధికరించి
మాతాత సాధుసమ్మతుఁడు ప్రహ్లాదుండు నీపాదకమలంబు నియతిఁజేసె

తే. భద్రుఁడతనికి మృతిలేని బ్రతుకు గలిగె
వైరులై కాని తొల్లి మావారు గాన
రర్థివై వచ్చి నీవు నన్నడుగు టెల్లఁ
బద్మలోచన! నాపుణ్యఫలము గాదె

మహాత్మా! పరమపవిత్రుడు, సాధుసత్తముడు, మా తాతగారు అయిన ప్రహ్లాదుడు, తన తండ్రిని కాదని, నీపాదకమలములచెంతకు నిష్ఠతో చేరెను. ఆయన గారిట్లు చెప్పుచుండిరి. చుట్టాలు దొంగలవలె దోచుకొందురు, పుత్రు లప్పులవారివలె ధనము కొఱకు పీడింతురు, స్త్రీలు సంసారమోహబంధమునకు కారకులు ధనసంపదలు, అస్థిరములు, తనువు అతిచంచలమైనట్టిది (ఎప్పుడు పోవునో తెలియదు), కార్యార్థులు ఇబ్బందిపెట్టేవారు, కాలము గడచిపోవునట్టిది, ఆయువు అతి శీఘ్రముగ పోవునట్టిది అని చెప్పిరి. ఆ భద్రునికి మృతిలేని బ్రతుకు కలిగెను కదా! తొల్లి మావారు (అసురులు) నీకు శత్రువులై గాని నిన్ను దర్శింపలేకపోయిరి. ఓ పద్మలోచనా! అర్థివై నీవు వచ్చి, నన్నడుగుట నా యొక్క విశేషమైన పుణ్యఫలము కాదా! - అని చెప్పుచున్న దైత్యేంద్రునకు, అప్పుడే ప్రవేశించుచున్న ప్రహ్లాదుడు కన్పించెను.

వరుణపాశ బద్ధుడైయున్న బలి, తాతగారికి సరియైన విధముగ ప్రణామము లాచరింపజాలక ఖిన్నుడై అశ్రుధారలతో తలవంచి మ్రొక్కెను. అంతప్రహ్లాదుడు యజ్ఞవేదికపై సునందాది పరిచర సమేతుడై కూర్చొనియున్న వామనమూర్తిని గని, పులకిత శరీరుడై ఆనందబాష్పములు రాల్చుచు దండప్రణామం బాచరించి, యిట్లు విన్నవించెను.

దేవదేవా! ఈ బలికి ముందు ఇంద్రపదమిచ్చి ఇప్పుడు తొలగించుటయు మిక్కిలి శ్రేయస్కరమే యైనది. అహంకార మోహములవలన గర్వాంధ తమస్సు వికారముదయించును. దానిని పోగొట్టి, కరుణతో రక్షింపడమే అయినది. ఇది, బంధించుటకాదు, కాపాడుటయే! తత్త్వజ్ఞునకు మహేంద్రత్వమేల? నీ పాదకమలములను నియతితో కొల్చిన, దానికి తులతూగునా యీ దేవేంద్ర భోగపరత? గర్వము పెరిగి, కన్నులు కానరావు, చెవులు వినరావు, చిత్తము చిక్కుపడును. నీ సేవలన్నియు మఱచిపోవును. ఇంద్రపదమును తొలగించి, గొప్ప మేలు చేసితివికదా! స్వామీ!

అని పలికి, జగదీశ్వరుడును, అఖిలలోక సాక్షియునగు నారాయణునకు నమస్కరించి ప్రహ్లాదుడు పలుకుచుండగా - నచ్చటికి వ్యాకులచిత్తయై బాష్పజలధారలు కారుచుండగ చేతులు జోడించి "పతి భిక్షాం మమదేహి కోమలమతే! పద్మాపతే!" యని ప్రార్థించుచు బలిదైత్యుని ధర్మపత్ని వింధ్యావళి వినమ్రయై వామనమూర్తి కడకు చేరెను. చరణములకు ప్రణామములుచేసి, యిట్లనెను.

నిఖిలలోకములచే స్తుతింపబడు స్వామీ! లోకములకు రాజువు నీవేయై యుండగా, నీ క్రీడాస్థలములైన లోకములను చూచి లోకులు, పరులు కుమతులు, తామే లోకాధీశులమని గర్వపడుచుందురుకదా!

ఓ ఆశ్రితమందారా! ఈ దైత్యనాథుడు నీకు దానమివ్వననలేదు, ఇవ్వరాదు సొమ్ము అనలేదు, మూడులోకముల రాజ్యము నీకే యిచ్చెను. మరి ఆ దైత్యునీ విధముగ బంధింపనేల ఓ చిత్తచోరా, శ్రీహరీ! - అని వింధ్యావళి విన్నవింపగా బ్రహ్మదేవుడచటకు వచ్చి యిట్లనెను :

సీ. **భూతలోకేశ్వర! భూతభావన! దేవదేవ!జగన్నాథ!దేవవంద్య!**
తనసొమ్ము సకలంబుఁ దప్పక నీ కిచ్చె దండయోగ్యుఁడు గాఁడు దానపరుఁడు
గరుణింప నర్హుండు కమలలోచన! నీకు విడిపింపు మీతని వెఱపుఁ దీర్చి
తోయపూరము చల్లి దూర్వాంకురంబులఁజేరి నీ పదము లర్చించునట్టి

తే. **భక్తియుక్తుఁడు లోకేశపదము నందు**
నీవు ప్రత్యక్షముగ వచ్చి నేఁడు వేఁడ
నెఱిఁగి తన రాజ్య మంతయు నిచ్చి నట్టి
బలికిఁదగునయ్య దృఢ పాశబంధనంబు

ఓ దేవదేవా! దేవవంద్యా! భూతలోకేశ్వరా! భూతభావనా! ఈ బలిదైత్యుడు గొప్పదానపరుడు. తనకున్నదంతా మాట తప్పకుండా నీకే అర్పించినవాడు. కమలలోచనా! ఇతడు దండింపదగినవాడు కాడు. కరుణింపవలసినవాడు. ఇతనిని బంధవిముక్తుని జేసి, భయమును తొలగింపుము. నీ పాదపద్మముల నభిషేకించి దూర్వాక్షతలతో అర్చించినట్టి భక్తియుక్తుడు, సర్వలోకేశ్వరుడవైన

నీవు వచ్చి స్వయముగ అడిగితివని, నీవు సర్వమును హరించి వేయగలవని తెలిసియు తన రాజ్యమంతా ధారపోసినట్టి ఈ బలికి ఈ దృఢపాశబంధనము తగునా, జగన్నాథా? అని అడిగిన బ్రహ్మతో భగవంతుడిట్లనెను:

సీ. ఎవ్వనిఁగరుణింప నిచ్ఛయించితిని వాని యఖిలవిత్తంబు నే నపహరింతు
సంసార గురుమద స్తబ్ధుఁడై యెవ్వఁడు దెగడి లోకము నన్ను ధిక్కరించు
నతఁ డెల్లకాలంబు నఖిలయోనులయందుఁ బుట్టును దుర్గతిఁ బొందుఁబిదప
విత్తవయో రూప విద్యా బలైశ్వర్య కర్మ జన్మంబుల గర్వ ముడిగి.

తే. యేక విధమున విమలుఁడై యెవ్వఁడుండు
వాఁడు నాకూర్చి రక్షింపవలయువాఁడు
స్తంభ లోభాభిమాన సంసారవిభవ
మత్తుఁడై చెడ నొల్లఁడు మత్పరుండు

పద్మాసనా! నీకు తెలుసుకదా! యెవ్వనిపైన నేను కరుణ జూపదలచెదనో వాని యొక్క సకలసంపదలను అపహరించెదను. ఎవడు అహంకారముతో గూడి మిక్కిలి మదముతో సంసార మైకములో మునిగి నన్ను తిరస్కరించి దూషించునో వాడు నానా రకముల గర్భములలో జన్మించి, దుర్గతియందు పడియుండును. కాని, అట్టివాడు పిదప ఎప్పుడు ధన, యౌవన, రూప, విద్యా, బల, ఐశ్వర్య, జన్మకర్మల ఆధిక్యతచే కలిగిన గర్వాహంకారములను ఒదిలించుకొని, నిర్మలుడై యుండునో వాడు, నాచే రక్షింపబడుటకు యోగ్యుడగును. నా యందు మనస్సు లగ్నము చేసినవాడు, అజ్ఞాన, లోభ, దురభిమాన, సంసార, వైభవమత్తుడై నశించుటకు ఇష్టపడడు.

ఈ పుణ్యాత్ముడు, గురుశాప వశమున రాజ్యభ్రష్టుడైనను, నిర్మలచిత్తుడై సన్మార్గమును, దయను, సత్యమును, ధర్మమును, విడువకుండ, జ్ఞానియై దుస్సాధ్యమైన మాయను జయించిన మహనీయుడీతడు. అల్పుడు కాడు.

ఇతడు అసురనాథుడని, పాపరహితుడని, ఇతని కట్టుబాట్లెంతవరకు నున్నవో చూచెదమని నేనింత మాట్లాడితిని. ఇతడు నిజముగానే సత్యవ్రతుడు, నిర్మలాచారుడు. మేలు మేలు, నాకు చాలా సంతోషము కల్గినది.

ఇతడు సావర్ణి మన్వంతరములో నింద్రుడగును. తదుపరి దేవతలకు అర్హత కలుగు నా ధామమునకు రావించెదను. అంతవరకు ఇతనిని దయతో రక్షించెదను. అంతవఱకు నీతడు వృద్ధిచెందిన వైభవముతో సుతలలోకమున నుండును. అచ్చట వ్యాధులు, దప్పులు, నొప్పులు, బాధలు ఉండవు. ఇది విశ్వకర్మచే నిర్మింపబడి దనుజులు ఆకాంక్షించే లోకము అని పలికి, బలితో భగవంతు డిట్లనెను:

ఓ ఇంద్రసేన మహారాజా! నీకు శుభమగుగాక! భయపడకుము. నీ దానశీలత అతి ఉత్తమమైనట్టిది. సుతలలోకములో దేవతలు కూడ నివసించుటకు ముచ్చటపడుదురు. అచ్చట నుండు వారికి దుఃఖములు, కష్టములు, ఆతురతలు, దుర్మరణము, నొప్పులు, ఉండవు. నీవును సుతలములో నుండుము. నీ ఆజ్ఞను, నీ శాసనమును మన్నింపని నీ శత్రువులను నా చక్రమువచ్చి సంహరించును. నీవు లోకపాలుర (మనువుల) పాలనలో నుండవు. అన్యులెంతటి వారైనను నిన్నేమియు చేయజాలరు. నేనెల్లప్పుడును వచ్చి, నిన్ను రక్షించెదను. కరుణతోడ నీకు నేను దర్శనమిచ్చుచుందును. నీవు నన్ను ధ్యానించుచుండుటచేత నీలోని ఆసురీ భావములు తొలగిపోయి, నీవు నిర్మలుడ వగుదువు. నా యొక్క ఆజ్ఞగా భావించి సుతలములో మనోజ్ఞముగ జీవింపుము.

అని పలికిన శ్రీహరియొక్క అమృతవాక్కులు వీనులవిందులవగ, కన్నులనుండి ఆనందబాష్పములు కురియగ, మేనుపులకింపగ, చేతులు మోడ్చి రాక్షసపతి యిట్లనెను.

ఓ శేషతల్పశయనా! శ్రీహరీ! ఎన్నడును, లోకపాలకులకైనను, ఇంతటి కృపజూపని నీవు, నా బ్రతుకును, నా జీవన క్రమమును నిర్దేశించి, కాపాడితివి. నీ యొక్క దయారసమును, నీవు నన్ను ఉన్నతునిజేసి, పలికిన పలుకులు, చేసిన మన్నన, ఇచ్చిన పెద్దరికము, ఈ జీవితమునకు చాలవా! ప్రభూ! నిన్నెఱిగి నీ పాదములబట్టిన నిక ఆపద కల్గునా!

అని పలికి, బలి, బంధ విముక్తుడై, శ్రీహరికి నమస్కరించి, బ్రహ్మకు ప్రణామముచేసి, శివునకు వందనమాచరించి, తనవారల తోడ్కొని

సుతలమునకు పయనమయ్యెను. అంత, శ్రీహరి కృపావశమున కృతార్థుడైన, కులోద్ధారకుండైన మనుమని జూచి, సంతోషించి, ప్రహ్లాదుడు భగవంతున కిట్లనెను.

ప్రభూ! మంగళాత్మా! ఈ బలికి నీవు అనుగ్రహించిన ఇంతటి మహద్భాగ్యము బ్రహ్మ రుద్రాదులు కూడ పొందలేదు. ఇక ఇతరులకు గాని, అసురులకుగాని ఎట్లు లభించును? బ్రహ్మాదిదేవతలచే నీవు సతతమూ పాదపూజ చేయబడువాడవు. అతి దుర్లభుడవైన నీవు అసురులమైన మా యొక్క దుర్గపాలుడ వైతివి. బ్రహ్మాదిదేవతలు నీయొక్క పాదపద్మ మకరంద పాన ఐశ్వర్యమును పొందినవారు. మరి మేము అల్పబుద్ధులము నీచయోనిజులము, కుటిలాత్ములము, అయియుండియు, నీ యొక్క యిట్టి కృపాదృష్టిని దివ్యమార్గమును, స్థానమును పొందుటకేమేమి తపముల నాచరించితిమో తెలుసుకోగలమా! నీవు మమ్మిట్లీ విధముగ రక్షించుట విచిత్రము గాదా! దేవదేవా!

మఱియును, దేవదేవా! నీవు సర్వాంతర్యామివి, సమదర్శనుడవు (అందరిని సమముగ జూచువాడవు). అయినను పరికించి చూడగా నీ కిష్టములేని వారికేమియు నివ్వవు (దుష్టులకు, దైవద్వేషులకు, లోకకంటకులకు ఏమియు నివ్వవు) కాని, భక్తుల కోర్కెలను కల్పతరువువలె తీర్చెదవు. అనిన ప్రహ్లాదునితో పరమపురుషుడిట్లనెను:

వత్సా! ప్రహ్లాదా! మంచిది. నీవారు, నీవు, నీ మనుమడును, సుతలమునకు పయనమైపొండు. నేను గదాధారినగుచు జేరి రక్షింతును. అచ్చట పాపము దరి జేరదు. అని నియమించిన పరమేశ్వరునకు ప్రహ్లాదుడు నమస్కరించి, ప్రదక్షిణచేసి, చేతులుజోడించి నుదుటిపై నిడుకొని, బలిని తోడ్కొని, సకల అసుర సమూహముతో నొక మహాబిలద్వారమున ప్రవేశించి, సుతల లోకమునకు వెడలెను. అప్పుడు నారాయణుడు, శుక్రాచార్యుని, ఋత్విక్కులను జూచి యిట్లనెను:

ఓ విప్రోత్తమా! ఈ బలిచేసిన యాగమున కెట్టి లోటుయు లేకుండ చివరివరకు కొనసాగించి, సమాప్తము చేయవలెను. అసంపూర్ణముగ

నుండిపోయిన కర్మలను బ్రాహ్మణులు చేపట్టినచో పరిపూర్ణమగును కదా! అనిన, శుక్రాచార్యుడిట్లనెను:

ఓ పురుషోత్తమా! నీవు యజ్ఞేశుడవు, యజ్ఞపురుషుడవు, అఖిల కర్మలకు అధినాథుడవు కదా! ప్రత్యక్షముగ నున్న నీవు పరితుష్టుడవైనచో, నే కర్మముల కైనను లోపమెట్లు కలుగును? ధన, దేశ, కాల, అర్హత, మంత్ర తంత్రముల యందు ఎటువంటి కొఱతలు కలిగినను, నీ నామము నుచ్చరించినంతనె పోవును కదా! అయినను నీ వాజ్ఞాపించితివి గావున నేను యాగ నిర్వహణచేసి సమాప్తి చేసెదను. నీ యాజ్ఞప్రకారము మెలగుట జనులకు మేలు గాదా! ఇంతకంటెను శుభము నా కెచట గలుగును? అని శ్రీహరి యాజ్ఞను శిరసావహించి, శుక్రాచార్యుడు దానవేంద్రుని యజ్ఞమును, మునులు, బ్రాహ్మణులు సహాయపడగా, పరిసమాప్తము చేసెను.

ఈ విధముగ శ్రీహరి వామనుడై, బలినడిగి, భూమిని పరిగ్రహించి, అన్నయైన దేవేంద్రునకు స్వర్గలోకమును దయతో నిచ్చెను. అప్పుడు చతుర్ముఖ బ్రహ్మ, దక్ష భృగు ప్రజాపతులను, శివుని షణ్ముఖుని, దేవర్షి పితృగణములను, రాజులను, తోడ్కొని వచ్చి కశ్యపునకు అదితికి సంతోషము కలుగునట్లుగా, లోకములకు లోకపాలకులకు వామనుడు ప్రభువని నియమించెను. అందరును, ఉపేంద్రుడు (వామనుడు), ధర్మమునకు , యశమునకు, ఐశ్వర్యమునకు, శుభములకు, దేవతలకు, వేదములకు, స్వర్గమునకు, మోక్షమునకు, ప్రధానుడని సంకల్పించిరి. ఆ సమయంబున

బ్రహ్మ, లోకపాలురు, దేవేంద్రునితో సహా, వామనుని అమరావతికి గొనిపోయిరి. మిక్కిలి శక్తివంతమైన అండ (వామనుని) వలన ఇంద్రునికి ఇంద్రపదము లభించెను. తనకు ఆద్యుడై తమ్ముడు సంభవింపగా, అన్నయొక్క కోర్కెలు ఎందుకు తీరవు? భగవంతుడైన తమ్ముడు రాజ్యభాగమడుగడు, తన మేలు కోరుకొనడు, రాజ్యమేలెదనని యడుగడు, బిచ్చమెత్తి సంపాదించి మూడు జగములను అన్నకిచ్చెను. దేవతల తల్లియైన అదితి యొక్క ఆఖరి బిడ్డడివంటి ఇచ్చుటకు వెనుదీయని తమ్ములెచ్చటనైన గలరా! తల్లి కడుపుకు బాధ కలిగించు పెక్కురు కొడుకులను కనుట కంటె,

శ్రేష్ఠుడైన శక్తిమంతు డొక్కడు చాలును, అదితి కన్న ముప్పది మంది దేవగణముకంటెసమస్య తీర్చిన చిన్నమేటి వడుగు శ్రేష్ఠుడైనట్లు.

ఇట్లు దేవేంద్రుడు, వామనుడు సంపాదించి తెచ్చిన త్రిభువన సామ్రాజ్యమును మఱల గైకొనెను. అప్పుడు బ్రహ్మ, శివుడు, కుమారుడు, భృగు ప్రముఖులైన మునులు, పితృదేవతలు, దక్షాది ప్రజాపతులు, సిద్ధులు, వైమానికులు, ఇతరులు, అద్భుత ప్రకాశుడైన విష్ణుప్రభావమున కాశ్చర్యచకితులై ప్రశంసించుచు, ఆడుచు, పాడుచు, తమతమ తావులకు మఱలిరి; అని చెప్పి శుక్రుడిట్లనెను:

పరీక్షిన్మహారాజా! భూమియందుండు ఇసుకరేణువుల నెవ్వరును లెక్కింప లేనట్లు త్రివిక్రముని మహిమను కొద్దిపాటి తెలుసుకొని, తర్కించుటకు లెక్కించుటకు ఎవ్వరికిని శక్యముకాదు.

అద్భుత వర్తనుడగు ఆ శ్రీహరి యొక్క విమలచరితము వినువాడు గొప్ప పరాక్రమశాలియై చివరకు ఉత్తమ గతులను పొందును.

ఈ త్రివిక్రమ విక్రమచరితమును గృహస్థ కర్మలు, పితృకర్మలు, దైవకర్మలు చేయునప్పుడు ఎవ్వరైనను, ఎక్కడెక్కడనైనను కీర్తింతురో వారు నిత్య సౌఖ్యంబులు పొందుదురు, భూవరేంద్రా!

అని యిట్లు శుకుడు పరీక్షిన్మహారాజుకు, వామనావతార చరితమును చెప్పెను, అని సూతుడు మునులకు చెప్పిన, వారానందభరితులైరి.

శ్రీవామనచరిత్ర సమాప్తము.

హరి: ఓం తత్ సత్

❖ ❖ ❖

4. రుక్మిణీ కల్యాణము

శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజు కిట్లు చెప్పెను: రాజా! నీకు ఇదివరకే చెప్పియుంటిని కదా! బ్రహ్మదేవుని సలహాపై ఆనర్తదేశపురాజైన రైవతుడు, తన పుత్రికయైన రేవతిని బలరామునకిచ్చి వివాహము చేసెను.

చేదిరాజు శిశుపాలుని మిత్రులైన సాళ్వాదులైన రాజులనోడించి, శుభగుడైన శ్రీకృష్ణుడు, భీష్మక రాజపుత్రియు, రమాదేవి అంశతో పుట్టినదియు మహాగుణమణియు, పుష్పగంధియు, బాలామణియునైన రుక్మిణిని వరించెను.

అనగా, రాజిట్లడిగెను : యోగీంద్రా! శ్రీకృష్ణుడు స్వయంవరమునకు వచ్చి రుక్మిణిని రాక్షస వివాహమున నెత్తుకు పోయెనని మునుపు చెప్పియుంటిరి కదా! మరి శ్రీకృష్ణుడొక్కడే సాళ్వాదులందరిని ఎట్లు ఓడించగలిగెనో చెప్పుడు, అదీ కాక,

కళ్యాణాత్మకమైన విష్ణుగాథలను వీనులవిందుగ వినువానికి ఎన్నడైనను తృప్తి కలుగునా! వినుచున్నకొద్ది యింకను వినవలెనని యుండునుకదా! కావున నాకు రుక్మిణీ కల్యాణగాథను వినవలెనను కోర్కె కలుగుచున్నది. విప్రవర్యా! చెప్పుము.

క. **భూషణములు సెవులకు బుధ**
తోషణము లనేకజన్మదురితౌఘవిని
శ్శోషణములు మంగళతర
ఘోషణములు గరుడగమనుగుణభాషణముల్

యోగీంద్రా! గరుడ గమనుడైన విష్ణువుయొక్క గుణగణగాథలను వినుట, చెవులకు అలంకారములు, సజ్జనులకు సంతోషదాయకములు, అనేకజన్మల దుష్కర్మములను పాపములను శోషింపజేయునట్టివి. అవి, మంగళకర శబ్దములు కదా అనిన శుకుడిట్లనెను.

రాజశ్రేష్ఠా! వినుము. విదర్భదేశమున కుండినపుర ప్రభువైన భీష్మకుడను ఒక దొడ్డరాజుండెను. అతనికి ఐదుగురు పుత్రులు. పెద్దవాడు రుక్మి.

అందరికంటె చివరిదైపుట్టెను రుక్మిణీ కన్య. ఆమె, బాలచంద్రరేఖవలె రాజు యింట వెలసి, దినదిన ప్రవర్థమానయై మెలయుచుండెను. వేర్వేరు దేవతలకు పేరుపేరున బొమ్మలపెండ్లిండ్లు చేయుచు, గుజ్జనగూళ్లను వండించి చెలులకు పెట్టించుచు, రమణీయమైన మందిరములలోను, ఆరామప్రదేశములలోను విహరించుచు, పువ్వులమొక్కలు లతలను పోషించుచు, మణిమయ సౌధములలో ఊయలలూగుచు, బాలికలతో బంతులాడుచు, చిలుక గోరువంకలకు పాటలనేర్పుచు, నెమళ్లకు నాట్యము నేర్పుచు రాజహంసలకు మందగమనము నేర్పుచు నుల్లాసముగ నెదుగుచుండెను. అంతట,

సీ. దేవకీసుతుకోర్కి తీఁగెలు వీడంగ వెలఁదికి మైదీఁగె వీడఁ దొడఁగెఁ
గమలనాభునిచిత్తకమలంబు వికసింపఁ గాంతి నింతికి ముఖకమల మొప్పె
మధువిరోధికి లోన మదనాగ్ని పొడచూపఁ బొలఁతికి జనుదోయి పొడవుసూపె
శౌరికి ధైర్యంబు సన్నమై డయ్యంగ జలజాక్షిమధ్యంబు సన్న మయ్యె

ఆ. హరికిఁ బ్రేమబంధ మధికంబు గాఁ గేశ
బంధ మధిక మగుచు బాల కమరెఁ
బద్మ నయనువలనఁ బ్రమదంబు నిండార
నెలఁతయౌవనంబు నిండి యుండె

దేవకీనందనుడైన శ్రీకృష్ణునియొక్క కోరికలను తీగలు పెరిగి ప్రాకు చుండగా నిచ్చట రుక్మిణీ కన్యయొక్క శరీరము మెఱుపుతీగవలె పెరగసాగెను. పద్మనాభుని (శ్రీకృష్ణుని) చిత్తకమలము వికసింపగా, ఆ కాంతకు (రుక్మిణికి) ముఖకమల మతి సుందరముగా వికసించి, వెలిగెను. శ్రీకృష్ణునకు మదనాగ్ని (కామ-తాపము) అంకురింపగా, ఆ యవ్వనవతికి వక్షము పైకుబకసాగెను. శ్రీకృష్ణునకు (రుక్మిణి తనకు లభించునను) ధైర్యము సన్నగిల్లి కృశింపగా, రుక్మిణీ సుందరి నడుము సన్నబడెను. శ్రీకృష్ణునకు ప్రేమబంధము అధికము కాగా, రుక్మిణీ కన్యకు కేశపాశబంధము పెరిగి అందముగ నమరెను. శ్రీకృష్ణుని రూపశౌర్యభావముల వలన కలిగిన సంతోషము పూర్తియగునట్లు, సుందరి యొక్క యౌవనము పరిపూర్ణత్వము నొందెను.

ఈ విధముగ భీష్మక పుత్రులైన రుక్మి, రుక్మరథ, రుక్మబాహు, రుక్మకేశ, రుక్మమాలి, యను ఐదుగురికిని ప్రియమైన చెల్లెలైన రుక్మిణీ కన్య, తన యౌవనప్రాయమున, తన తండ్రి గృహమునకు వచ్చుచుండు అతిథి జనులవలన శ్రీకృష్ణుని రూప, యౌవన, బల, గుణాదులను గుఱించి వినుచుండుటచే శ్రీకృష్ణుడే తనకు తగిన విభుడని నిశ్చయించుకొనెను.

అచ్చట ద్వారకలో, శ్రీకృష్ణుడు రుక్మిణియొక్క రూపము, బుద్ధి, శీలము, లక్షణము, గుణముల గుఱించి వినివిని, ఆలోచించుచు, ఆ కన్యారత్నమే తనకు తగిన యిల్లాలని తలంచి ఆమెనే పొందవలెనని నిశ్చయించుకొనెను; అంత,

బంధువులందరును, శ్రీకృష్ణునకే రుక్మిణి నిచ్చుట యుక్తమని బాగుగ నాలోచించి చెప్పుచుండగా, దుష్టబుద్ధియగు రుక్మి, శ్రీకృష్ణుని యందు మిక్కిలి శత్రుత్వము గలవాడై, తన చెల్లెలిని తన మిత్రుడైన శిశుపాలునకే యిచ్చెదనని, ద్వేషాంధుడై పట్టుబట్టెను.

అన్నయొక్క మూఢ పట్టుదలను ఎఱిగి ఆ రుక్మిణీ కన్య, తనలో మిక్కిలి భీతి జెందినదై, విశ్వాసపాత్రుడు, ఆప్తుడునైన ఒక బ్రాహ్మణుని పిలిపించి, "బ్రాహ్మణోత్తమా! గర్వముతో నిండియున్న రుక్మి నన్ను తన మిత్రుడైన శిశుపాలున కిచ్చెదనని యనుచున్నాడు. ఓ బుధశ్రేష్ఠా! నీవు ఎట్లైనను ద్వారకకు పోయి, శ్రీకృష్ణునకు, నా మాటగా విన్నవింపుము" అని వేడుకున్నది. మఱియును,

"అయ్యా! నా తండ్రి, కొడుకు యొక్క ఆలోచనను కాదని అడ్డుకొనలేడు. మా అన్న తలచినట్లు జరుగకుండ, భక్తరక్షకుడైన యా శ్రీకృష్ణుని వెంటనే రావలసినదిగా జెప్పుము" అని,

కొన్ని రహస్య వచనములను చెప్పిన విని, బ్రాహ్మణుడు ద్వారకా నగరమునకు బోయి, ద్వారపాలకుల ద్వారా తన రాకను గిరిధారికి ఎఱింగించెను. లోనికి ప్రవేశించి, బంగారు సింహాసనముపై కూర్చున్న పురుషోత్తముని గాంచి, "పెండ్లి కొడుకువు కమ్మ"ని దీవించెను. ముసిముసి నవ్వులు నవ్వుచు ఆ శ్రీహరి, తన ఆసనమునుండి దిగి బ్రాహ్మణునికి

ఉచితాసనమున కూర్చుండబెట్టి, తనకు దేవతలు చేయు విధముగ ఆ బ్రాహ్మణునకు పూజలుచేసి, ప్రశస్తమైన భోజనము పెట్టించి, అతని పాదముల నిమురుచు నిట్లనెను.

భూసురోత్తమా! సంతోషచిత్తముతోనున్నచో ధర్మపాలన మతి సులభము, బుధసమ్మతమగును. అదియేదన, ప్రాప్తించిన విత్తముతోసంతోషించు బ్రాహ్మణుడు తన ధర్మమున నుండును, చలింపడు. ఆ ధర్మమే అతనికి కోరికలనన్నిటిని తీర్చును. సంతోషి కాకున్నచో ఇంద్రునివంటి గొప్పవాడైనను నశించును. నిర్ధనుడైనను సంతుష్టుడై సంతోషముతో నున్న వాడు సుఖముగా నిద్రించును. సర్వభూతముల మేలుకోరువారు, ప్రాప్తించిన దానితో సంతోషించువారు, శాంతులు, సజ్జనులు, గర్వములేనివారు, నైనట్టి వారల సకలకోరికలను నేను తీర్చెదను.

బ్రాహ్మణశ్రేష్ఠా! నీ ఉనికి ఎవ్వని దేశమందు? ఎవ్వనిచే మీ సంక్షేమము కలుగుచున్నది? ఎవ్వని రాజ్యమందు ప్రజలు సుఖింతురో వాడు నాకు ప్రియుడు. నీవు ఈ జలదుర్గము నందున్న ఇచ్చోటి కెట్లు రాగలిగితివి? నేను పరిహసించుట లేదు. నీ మనస్సులో నున్న కోరికను నేను తీర్చెదను లెమ్ము.

అని యిట్లు ఆ లీలా మానుష విగ్రహుడైన పరమేశ్వరుడు అడిగిన ప్రశ్నలకు ఆ భూసురుడిట్లు బదులు చెప్పెను:

దేవా! విదర్భ దేశాధీశుడైన భీష్మకుని పుత్రికారత్నము రుక్మిణి యను కన్యకామణి గలదు. ఆమె నీకు తనను అర్పణము చేసుకొనగోరి, మంగళప్రశస్తమైన ఒక సందేశమును నీకు విన్నవించుటకు నన్నిక్కడికి పంపించినది. ఆలకింపుము.

సీ. ఏ నీగుణములు కర్ణేంద్రియంబులు సోఁక దేహతాపంబులు దీఱిపోవు
నే నీశుభాకార మీక్షింపఁ గన్నుల కఖిలార్థలాభంబు కలుగుచుండు
నే నీచరణసేవ లేప్రొద్దుఁ జేసిన భువనోన్నతత్వంబుఁ బొందఁ గలుగు
నే నీలసన్నామ మేప్రొద్దు భక్తితోఁ దడవిన బంధసంతతులు వాయు

తే. నట్టి నీయందు నాచిత్త మనవరతము
నచ్చి యున్నది నీయాన నాన లేదు
కరుణఁ జూడుము కంసారి ఖలవిదారి
శ్రీయుతాకార మానినీచిత్తచోర

ఓ కంసాంతకా! ఎట్టి నీ గుణగణములు చెవులకు సోకగానే శరీర తాపములన్నియు తీరిపోవునో, ఏ మంగళకరమైన నీ శుభాకారమును చూడగనే కన్నులకు సకల ఫలములు సిద్ధించునో, ఏ నీ చరణసేవ చేసినంతనే ఉత్తమ లోకములు ప్రాప్తమగునో, ఏ నీ దివ్యనామమును భక్తితో స్మరించిన బంధములన్నీ వీడిపోవునో, అట్టి నీ యందు నా చిత్తమెల్లప్పుడును నిలిచి యున్నది. ఇది నీ సాక్షిగా నిక్కముసుమా! ఓ మానినీ మానస చోరా! శ్రీయుతా కారా! నాపై కరుణ జూపవా?

శా. ధన్యున్ లోకమనోభిరాముఁ గులవిద్యారూపతారుణ్యసౌ
జన్య శ్రీబలదానశౌర్యకరుణాసంశోభితున్ నిన్ను నే
కన్యల్ గోరరు కోరదే మును రమాకాంతాలలామంబు రా
జన్యానేకపసింహ నావలననే జన్మించెనే మోహముల్

ఓ రాజసింహమా! ధన్యుడవు, లోకమనోభిరాముడవు, వంశ, విద్యా, రూప, యౌవన, సౌజన్య, సంపద, బల, దాన, శౌర్య, కరుణా సంశోభితుడవును, నైన నిన్ను ఏ కన్యలు మాత్రము వరింపకుండ నుండగలరు? ఆనాడు, ఆ లక్ష్మీదేవియే నిన్ను వరించలేదా? నేనొక్కతెనే నిన్ను ప్రేమించితినా యేమి? నా కోరికను మన్నింపుము స్వామీ!

ఉ. శ్రీయుతమూర్తి యో పురుషసింహమ సింహముపాలిసొమ్ము గో
మాయువు గోరుచందమున మత్తుఁడు చైద్యుఁడు నీ పదాంబుజ
ధ్యాయిని యైన నన్ను వడిఁ దాఁ గొనిపోయెద నంచు నున్న వాఁ
డా యధమాధముం డెఱుఁగఁ డద్భుతమైన భవత్ప్రతాపముల్

ఓ పురుష సింహమా! లక్ష్మీపతీ! సింహము తినబోవు (సింహము తినుటకు యోగ్యమగు) ఆహారమును నక్క తినుట కాశించునట్లు, అహంకారి యైన

ఆ చైద్యుడు (శిశుపాలుడు), నీ పాదముల కంకితమై, నిన్నే ధ్యానించుచుండు నన్ను, శీఘ్రముగ కొనిపోవుటకు సిద్ధముగ నున్నాడు. నీ ప్రతాపమెట్టిదో, ఆ యధము డెఱుగడు కదా!

మ. వ్రతముల్ దేవగురుద్విజన్మబుధసేవల్ దానధర్మాదులున్
గతజన్మంబుల నీశ్వరున్ హరి జగత్కల్యాణుఁ గాంక్షించి చే
సితినేనిన్ వసుదేవనందనుఁడు నా చిత్తేశుఁ డౌఁ గాక ని
ర్జితులై పోదురు గాక సంగరములోఁ జేదీశముఖ్యాధముల్

ఓ కృష్ణస్వామీ! నేను వ్రతములు చేసి, దేవతలను, గురువులను, బ్రాహ్మణోత్తములను గత జన్మలలో పూజించి వసుదేవనందనుడైన శ్రీకృష్ణుడే నా చిత్తేశుడు (భర్త) యగు గాక యని కాంక్షించి, ఆ శ్రీహరిని కొలిచియున్న దాననైనచో, నతడే నా భర్తయగుగాక. యుద్ధములో శిశుపాలాది యధములు పరాజితులై పోవుదురుగాక!

ఉ. అంకిలి సెప్ప లేదు చతురంగ బలంబులతోడ నెల్లి యో
పంకజనాభ నీవు శిశుపాలజరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి రాక్షసవివాహమునన్ భవదీయశౌర్యమే
యుంకువ సేసి కృష్ణ పురుషోత్తమ చేకొని పొమ్ము వచ్చెదన్

ఓ పురుషోత్తమా! పంకజనాభా! కృష్ణా! నేనేమీ అసత్యము చెప్పుటలేదు. నీవు రేపు చతురంగబల సమేతముగ వచ్చి శిశుపాల జరాసంధాదులను జయించి, నావైపునకు వచ్చి, నన్ను రాక్షస వివాహమున గొనిపొమ్ము. నన్ను పొందుటకు నీ యొక్క శౌర్యమే కన్యాశుల్కముగ భావించి నీతోడవచ్చెదను.

సీ. లోపలిసౌధంబులోన వర్తింపంగఁ దే వచ్చునే నిన్ను దెత్తునేనిఁ
గావలివారలఁ గలబంధువులఁ జంపి కాని తే రా దని కమలనయన
భావించితేని నుపాయంబు సెప్పెద నాలింపు కులదేవయాత్రఁ జేసి
నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్కఁ బెండ్లికి మునుపడఁ బెండ్లికూఁతు

తే. నెలమి మావారుఁ బంపుదు రేను నట్లు
పురము వెలువడి యే తెంచి భూతనాథు
సతికి మ్రొక్కంగ నీవు నా సమయమందు
వచ్చి కొనిపొమ్ము నన్ను నవార్య చరిత

ఓ ఉత్తమచరితా! అంతఃపురములో మసలుచుండు నన్ను కొనిపోవుటకు అక్కడ నున్న కావలివారలను, బంధుజనులను, చంపినగాని సాధ్యపడునా యని శంకించెదవేని, నేనొక ఉపాయమును చెప్పెద వినుము. నగరము వెలుపలనున్న పార్వతీదేవి మందిరమునకు పెండ్లికి ముందు పెండ్లికూతురును పంపించు సాంప్రదాయమున్నది. ఆ ప్రకారము నేను ఆ శివాని ఆలయమునకు పోయి, ఆ దేవిని మ్రొక్కు సమయమున నీ వచ్చుటికి వచ్చి నను కొనిపోవ వచ్చును.

మ. ఘనులాత్మీయతమో నివృత్తికొఱకై గౌరీశుమర్యాద నె
వ్వని పాదాంబుజతోయమందు మునుఁగన్ వాంఛింతు రే నట్టి నీ
యనుకంపన్ విలసింపనేని వ్రతచర్యన్ నూఱుజన్మంబులన్
నినుఁ జింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా

ఓ ప్రాణేశ్వరా! సజ్జనులు తమ అజ్ఞాన నివృత్తికై గౌరీశునివలె నెవ్వని పాదపద్మ జలమున (గంగాజలమునందు) మునుగ వాంఛింతురో అట్టి నీ యొక్క కృపకు నేను అర్హురాలిని కాకున్నచో తీవ్రమైన వ్రతదీక్షనుబూని నూఱు జన్మలకైనా నిన్నే స్మరించుచు ప్రాణములను విడిచెదను. ఇది మాత్రము నిక్కము సుమా!

సీ. ప్రాణేశ నీమంజుభాషలు వినలేని కర్ణరంధ్రంబులకలిమి యేల
పురుషరత్నమ నీవు భోగింపఁగా లేని తనులతవలని సౌందర్య మేల
భువనమోహన నిన్నుఁ బొడగానఁగా లేని చక్షురింద్రియముల సత్త్వ మేల
దయిత నీయధ రామృతం బానఁగా లేని జిహ్వకు ఫలరససిద్ధి యేల

ఆ. నీరజాతనయన నీవనమాలికా
గంధ మబ్బలేని ఘ్రాణ మేల

ధన్యచరిత నీకు దాస్యంబు సేయని
జన్మ మేల యెన్ని జన్మములకు

ప్రాణేశ్వరా! నీ యొక్క మృదుమధుర భాషలు వినలేని చెవులుండి యెందుకు? నీవు అనుభవింపలేని సుకుమార కోమల శరీరముయొక్క సౌందర్య మెందులకు? భువన మోహనా! నిన్ను సందర్శింపగా లేని కన్నులుండియు నేమి ప్రయోజనము? దేవా నీ అధరసుధారసము నాస్వాదింపలేని నాలుక యేల? కమలాక్షా! నీవు ధరించువనమాల యొక్క సుగంధము నాఘ్రాణింపలేని నాసిక ఎందుకు? ధన్యచరితా! నీకు సేవ చెయ్యలేని జన్మము యెన్ని జన్మలెత్తినను వృధాయే కదా!

అని యిట్లు రుక్మిణీ కన్య చెప్పిన సందేశమును విన్నవించి, ఆమె యొక్క అసమాన రూప సౌందర్యాది విశేషములను వర్ణించి చెప్పెను, మఱియు

సీ. **పల్లవవైభవాస్పదములు పదములు కనకరంభాతిరస్కారు లూరు**
లరుణ ప్రభామనోహరములు కరములు కంబుసౌందర్యమంగళము గళము
మహితభావాభావమధ్యంబు మధ్యంబు చక్షురుత్సవదాయి చన్ను దోయి
పరిహసితార్ధేందుపటలంబు నిటలంబు జితమత్తమధుకరశ్రేణి వేణి

ఆ. **భావజాశుగముల ప్రాపులు చూపులు**
కుసుమశరునివింటికొనలు బొమలు
చిత్తతోషణములు చెలువభాషణములు
జలజనయనముఖము చంద్రసఖము

ప్రభూ! ఆ రుక్మిణీ కన్యయొక్క పాదములు చిగురాకువలె మృదువుగా నుండునట. (అని అంతఃపుర పరిచారికల వర్ణన). ఆమె తొడలు సువర్ణఛాయతో అరటి బోదెల వలె నుండునట. చేతులు అరుణకాంతులీనుచు, మనోహరముగ నుండునట. కంఠము శంఖమువలె శోభిల్లుచుండునట, నడుము సింహము నడుమట, ఆమె చన్నులు నేత్రపర్వములుగ నుండునట, ఆమె ఫాలభాగ మర్ధచంద్రునివలె మెఱయుచుండునట. ఆమె వేణి (జడ) గండు తుమ్మెదల వరుసవలె నుండును. ఆమె చూపులు మన్మథబాణమువలె నుండునట.

కనుబొమలు మన్మథుని వింటి కొనలవలె నుండునట. ఆమె భాషణములు (పలుకులు) మనస్సు కాహ్లాదము కలిగించునట్టివి. ఆమె ముఖము చంద్ర సదృశమే!

ఉ. ఆ యెలనాఁగ నీకుఁ దగు నంగనకుం దగు దీవు మాయుపా
ధ్యాయులయాన పెండ్లి యగుఁ దప్పదు జాడ్యము లేల నీవు నీ
తోయమువారిఁ గూడుకొని తోయరుహాననఁ దెత్తు గాని వి
చ్చేయుము శత్రులన్ నఱుముసేయుము సేయుము శోభనం బిలన్

ప్రభూ! ఆ సుందరియే నీకు తగిన జంట, మఱియు నీవే యామెకు సరియైన పతివి, ఇది నిజము, మా గురువుల సాక్షిగా చెప్పుచుంటిని, మీ యిరువురకు నిశ్చయముగ పెండ్లియగును. ఇక జాగేల? నీ పరివారము వారిని తోడ్కొనిపోయి, పద్మాననయైన యా రుక్మిణిని తెచ్చెదవుగాక! విచ్చేయుము. శత్రువులను నశింపజేయుము లోకమునకు శుభము చేయుము.

అని యిట్లు పలికిన బ్రాహ్మణుని వలన విదర్భరాజు తనయ పంపించిన సందేశమును, ఆమెయొక్క రూప, సౌందర్యాది విశేషములను విని, సంతసించి తనచేతితో బ్రాహ్మణుని చేతిని పట్టుకొని, నవ్వుచు ఆ యాదవేంద్రుడిట్లనెను:

ఉ. కన్నియమీఁద నాతలఁపు గాఢము కూరుకు రాదు రేయి నా
కెన్నఁడు నావివాహము సహింపక రుక్మి దలంచు కీడు నే
మున్నె యెఱుంగుదున్ బరులమూఁక లడంచి కుమారిఁ దెత్తువి
ద్వన్నుత మ్రాను ద్రచ్చి నవవహ్నిశిఖన్ వడిఁ దెచ్చుకైవడిన్

ఓ విద్వత్పూజ్యుడా! రుక్మిణీ కన్యపై నా కిదివరకే మనస్సు గాఢముగ లగ్నమైపోయెను. రాత్రులందు నాకు నిద్రవచ్చుటలేదు. (రుక్మిణి యన్న) రుక్మి నాయెడల ద్వేషభావముతో ఈ వివాహమును సహింపలేక కీడు తలపెట్టునని నే నిదివరకే యెఱుగుదును. శత్రుమూకల నణచివేసి కన్యను నేనిచ్చటికి తీసుకొని వచ్చెదను.

క. వచ్చెద విదర్భభూమికిఁ
జొచ్చెద భీష్మకునిపురము సురుచిరలీలన్
దెచ్చెద బాలన్ వ్రేల్మిడి
వ్రచ్చెద నడ్డంబు రిపులు వచ్చినఁ బోరన్

భూసురోత్తమా! నేను విదర్భరాజ్యమునకు వచ్చెదను, భీష్మకుని నగరమందు అవలీలగ ప్రవేశించెదను, బాలామణియైన రుక్మిణిని తెచ్చెదను. నా కడ్డము వచ్చి యుద్ధము చేయు శత్రువులను చిటికలో చీల్చివేసెదను.

అని పలికి, రుక్మిణి పెండ్లి ముహూర్తమెప్పుడో తెలుసుకొని, ప్రయాణమునకు సిద్ధపడగా, రథసారథియైన దారుకుడు, శైబ్య సుగ్రీవ, మేఘపుష్ప, వలాహక మనెడి అశ్వములను పూన్చి, రథమును తీసుకొనిరాగా, శ్రీహరి, బ్రాహ్మణుని తోడ్కొని, విదర్భదేశమునకు వెళ్లెను. ఆ సరికి కుండినపురాధీశుడైన భీష్మకుడు, కొడుకునకు వశుడై రుక్మిణిని శిశుపాలున కిచ్చుటకు పెండ్లి ప్రయత్నములు చేయించెను. అప్పుడు :

దారులు, బాటలు, రాజమార్గములు, అంగడిప్రదేశములు, విశాలముగ చేసి, సుగంధజలములు చల్లి, తోరణములు ముగ్గులతో నలంకరించి, నగర వీథులను, గృహములను, తోరణ పతాకములతో సుందరముగ నలంకరించిరి, మంగళ వాద్యములతో నగరమంతా మారుమ్రోగెను. అంతటను ఉత్సవ వేడుకలు నిండియుండెను.

భీష్మకుడు, విహిత ప్రకారముగ పితృదేవతల నర్చించి బ్రాహ్మణులచే మంగళాశీర్వచనముల జదివించి, రుక్మిణీ కన్య కభిషిక్తము చేయించి, వస్త్రములను ధరింపజేసి, మణిమయ రత్నభూషణములతో నలంకరింపజేసి, ఋక్ యజుః సామవేదమంత్రములచే మంగళాచరణములు చేయించెను. బ్రాహ్మణులు రక్షాకరణము లాచరించిరి. పురోహితులు గ్రహశాంతి కొఱకు హోమము చేసిరి. వధూవరుల మేలుకొఱకు రాజు, తిలదాన, గోదాన, వస్త్రదాన, కనక దానములను ధరణీదేవతలకిచ్చెను.

ఆ సమయమున, అనేకమైన రథములు, అశ్వములు, గజములు, భటులతో కూడిన పటాటోపముతోను బంధుమిత్ర పరివారములతోను, మిక్కిలి

అహంకార బలదర్పములతో, చైద్యరాజైన శిశుపాలుడు విదర్భరాజ పుత్రికయైన రుక్మిణిని పొందుటకు, వచ్చి చేరెను. కృష్ణబలరాములు వచ్చినచో పారద్రోలుటకు సిద్ధముగ శిశుపాలుని మిత్రులును, కృష్ణ శత్రువులును, అయిన జరాసంధ, దంతవక్త్ర సాల్వ విదూరథ, పౌండ్రకాదులు, రథగజ తురగ పదాతి సేనలతో, ఎట్టి ఆటంకము కలుగకుండ శిశుపాలుని వివాహము జరిపించుటకు వచ్చిచేరిరి. మఱియు, నానాదేశముల రాజులనేకులు వచ్చిచేరిరి. భీష్మకుడు శిశుపాలునకు ఎదురువెళ్లి సత్కరించి, విడిదిజూపెను.

బలరాముడిట్లు తలంచి, ఒక పెద్దసేనతో శ్రీకృష్ణునివెనుక తరలివచ్చెను కృష్ణుడొక్కడే విదర్భకు వెళ్లెను. శిశుపాలుని మిత్రులందరు సేనలతో వచ్చెదరు. ముఖ్యముగ కంసపత్నుల తండ్రియైన జరాసంధుడు కృష్ణునిపై కక్షకట్టి యున్నాడు. రుక్మిణిని తెచ్చునప్పుడు వీరందరితో యుద్ధము జరుగును. గావున కృష్ణునకు సహాయమవసరము - అని భావించి సేనను తీసుకొని వెళ్లెను.

ఇంతలో ఆ రుక్మిణీ కన్య శ్రీకృష్ణుడు వచ్చి తన్ను కలియడేమో యని శంకాకుల చిత్తయై యిట్లు తలపోసెను.

శా. లగ్నం బెల్లి వివాహముం గదిసె నేలా రాఁడు గోవిందుఁడు
ద్విగ్నం బయ్యెడి మానసంబు వినెనో వృత్తాంతమున్ బ్రాహ్మణుం
డగ్నిద్యోతనుఁ డేటికిం దడసె నాయత్నంబు సిద్ధించునో
భగ్నంబై చనునో విరించికృతమెబ్భంగిన్ బ్రవర్తించునో

రేపే లగ్నము, వివాహము దగ్గర పడినది. గోవిందు డింకను రాడేమి? నా మనస్సు అలజడి చెందుచున్నది. ఆ బ్రాహ్మణుడు అగ్నిద్యోతనుడేల ఆలస్యము చేసెనో! బ్రాహ్మణుడు చెప్పిన వృత్తాంతమంతయును శ్రీకృష్ణుడు వినెనో, వినలేదో! నా ప్రయత్నము సిద్ధించునో భగ్నమైపోవునో! ఇంతకూ ఆ బ్రహ్మదేవుని చేష్టితమే విధముగ జరుగనున్నదో!

మ. ఘనుఁ డా భూసురుఁ డేఁ గెనో నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో
విని కృష్ణుం డిది దప్పుగాఁ దలఁచెనో విచ్చేసెనో యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో తలఁపఁడో యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో నాభాగ్య మెట్లున్నదో

ఆ భూసురోత్తముడు సుఖముగ ద్వారక చేరగలిగెనో, లేక మధ్యలో నెక్కడైనను మార్గాయాసముచే చిక్కుకొనెనో! అతడు క్షేమముగ చేరి, నా సందేశమును శ్రీకృష్ణునకు సమముగ విన్నవించెనో, లేదో! శ్రీకృష్ణుడది విని తప్పుగా తలచెనేమో! (ఒక రాజవంశపు కన్య ఒక అపరిచితున కిట్లు సందేశము పంపుట, లేదా, రాక్షసపద్ధతిని కన్యనెత్తుకొని పోవుట సరికాదని భావించెనేమో!) లేక, (దయామయుడు గాన, నన్ను రక్షించుటకు) విచ్చేసెనేమో! పరమేశ్వరుడు నా సంకల్పమునకు అనుకూలించునో లేదో! గౌరీమహాదేవి నన్ను కాపాడ దలచునో లేదో! ఇంతకూ, నా భాగ్యమెట్లున్నదో, యని పరిపరివిధముల తర్కించుకొనుచు, నిఃస్పృహ చెందుచు నిట్లు తలపోసెను:

ఉ. పోఁడను బ్రాహ్మణుండు యదుపుంగవువీటికి వాసుదేవుడున్
రాఁ డను నింకఁ బోయి హరి రమ్మని చీరెడి యిష్టబంధుఁడున్
లేఁ డను రుక్మికిం దగవు లే దిటఁ జైద్యున కిత్తు నంచు ను
న్నాఁడను గౌరి కీశ్వరికి నావలనం గృప లేదు నేఁ డనున్

యదువీరుని యింటికి బ్రాహ్మణుడు చేరియుండడు, చేరలేడు, వాసుదేవుడు రాలేడు, రాడు. ఇక నేనేమి చేయగలను? శ్రీహరిని పిలుచుకొని రమ్మని పంపించుటకు విశ్వాసపాత్రుడు, ఇష్టబంధువు ఇంకెవ్వడును లేడు, సమయము కూడలేదు. శిశుపాలునకు నన్నిచ్చెదను అనుచున్న రుక్మికిప్పుడు ఎట్టి ఆటంకమును లేదు. ఇప్పుడు ఈశ్వరియైన గౌరికి కూడ నా యందు కృపలేదు, అని చింతించుచు, నామె,

ఉ. చెప్పదు తల్లికిం దలఁపుఁజిక్కు దిశల్ దరహాసచంద్రికన్
గప్పదు వక్త్రతామరసగంధసమాగతభృంగసంఘమున్
రొప్పదు నిద్రఁ గైకొన దురోజపరస్పరస క్తహారముల్
విప్పదు కృష్ణమార్గగతవీక్షణపంక్తుల ద్రిప్ప దెప్పుడున్

ఆ కన్య తన మనస్సులో నున్న ఆలోచనల జటిల సమస్యను తల్లికైనను చెప్పుకొనదు. చిరునవ్వులను చిందించదు. పెదవులు కలువలని భ్రమపడి తననోటివద్ద సంచరించు భ్రమర సమూహము నైనను రొప్పదు. నిద్రపోవదు.

మెడలో చిక్కుపడియున్న హారముల నైనను విప్పి, సవరించుకొనదు, చూడ్కులను కృష్ణుడు రాబోవు మార్గముననే నిలిపి, ఒక్కక్షణమైనను ఇటు నటు త్రిప్పదు.

చ. తుడువదు కన్నులన్ వెడలు తోయకణంబులు కొప్పుఁ జక్కఁగా
ముడువదు నెచ్చెలిం గదిసి ముచ్చటకుం జన దన్న మేమియుం
గుడువదు నీరముం గొనదు కూరిమిఁ గీరముఁ జేరి పద్యమున్
నొడువదు వల్లకీగుణవినోదము సేయదు డాయ దన్యులన్

శ్రీకృష్ణాగమన నిరీక్షణయందు మునిగియున్న రుక్మిణీ కన్య, నిర్విరామముగ ప్రవహించు కన్నీటి ధారలనైనను తుడుచుకొనదు. చిందరవందరగా చెదిరియున్న జుట్టునైనను సవరించి ముడివేసుకొనదు. చెలికత్తెలతో నైన ముచ్చట లాడదు. అన్నము తినదు. నీరైనను త్రాగదు. చిలుకకు మాటలు నేర్పదు, వీణను మీటి వినోదింపదు. ఎవ్వరినీ సమీపింపదు.

సీ. మృగనాభి యలఁదదు మృగరాజమధ్యమ జలముల నాడదు జలజగంధి
ముకురంబు సూడదు ముకురసన్నిభముఖి పువ్వులు దుఱుమదు పువ్వుఁబోఁడి
వనకేళిఁ గోరదు వనజాతలోచన హంసంబుఁ బెంపదు హంసగమన
లతలఁ బోషింపదు లతికాలలితదేహ తొడవులు దొడవదు తొడవుతొడవు

ఆ. తిలక మిడదు నుదుటఁ దిలకినీతిలకంబు
కమలగృహముఁ జొరదు కమలహస్త
గారవించి తన్నుఁ గరుణఁ గైకొన వన
మాలి రాఁడు తగవు మాలి యనుచు

తనను గౌరవించి, కరుణతో స్వీకరించుటకు కొంటె కృష్ణయ్య రాడేమి యను రోషముతో రుక్మిణీ కన్య కస్తూరిని అలదుకొనదు. ఆ పద్మగంధి జలక్రీడలాడదు, అద్దమువంటి మోముగల ఆ సుందరి అద్దమైనను చూచుకొనదు. పువ్వులను తలలో తురుముకొనదు. ఆ పూబోణి, వన విహారమునకు పోవదా వనజాక్షి. పుష్పలతలను పోషింపదా లతాంగి. హంసలను పోషింపదా హంసగమన. కొలనులో కమలములతో నాడుకొనదా కమల హస్త

ఆభరణములను ధరింపదా అందాలరాశి. తిలకము పెట్టుకొనదా సౌందర్య తిలక.

ఇట్లు శ్రీహరి రాకకెదురు చూచుచు, అన్ని విషయములయందును విరక్తయై మనోవేదనతో క్రుగ్గిపోవుచున్న మగువకు శుభమును తెలుపునట్లు ఎడమకన్ను భుజము, తొడ అదిరినది. అప్పుడు శ్రీకృష్ణుని కడకు వెళ్లిన బ్రాహ్మణుడు తిరిగివచ్చెను. అతని ముఖలక్షణములను పరికించి చూచినదా బాలామణి. చిరునవ్వుతో వచ్చి ఎదురుగా నిల్చున్న బ్రాహ్మణోత్తముడా కన్యతో నిట్లనెను:

ఉ. మెచ్చె భవద్గుణోన్నతి కమేయధనావళు లిచ్చె నాకుఁ దా
వచ్చె సుదర్శనాయుధుఁడు వాఁడె సురాసురు లెల్ల నడ్డమై
వచ్చిన నైన రాక్షసవివాహమునన్ గొనిపోవు నిన్ను నీ
సచ్చరితంబు భాగ్యమును సర్వము నేఁడు ఫలించెఁ గన్యకా

రాకుమారీ! ఆ సుదర్శనాయుధుడు వచ్చెను. అతడు నీ యొక్క ఉత్తమ సద్గుణములకు మెచ్చుకొనెను. నేను చెప్పిన నీయొక్క సందేశమునకు మిక్కిలి సంతసించినవాడై నాకు అమితమైన ధనము నిచ్చెను. అతడు వచ్చెను గనుక ఇక నీ కెట్టి భయమును ఉండదు. దేవదానవులేకమై యుద్ధము వచ్చినను, నిన్ను రాక్షసవివాహ పద్ధతిని కొనిపోవును. నీ యొక్క సచ్చరిత్రము, భాగ్యమును నేడు ఫలించినవి గదమ్మా! అనిన ఆ బ్రాహ్మణునితో రుక్మిణి యిట్లనెను:

మ. జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి నా సందేశముం జెప్పి నన్
నిలువంబెట్టితి నీకృపన్ బ్రదికితిన్ నీయంత పుణ్యాత్ముకుల్
గలరే దీనికి నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నే నేర నం
జలిఁ గావించెద భూసురాన్వయమణీ సద్బంధుచింతామణీ

ఓ భూసురరత్నమా! నా సందేశమును విన్నవించి, శ్రీకృష్ణుని తోడ్కొని వచ్చితివి. నా ప్రాణముల నిలబెట్టితివి. నీ యొక్క కృపచే నేను బ్రతికిపోయితిని. నీ వంటి పుణ్యాత్ములింకెవ్వరైన నుందురా! దీనికి నేను నీ కెటువంటి ప్రత్యుపకారము చెయ్యగలను? ఏమియును చెయ్యలేనట్టి నిస్సహాయను. ఓ సద్బంధు చింతామణీ! నీకు దోసిలొగ్గి నమస్కరించెదను.

అంత, బలరామకృష్ణులు తమ పుత్రిక వివాహమునకు విచ్చేసిరని వినిన భీష్మకుడు మంగళవాద్యములతో నెదురుగా వెళ్లి విధిప్రకారము, వారిని పూజించి, మధుపర్కములిచ్చి, వివిధ అంబర ఆభరణములు మొదలైన కానుకలిచ్చి, బంధుజన సేనాసమేతులై వచ్చిన వారికి ఉచిత వసతులు కల్పించెను. అట్లే విచ్చేసిన ఇతర రాజులను సత్కరించి వసతులు కల్పించెను. శ్రీకృష్ణుడు విచ్చేసెనని విని విదర్భపురవాసులు గుంపులుగా వచ్చి కన్నులపండువుగా అతనిని తిలకించి, ఆనందబాష్పముల రాల్చి ఆ దివ్యసుందర వదనకమలమునుండి చూడ్కులు మరలింప జాలకుండిరి. మఱియు, వారు తమలోతామిట్లు చర్చించుకొనిరి: మహానుభావుడైన హరికి ఈ విదర్భరాజపుత్రి చక్కగ తగియుండును, మఱియు నీవై దర్భికి అతడే ముమ్మార్తుల తగియున్న వరుడు. ఇంత మంచి దాంపత్యము కుదిరి యుండగా మఱి ఆ బ్రహ్మ ఎందులకు తన తెలివినుపయోగించి అట్లుకాకుండ తగులబెట్టెనో! మా అందరి పుణ్యవిశేషము చేత మా రాకుమారియైన ఈ రమణికి ఆ హరియే భర్త యగుగాక! అని యనుకొనిరి.

ఆ సమయమాసన్నమయ్యెను. రుక్మిణీ కన్య గౌరీ మందిరమునకు వెళ్లవలసియున్నది. చుట్టును, వీరభటులు, ఆయుధధారులై నడుచుచుండ, ముందర, వారకాంతలు, దేవికి ఉపహారములు కానుకలు పట్టుకొని నడచుచుండ, పుష్పములు, గంధము, కుంకుమపువ్వు, మొదలైన సుగంధ ద్రవ్యములను ధరించి, కీర్తనలు పాడుచు, బ్రాహ్మణ పుణ్యస్త్రీలు నడువగ, వేణువు, మద్దెలలు, శంఖములు, భేరీనాదములు మంగళధ్వనులు చేయు చుండగ, సఖులు, తల్లులు, బంధువుల భార్యలు, వెంట నడచుచుండగ, రుక్మిణీ వధువు, వినయ మందగమనయై కురులు ఫాలముపై కదిలి యాడుచుండగ, ఆదిశక్తి మందిరమునకు నడచి వెళ్లుచుండెను.

మఱియు, వందిమాగధులు, గాయక పాఠకజనులు, అభినందించు చుండగ, కన్య, మందగమనమున పోవుచు, ముకుంద చరణార విందములను హృదయములో తలచుచు, గౌరీమందిరమును సమీపించి, కాలుచేతులు కడుగుకొని శుచియై దేవి చెంతకు చేరెను. బ్రాహ్మణ ముత్తైదువులు పార్వతీ

పరమేశ్వరులకు అభిషేకము చేసి గంధాక్షతల నిడి, వస్త్రమాల్యాది భూషణములతో నలంకరించి, ధూపదీపములను జూపి, నానావిధ ఉపహారములను సమర్పించి, కానుకలిచ్చి, దీపమాలికల నివాళులర్పించి, రుక్మిణీ కన్యచే మ్రొక్కించిరి. అప్పుడా కన్య ఆదిదంపతుల నీవిధముగ మనస్సులో ప్రార్థించెను.

ఉ. నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్
మిమ్ముఁ బురాణదంపతుల మేలు భజింతుఁ గదమ్మ మేటిపె
ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ హరిం బతిఁ సేయు మమ్మ నిన్
నమ్మినవారి కెన్నఁడును నాశము లేదు గదమ్మ యీశ్వరీ

అమ్మా! సనాతనులైన ఆదిదంపతులు మీరు, ఉమామహేశ్వరులైన మిమ్ములను నేను మదిలో నమ్మితినమ్మ! అమ్మలగన్నయమ్మ! మేటి పెద్దమ్మా! మిమ్ములను నేను బాగుగ భజించుచుంటిని గదమ్మా! నీవు దయాసాగరివి కదమ్మా! శ్రీహరిని నాకు పతిగా ప్రసాదింపుమమ్మా! నిన్ను నమ్మిన వారికెన్నటికిని, నాశములేదు గదమ్మా! సర్వేశ్వరీ! అని మ్రొక్కి, బ్రాహ్మణ ముత్తైదువులకు అపూపములను, కంఠసూత్రములను, ఫలతాంబూలములను చెఱకు గడలను ఇచ్చి, రుక్మిణి, వారలను పూజించెను. వారు ఆమెను శిరముపై అక్షతలు చల్లి ప్రేమతో అమితముగ దీవించిరి. ఆమె తలనిండ అక్షతలతో శివానికి నమస్కరించి, తేలిక పడిన మనస్సుతో నెమ్మదిగ బైటకు వచ్చెను.

అప్పుడా కన్య ఏ రీతిగ కన్పించె ననగా -

కారుమేఘముల మధ్యను మెఱిసే విద్యుల్లతవలెను, చంద్రమండలము నుండి దిగివచ్చిన లేడిపిల్లవలెను, విష్ణుమూర్తి దేవదానవులకు అమృతమును పంచి యిచ్చుటకై అవతరించిన మోహిని వలెను, సాగరమథనమున ఉద్భవించిన లక్ష్మీదేవివలెను, మానససరోవరమున స్వర్ణకమలముల మధ్య దర్పముతో విహరించు రాజహంసవలెను, వక్షోజ భారమును మోయలేని సన్నని నడుము గలదిగను, రత్నఖచిత కాంచన కర్ణాభరణకాంతులు చెక్కిళ్లపై మెఱయునదిగను, కమలముల సుగంధముచే నాకర్షింపబడిన నల్లని గండు

తుమ్మెదల సమూహమువలె కనబడు కురులతో నున్నదిగను, సుందర మందహాస కాంతులు, బాలచంద్రికా సౌందర్యశోభను వెదజల్లు వదనము గలదిగను, సువర్ణవర్ణ చంద్రవదనమునకు శోభను చేకూర్చునట్టి యెఱ్ఱని అధరములు కలదిగను, మన్మథ బాణముల వంటివియును రాజపుత్ర వీరుల హృదయములను భేదించునట్టివియును అయిన వాడిచూపులు గలదిగను, వీనుల విందుగ వినిపించు, గజ్జెలందియల ధ్వనులను వెదజల్లునదిగను, కనిపించుచున్న రుక్మిణీ వధువు, శ్రీహరి రాకకు ఎదురుచూచుచు, పాదచారిణియై, వీరమోహినియై వచ్చుచుండగా -

తుమ్మెదల వంటి నల్లని ముంగురులతో పూర్ణచంద్రబింబమువంటి ముఖముతో, లేడికనులవంటి కన్నులతో, లేతమామిడిచిగురువంటి పెదవులతో, కోకిల కంఠముతో, లేత తమలపాకువంటి పాదములతో, చక్కగ సౌష్ఠవముగ పెరిగిన చన్నులతో, మదపుటేనుగు మందగమనముతో నడచుచు, ఎఱ్ఱకలువలవంటి హస్తములుగల సింహమువంటి నడుముగల పద్మగంధియైన రుక్మిణి చూపరులను విభ్రాంతులుగ చేసెను.

మఱియు, ఆ సుందరి యొక్క సిగ్గుతో కూడిన మందహాసమును చూచిన రాజ కుమారులందరును, బాటకిరువైపుల నిల్చొని, మతులు పోగొట్టుకొని, ధైర్యములు దిగనాడి, గాంభీర్యములను విడిచి, గౌరవములు మఱచి చేష్టలు మాని, ఎఱుకలుడిగి, ఆయుధములు చేజార్చుకొని, వాహనముల నెక్కుట మఱచి నిర్వీర్యులై నేల చదికిలబడిరి. ఆహరిణాక్షి తన ఎడమచేతితో, నుదుటిపై నాడుకొనుచున్న ముంగురులను ఎగద్రోయుచు, ఉత్తరీయమును (పైటచెంగును) సరిజేసుకొనుచు క్రీగంటి చూపులతో, శ్రీకృష్ణుని గురించి వెదుకుకొనుచు, ఆ రాజకుమారులను ఒక్కొక్కరిని పరికించి చూచుచుండెను: అప్పుడు -

మ. కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖున్ గంఠీరవేంద్రావల
గ్ను నవాంభోజదళాక్షుఁ జారుతరవక్షున్ మేఘసంకాశదే
హు నగారాతిగజేంద్ర హస్తనిభబాహుం జక్రిఁ బీతాంబరున్
ఘనభూషాన్వితుఁ గంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్

చంద్రబింబమువంటి మోము కలవానిని, సింహనడుము గలవానిని, కమలరేకులవంటి నేత్రములు గలవానిని, విశాలవక్షుని, నీలమేఘశ్యాముని, ఏనుగు తొండములవంటి బాహువులు గలవానిని, సర్వాలంకార భూషితుని, శంఖమువంటి కంఠముగలవానిని, చక్రహస్తుని విజయోత్సాహిని, జగన్మోహనుని, శ్రీకృష్ణుని గాంచెను.

చూచి, అతని రూప వయో లావణ్య వైభవ గాంభీర్య చాతుర్య తేజోవిశేషములకు సంతసించి, మన్మధబాణ పీడితయై రథమునెక్క గోరుచుండు కన్యకారత్నమును జూచి, శత్రురాజులు చూచుచుండగా, మందగమనమున వచ్చు మదపుటేనుగువలె వచ్చి, అచ్చటనున్న రాజుల గుంపులను లక్ష్యపెట్టక, తృణీకరించి, రాజ కన్యకను తెచ్చి, తన రథముపై నిడుకొని, భూమి ఆకాశములు దద్దరిల్లునట్లుగ శంఖము పూరించుచు, శ్రీహరి బలభద్ర సమేతుడై యాదవసేనవెంట వచ్చుచుండగ, ద్వారకానగర మార్గము పట్టి పయనించెను. అంత జరాసంధునికి లోబడియున్న రాజులందరును శ్రీకృష్ణుని సాహసకృత్యమును సహింపలేని వారై - యిట్లు భావించిరి-

సింహము చేసిన వేటయొక్క ఘనతను, దానివెనుకను తిరుగు క్షుద్రజంతువు కాజేయునట్లు, మనవంటి గొప్ప రాజరికపు చిహ్నమైన ఈ రాజకన్యను, మతిచెడిన ఈ గొల్లలు ఎత్తుకొనిపోవుచుండగా మన శౌర్యమెందులకు? ఈ శస్త్రాస్త్రములన్నీ ఎందుకు? కాల్పనా? ఈ సుందరిని మనము విడిపింపకున్న, పురవీథులందును నగరములందును ప్రజలు నవ్వరా, గేలి చేయరా?

అని ఆ జరాసంధాది రాజులు తమలో తాము తర్కించుకొని, రోషములను మనస్సులలో నింపుకొని, వెంటనే ఉద్యమించి, కవచ, ధనుర్బాణాది సాధనములను ధరించి, పంతము లాడుకొని, తమతమ చతురంగ బలములతోగూడ, యాదవులవెంటబడి, సమీపించి, నిలువుడు, నిలువుడు, అని ధిక్కరించి పలికి, అతిశయించి, వారిపై బాణవర్షములను కురిపింపగా, యాదవవీరులు బాణములనెక్కుపెట్టి, ధనుష్టంకారములు చేసి నిలువబడిరి. అప్పుడు.

శత్రుసేనలు, బలపటాటోపములతో యాదవసైన్యములను బాణవర్షముచే గప్పివేయుటను గాంచిన రుక్మిణి, సిగ్గుతోను, భయముతోను, భీతహరిణము వలె శ్రీహరి వంక జూచెను.

అప్పుడు శ్రీకృష్ణుడామె భయమును గుర్తించి యిట్లనెను : పద్మాక్షీ! చూచుచుండుము; మన యాదవవీరులు శత్రుసేనలయందెట్లు చొచ్చుకొని పోయి, వారి నేవిధముగ చీల్చిచెండాడెదరో నేడు జూడుము, అని ఆమె నూఱడించి భయము దీర్చెను.

అంత, బలభద్రప్రముఖులైన యదువీరులు ప్రళయకాలపు పిడుగులవలె విరుచుకుపడుచు, జరాసంధాది శత్రురాజ సమూహముల సేనలపై అసమాన పరాక్రమముతో బాణపరంపరలను కురిపింపగా, ఆ భీభత్సమైన రణరంగ మెట్టులుండె ననగా - చీల్చబడిన మత్తగజములతోను, విచ్ఛిన్నమైన గుఱ్ఱములతోను, విరిగిముక్కలైన రథములతోను, చంపబడిన పదాతిసేనలతోను, ఖండింపబడిన మస్తకములు, వక్షములు, కంఠములు, హస్తములు, తొడలతోను, విరిగిపోయిన గదలు, ఖడ్గములు, శూలములు, బాణములతోను, పతనమైన ధ్వజములు, చామరఛత్రములు, రక్తప్రవాహముతోను, భూతభేతాళ కలకల ధ్వనులతోను, రక్తమాంసాదులను తినగోరు జంబుకములు, గ్రద్దలు రాబందులతోను కోలాహలముగ నుండెను. యాదవులచేత బాగుగ దెబ్బతిని ప్రాణభయముతో జరాసంధాది రాజులు వెనుకకు మరలి దుఃఖితుడైయున్న శిశుపాలుని అవస్థను జూచిరి. శిశుపాలుడు భార్యను పోగొట్టుకొన్న వానివలె, శోకముతో నిట్టూర్చుచుండుటను గాంచి, యాదవులచేత జిక్కకుండ ప్రాణముతో నున్నందుకు సంతోషింపుమని చెప్పి, వారిట్లనిరి :

ఆ. బ్రదుకవచ్చు నొడలఁ బ్రాణంబు లుండిన
బ్రదుకు గలిగె నేని భార్య గలదు
బ్రదికి తీవు భార్యపట్టు దైవ మెఱుంగు
వగవ వలదు చైద్య వలదు వలదు

మిత్రమా! ఓర్చుకొనుము. శరీరమందు ప్రాణముండిన బ్రతుకవచ్చును. బ్రతికియున్నచో భార్యయే దొరకకుండునా! ఆ యాదవుల చేజిక్కకుండ బ్రతికిపోయితివికదా! సంతోషించు. భార్య విషయమా! దైవమే చూచుకొనునులే, విచారింపవలదు. వలదు వలదు, చైద్యరాజా! జరాసంధు డింకా ఇట్లు చెప్పెను:

మిత్రమా! వినుము. దేహధారి స్వతంత్రుడు గాడు. యంత్రగానిచేతిలో కీలుబొమ్మవలె, ఈశ్వరుని విధాన పరతంత్రుడై సుఖదుఃఖములందు నటించును. (తన పాత్రను వహించును). నా విషయమే చూడు, తొల్లి నేను మధురాపురముపై పదునేడు మాఱులు పరాక్రమముతో దండెత్తి పోరి, కృష్ణునిచేత సేనలను పోగొట్టుకొని, బలరామునిచేత పట్టుబడి, కృష్ణుడు కరుణింపగా విడిపింపబడి, పదునెనిమిదవ మాఱున ఇరువది అక్షౌహిణుల సేనతో దాడిచేయుగా బలరామకృష్ణులు పారిపోయిరికదా! జయాపజయములందు ఎన్నడును హర్షశోకములు పొందరాదు, నేడు, ఈ రాజులేకాక శివుడైనను కృష్ణునెదిరించిన ఓడిపోవుట తథ్యము. అంతేకాక, దైవయుక్తమైన కాలవశమున లోకములు పరిభ్రమించుచుండును. అదియును కాక,

యాదవులకు ఇప్పుడు కాలమనుకూలముగ నున్నది గావున, మూడు లోకములను జయింపగలిగిన మనలను వారు జయింపగలిగిరి. అట్లే, మనకు కాలమ్మెలై అనుకూలమైనప్పుడు మనమును, శత్రువులను జయించెదము. ఇంత మాత్రమునకు శంకించి, శోకింపనేటికి?

ఇట్లు జరాసంధుడును, ఇతరరాజులును, శిశుపాలుని ఊరడించి, అతని పరితాపమును నివారించి తమతమ రాజ్యములకు జనిరి. శిశుపాలుడును, తన అనుచరులను తోడ్కొని తన నగరమునకు మఱలెను. అప్పుడు, రుక్మిణి పెద్ద అన్న అయిన రుక్మి, కృష్ణుడు రాక్షసవివాహము కొఱకై తన చెల్లెలిని కొనిపోవుటను సహింపలేక, ఒక అక్షౌహిణీ సైన్యమును తీసుకొని యుద్ధసన్నద్ధుడై, కృష్ణుని వెంబడించుచు, తన సారథితో నిట్లనెను:

భీష్మక మహారాజపుత్రుడను, బలవంతుడను అయిన నన్ను అవమానించి, నా చెల్లెలిని, రుక్మిణిని గొప్పయోధుని వలె చిక్కకుండ, ఈ గొల్లడు తీసుకొని పోవుచున్నాడు. ఆ రథమును కలుసుకొనునట్లుగ, నింకను శీఘ్రముగ

త్రోలుము. ఈ గొల్లల వంశముయొక్క మదమును అణచివేసెదను. నా ప్రతాపమును జూపెదను.

అని యిట్లు రుక్మి, హరియొక్క శక్తిని తెలియనివాడై, సారథిని తొందరపెట్టి, రథమును కృష్ణుని రథముతో సమానముగ నడిపింపజేసి, "నిలు నిలు, గోపాలక! వెన్నదొంగ! ఒక్కనిముషమాగు. నీ పని పట్టించెదను, అని తిరస్కరించి, బాణముసంధించి మూడు వాడియైన బాణములనువేసి శ్రీహరికి నొప్పి కలిగించి యిట్లనెను:

సీ. మాసరివాఁడవా మాపాపఁ గొనిపోవ నేపాటిగలవాఁడ వేది వంశ
మెందు జన్మించితి వెక్కడఁ బెరిగితి వెయ్యది నడవడి యెవ్వఁ డెఱుఁగు
మానహీనుఁడ వీవు మర్యాదలును లేవు మాయ గైకొని కాని మలయ రావు
నిజరూపమున శత్రునివహంబుపైఁ బోవు వసుధేశుఁడవు గావు వావి లేదు

ఆ. కొమ్మ నిమ్ము నీవు గుణరహితుండవు
విడువు విడువ వేని విలయకాల
శిఖిశిఖాసమానశితశిలీముఖముల
గర్వ మెల్లఁ గొందుఁ గలహమందు

ఓరీ గోపాలకా! నీవు మాకు సరిసమానుడవా ఏమి? మా చెల్లిని కొనిపోవుటకు నీవు ఏపాటివాడవు? నీ సంపదలేమిటి? నీ వంశమెట్టిది? నీవెక్కడ జన్మించితివి? నీవెక్కడ పెరిగితివి? నీ ప్రవర్తన యెట్టిది? నిన్నెఱిగిన వాడెవ్వడు? నీవు మానహీనుడవు, మర్యాద లెఱుంగని వాడవు; మాయతోనే సర్వమును ఆడించెదవు. మాయలేకుండ నీ నిజరూపమున సంచరింపవు. శత్రుసమూహములపై దండెత్తగల రాజువుకావు. రాజులతో బంధుత్వము లేదు. నా చెల్లెలినిచ్చివేయుము. నీవు గుణములు లేనివాడవు (గనుక మా చెల్లెలికి తగినవాడవు కావు) ఆమెను విడువుము. విడువకున్నచో యుద్ధమందు ప్రళయకాలాగ్నివంటి నా యొక్క వాడియైన బాణములతో నీగర్వమంతయు హరించివేసెదను. (రుక్మి కృష్ణునియందు ద్వేషముచే అన్నమాటలు ఆధ్యాత్మికముగ భగవంతునకు అన్వయించును) అని రుక్మి అనగా, శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వి,

ఒకబాణమున రుక్మియొక్క విల్లును ఖండించి, ఎనిమిది బాణములతో రథమును అశ్వములను కూల్చి రెండు బాణములతో సారథిని పడగొట్టి, మూడు బాణములతో రథధ్వజము నెగుఱగొట్టి, అతడు వేరొక విల్లునందుకొనదానిని గూడ విరిచి ఒక్కొక్క బాణముచే రుక్మియొక్క ఆయుధములను (పట్టిస, పరిఘ, శూల, చర్మాసి, శక్తి, తోమర మొదలైనవి) ముక్కలు చేసి, ఇంకను ఇతర ఆయుధము లెన్నిటిని రుక్మి ఎత్తిన, అన్నిటిని ఖండములజేసెను. ఇక చేయునది లేక రుక్మి రోషముతో ఖడ్గమును చేతబూని, అగ్నిమంటవైపు జోరుగ నెగిఱిపోవు మిడుతమాదిరి, శ్రీకృష్ణుని మీదికి దూసుకొని పోయి, ఎగిసిపడెను. శ్రీకృష్ణుడు వాని ఖడ్గకవచములను ముక్కలుచేసి, తన ఖడ్గమును దూసి రుక్మి శిరస్సును తెగగొట్టుటకు సిద్ధపడగా రుక్మిణి అడ్డమువచ్చి, శ్రీకృష్ణుని పాదములు పట్టుకొని ఇట్లు వేడుకొనెను:

ఓ అనాథనాథా! దయానిధీ! నీవు ఈశ్వరుడవు, దేవదేవుడవు అని తెలుసుకొన లేక వినియున్నను విశ్వసింపలేక, మా అన్నయైన ఇతడు నీ యెడల గొప్ప అపరాధము చేసెను. ఓ అమరసన్నుతా! నన్ను మన్నించి, మా అన్నను కాపాడుము సర్వలోకశరణ్యా!

ప్రభూ! ఇతడు పరుషవాక్కులాడి నీ యెడల అపరాధము చేసినవాడే, దండనార్హుడే, నేను కాదనను. అయినను, ఇతనిని నీవు చంపినచో, స్వయంగా ఈశ్వరుడైన ముకుందుడే మా అల్లుడైనాడు, మేమెంత భాగ్యవంతులము అని ఆనందించుచున్న మా తల్లిదండ్రులు పుత్రశోకములో చిక్కుకొని కృంగిపోవుదురు స్వామీ! కరుణింపుము -

అని మహాభయముతో, వణకుచున్న శరీరముతో, గద్గద స్వరముతో చెమర్చిన కన్నులతో, కన్యారత్నము మ్రొక్కగా శ్రీకృష్ణుడు ప్రసన్నుడై, రుక్మిని చంపకుండ, బావా రమ్మని, చిరునగవుతో పిలిచి, బంధించి, తల, గడ్డము, మీసము గొఱిగి, విరూపునిగ జేసెను అంతట, శత్రువులను తఱిమివేసి బలభద్రుడు వచ్చి చేరి, రుక్మి అవస్థను గాంచి, జాలిపడి, కట్లువిప్పి, శ్రీకృష్ణునితో యిట్లనెను.

తమ్ముడా! ఈ భీష్మక పుత్రుని దూరముగ పొమ్మనకుండ ఈ విధముగ

తలను, మీసమును గొఱుగుట నీకు తగునా? ఇతడిప్పుడు మన బంధువు కూడను. బంధువునకు తలయు మీసమును గొఱుగుట తలనఱకుట కంటెను అవమానకరము కాదా! కొందఱు శత్రువులని వారికి కీడును, కొందఱు మిత్రులని వారికి మేలును చేకూర్పవు. నీవు అందరిపట్ల సముడవు కదా! మరి ఇతనిపట్ల ఈ భేదబుద్ధి ఏలనయ్యా - అని పలికి, రుక్మిణితో నిట్లనెను:

శా. **తోడంబుట్టినవానిభంగమునకున్ దుఃఖించి మాకృష్ణు నె**
గ్గాడం జూడకు మమ్మ పూర్వభవకర్మాధీన మైప్రాణులన్
గీడున్ మేలును జెందు లేఁ డొకఁడు శిక్షింపంగ రక్షింప నీ
తోడంబుట్టువు కర్మ శేషపరిభూతుం డయ్యె నేఁ డియ్యెడన్

అమ్మా! రుక్మిణీ! మీ యన్న యొక్క భంగపాటుకు నీవు మా కృష్ణుని నిందింపబోకుము. ప్రాణులు పూర్వజన్మ కర్మాధీనులై మేలు కీడులను పొందెదరు. అంతేగాని, శిక్షించుట, రక్షించుట, ఎవ్వరో చేయుదురని భావింపరాదు. మీ అన్న యొక్క అవమానమునకు కారణము, అతని కర్మశేషమేయని భావింపుము.

చంపదగునట్టి దోషము చేసినను, బంధుజనుల జంపరాదు. అట్టివారిని విడిచిపెట్టుటయే ధర్మము. చంపినచో దోషము సిద్ధించును. మొదటనే చచ్చిన వానిని మఱల చంపుట యికనేల? (మరణ శిక్షార్హులు ఎట్టైనను ప్రభుత్వముచే శిక్షింపబడుదురు గావున ఇతరులు దోషులను చంపరాదు. అట్లు చంపినచో వారు హత్యాదోషమునకు పాల్పడుదురు - అని భావము)

బ్రహ్మచేత రాజులకీ ధర్మము కల్పింప (నిర్దేశింప) బడినది. కాని కొందరు దుష్టరాజులు, రాజ్యకాంక్షచేత తోబుట్టువులనైనను అతి క్రూరులై చంపుదురు. అహంకారులు (కొందరు రాజులు) భూమికొఱకును, ధనధాన్యముల కొఱకును, భామలకొఱకును, దురభిమానముచేతను, అధికారము కొఱకును, కాంక్షించి, మంచీచెడు గానక ఐశ్వర్యమదమున ఇతరులపై దాడిచేయుదురు.

ఇంకను వినుము. దైవమాయచేత, దేహాభిమానులైన మానవులకు బంధువు శత్రువు తటస్థుడు అను భేదభావములుండును. వేర్వేరు జలపాత్రలలో, ఒకే

సూర్యుడు వేర్వేరుగ ననేకములుగ నున్నట్లు కన్పించు మాదిరిగ, ఆత్మ ఒక్కటే అయినను, దేహధారుల కనేకముగనున్నట్లనిపించును. తటస్థముగ నుండు సూర్యునివలన దృశ్యమానములైన వస్తువులన్నీ ప్రకాశించునట్లు, తటస్థముగ నుండు ఆత్మవలన దేహేంద్రియములు ప్రకాశించుచుండును. ఆత్మకు దేనితోను సంయోగ వియోగములుండవు. జనన మరణములు దేహమునకేగాని, ఆత్మకు లేవు.

అమ్మా! శోకము అజ్ఞానమువలన కలుగును. నీవు విజ్ఞానవతివి గావున నీకు మీ అన్న విషయమై శోకము తగదు.

ఈ విధముగ బలరామునిచే బోధింపబడి, రుక్మిణి ఊరట జెందెను. పరాభవింపబడిన రుక్మి తన వికృతాకారమునకు మిక్కిలి ఖిన్నుడై కృష్ణుని గెల్చిగాని కుండిన పురమున ప్రవేశింపనని ప్రతిజ్ఞచేసి, ఆ దగ్గరలోనే నివసించు చుండెను. ఈ విధముగ

క. రాజీవలోచనుఁడు హరి
రాజసమూహముల గెలిచి రాజస మొప్పన్
రాజిత యగుతనపురికిని
రాజాననఁ దెచ్చె బంధురాజి నుతింపన్

పరీక్షిన్మహారాజా! రాజీవనేత్రుడైన శ్రీహరి, తన్నెదిరింపవచ్చిన రాజసమూహములను ఓడించి, రాజఠీవితో శోభిల్లుచుండు ద్వారకానగరికి, తేజస్విని యైన రుక్మిణిని, బంధువర్గమంతా మెచ్చునట్లుగ, గొనివచ్చెను.

ద్వారకానగరిలో వివాహప్రయత్నములు ప్రారంభింపబడినవి. అంతటను గీత, నృత్య, వాద్యములు మారుమ్రోగినవి. ప్రతి గృహమందును నరనారీ సమేతముగ గృహస్థులు అలంకరించుచుండిరి. వీధులు మార్గములు పన్నీటి జల్లులతో తడిసి యున్నవి. ప్రతిద్వారము వద్దను అరటి మొక్కలతోను, కర్పూరకుంకుమ అగరు ధూప, దీప, పూర్ణకుంభములతోను అలంకరించిరి. ఇంటి అరుగులు, ద్వారములు గడపలు, సుగంధపుష్పతోరణములతోను, దీప స్తంభముతోను, ఎగురవేయబడిన పతాకములతోను శోభాయమానముగ నుండెను.

మ. ధ్రువకీర్తిన్ హరి పెండ్లియాడె నిజచేతో హారిణిన్ మానవై
భవగాంభీర్యవిహారిణిన్ నిఖిలసంపత్కారిణిన్ సాధుబాం
ధవసత్కారిణిఁ బుణ్యచారిణి మహాదారిద్ర్యసంహారిణిన్
సువిభూషాంబరధారిణిన్ గుణవతీచూడామణిన్ రుక్మిణిన్

మహోన్నత యశోవిలాసినియు, తనమానస హారిణియు, మానవతి, ఐశ్వర్యవతియు, సాగర విహారిణియు, సకలసంపదల నొసంగునదియు, సాధువులను, బంధువులను ఆదరించునదియు, పుణ్యచరితయు, మహాదారిద్ర్య నాశినియు, చక్కని వస్త్రాభరణ భూషితయు, గుణవతీ శ్రేష్ఠయు నైన రుక్మిణీదేవిని ఆ శ్రీహరి వివాహమాడెను అని శుకయోగీంద్రుడు పరీక్షిత్తుకు చెప్పెను.

ద్వారకానగరిలోని పుణ్యసతులు, పౌరులును, కరుణామయులు, తేజస్వరూపులు అయిన రుక్మిణీ కృష్ణులకు ప్రేమతో భూరికానుకలను తెచ్చి అర్పించిరి.

శ్రీహరి పెండ్లికి కేకయ, కురు, సృంజయ, యదు, విదర్భ, కుంతి దేశముల రాజులు అమితమైన ఆసక్తితో వచ్చి, పరమానందము పొందిరి.

అన్నిదిశల యందున్న రాజులు, రాజపుత్రులు, శ్రీకృష్ణుడీవిధముగ రుక్మిణిని గొనివచ్చి పెండ్లియాడుట అతి దుష్కరము, అపూర్వము, అని ఆశ్చర్యపోయిరి.

మహారాజా! ఆదిలక్ష్మియైన రుక్మిణితోడ క్రీడ సలుపుచున్న శ్రీకృష్ణుని జూచి, పట్టణములో ప్రజలు నిర్భయులై ప్రీతితోను, ఉల్లాసముగాను ఆనందించిరి. అని చెప్పి, ఇట్లు స్తుతించెను.

క. కువలయ రక్షాతత్పర!
కువలయదళ నీలవర్ణ కోమలదేహా!
కువలయనాథ శిరోమణీ!
కువలయజన వినుత విమలగుణ సంఘాతా!

భూమండలమును రక్షించు నిష్ఠగలవాడా! నల్లకలువవంటి నీలవర్ణదేహము వాడా! రాజులకు శిరోభూషణ మనదగువాడా! భూమండలములోని ప్రజలందరిచే నుతింపబడు నిర్మల గుణనిధీ! నీకు వందనములు.

మాలిని. సరసిజనిభ హస్తా! సర్వలోక ప్రశస్తా!
నిరుపమ శుభమూర్తీ! నిర్మలారూఢ కీర్తీ!
పరహృదయ విదారీ! భక్త లోకోపకారీ!
గురు బుధజన తోషీ! ఘోర దైతేయ శోషీ!

కలువపుష్పములవంటి చేతులు గలవాడా! సర్వలోకములచే ప్రశంసింపబడు వాడా! సాటిలేని శుభంకరా! ప్రసిద్ధమైన నిర్మలకీర్తి గలవాడా! శత్రు హృదయములను చీల్చువాడా! భక్తజనులకు క్షేమము కలిగించువాడా! గురుజనులను, బుధజనులను పోషించువాడా! ఘోరరాక్షసులను దహించువాడా! నీకు ప్రణామములు.

పరీక్షిన్మహారాజా! లక్ష్మీనారాయణులు ఈ విధముగ తమ లీలానాటక ప్రదర్శనమునకు భూలోకములో నిట్లు కలుసుకొనిరి అని శుకయోగీంద్రుడు చెప్పెను.

రుక్మిణీ కల్యాణము సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

5. కుచేలోపాఖ్యానము

పరీక్షిన్మహారాజు శుకయోగీంద్రునితో నిట్లనెను : మహాత్మా! శ్రీహరి కథలెన్నివిన్నను తనివితీరదుకదా! అంతియేకాక,

చ. హరి భజియించు హస్తములు హస్తము లచ్యుతుఁ గోరి మ్రొక్కు త
ఛ్ఛిరము శిరంబు చక్రధరుఁ జేరిన చిత్తము చిత్త మిందిరా
వరుఁ గను దృష్టి దృష్టి మురవైరి నుతించిన వాణివాణి య
క్షరు కథ లాను కర్ణములు కర్ణములై విలసిల్లుఁ బో భువిన్

యోగీంద్రా! నా ఉద్దేశములో శ్రీహరిని భజించే హస్తములే నిజమైన హస్తములు. అచ్యుతుని కోరి మ్రొక్కు శిరమే శిరము. చక్రధరుని చేరు చిత్తమే చిత్తము. ఇందిరానాథుని గాంచు దృష్టులే దృష్టులు; మురవైరిని స్తుతించువాణియే వాణి, అక్షరుని (పరమాత్ముని) కథలను వినెడి కర్ణములే కర్ణములై విలసిల్లు నీ పృథివియందు.

మఱియును, శ్రీహరియొక్క పాదతీర్థ సేవాపరుడై విలసిల్లునట్టి భాగవతుని ప్రకాశమానమైన అంగములే అంగములు కదా! మునీంద్రా! ఆ పరమేశ్వరుని గుఱించి నాకు ఇంకను చెప్పుడు. అనగా ఆ యోగీంద్రుడు ఇట్లు పలికెను. ఓ పరీక్షిన్మహారాజా! కుచేల నామధేయుడొక విప్రుడుండెను. అతడు శాంతుడు, విజ్ఞాననిధి, గర్వరహితుడు, ధర్మవత్సలుడు, విజితేంద్రియుడు, బ్రహ్మవేత్త. అయినను ఆగర్భదరిద్రుడు. దారిద్ర్యమెంత బాధించినను దైన్యత జెందడు. ఎవ్వరినీ యాచింపడు. తనకు లభించినది ఒక కాసు అయినను పదివేల నాణెములుగా దలచి సంతోషించి భార్యాబిడ్డలను ఏదోయొకవిధముగ పోషించుకొని వచ్చుచుండ, ఒకనాడు,

పతివ్రతా శిరోమణియు, ఉత్తమవంశ సంజాతయునగు నతని భార్య, దుస్సహ దారిద్ర్యముచే పీడింపబడుచు, శిశువులాకటి చిచ్చుచే కృశించి, మాడుచు, ఆకుదొన్నెలు పట్టుకొని తినుటకేమైన నిమ్మని హృదయ విదారకముగ నేడ్చుచుండ, భరింపజాలనిదై భర్తచెంతజేరి యిట్లనెను: జీవితేశా! దుర్భరమైన ఈ దారిద్ర్యమునుండి గట్టెక్కుటకు ఏదైన ఉపాయమును

యోచింపవలెను. నాకొక ఊహవచ్చినది. నీ బాల్యసఖుడైన శ్రీకృష్ణుని దర్శించిన, అతని కరుణాకటాక్ష కిరణమొకటి మనపై ప్రసరించిన ఈ దరిద్రాంధకారము తొలగి మనముద్ధరింపబడుదుము. మఱియును,

చ. వరదుఁడు సాధుభక్తజన వత్సలుఁ డార్తశరణ్యు డిందిరా
వరుఁడు దయాపయోధి భగవంతుఁడు కృష్ణుఁడుఁ దాఁ గుశస్థలీ
పురమున యాదవప్రకరముల్ భజియింపఁగ నున్న వాఁడు నీ
వరిగిన నిన్నుఁ జూచి విభుఁ డప్పుడ యిచ్చు ననూనసంపదల్

స్వామీ! మీ చిన్ననాటి మిత్రుడు, శ్రీకృష్ణుడు, భగవంతుడే, అతడు భక్తవత్సలుడు, వరదాత, దయాసాగరుడు, ఇందిరాపతి, అతడిప్పుడు యాదవులచే సేవింపబడుచు, కుశస్థలీపురమున నున్నాడు. మీరొకసారి అచ్చటికిపోయినచో, ఆ ప్రభువు మిమ్మజూచి, భూరి సంపదల నిచ్చును కదా! మఱియును,

మ. కలలోనం దను మున్నెఱుంగని మహాకష్టాత్ముఁ డైనట్టి దు
ర్బలుఁ డాపత్సమయంబునన్ నిజపదాబ్జాతంబు లుల్లంబులో
దలఁప న్నంతనె మెచ్చి యార్తిహరుఁ డై తన్నైన నిచ్చున్ సుని
శ్చలభక్తిన్ భజియించువారి కిడఁడే సంప ద్విశేషోన్నతుల్

నాథా! ఆయనను చూడ సంకోచింపవలదు. ఏలనన - కలలోనైనను, ఎన్నడును, ఆ మహాత్ముని స్మరింపని కఠినాత్మునికైనను, వాడు నిస్సహాయుడై ఆపదలో నున్నప్పుడాయన యొక్క పాదపద్మముల మనస్సున స్మరించి నంతనె, వాని ఆర్తిని హరించి తన్నుతానైనను అర్పించుకొను దయాసాగరుడాయన. అట్టితరి, నిశ్చలభక్తితో నిత్యమూ కొలిచెడి మీవంటి సజ్జనునకు సంపద్విశేషముల నివ్వకుండునా!

అని పలికిన ఆ యిల్లాలి మాటలువిని, ఆలోచించి ఆ బ్రాహ్మణోత్తముడు శ్రీకృష్ణుని దర్శించుటయే, ఇహపర సాధనమని తలచినవాడై ఆమెతో నిట్లనెను:

తే. నీవు చెప్పినయట్ల రాజీవనేత్రు
పాదపద్మంబు లాశ్రయింపంగఁజనుట
పరమశోభన మా చక్రపాణి కిపుడు
కాను కేమైనఁ గొంపోవ, గలదె మనకు

మానవతీ! నీ యాలోచన ఆచరింపదగినదిగానే ఉన్నది. ఆ రాజీవలోచనుని పాదపద్మముల నాశ్రయించుట పరమ శుభకరము. మఱి ఆ చక్రపాణికి కానుకగా గొనిపోవుట కేమైనా మన యింటనున్నదా! అనగా నామె -

తే. అనిన న య్యింతి యొఁగాక యనుచు విభుని
శిథిల వస్త్రంబు కొంగునఁ బృథుక తండు
లముల నొకకొన్ని ముడిచి నెయ్యమున ననుపఁ
జనియె గోవింద దర్శనోత్సాహి యగుచు

అని భర్త చెప్పగా ఆ యిల్లాలు, సరే యని, అతని చినిగిన ఉత్తరీయపు కొంగున కొన్ని ముదుక తండులములను (అటుకులు) ముడివేసి, ప్రీతితో నతనిని సాగనంపగా నతడు గోవింద సందర్శనోత్సాహియై వెడలెను.

అట్లు పోవుచు, తన మనస్సులో నిట్లు తలపోసెను: ద్వారకానగరములో నేనెట్లు ప్రవేశింపగలను? దివ్యమైన అంతఃపురవాసియు, అఖిలేశ్వరుడును అయిన ఆ శ్రీకృష్ణమూర్తిని నేనెట్లు దర్శింపగలను? ఆ ద్వారపాలకులు నీవెక్కడివాడివి, ఇచ్చటి కేల వచ్చితివి, ఎందులకు వచ్చితివి అని యడ్డుపెట్టిన నేనేమి చెప్పగలను, మఱి వారికేమైన కానుక నిచ్చుటకు శూన్యహస్తుడనైన నేనేమివ్వగలను? నా అదృష్టము, ఆతని దయాదృష్టి తప్ప, ఆలోచించుట కేమున్నది? అతడు నన్ను ఉపేక్షింపడు. అట్లెందుకు నేను భావించాలి? అని ద్వారకను ప్రవేశించెను. ముందఱకు పోయిపోయి,

సీ. విశదమై యొప్పు షోడశ సహస్రాంగనా కలిత విశాల సంగతి దనర్చి
మహనీయ తపనీయ మణిమయ గోపుర ప్రాసాద సౌధహర్మ్యములఁ జూచి
మనము బ్రహ్మానందమును బొందఁగడు నుబ్బిసంతోషబాష్పముల్ జడిగొనంగఁ
బ్రకట మై విలసిల్లు నొక వధూమణి మందిరమున నింతులు చామరములు వీవఁ

తే. దనరు మృదు హంసతూలికా తల్పమందుఁ
దానుఁ బ్రియయును బహువినోదములఁ దనరి
మహిత లావణ్య మన్మథమన్మథుండు
ననఁగఁ జూపట్టు పుండరీకాయతాక్షు

అప్పుడు కుచేలుడు గాంచెను - విశాలముగ కన్పించు పదునారువేల భార్యలతో కూడిన మహనీయమైన బంగారు మణిమయ రత్నములు పొదగబడిన గోపురములు ప్రాసాదములతో నున్న సౌధములు చూడగనే అతని మనస్సు బ్రహ్మానందముతో నిండిపోయెను. కన్నులు ఆనందబాష్పములతో వర్షించెను. ఒక పెద్ద సౌధమునందు భామలు చామరములతో వీచుచుండగ మృదువైన హంసతూలికా తల్పముపై విభుడు, తన ప్రియపత్నితో వినోదించుచు మహిత లావణ్యమన్మథ మన్మథుని వలె మెఱిసిపోవుచున్న శ్రీకృష్ణుని కుచేలుడు గాంచెను.

సీ. ఇందీవర శ్యాము వందితసుత్రాముఁ గరుణాలవాలు భాసురకపోలుఁ
గౌస్తుభాలంకారుఁ గామిత మందారు సురుచిరలావణ్యు సురశరణ్యు
హర్యక్షనిభ మధ్యు నఖిలలోకారాధ్యు ఘన చక్రహస్తు జగత్ప్రశస్తు
ఖగకులాధిపయానుఁ గౌశేయపరిధానుఁ బన్నగ శయను నబ్జాతనయను

తే. మకరకుండల సద్భూషు మంజుభాషు
నిరుపమాకారు దుగ్ధసాగర విహారు
భూరి గుణసాంద్రు యదుకులాంభోధి చంద్రు
విష్ణు రోచిష్ణు జిష్ణు సహిష్ణుఁ గృష్ణు

ఆ శ్రీకృష్ణుడెట్లు కనిపించెను? - నల్లకలువవంటి శ్యామలవర్ణుడు, దేవేంద్రునిచే వందనములను పొందువాడు, కరుణా నిలయుడు, మెఱయుచుండు చెక్కిళ్లు గలవాడు, కౌస్తుభమణిచే నలంకరింపబడినవాడు, కోర్కెలను దీర్చు మందారము వంటివాడు, సుందర లావణ్య రూపుడు, దేవతలకు శరణ్యమైనవాడు, సింహనడుమువాడు, అఖిలలోకములచే నారాధింపబడువాడు, గొప్ప సుదర్శన చక్రమును చేత ధరించువాడు, మూడు జగములలోను

శ్రేష్ఠుడు, గరుడవాహనుడు, పీతాంబరధారి, శేషతల్పశయనుడు, అరవిందాక్షుడు, మకరకుండలాభరణుడు, మృదు భాషణుడు, సాటిలేని సుందరరూపుడు, క్షీరసాగర విహారి, ఘనమైన గొప్పగుణములు గలవాడు, యాదవ కులచంద్రుడు, విష్ణుడు (సర్వవ్యాపి) జిష్ణుడు (విజయశీలి) రోచిష్ణుడు (తేజస్వి) సహిష్ణు (శాంత సహనశీలి) యైన శ్రీకృష్ణుని కుచేలుడు దర్శించెను.

మ. కని డాయం జనునంతఁ గృష్ణుఁడు దళత్కంజాక్షుఁ డప్పేదవి
ప్రుని నశ్రాంత దరిద్రపీడితుఁ గృశీభూతాంగు జీర్ణాంబరున్
ఘన తృష్ణాతురచిత్తు హాస్యనిలయున్ ఖండో త్తరీయుం గుచే
లుని నల్లంతనె చూచి సంభ్రమ విలోలుండై దిగెన్ దల్పమున్

కుచేలుడు నెమ్మదిగా శ్రీకృష్ణుని చెంతకు చేరుచుండగా, ఆ పేద విప్రుని, నిరంతర దరిద్రపీడితుని, కృశించిన శరీరముగలవానిని, చినిగిన వస్త్రధారిని, దాహపీడితుని, (శ్రీకృష్ణదర్శన పిపాసతో నిండిన చిత్తము గలవానిని) నవ్వుపుట్టించు ఆకారముగల వానిని, చినిగిన ఉత్తరీయముతో నున్నవానిని, కుచేలుని స్వామి అల్లంతదూరమున చూచి, వెంటనే పాన్పుదిగి, సంభ్రమముతో, మిత్రునాహ్వానించుటకు ఎదురేగెను.

క. కర మర్థి నెదురుగా జని
పరిరంభణ మాచరించి బంధు స్నేహ
స్ఫురణం దోడ్తెచ్చి సమా
దరమునఁ గూర్చుండఁ బెట్టెఁ దన తల్పమునన్

శ్రీకృష్ణుడు కుచేలునిజూచి, చేతులు చాచి ఎదురువెళ్లి, ఆలింగనము చేసుకొని, పూర్వపు స్నేహబంధమును స్మరించుకొని తోడ్తెచ్చి, తన పాన్పుపైననే కూర్చుండబెట్టెను. అట్లు కూర్చుండబెట్టి ప్రేమతో, బంగారుకలశములోని జలముతో కాళ్లుకడిగి, భక్తితో ఆ జలమును తలపై చల్లుకొని, చందన కర్పూర కస్తూరి కలసిన సుగంధ లేపనములను మేనుకి అలది, తాటాకు విసనకఱ్ఱ వీచి, రమ్యమైన ధూపమువేసి, మణిదీపములచే నివాళులర్పించి, పరిమళ పుష్పమాలికను సిగలో దుఱిమి, కర్పూర తాంబూలమిచ్చి, సాదరముగ

స్వాగతము పలుకగా, ఆ విప్రుడు, మేనుపులకాంకితమవగా, ఆనంద బాష్పముల కురిపించెను. అప్పుడు కాంతామణియైన రుక్మిణీదేవి చామరముతో వీవగా చెమటలు ఆరిపోయినవి. ఈ యద్భుత దృశ్యమును జూచి అంతఃపురకాంతలు అబ్బురముతో నిట్లనుకొనిరి:

ఉ. ఏమితపంబు సేసెనొకొ యీ ధరణీదివిజోత్తముండు దొల్
బాముున యోగివిస్ఫుర దుపాస్యకుఁ డై తనరారు నీ జగ
త్స్వామి రమాధినాథు నిజతల్పమునన్ వసియించి యున్న వాఁ
డీ మహనీయమూర్తి కెనయే మునిపుంగవు లెంతవారలున్

ఆహా! ఈ భూసురోత్తముడెంత ధన్యుడోకదా! ఇతడు పూర్వజన్మయందెట్టి తపము చేసెనో మఱి! యోగివరేణ్యులచే నిత్యమూ ఉపాసింపబడి ప్రకాశించు ఈ రమానాథుని, జగన్నాథుని నిజతల్పముపై కూర్చొని యున్న ఈ మహనీయమూర్తి కెంతటి మహాముని పుంగవులైనను సాటిరాగలరా? అంతేకాదు. ఆ స్వామిపైనను, ఆ తల్పముపైనను సర్వహక్కులూ తనవేయని భావించుచున్న ఆ రుక్మిణీదేవిని ఎడముగా విడిచి, ఆమె యేమనుకొనునో యను సంకోచమైనను లేకుండ, స్వామి, ఈ బ్రాహ్మణునికి ఎదురేగి, కౌగలించుకొని, సకల సేవలుచేసి, గౌరవించి, తన పాన్పుపైననే కూర్చుండబెట్టి వినయముతో పూజింపబడుటకు ఇతడెంతటి భాగ్యశాలియో కదా! అని యనుకొనిరి. అప్పుడు శ్రీకృష్ణుడు కుచేలుని చేతిని తనచేతిలోనికి తీసుకొని, గురుగృహమందు తాము విద్యార్థి దశలో గడిపిన దినములను సంఘటనలను జ్ఞప్తికి తెచ్చుకొని అడిగెను.

మిత్రమా! వేదాధ్యయన పరులైన సద్వంశ సంజాతయైన నీ భార్య సుశీలయై, నీకు అనుకూలవతియై, నీకు సమానముగ నున్నదికదా! చూడగా, నీకు గృహ, క్షేత్ర, ధన, భార్యాపుత్రాదులయందు మనస్సు తగుల్కొన్నట్లు కనబడుటలేదే! నేను కూడ ఎట్టి సంగమును లేక లోకసంగ్రహార్థమై కర్మాచరణము చేయుచుందును. కొందరుత్తములు నీవలెనే కోరికల మోహములో పడకుండ విహితకర్మల నాచరించుచు, సత్యనిష్ఠతోనే ప్రకృతితోడ సంబంధముంచుకొందురు.

జ్ఞాపకమున్నదా! మనము గురుకులమునందు గురువు చెప్పిన జ్ఞానార్థము లన్నియు తెలుసుకొంటిమికదా! మన గురువు అజ్ఞానాంధకారమునకు జ్యోతివంటివాడు. అవ్యయ పరబ్రహ్మానుభూతిని చెందినవాడు, సత్కర్మ నిరతుడు సత్త్వగుణ శ్రేష్ఠుడు, నిర్మలుడు, బుధనుతుడు, బ్రాహ్మణోత్తముడు, నేను సకలవర్ణాశ్రమములవారికి విజ్ఞానప్రదుడనైన జగద్గురువునైనప్పటికిని, సాంప్రదాయము ననుసరించి గురుసేవయే పరమధర్మమని ఆ మహాత్మునివద్ద శిష్యుడనైతిని. భూసురులలో ముఖ్యుడనై సకలవర్ణాశ్రమ ధర్మములయందు జ్ఞాన సుజ్ఞాన ప్రదుడనై, గురువునై నేనెల్లప్పుడును వెలయుచుందును.

అట్టి వర్ణాశ్రమ ధర్మములయందు అర్థకుశలురైనవారు (ధర్మములను బాగుగ గ్రహించినవారు) ఏకైక గురుడనైన నాయొక్క వాక్యము (బోధ)చే, నాపాదపద్మముల యందు ధ్యానపరులై, శీఘ్రముగ సంసారసాగరమును దాటగలరు.

అంతేకాదు, సకలభూతాంత రాత్ముడనైన నేను తపములు, దానములు, వ్రతములు, యజ్ఞములు, శమదమాది సాధనలచే సంతసింపనుగాని, గురుజనులను పరమభక్తితో సేవించువారియందు మిక్కిలి సంతసించెదను.

మిత్రమా! నీకు జ్ఞప్తియున్నదా! మనము గురుమందిరము నందున్నప్పుడు ఒకనాడు గురుపత్ని చెప్పుటచేత వంటకట్టెలను తెచ్చుటకు అడవికి వెళ్లియుంటిమి కదా! ఘుమ ఘుమ గర్జనలతో గాఢమైన కారుమేఘములు ఆకాశమంతా కప్పివేయగా, భయంకరముగా మెఱుపులు మెఱయగా, వృక్షములను పడద్రోయు ఝంఝామారుతములు వీచగా, ఏనుగు తొండముల వంటి ధారలతో కుంభవృష్టి కురియగా, సూర్యుడస్తమింపగా, అంతటా గాఢాంధకారము అలముకొనగ, మనము ఆ వానలో తడిసిపోయితిమి కదా! ఆ గాఢాంధకారమున ఏమియు కానలేక, దారితెలియక, ఎత్తుపల్లములు తెలియక, మనమొకరిచేతి నింకొకరు పట్టుకొని రాత్రిని గడిపివేస్తిమి. ప్రాతః కాలమందు తెలతెలవారినప్పుడు వనమంతా శోభతో నవ్వెను. పక్షులు కిలకిలారావములు చేసెను, సూర్యుడు తళతళ మెఱయుచు దర్శనమిచ్చెను. అప్పుడు మన గురువర్యుడు సాందీపని వచ్చి మనయొక్క స్థితిని గాంచి,

మిక్కిలి చింతించి, యిట్లనెను కదా! "అక్కటా! ఓ వటులారా! మీరు మా కొఱకు ఈ మహారణ్యమునకు వచ్చి, యిక్కట్లలో పడితిరి. ఈ విధముగ శిష్యులైన మీకు, మా ఋణము తీరిపోయినది. మీరు ఇకమీదట ధనము, బంధువులు, భార్యాపుత్రులు, వైభవము, జయము, ఆయుర్దాయము, ఉన్నతులను పొందెదరు" అని చెప్పి వాత్సల్యముతో మనల్ని తోడ్కొని వెళ్లెను కదా! మఱువగలమా? మనము చదువుకొనునప్పుడు ఎంత అన్యోన్య స్నేహవాత్సల్యములతో చేసిన పనులను మఱవగలమా!" అని యీ విధముగ మాధవుడు చెప్పగా కుచేలు డిట్లనెను : ఓ పద్మనాభా! మనము గురు మందిరమున నున్న దినములలో మంచి పనులెన్నియో చేసియుంటిమి. అది యట్లుండనిమ్ము,

క. గురుమతి దలఁపగఁ ద్రిజగ
ద్గురుఁడ వనందగిన నీకు గురుఁ డనఁగా నొం
డొరుఁ డెవ్వఁ డింతయును నీ
కరయంగ విడంబనంబ యగుఁగాదె హరీ!

ఓ శ్రీహరీ! బాగుగా నాలోచింపగా, మూడు జగములకు జగద్గురు వనదగిన నీకు వేఱుగా నింకొకడెవ్వరైనను గురువు కాగలడా స్వామీ! కాని నీ కొక గురువుండుట యొక విడ్డూరమే కదా! - అనగా విని మందస్మిత వదనార విందుడైన స్వామి యిట్లడిగెను : మిత్రమా! నీవిచ్చటికి వచ్చునప్పుడు, నా యందు భక్తితో నీవు నా కొఱకేమి కానుకను తెచ్చితివి? అది ఎంతటి స్వల్పమైన దైనను, దానిని పదివేలుగ స్వీకరించెదను. అట్లుగాక, భక్తిలేనివాడు, నీచవర్తనుడు, దుష్టాత్ముడు నైనవాడు, మేరుపర్వత సమానమైన దిచ్చినను, అది నాకు సమ్మతము కాదు. కావున

క. దళమైన పుష్పమైనను
ఫలమైనను సలిల మైనఁ బాయనిభక్తిన్
గొలిచిన జను లర్పించిన
నెలమిన్ రుచిరాన్న ముగనె యేను భుజింతున్

ఎడబాయని భక్తితో నన్ను కొలుచువా రర్పించిన దళమైనను, పుష్పమైనను, ఫలమైనను, జలమైనను, నేను ప్రీతితో నిష్టాన్నముగనే ఆరగించెదను.

అని శ్రీకృష్ణుడు చెప్పిన వినయోక్తులకు సంతసించినను, కుచేలుడు తాను తెచ్చిన అటుకులను ఇచ్చుటకు సంకోచించి, తలవంచుకొని మిన్నకుండెను.

బ్రాహ్మణుడు వచ్చిన పని భగవంతునకు తెలియదా? శ్రీకృష్ణుడిట్లు తలచెను: "ఈ మహాత్ముడు పూర్వజన్మలో ఐశ్వర్యకాంక్షతో ధన సంపాదన యందే చిత్తము నిలిపి నన్ను సేవింపలేదు. (ఆ కారణముచేతనే ఈ జన్మయందు కఠిన దారిద్ర్యమును అనుభవించవలసి వచ్చెను) ఇప్పుడైనను, భార్యను తృప్తిపరచుటకు ఇచ్చుటకు వచ్చెనుగాని, ఏమియును కోరడు. ఇతడు ఇంద్రాదులకు కూడ లభించని బహుప్రకారములైన సంపద విశేషములను తక్షణము ఇవ్వదగినవాడు" అని తలంచి, బ్రాహ్మణుని చింకివస్త్రము కొనలో ముడివేయబడిన అటుకుల మూటను చూచి ఇది ఏమియని తటాలున ఆ మూటను తన కరకమలములతో విప్పి దానినుండి ఒక పిడికెడు అటుకులు తీసుకొని, సకలలోకములను నన్నును, తృప్తిపరచుటకు యివి చాలునని వాటిని నోట వేసుకొనెను. శ్రీకృష్ణుడు మరలను ఒక పిడికెడు తీసుకొనుటకు చెయ్యి చాచగా రుక్మిణీదేవి వారించి, ఆ చేతిని పట్టుకొని, యిట్లనెను:

"స్వామీ! ఇతనికి బహుసంపదల నిచ్చుటకు ఒక్క పిడికెడు అటుకులు మాత్రముచాలును. మరి తినవద్దు, త్రిజగత్ సంపత్కరా! దేవదేవా! సర్వాత్మా! శ్రీహరీ!"

కుచేలుడా రాత్రి శ్రీకృష్ణభవనమున హృదయానందకరములైన అనేక పదార్థముల ననుభవించి, మృదుల శయ్యపై నిద్రించి, తాను స్వర్గసుఖముల కంటె అధికమైన భోగములననుభవించినట్లు భావించెను. మఱునాడు అరుణోదయమున మేల్కొని నిత్యకర్మలాచరించి, శ్రీకృష్ణుడు కొంతవరకు వచ్చి సాగనంపగా, నందనందన సందర్శనానంద లోలాత్ముడై, ముందుకు సాగుచు నిట్లు తలపోసెను.

క. నా పుణ్య మరయ నెట్టిదొ
యా పుణ్యనిధిం బ్రశాంతు నచ్యుతు నఖిల
వ్యాపకుఁ బ్రహ్మణ్యునిఁ జి
ద్రూపకుఁ బురుషోత్తమునిఁ బరుం గనుఁ గొంటిన్

ఆహా! చూడగా, నా పుణ్యమెంతటిదో కదా! ఆ పుణ్యనిధిని, ప్రశాంతుని, అచ్యుతుని, సర్వవ్యాపకుని, బ్రహ్మణ్యుని, చిద్రూపకుని, పురుషోత్తముని, పరమాత్మను ఈ విధముగ జూడగల్గితిని! (మహాయోగీశ్వరులకైనను దుర్లభమైన భాగ్యము)

పరికింపగా దరిద్ర దీన స్వభావుడనైన నేనెక్కడ, త్రిభువనైశ్వర్య స్వరూపిణియైన లక్ష్మీదేవికే పతియు, నివాసమును అయిన ఆ వాసుదేవుడెక్కడ? అతడే నన్ను కోరి, తోబుట్టువువలె నన్ను కౌగలించుకొని, దగ్గర జేర్చుకొని, నన్ను దైవముగ భావించి, తన పాన్పుపై కూర్చుండబెట్టుకొని, సత్కారములు జరిపించి, భార్యచే చామరమున వీవనిచ్చి, నాశ్రమను దీర్చి, శ్రీదేవి కుచములకు చందనములు పూయు చేతులతో నా పాదములు కడిగి, ప్రేమతో తుడిచెనా మహనీయుడు. ఆహా! నా భాగ్యమే భాగ్యము కదా!

శ్రీనిధియైన నా మిత్రుడింత ఘనముగా నా యెడల ప్రవర్తించి, ధనమేమియు నివ్వని కారణమును యోచింపగా తెలియునదేమన - దరిద్రునికి సంపదకలిగిన అతడు ధనమదాంధుడై, కన్నుమిన్ను గానక, తన్ను (భగవంతుని) చేరడని, గాని, కాకున్నచో ఆశ్రితుల ఆర్తిని హరించువాడును, కృపాసాగరుడును, అయిన మా కృష్ణుడు నన్ను సర్వవస్తు పరిపూర్ణునిగ చేయకుండునా?

అని తన మనమున తర్కించుకొనుచు నిజగ్రామమునకు పోయిపోయి ఏమి చూచెననగా - సూర్యచంద్రుల కాంతులవంటి చంద్రకాంత శిలలతోను, బంగారు రేకులతోను నిర్మింపబడిన సౌధములను, చిలుకలు, నెమళ్లు, హంసలు, కోకిలలు మొదలైన పక్షికూతలతో మాఱుమ్రోగు ఉద్యాన వనములను, తెల్లని పద్మములతోను, నల్లకలువలతోను ఎఱ్ఱని తామరలతోను నిండియున్న కొలనులను, మణిమయ కంకణ ముఖాభరణముల

నలంకరించుకొని ప్రకాశించు దాసదాసీజనములను, కలిగి శోభించు భవనమును చూచి ఆశ్చర్యచకితుడై ఈ అపూర్వమైన వైభవోన్నతమైన లక్ష్మీనివాసమునందు ఎట్టి పుణ్యాత్ముడు నివసించు చుండునో యని విస్తుపోవుచుండగా

దేవకాంతల వంటి సుందరీమణులప్పుడు ఆ ఇంటినుండి వచ్చి, లోనికి దయచేయుడు అని సంగీత వాద్యనృత్యములతో నాతని ఆహ్వానించి, లోనికి గొనిపోయిరి. అతని సతీమణి అప్పుడాతని కెదురువచ్చి ఆనందబాష్పములతో నాహ్వానించెను.

ఆ కుచేలపత్ని, భర్తరాకను జూచి, మనస్సులో నుప్పొంగి, వైభవోపేతయై, మానవరూపధారిణియైన మహాలక్ష్మివలె మెఱియుచు ఆనందబాష్పములతో పతిదేవు పాదములను మనస్సులో మొక్కి అతనిని భావనలోనే ఆలింగనము చేసుకొనెను. దివ్యాంబరా భూషితలైన అప్సరసల వంటి పరిచారికలు సేవలు చేయుచుండగా, నిజకాంతను చూచి బ్రాహ్మణోత్తముడు, నిజమిత్రుని స్మరించెను.

శ్రీకృష్ణునిచే ననుగ్రహింపబడిన ఐశ్వర్యములో ఆ బ్రాహ్మణ దంపతులు అనురాగము వెల్లివిరియగ నిత్యానందము ననుభవించుచు, వైభవమున నుండిరి.

ఇంతకాలమును అంతులేని దారిద్ర్య దుఃఖసాగరమున మునిగియున్న నాకు చివరికి కలిగిన ఐశ్వర్యమువలన నిప్పుడు, సుఖములు ప్రాప్తించుటచేత మనోవికారములు తలెత్తరాదు అని ఆ భూసురుడు జాగరూకుడై యుండెను.

ఈ సంపదలన్నీ ఆ శ్రీహరియొక్క కరుణాకటాక్షము వలననే లభించినవి. నేను అర్థినై ఆయన దర్శనము చేయుటకు వెళ్లియుంటిని. అతనికి నా వృత్తాంత మంతయును తెలిసియును, పైకి ఏమియును చెప్పకుండా, నేను తిరిగి వచ్చివేసిన పిమ్మట ఈ సంపదలన్నిటిని అనుగ్రహించెను. ఆ పురుషోత్తముడు భక్తినిష్ఠులైన సజ్జనులు, లేశమాత్రమైన (అతిస్వల్పమైన) పదార్థమేదైనను భక్తిపూర్వకముగ సమర్పించిన, దానిని కోటిరెట్లుగా పెంచి స్వీకరించి అనుగ్రహించు ననుటకు నాకథయే ఒక దృష్టాంతము కాదా! దరిద్రుడు,

శిథిలదేహుడు, చినిగిన గుడ్డలవాడు అని నన్ను మనస్సులోనైన ఏవగించుకొనక, నా వద్దనున్న పిడికెడు అటుకులను ఆదరమున ఆరగించి నన్ను కృతార్థుని చేయుట అతని నిర్హేతుక (అకారణమైన) దయకాదా! అట్టి కరుణాసాగరుడైన గోవిందుని చరణారవిందముల యందు నాకు అచంచలభక్తి కలుగుగాక! అని ఆ శ్రీహరియందు ఎప్పటివలె భక్తి తాత్పర్యములు కలిగియుండి, పత్నీసమేతుడై భోగముల యందాసక్తి లేనివాడై, రాగాదిదోషరహితుడై, నిర్వికారుడై, కర్మలను భగవదర్పితము జేసి, బంధములనొదిలించుకొని, మోక్షప్రాప్తిని పొందెను మహాత్ముడైన కుచేలుడు.

ఆ. **దేవదేవుఁ డఖిలభావజ్ఞుఁ డాశ్రిత**
వరదుఁడయిన హరికి ధరణిసురులు
దైవతములు గాన ధారుణీదివిజుల
కంటె దైవ మొకడుఁ గలఁడె భువిని

దేవదేవుడును, భావమును గ్రహించువాడును, ఆశ్రితవరదుడును అయిన శ్రీహరికి బ్రాహ్మణులే దేవతలు కావున బ్రాహ్మణుని కంటె దైవము వేఱొక డీ పృథ్వియందు కలడా!

క. **మురహరుఁ డిట్లు కుచేలునిఁ**
జరితార్థునిఁ జేసినట్టి చరితము విను స
త్పురుషుల కిహ పర సుఖములు
హరిభక్తియు యశముఁ గలుగు నవనీనాథా!

పరీక్షిన్మహారాజా! ఈ విధముగ శ్రీహరి కుచేలుని చరితార్థునిగా చేసినట్టి చరితమును వినిన సత్పురుషులకు ఇహపరసుఖములు, హరిభక్తి కీర్తి కలుగును.

కుచేలోపాఖ్యానము సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

భాగవత భక్తితత్త్వము

మానవులకు మోక్షప్రాప్తి సాధనలుగా జ్ఞాన, కర్మ, భక్తి మార్గములు నిర్దేశింపబడినవి. జ్ఞానమార్గమునకు, వేదాంతశాస్త్రాధ్యయనము, పరిణతి చెందియున్న సునిశిత బుద్ధికుశలత, మిక్కిలి అవసరము. కర్మమార్గముకూడ, వర్ణాశ్రమ ధర్మవిహిత కర్మానుష్ఠాన పరత అవసరము గనుక, అందరికిని, అంతసులభ సాధ్యము కాదు. అందుచేతనే స్త్రీ, పురుష పండిత పామర వయోవర్ణ విభేదము లేవియును లేక, అందరును సులువుగా నాచరింపగల్గునది కేవలము భక్తిమార్గమొక్కటియే అని చెప్పబడినది. పోతనగారి భాగవతము నందు భక్తికే ప్రాధాన్యత నివ్వబడినది. ఆదిశంకరులవారు కూడ "మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరిత్యభిధీయతే" అని వ్రాసియుంటిరి.

"భక్తి" అనగా భగవంతుని యందు అత్యంత ప్రేమయని నారదమహర్షి నిర్వచించెను. ఈ ప్రేమను భక్తుడేవిధముగ ప్రకటింపగలడు? ప్రేమకు సంకేతము, త్యాగము, సమర్పణము. తనకున్నదంతా నిశ్శేషముగ భక్తుడు తన ఇష్టదైవమునకు అర్పణ చేయుటయే భక్తి అనవచ్చును. స్వాత్మార్పణయే భక్తి అదియే అనన్యభక్తి, శరణాగతి.

భక్తునకు భగవంతునియందు భక్తి కుదరవలెనన్న ఆయనయొక్క లీలా గుణవైభవ గాథలను, సర్వజ్ఞతను, సర్వవ్యాపకత్వమును, సర్వశక్తి మంతత్వమును, సర్వసుహృద్భావమును, శరణాగత వత్సలతను, పదే పదే మననము చేసుకొనవలెను. ఈ గుణగణములను భాగవతములోని భక్తులు తమ స్తుతి స్తోత్రములద్వారా విరివిగా ప్రస్తుతించిరి. అనన్యభక్తుడు తన ప్రియతమ దైవతమునుండి వియోగమును ఒక్కక్షణమైనను సహింపజాలడు. దీనికి గోకులములోని గోపికల విరహవేదనయే ఒక చక్కని ఉదాహరణ.

భక్తునియొక్క జన్మజన్మల పరిణామ పరిపక్వదశకు అనుగుణముగా భగవంతునితో నతనికి అనుబంధమేర్పడును - దాస్యభక్తి, వాత్సల్యభక్తి, సఖ్యభక్తి, మధురభక్తి, వైరభక్తి మొదలైనవి. నారదుడు యుధిష్ఠిరునితో నిట్లు చెప్పెను:

శా. కామోత్కంఠత గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాలముఖ్యనృపతుల్ సంబంధులై వృష్ణులుం
బ్రేమన్ మీఁరలు భక్తి నేము నిదె చక్రిం గంటి మెట్లైనను
ద్ధామధ్యానగరిష్ఠుఁడైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా

ధర్మనందనా! కామోద్రేకముచే గోపికలును, భయముచే కంసుడును, వైరప్రక్రియలచే శిశుపాలాది రాజులును, బంధుత్వముచే యాదవులును, ప్రేమచే పాండవులైన మీరును, భక్తిచే మునులమైన మేమును ఈ భూమిపై (ఇక్కడ) శ్రీహరిని చూడగల్గితిమి. ఏవిధమునైనను, నిరంతర సంస్మరణ ధ్యానాదులచే శ్రీహరిని చేరవచ్చును.

మఱియు ప్రహ్లాదుడు తండ్రియైన హిరణ్యాకశిపునితో విష్ణువును నవవిధ భక్తులతో నీవిధముగ సేవింపవచ్చునని ఇట్లు చెప్పెను:

మ. తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిదిభ క్తిమార్గముల సర్వాత్మున్‌హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా

తండ్రీ! మనోవాక్ కాయకర్మల నొక్కటిగానే ఉంచుకొనుట (త్రికరణశుద్ధి) శ్రవణము (విష్ణుకథాశ్రవణము), దాసత్వము (భగవంతునియందు కింకర భావము) వందనము, అర్చనము, సేవ (పరిచర్యలు చేయుట) ఆత్మలో నెఱుక, (భగవంతుడే సర్వస్వమని సతతము మననము చేయుట), ఆత్మనివేదనము (ఆత్మార్పణము), సంకీర్తనము, చింతనము (మననధ్యానాదులు), ఈ తొమ్మిది భక్తిమార్గముల ద్వారా సర్వాత్ముడైన శ్రీహరిని నమ్మి, సజ్జనుడై యుండుటయే, సత్యముగ శ్రేయస్కరమని నమ్ముచుంటిని దైత్యోత్తమా!

ఇటువంటి భాగవత భక్తితత్త్వమును ప్రకటించు కొన్ని స్తుతి స్తోత్రములను, బోధలను ఈ అనుబంధమునందు పొందుపరచడమైనది.

1. అంబరీషుడు

మహాకవి బమ్మెర పోతన విరచిత మహాభాగవతము భక్తిప్రధానమైన గ్రంథము. ప్రహ్లాదాది పరమభాగవతోత్తముల గాథలలో అంబరీషోపాఖ్యాన మొకటి. భక్తఅంబరీషునిపై బ్రాహ్మణశాపముగూడ పనిచేయనంతటి మహా పుణ్యాత్ముడతడు. అదెట్లన -

శా. సప్తద్వీపవిశాల భూభరము దోఃస్తంభం బునం బూనిసం
ప్రాప్తశ్రీయుతుఁడై మహావిభవ సంపచ్చాతురిం గల్గి దు
ర్వ్యాప్తిం జెందక వైష్ణవార్చనల మేరం గాలముం బుచ్చుచున్
సుప్తిం బొందక యొప్పె సద్గుణ గరిష్ఠుం డంబరీషుం డిలన్

సప్తద్వీపముల భూభారమును చేతులే స్తంభములుగా వహించి, (పాలించి) ప్రాప్తించిన సిరిసంపదలతోను, మహావైభవముతోను, మిక్కిలి నేర్పు, కౌశలములతోను, చెడును చేరనీయక, ఏవిధమైన అశ్రద్ధ, అలసత్వములకు లోనుగాక శ్రీమహావిష్ణువు సేవార్చనల యందే నిమగ్నుడై సద్గుణ శ్రేష్ఠుడైన అంబరీషుడు ఈ భూమిపై వెలసియుండెను.

సీ. చిత్తంబు మధురిపు శ్రీపాదములయంద పలుకులు హరిగుణ పఠనమంద
కరములు విష్ణుమందిర మార్జనములంద శ్రవములు హరికథా శ్రవణమంద
చూపులు గోవింద రూపవీక్షణమంద శిరము కేశవ నమస్కృతులయంద
పదము లీశ్వరగేహ పరిసర్పణములంద కామంబు చక్రి కైంకర్యమంద

తే. సంగమచ్యుత జనగుణ సంగమంద
ఘ్రాణ మసురారి భక్తాంఘ్రి కమలమంద
రసన తులసీదళములంద రతులు పుణ్య
సంగతులయంద యా రాజచంద్రమునకు

ఆ రాజచంద్రుడైన అంబరీషునకు, చిత్తమెల్లప్పుడును మధుసూదనుని పాదపద్మములపైననే యుండును. వాక్కు శ్రీహరి గుణ సంకీర్తనమునందే యుండును. చేతులు విష్ణుమందిరములను శుభ్రపరచుటయందే నిమగ్నమై

యుండును. చెవులు శ్రీహరి కథాశ్రవణముల కొఱకే కాంక్షించుచుండును. చూపులు గోవిందుని మోహన రూపవీక్షణము కొఱకే చూచుచుండును. శిరము కేశవుని మొక్కుట యందే మగ్నమైయుండును. పాదములు విష్ణుమందిర ప్రదక్షిణలలోనే నడుచుచుండును. కోరికలు శ్రీహరి కైంకర్యము (సేవ) కొఱకే కలుగును. చెలిమి విష్ణుభక్తుల తోడను, విష్ణుగుణ చర్చల యందును, నాలుక తులసీదళాస్వాదనమందును, ముక్కు, మురవైరి భక్తుల పాదపద్మ సుగంధమునందును, ప్రీతి, శ్రీహరికి చెందిన పుణ్యసంగతుల యందును, ఎల్లప్పుడును ఉండును. మఱియు ఆ రాజు, పవిత్రుడై, ఘనవైభవమున, వశిష్ఠాది మునిశ్రేష్ఠులతో కూడి, సరస్వతీనదీ తీరమున విష్ణుదేవుని గూర్చి అనేకమైన అశ్వమేధయాగములు చేసి, విరివిగా దక్షిణలుపెట్టి, బంగారము, మట్టిముద్దలను సమదృష్టితో చూచి, సర్వకర్మలను శ్రీహరి పరము చేయుచు పృథివిని పాలించెను. విష్ణుభక్తులయందుగాని విష్ణువునందుగాని ఎప్పుడైన కారణాంతరమువలన భక్తిశ్రద్ధలకు బాధ కలుగునని శంక కలిగినప్పుడు, కర్తవ్య కర్మలను నిర్వహింపుచు, రాజర్షివలె అసంగుడై భక్తిని కూడ నెఱపుచుండెను.

మఱియు, ఆ మహాభాగవతుడు,

క. హరి యని సంభావించును
హరి యని దర్శించు నంటు నాఘ్రాణించున్
హరి యని రుచిగొనఁదలఁచును
హరిహరి! ఘను నంబరీషు నలవియె పొగడన్

ఆ అంబరీషుడు, "హరి" యనుకొనుచు భావించును (ఆలోచించును). హరీయనుచు చూచును, హరీ యనుచు తాకును, హరీయనుచు వాసనజూచును, హరీ యనుచు చవిజూచును (ఏ కార్యము చేసినను హరిస్మరణతోనే చేయును) హరిహరీ! (ఆహా, ఎంతగొప్పతనము!) ఘనుడైన ఆ అంబరీషుని పొగడవశమా!

ఆ పుణ్యచిత్తుడు ఈ విధముగ నీశ్వరాధీనుడై నెమ్మదిగ రాజ్యము చేయుచుండగ :-

ఆ. అతని కీహ మానె హరులందుఁ గరులందు
ధనములందుఁ గేళివనములందుఁ
బుత్రులందు బంధు మిత్రులయందును
బురమునందు నంతిపురమునందు

ఆ మహాత్మునకు, రాజరికపు హంగులైన గజములు, అశ్వములు, ధనసంపదలు, ఉద్యానవన కేళీ విహారాదులు, పుత్రులు, బంధుమిత్రాదులు, రాజధాని, రాజాంతఃపురము లేవియును ఆసక్తికరములు కావు. వాటియందే మాత్రము అతనికి వాంఛలులేవు.

పిమ్మట కొంతకాలమునకు ఆ మహారాజు సంసారమునందు సంగము విడిచి, నిర్మలుడై ఏకాంతమున భక్తిపరవశుడైయుండ ఆ రాజర్షికి, భక్తవత్సలుడైన పురుషోత్తముడు, శత్రుశిక్షణ ఆత్మరక్షణకొఱకై తన సుదర్శన చక్రమును నియోగించి వెడలెను.

క. తన తోడినీడకైవడి
ననురూప గుణాఢ్యయైన యాత్మ మహిషితో
జనవిభుఁడు ద్వాదశీవ్రత
మొనరఁగహరిఁగూర్చి చేసె నొక యేఁడధిపా!

ఆ అంబరీషుడు, తన తోడు నీడవంటి అనురూపవతి, గుణవతియైన సహధర్మచారిణితో కూడి, శ్రీహరిని గూర్చి ఒక సంవత్సరము ద్వాదశీవ్రత మాచరించుటకు పూనుకొనెను, పరీక్షిన్మహారాజా!

ఇట్లు వ్రతముచేసి, ఆ వ్రతాంతమున, కార్తీక మాసమున మూడురాత్రులు ఉపవసించి, కాళిందీ నదీజలములో స్నానమాచరించి, మధువనమున మహాభిషేక విధానమున శ్రీహరికి అభిషేకముచేసి, మనోహరములైన గంధాక్షతలను సమర్పించి, పుష్పములతో పూజించి, తదుపరి,

పాలవర్ష ప్రవాహములను కురిపించునట్టివి, అందమైన బంగారు కొమ్ములతోను వెండి గిట్టలతోను, దూడలతోను ఉన్నవియగు ఆరువేల కోట్ల పాడిగోవులను బ్రాహ్మణులకు దానమిచ్చెను. అనేకులైన బ్రాహ్మణులకు

కడుపులనిండుగ మృష్టాన్న భోజనములు పెట్టించి, తానొక్కడే పారణము చేయుటకు సిద్ధపడగా, నంతలోనే

క. భాసుర నిగమ పదోప
న్యాసుఁడు సుతపోవిలాసుఁ డనుపమ యోగా
భ్యాసుఁడు రవిభాసుఁడు దు
ర్వాసుఁడతిథియయ్యెదన్ని వాసంబునకున్

తేజోమయుడును, వేదపదములను విశ్లేషింపగల ధీశక్తి గలవాడును, ఉత్తమ తపశ్శక్తి సంపన్నుడును, రవితేజో భాసుడును అయిన దుర్వాసమహాముని, అంబరీష గృహమునకు అతిథిగా విచ్చేసెను. వెంటనే రాజు లేచి, నిల్చొని మునివర్యునికి ఎదురేగి, నమస్కరించి ఉచితాసనమునిచ్చి, పాదములు కడిగి పూజించి, క్షేమములడిగి, తన యింట భోజనము చేయుమని ప్రార్థించిన, ఆ మహాత్ముడు సంతసించి, అంగీకరించి, కాళిందీనదిలో స్నానమాచరించి వచ్చెదని చెప్పి వెళ్లెను. ముని, నదిలో పరమధ్యానములో మునిగి ఎంతకూ తిరిగి రానందున, ఇంకను ముహూర్తకాలము కొద్దిమాత్రమే మిగిలియుండ, ద్వాదశి పారణము చేయవలసియున్నది గావున, విజ్ఞులను రావించి, వారితో నిట్లనెను:

క. ముని నీరుసొచ్చి వెడలఁడు
చనియెడు ద్వాదశియు నింత (సనియె న్నీలో
నన పారణయున్ వలయును
వినిపింపుండర్హధర్మ విధ మెట్టిదియో

విబుధులారా! దూర్వాసముని నదికి స్నానమునకు పోయి యింకను తిరిగి రాలేదు. ద్వాదశి దాటిపోవనున్నది. ఈ లోపలనే పారణము చేయవలయును కదా! కావున అతిథిపట్ల అపరాధము జరుగకుండ, ఏమిచేసిన తగియుండునో ఆ విధమును నాకు తెలియజేయుడు. అని ప్రశ్నించిన రాజుకు బ్రాహ్మణు లిట్లనిరి.

ఆ. అతిథి వోయి రామి నధిప! యీ ద్వాదశి
పారణంబు మానఁ బాడిగాదు
గుడువకుండుటఁ గాదు కుడుచుటయును గాదు
సలిలభక్షణంబు సమ్మతంబు

రాజా! అతిథి స్నానమునకు పోయి ఇంకను తిరిగిరానందున, ఈ ద్వాదశి పారణ మానరాదు గనుక, శుద్ధజలమును కొద్దిగ సేవించిన, నుపవాసము ముగించినట్లును, అతిథి గురించి భోజనము చేయకుండ వేచియున్నట్లును అగును. ఇది ధర్మసమ్మతమే అని ధర్మసందేహము తీర్చిన, నా రాజర్షి శ్రేష్ఠుడు మనస్సులో శ్రీహరిని తలంచి, జలముసేవించి, ముని రాకకై యెదుఱు చూచుచున్న సమయమున

సీ. యమునలోఁ గృతకృత్యుఁడై వచ్చి రాజుచే సేవితుండై రాజుచేష్టితంబు
బుద్ధిలో నూహించి బొమముడి మొగముతో నదరెడిమేనితో నాగ్రహించి
రెట్టించి యాఁకలి గొట్టుమిట్టాడంగ నీ సంపదున్మత్తు నీనృశంసు
నీ దురాహంకారు నిందఱుఁ గంటిరే విష్ణుభక్తుఁడుగాఁడు వీఁడు నన్నుఁ

తే. గుడువ రమ్మని మునుముట్టఁ గుడిచినాఁడు
ధర్మభంగంబు సేసి దుష్కర్ముఁడయ్యె
నయిన నిప్పుడు సూపెద నన్ని దిశల
నేనుఁ గోపింప మాన్పువాఁ డెవ్వఁ డనుచు

దూర్వాస మహాముని యమునలో స్నానమాచరించి వచ్చెను. అంబరీషు డతనికి ఉచిత సేవలు చేసెను. రాజు పారణము చేసినట్లు ముని, బుద్ధి ద్వారా ఊహించెను. మిక్కిలి కృద్ధుడయ్యెను. బొమముడి (కనుబొమలు ముకుళించి) ముఖముతో, వణకుచున్న శరీరముతో, ఆకలిబాధ పీడింపగా, కోపావేశుడై, రెట్టించిన కంఠధ్వనితో నిట్లనెను. “ఈ నరఘాతకుడు, సంపదున్మత్తుడు (ధనమదాంధుడు), దురహంకారుడు, వీడు విష్ణుభక్తుడు కాడు, అందరూ చూచుచుంటిరా? వీడు నన్ను భోజనమునకు ఆహ్వానించి, తానే మొట్టమొదట ఆరగించినాడు, చూచితిరా! వీడు ధర్మభంగము చేసి

దుష్కర్ముడైనాడు. వీనికి నేనెవరినో ఇప్పుడె చూపించెదను. అన్నిదిశలలోను, నాకోపము నుండి వీనిని ఎవ్వడు రక్షించునో నేను చూచెదను" అని,

చ. పెట పెటఁ బండ్లు గీటుచును భీకరుఁడై కనుగ్రేవ నిప్పుకల్
పాట పాట రాల, గండములు పొంగ, మునీంద్రుఁడు హుంకరించుచున్
జట మొదలంటఁగాఁ బెఱికి చక్కన దానన కృత్య నాయుధో
త్కట వరశూల హస్తయుతఁగా నొనరించి కవించె రాజు పై

క్రోధోద్రేకుడైన ఆ ముని, పటపట పండ్లు కొరుకుచు, భయంకరుడై, కన్నుల నుండి నిప్పుకణములు పొటపొట రాల్చుచు, చెక్కిళ్లు కోపముతో జేవురించి పొంగగ, హుంకరింపుచు, తన తలలోని ఒక జటను మొదలంటగా బెఱికి, దానినుండి ఒక కృత్యను (దుష్టశక్తి స్వరూపిణిని) సృష్టించి అంబరీషునిపై ప్రయోగించెను. ఆ కృత్య, శూలమును ధరించి, కాలాగ్నివలె విజృంభించుచు, సుఱసుఱచుట్టివేయుచు, పెద్దపెద్ద పాదములతో నేల ద్రొక్కుచు, అంబరీషుని సమీపించి, మీద పడబోయెను.

అప్పుడు విశ్వరూపుడును, సర్వవ్యాపియునైన విష్ణుమూర్తి వెఱ్ఱి బ్రాహ్మణుడైన దూర్వాసుని దుష్టకృత్యమును చక్కబెట్టి రమ్మని తన సుదర్శనచక్రమును పంపించగా నది ప్రళయకాల అగ్నిహోత్రమువలె దిగివచ్చి, ముని ప్రయోగించిన కృత్యను దహించివేసి, కుటిలాత్ముడైన ఆ ముని వెంటబడెను. అంత అతడు తలదాచుకొనుటకు మేరుపర్వత గుహయందు చొచ్చెను. ఆ చక్రము కూడ పెనుగాలిలోని దావానలము (అగ్నిజ్వాల) వలె అతనిని వెంబడించెను.

మ. భువిఁ దూఱన్ భువిఁ దూఱు నబ్ధిఁ జొర నబ్ధుల్ సొచ్చు నుద్వేగి యై
దివిఁ బ్రాఁకన్ దివిఁ బ్రాఁకు దిక్కులకుఁ బో దిగ్వీథులం బోవుఁ,జి
క్కి వెసన్ గ్రుంగినఁ గ్రుంగు, నిల్వ నిలుచుం, గేడింప గేడించు, నా
క్కవడిన్ దాపసు వెంట నంటి హరిచక్రం బన్యదుర్వక్రమై

దూర్వాసుడు తలదాచుకొనుకు భూమిలో దూరిన ఆ సుదర్శన చక్రమతనిని వెంబడించుచు భూమిలో దూఱును. అతడు సముద్రమునందు

జొచ్చిన, నదియు ఉద్వేగముతో సముద్రమునందు చొచ్చును. అతడాకాశమున కెగ(బ్రాకిన ఆ చక్రము కూడ ఆకాశమున వెంటబడును. అతడు దిక్కులకుపోయిన నా చక్రమును ఆ దిక్కులకు పో వెంబడించును. అతడాగిపోయిన నా చక్రము కూడ నాగిపోవును. అతడు మందగమనుడైన నా చక్రమును వేగము తగ్గించును. మఱియు నా మునిని వెంటనంటి ఆపశక్యము కాకుండ వెంబడించెను.

ఆ దూర్వాసుడు ఏ లోకమునకు పోయినను, చక్రమాలోకమునకు వెంబడించుచుండుటచేత ఆ చక్రానల జ్వాలలు దుర్భర మగుచుండగా భయకంపితుడై యతడు దేవజ్యేష్ఠుడును, లోకేశుడును అయిన బ్రహ్మదేవుని కడకు పోయి "ఓ విధాతా! విశ్వసృష్టి కార్య ధురంధరా! ఈ చక్రముయొక్క భయమునుండి నన్ను కరుణతో కాపాడవా ప్రభూ" అని వేడుకొనిన, బ్రహ్మ యిట్లనెను.

"మునివర్యా! శ్రీహరియొక్క ఈ సుదర్శన చక్రాగ్నిజ్వాలల నెవ్వడును వారింపలేడు. నేను, శివుడు, దక్షుడు, ఇంద్రాదులు, ప్రజాపతులు, భృగువు, రాజులు, ఆ విష్ణువుయొక్క ఆజ్ఞలు శిరోధార్యములుగా గ్రహించి కార్యములు నిర్వహింతుము. అందుచేత ఈ సుదర్శనుని నేను ఆపలేను. అని బ్రహ్మ చెప్పగా నా ముని కైలాసమునకు పోయి, శివుని ప్రార్థించి, చక్రము బారినుండి రక్షింపుమని వేడుకొనెను. మహాదేవుడిట్లనెను:

వినుము నాయనా! ఏ విశ్వేశ్వరుని నుండి సకల జీవరాశులుద్భవించి, లయమును పొందునో, ఎవ్వని మాయాశక్తిచే మేము కూడా భ్రాంతిని చెందుచుంటిమో ఎవ్వని మాయను నేను, దేవలఋషి, ప్రహ్లాదుడు, నారదుడు, బ్రహ్మ, సనత్కుమారుడు, ధర్ముడు, కపిలుడు, మరీచ్యాది అఖిల దేవతలును, సిద్ధులును, ఆ మాయామూలమిట్టిదని యెఱుంగలేమో, అటువంటి నిఖిలనాథుని యొక్క ఆయుధశ్రేష్ఠమైన సుదర్శన చక్రమును తొలగించుట మాకు వశముకాదు సుమా! కావున, మునీంద్రా! నీవు ఆ మహాత్ముడే (విష్ణువునే) శరణువేడుము. నీకు మేలు చేయగలవాడు అతడే అని శివుడు పలికిన, దూర్వాసుడు నిరాశుడై వైకుంఠమున కేగెను.

శా. ఆ వైకుంఠములోని భర్మ మణి సౌధాగ్రంబు పై లచ్చి దా
గ్రేవన్ మెల్లన నర్మభాషణములం గ్రీడించుపుణ్యున్ హరిన్
దేవాధీశ్వరుఁ గాంచి "యో వరద! యో దేవేశ! యో భక్తర
క్షా విద్యా పరతంత్ర! మానుపఁగదే, చక్రానల జ్వాలలన్

ఆ వైకుంఠములో, మణిమయ సువర్ణ సౌధమున, లక్ష్మీదేవి చెంతనుండగా మధుర మనోహర సంభాషణలతో క్రీడింపుచుండగా, పుణ్యపురుషుడు, దేవాధీశ్వరుడు నైన శ్రీహరిని గాంచి, దూర్వాసుడిట్లు ప్రార్థించెను: "ఓ వరదా! ఓ దేవేశా! ఓ భక్తరక్షణ విద్యావిశారదా! నీ యొక్క చక్రాగ్నిజ్వాలల నుండి నన్ను రక్షింపవా?"

ఉ. నీ మహిమార్ణవంబు తుది నిక్కముగా నెఱుఁగంగలేక నీ
ప్రేమకు వచ్చు దాసునకుఁ గ్రించతనంబున నెగ్గుసేసితిన్
నా మఱపున్ సహింపు మట నారకుఁడైన మనంబులో భవ
న్నామము చింతసేసిన ననంత సుఖస్థితి నొందకుండునే

ఓ ప్రభూ! నీ యొక్క అనంత మహిమాసాగరతీరము నెఱుంగలేక, నీకు మిక్కిలి ప్రేమపాత్రుడైన నీ యొక్క దాసునకు, నా నీచగుణముచే కీడు చేయదలచితిని నా యొక్క పొఱపాటును మన్నింపుము దేవా! నరకమునకు పోవలసిన వాడైనను, మనస్సులో నీ దివ్యనామము స్మరించి, అనంత సుఖసౌఖ్యములు పొందును కదా!

అని పలికి, శ్రీహరి పాదకమలములకు మ్రొక్కి, లేవకయున్న దూర్వాసునితో శ్రీహరి యిట్లనెను :

ఓ మునీంద్రా! బుద్ధిమంతులైన సాధువులు పట్టుదలతో, నిర్మలమైన భక్తియనెడి లతలతో నన్ను నిలబెట్టి, మదపుటేనుగును బంధించునట్లు, నా హృదయమును దొంగిలించి, బంధించి యుంచుదురు. నేనును, వలలో చిక్కిన జంతువువలె, భక్తజనవత్సలత యనెడి వలలో చిక్కుకొని యుందును.

విప్రవర్యా! నేను క్రతువులకు, పూజలకు గోదాన సువర్ణదానాది దానములకు వ్రతములు, తీర్థయాత్రలు విరివిగా చేయు పుణ్యాకాంక్షులకు,

నేను చిక్కనుసుమా! మానసమున అతులిత భక్తి కలిగిన వారికి మాత్రమే నేను దక్కుదును.

నన్ను నమ్మువారికి నా భక్తులైనవారికి, నేనే పరమగతినై యుందును. నా భక్తుడెచ్చటికి పోయిన, వానివెంట నేనును పోవుచుందును. అదియునుగాక,

ఆ. తనువు మనువు విడిచి తనయులఁ జుట్టాల
నాలి విడిచి సంపదాలి విడిచి
నన్నె కాని యన్య మెన్నఁడు నెఱుఁగని
వారి విడువ నెట్టివారి నైన

ఓ మునీంద్రా! దేహధ్యాసను విడిచి, మనుగడను మఱచి, భార్యాపుత్ర బంధువర్గములయందు సంగమును విడిచి, ధనసంపదలను విడిచి, నన్నే తప్ప అన్యమేదియు నెఱుగనివారిని, ఎట్టివారైనను, వారిని రక్షింపకుండ విడిచిపెట్టను. పంచజ్ఞానేంద్రియముల పోకడలను వశము నందుంచుకొని, బుద్ధిమంతులు (ఉత్తమభక్తులు) నన్నే తమ హృదయములందు ప్రతిష్ఠించుకొని యుంచుకొందురు.

క. సాధుల హృదయము నాయది
సాధుల హృదయంబు నేను జగముల నెల్లన్
సాధుల నేన యెఱుంగుదు
సాధు లెఱుంగుదురు నాదు చరితము విప్రా!

ఓ బ్రాహ్మణోత్తమా! సాధువులు తమ హృదయములను నాకర్పింతురు. గావున, అవి, నావియే. జగములన్నిట సాధువుల హృదయము నేనే (వారి హృదయముల నిండా నేనే యుందును.) సాధువులను నేనే యెఱుగుదును. నా యొక్క చరితమును (గుణగణములను) సాధువులే ఎఱుగుదురు.

ఆ. ధారుణీసురులకుఁ దపము విద్యయు రెండు
ముక్తి సేయుచుండు ముదముతోడ
దుర్వినీతులగుచు దుర్జనులగువారికి
నివియె గీడు సేయ కేల యుండు

ఓ విప్రుడా! సద్బ్రాహ్మణులకు తపస్సు, విద్యయు, ఆనందమునిచ్చి, ముక్తికి చేరువజేయును. కాని, నీతి బాహ్యులైన దుర్జనులకు ఆ తపస్సు విద్యలే కీడు చేయకుండ ఎట్లు విడిచిపెట్టును? సాధువులలో నా తేజము మిక్కుటముగ నుండును. ఆ తేజమే, సాధువులను కష్టపెట్టెడివారిని అగ్నిజ్వాలవలె భయపెట్టి, ఆనందమును హరించివేయుట తథ్యము సుమా! అందుచేతనో బ్రాహ్మణోత్తమా! నీవు పోయి, సదయుడు, లోకవినుత గుణములు గలవాడు, అంబరీషుని సంతృప్తునిజేసి, వేడుకొనిన, అతడు నీకు శరణమిచ్చును.

మ. అని శ్రీవల్లభుఁ డానతిచ్చిన మహోద్య చ్చక్ర కీలావళీ
జనితాయాసుఁడు నిర్వికాసుఁడుదిత శ్వాసుండు దుర్వాసుఁడ
ల్లన యేతెంచి సభక్తిఁ గాంచెఁ గరుణాలావణ్యవేషున్ విదో
షు నయోదారమనీషు మంజుమితభాషు న్నంబరీషున్ వెసన్

సుదర్శన చక్రాగ్నికీలల భయముచే పరువులెత్తి అలసిపోయిన వాడును, మనోవికాసమును కోల్పోయినవాడును, ఎగశ్వాసలతో నున్నవాడును, అయిన దూర్వాసముని, వడివడిగా పోయి, కరుణాలావణ్య స్వరూపుడును, దోషరహితుడును, గొప్ప ఉదార స్వభావుడును, బుద్ధిమంతుడును,, మృదుమధుర మితభాషియునైన అంబరీషుని శీఘ్రముగ గాంచెను.

చూచి, దుఃఖముతో ఆ రాజచంద్రుని పాదములు పట్టుకొని విడువకున్న ఆ రాజు పాదములను వెనుకకు లాగుకొని, దయార్ద్రహృదయుడై సుదర్శన చక్రమునిట్లు స్తుతించెను.

సీ. నీవ పావకుఁడవు నీవ సూర్యుండవు నీవ చంద్రుండవు నీవ జలము
నీవ నేలయు నింగి నీవసమీరంబు నీవ భూతేంద్రియనికర మీవ
నీవ బ్రహ్మంబును నీవ సత్యంబును నీవ యజ్ఞంబును నీవ ఫలము
నీవ లోకేశులు నీవ సర్వాత్మయు నీవ కాలంబును నీవ జగము

తే. నీవ బహుయజ్ఞభోజివి నీవ నిత్య
మూలతేజంబు నీకు నే మ్రొక్కువాఁడ
నీరజాక్షుండు చాల మన్నించునట్టి
శస్త్రముఖ్యమ కావవే చాలు మునిని

శ్రీమహావిష్ణువు మిక్కిలిగ మన్నించునట్టి ఓ శస్త్రరాజమా! నీకు నేను మ్రొక్కుచున్నాను. నీవె అగ్నివి, నీవె సూర్యుడవు, నీవె చంద్రుడవు, నీవె జలము, నీవె భూమివి, నీవె ఆకాశము, నీవె వాయువు, నీవె భూత, ఇంద్రియ సమూహములును, నీవె బ్రహ్మమును, నీవె సత్యమును, నీవె యజ్ఞమును, నీవె యజ్ఞ, ఫలమును, నీవె లోకేశులు, నీవె సర్వాత్మవు, నీవె కాలము, నీవె జగమును, నీవె యజ్ఞభోక్తవు, నీవె సత్యమూల తేజము, అట్టి ఓ సుదర్శన చక్రమా! నీకు వందనములు. ఈ మునిసత్తముడింత వరకు అనుభవించిన వ్యథ చాలును. ఈయనను విడిచిపెట్టుము.

ఓ చక్రరాజమా! దైత్యులపై యుద్ధసమయమున శ్రీహరి నిన్ను రప్పించి రాక్షసులపై ప్రయోగించగనే ఆ విషయము ముందే తెలుసుకున్న దైత్యులకు నడుములు, శిరములు, పాదములు, భుజములు, తొడలు, చేతులు మొదలైన అంగములన్నీ శక్తిహీనములై ప్రాణములు విడిచిపెట్టునుకదా!

కలతజెంది నిద్రపోయిన అసురులకు నీవు కలలో కనిపించినంతనే వారు దీర్ఘనిద్ర (ప్రాణములు వదలి) పోవుదురుకదా! అట్లే అసురాంగనలు నిన్ను కలలో గాంచిన ఉదయం లేవగానే పలువరించెదరట.

ఓ సుదర్శనమా! చీకటిని బాపి వెలుగునిచ్చి, సజ్జన కోటిని ఉద్ధరించుచుండు నీయొక్క తేజోకిరణముల శోభను విధాత కూడ వర్ణింపలేడు కదా! అద్భుతమైన నీ రూపము ఆ పరమేశ్వరునితోనే వ్యక్తమై తుదిలేని అనంతమైనట్టిది.

శ్రీహరి, నన్ను హింసింపబోవు దుష్టులను శిక్షింపుటకు నిన్ను నియోగించెను. ఈ తాపసి మిక్కిలి ఆపన్నుడై యున్నాడు కావున నీతనిని ఇక విడిచిపెట్టుము, అని పలికి చేతులు జోడించి నొసట పెట్టుకొని నమస్కరించెను.

రాక్షసులపట్ల అగ్నిపిడుగును, ధర్మరక్షణ సేతువును, విమలరూపమును విశ్వదీపమును, ఇంద్రరక్షణమును అయిన చక్రరాజమునకు నేను నమస్కరించుచున్నాను.

ఆ. విహితధర్మమందు విహరింతునేనియు
నిష్టమైన ద్రవ్యమిత్తునేని
ధరణిసురుఁడు మాకు దైవతం బగునేని
విప్రునకు శుభంబు వెలయుఁగాక

నేను, నాయొక్క విధ్యుక్తధర్మములను నిష్ఠతో నిర్వహించిన వాడనైతినేని, సత్పాత్రులకు ఇష్టమైన ద్రవ్యము నిచ్చినవాడనైతినేని, ఈ బ్రాహ్మణోత్తముని నేను దైవ సమానునిగ భావించిన వాడనైతినేని, ఈ భూసురోత్తమునకు శుభము కలుగుగాక!

అఖిల గుణములకు నాశ్రయుడైన శ్రీహరి, నా సేవలు, పూజలు వలన సంతోషించిన వాడైన, ఆ నిఖిలాత్మమయుడగు హరి, ఈ భూసురునికి ఇప్పుడు సుఖమును కలిగించుగాక!

ఈ విధముగా రాజుచే స్తుతింపబడిన సుదర్శనచక్రము, మునిని విడిచి మఱలిపోయెను. అంత దుర్వాసముని శాంతిని పొంది, మెల్లని, చల్లని, మేలిమి మాటలతో రాజును దీవించి, యిట్లనెను:

ఓ రాజశ్రేష్ఠమా! నా తప్పును మన్నించి నాకు ఇంతమేలు చేసితివికదా! శ్రీహరి పాదపద్మముల నింత దృఢముగ కొలుచు నీ భక్తికి, ఆశ్చర్యమగు చున్నది. నీవంటివారు చాలా అరుదుగా నుందురు. నీవంటి ఉత్తమ సాధుజనులకు, ఇచ్చుటయందును ఆపదలో రక్షించుటయందును,, మిత్రభావముతో నుండుట యందును, మొదలైన గుణములు సహజముగానే వచ్చునుకదా! మఱియును

మ. ఒకమా టెవ్వని పేరు కర్ణములలో నొయ్యార మై సోఁకినన్
సకలాఘంబులుఁ బల్లటిల్లి తొలఁగున్ సంభ్రాంతితో నట్టి స
త్సుకరున్ మంగళతీర్థపాదు హరి విష్ణున్ దేవదేవేశుని
న్నకలంకస్థితిఁ గొల్చు భక్తులకు లే దడ్డంబు రాజాగ్రణీ!

రాజేంద్రా! ఎవ్వరి పేరొక్కమారైనను, అలవోకగ నైనను, చెవుల సోకినచో సకల పాపములు తొలగిపోవునో, అట్టి సకల శుభంకరుని, మంగళకరుని,

తీర్థపాదుని, (అనగా పాదము సోకినచోట తీర్థమేర్పడునట్టివానిని, లేదా, పాదజలము ప్రవహింపగా తీర్థమేర్పడినట్టి వానిని) శ్రీహరిని విష్ణుని, దేవదేవేశుని, నీ వంటి నిర్మల భక్తులు అత్యంతాసక్తితో కొల్చెదరు కావున వారి కెటువంటి ఆటంకములును కలుగవు కదా!

ఓ రాజా! నేను చేసిన తప్పులను మన్నించి, విష్ణుచక్రాగ్నియొక్క దాహమును తొలగించితివి. ఓ నరేశ్వరా! నీ యొక్క దయారసముచే నా ప్రాణములు మఱల కుదుటబడినవి. నేను ధన్యుడనైతిని. నీ కెల్లప్పుడును శుభము కలుగుచుండవలెను గాక! అని నేను కోరెదను. నేనిక వెడలెదను. అనగా నా రాజు, ముని వల్లభుని పాదములకు మ్రొక్కి, మిక్కిలి గౌరవించి, మృష్టాన్నభోజనము ప్రీతిగా పెట్టించెను. ముని సంతృప్తుడయ్యెను, మఱియు నిట్లనెను:

శా. కంటిన్ నేటికి నిన్ను నీ వచనముల్ కర్ణద్వయ ప్రీతిగా
వింటి న్నన్నముఁగొంటి నీగృహమునన్ వేడ్కన్ ఫలం బబ్బె నే
మంటిం బోయెద నీ చరిత్ర మమరుల్ మర్త్యుల్ సుఖాసీనులై
మింటన్ మేదిని సన్నుతింపఁ గల రీమీఁదన్ నరేంద్రాగ్రణీ!

రాజోత్తమా! అంబరీషా! నీ యొక్క మహత్త్వమును నేడు నేను కంటిని. నీ మధురవాక్కులను వీనులవిందుగా వింటిని, నీ గృహమందు మృష్టాన్నమును తృప్తిగా నారగించితిని, నాకు వ్రతభోజన ఫలము లభించెను; నేను నీ యందిప్పుడు స్నేహభావముతో నిష్క్రమించెదను. ఓ రాజా! ఇక మీదట, దేవతలు స్వర్గమందును, మానవులు భూమిపైనను, నీయొక్క పుణ్యచరితమును, సుఖాసీనులై పొగడుచు, ముచ్చటించుకొను చుందురు. అని చెప్పి, దుర్వాసుడు అంబరీషుని దీవించి, కీర్తించి, ఆకాశవీధిలో బ్రహ్మలోకమునకు వెడలెను. మునీశ్వరుడు తిరిగివెళ్లుసరికి ఒక సంవత్సరము నిండెను. వ్రతము పరిపూర్ణమయ్యెను.

ముని భోజనము చేసిన పిమ్మట అతిపవిత్రమైన ప్రసాదమును రాజశ్రేష్ఠుడు గైకొని, తాపసి కష్టమును తొలగించుటకు తానెంతవంటివాడను (అల్పుడను,

అశక్తుడను) అంతయు నా శ్రీహరియొక్క కృపామహత్మ్యమే కదా! యని తలంచినవాడై,

క. హరిఁ గొల్చుచుండువారికిఁ
బరమేష్ఠిపదంబు మొదలు పదభోగంబుల్
నరకసమములను తలఁపున
ధరణీరాజ్యంబుతోడి తగులము మానెన్

శ్రీహరిని కొల్చువారికి (వైకుంఠధామము తప్ప) బ్రహ్మపదము వఱకుగల ఏ పదమైనను నరకతుల్యమే (జన్మకారకములు గనుక అవాంఛనీయములే) యని తలంచినవాడైన అంబరీషుడు రాజ్యముతో సంగమును వీడెను. అట్లు విరక్తుడై,

తనతో సమానులైన పుత్రులను పిలిపించి, రాజ్యభారమును, వారికి పంచిపెట్టి, తాను అరణ్యములో ప్రవేశించి, కామక్రోధాదులను జయించినవాడై, మహాత్ముడైన ఆ అంబరీషచక్రవర్తి శ్రీహరి సన్నిధిని చేరెను.

పరీక్షిన్మహారాజా! ఈ అంబరీషుని చరితమును ప్రీతితో విన్న, చదివిన మానవుడు ధీ సంపన్నుడై భోగములను పొందువాడై, పుణ్యాత్ముడై యుండును అని శుకయోగీంద్రుడు చెప్పెను.

అంబరీషోపాఖ్యానము సమాప్తము.

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

2. శ్రీశుకవాణి - భక్తిమార్గము (ద్వితీయ స్కంధము)

శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజుతో నిట్లు చెప్పెను :

రాజా! పూర్వము బ్రహ్మదేవుడు వేదములను మూడుసార్లు తరచి తరచి, విశ్లేషించి, నిర్ధారించిన సత్యమేమనగా, మానవునకు భక్తిమార్గము వినా వేఱొక మార్గము ననుసరించిన మోక్షము సిద్ధించదు, అని

సీ. అఖిలభూతములందు నాత్మరూపంబున, నీశుండు హరియుండు నెల్లప్రొద్దు
బుద్ధ్యాదిలక్షణంబులఁ గానఁబడును మ, హాత్సేవనీయుఁడహర్నిశంబు
వందనీయుఁడు భక్తవత్సలుండత్యంత, నియతుఁడై సతతంబు నియతబుద్ధి
నాత్మరూపకుఁడగు హరికథామృతమును, గర్ణపుటంబులఁ గాంక్ష దీరఁ

తే. గ్రోలుచుండెడుధన్యులు కుటిలబహుళ
విషయమలినీకృతాంగముల్ వేగవిడిచి
విష్ణుదేవునిచరణార విందయుగము
కడకుఁ జనుదురు సిద్ధంబు కౌరవేంద్ర

ఓ కౌరవవంశశ్రేష్ఠా! జీవరాశులన్నిటి యందును, ఆత్మరూపమున పరమేశ్వరుడైన శ్రీహరి ఎల్లప్పుడును వెలసియుండును. విశుద్ధమైన బుద్ధిద్వారా మాత్రమే అతడు తెలియనగును. అతడు మహాసేవనీయుడు (సేవింపవలసిన వాడు). అహర్నిశము (నిరంతరము) పూజింపవలసినవాడు. భక్తవత్సలతలో (భక్తులను అనుగ్రహించుటయందే) ఎల్లప్పుడును నియుక్తుడై యుండువాడు; ఆత్మరూపుడైన ఆ శ్రీహరియొక్క కథామృతమును, నియతబుద్ధితో, వీనులవిందుగా, కాంక్షతీర పానము చేయు ధన్యులు, పెక్కు విషయభోగములతో మలినమైన దేహములను సత్వరమే విడిచి, శ్రీమహావిష్ణువు చరణ కమలముల కడకు నిశ్చయముగ చేరుదురు.

ఇది నిజము. మనుష్యులై జన్మించినవారు, మరణమాసన్నమైనవారు, మహాజ్ఞానులు, చేయవలసిన కర్తవ్యమిదియే. రాజా! వాసుదేవునియందు భక్తిమహిమను ఎట్లు వర్ణింపగలను? వినుము:

సీ. వాసుదేవ శ్లోకవార్త లాలించుచుఁ, గాల మేపుణ్యుండు గడపుచుండు
నతని యాయువుఁదక్క నన్యుల యాయువు, నుదయాస్తమయముల నుగ్రకరుఁడు
వంచించి కొని పోవు వాఁడది యెఱుఁగక, జీవింతుఁ బెక్కేండ్లుసిద్ధ మనుచు
నంగనాపుత్ర గేహోరామవిత్తాది, సంసార హేతుక సంగసుఖముఁ

తే. దగిలి వర్తింపఁ గాలంబు తఱియెఱింగి
దండధరుకింకరులు వచ్చి తాడనములు
సేసికొనిపోవఁ బుణ్యంబు సేయ నైతిఁ
బాపరతినైతినని బిట్టు పలవరించు

వాసుదేవుని కీర్తిగాథలను వినుచు, ఏ పుణ్యాపురుషుడు కాలము గడుపుచుండునో అతని ఆయువు తప్ప ఇతరుల ఆయువు వ్యర్థముగ సూర్యోదయాస్తమయములచే తరిగిపోవుచున్నవని యెఱుంగని అవివేకులు. తాము చాలాకాలము బ్రతికియుందుమను భ్రమలో, దారా పుత్ర గృహ ఆరామ విత్తాది సంసార బంధములలో, సుఖసంగములో తగుల్కొని, దేహాంతమున యమకింకరులచే కొట్టబడుచు ఈడ్వబడుచున్నప్పుడు అయ్యో! పుణ్య కార్యములను చేయకుండ పాపకార్యముల యందే కాలము వ్యర్థము చేసితినేయని వాపోయెదరు.

రాజా! పశువులు, పక్షులు, మొదలైన జీవరాసులు, ఆహార, నిద్ర, భయ మైథునములవంటి శరీర వ్యాపారములకు లోనై, పుట్టుచు, గిట్టుచు నుండుట లేదా? పరమేశ్వరుని గూర్చి చింతింపని మానవ మృగములు సూకర గార్దభముల (పందులు గాడిదలు) వలె నికృష్టమైన జీవితములను గడిపెదరు కదా! విష్ణుగాథలను వినియుండని చెవులు కొండ బిలముల వంటివి. చక్రధరుని పైని పద్యములను చదువని నాలుకలు కప్పనాలుకల వంటివి. శ్రీనాథుని యొక్క దివ్యమంగళ రూపమును చూడలేని కన్నులు నెమలి పింఛపు కన్నులవంటివే. శ్రీహరిపాదముల పై నుండు తులసీ దళముల పరిమళము నాఘ్రాణింపని ముక్కు పందిముక్కువంటిదేకదా! అంతేకాదు, ఓ రాజా!....

సీ. నారాయణుని దివ్య నామాక్షరములపైఁ, గరఁగని మనములు కఠినశిలలు
మురవైరికథలకు ముదితాశ్రురోమాంచ, మిళితమై యుండని మేను మొద్దు
చక్రికి మొక్కని జడునియౌదల నున్న, కనకకిరీటంబు గట్టెమోపు
మాధవార్పితముగా మననిమానవుసిరి, వనదుర్గచంద్రికావైభవంబు

ఆ. కైటభారిభజన గలిగియుండనివాఁడు
గాలిలోన నుండి కదలు శవము
కమలనాభుపదముఁ గననివానిబ్రదుకు
పసిఁడికాయలోని ప్రాణిబ్రదుకు

ఓ రాజా! శ్రీమన్నారాయణుని దివ్యనామాక్షర స్మరణమాత్రముచే కరిగి ప్రవహింపని మనస్సులు కఠిన శిలలే కదా! విష్ణుదేవుని కథాశ్రవణముచే ఆనందబాష్పధారలతో రోమాంచము (గగుర్పాటు) కాని శరీరమొక కట్టె మొద్దువంటిదే; చక్రధారునికి ప్రణమిల్లని మూఢుని తలపైన నొకబంగారు కిరీటమున్నను, అదియొక కట్టెల మోపువలె బరువుచేటేగాని శోభనిచ్చునా? భగవంతునికి అర్పితము కాని (భగవత్కార్యములలో వినియోగింపబడని) ఐశ్వర్యము అడవిగాసిన వెన్నెలవలె నిరర్థకమేగాని, రాణించునా? వాసుదేవుని సేవయందు వినియోగింపబడని శరీరము గలవాడు ప్రాణవాయువుచే కదిలే శవము వంటివాడు. పద్మనాభుని పాదముల నాశ్రయింపని వాని బ్రతుకు బంగారు భరిణెలోని పురుగు బ్రతుకు సుమా! అని శుకయోగీంద్రుడు చెప్పి, భగవంతు నిట్లు స్తుతించెను.

మ. పరుఁ డై యీశ్వరుఁడై మహామహిముఁడై ప్రాదుర్భవస్థాన సం
హరణక్రీడనుఁడై త్రిశక్తియుతుఁడై యంతర్గతజ్యోతియై
పరమేష్ఠి ప్రముఖామరాధిపులకుం బ్రాపింప రాకుండు దు
స్తరమార్గంబునఁ దేజరిల్లు హరికిం దత్త్వార్థి నై మ్రొక్కెదన్

ప్రకృతికి పరమైనవాడు, ఈశ్వరుడు, మహామహిముడు, (సాటిలేని మహిమలు గలవాడు) సృష్టి స్థితి లయ క్రీడలను నడిపించువాడు, త్రిశక్తి యుతుడు (త్రిమూర్తులయొక్క ఏకైకశక్తి స్వరూపుడు), సర్వజీవరాసులలో

నంతర్జ్యోతియై ప్రకాశించువాడు, బ్రహ్మాది దేవతలకు కూడ అందుబాటులో లేని దుస్తరమైన మార్గమున ప్రజ్వలించువాడునైన శ్రీహరిని నేను తత్త్వ జ్ఞానమును కోరుచు ప్రార్థించుచున్నాను.

ఉ. ఏవిభువందనార్చనము లేవిభుచింతయు నామకీర్తనం
బేవిభులీల లద్భుతము లెప్పుడు సంశ్రవణంబు సేయ దో
షావలిఁ బాసి లోకము శుభాయతవృత్తిఁ జెలంగు నంఘ్రు నే
నావిభు నాశ్రయించెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్

ఏ విభుని (సర్వవ్యాపి ప్రభువును), వందనము చేసిన, అర్చనము చేసిన, స్మరణ చేసిన, నామ సంకీర్తనము చేసిన, ఎవ్వని అద్భుతలీలా గాథలను శ్రవణము చేసిన, దోషములన్నీ తొలగిపోయి, లోకము సర్వశుభములను పొందునో ఆ విభుని, పాపవిమోచనుని, శుభంకరుని నే నాశ్రయించెదను.

ఉ. ఏపరమేశు పాదయుగ మెప్పుడుఁ గోరిభజించునేర్పరుల్
లోపలిబుద్ధితో నుభయ లోకములందును సక్తిఁ బాసి యే
తాపము లేక బ్రహ్మగతిఁ దారు గతశ్రములై చరింతు రే
నాపరమేశు మ్రొక్కెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్

ఏ పరమేశ్వరుని పాదముల నెల్లవేళల కోరి, సేవించి, నిపుణులైన సాధకులు అంతర్దృష్టితో, నిహపర లోకముల యందాసక్తిని వీడి, ఏ తాపములు లేక, పరబ్రహ్మపదము నొందుటకు కష్టముల నధిగమించి చరించెదరో, అట్టి పాపమోచనుడును, భద్రకీర్తనుడును అయిన పరమేశ్వరుని మ్రొక్కెదను.

చ. తపములఁ జేసి యైన మఱి దానము లెన్నియుఁ జేసి యైన నే
జపములఁ జేసి యైన ఫలసంచయ మెవ్వని (జేర్పకున్న హే
యపదములై దురంతవిప దంచితరీతిగ నొప్పు చుండు న
య్యపరిమితున్ భజించెద నఘౌఘనివర్తను భద్రకీర్తనున్

ఎన్నితపములు చేసినను, మఱియెన్ని దానములు జేసినను, ఎన్నిజపములు చేసినను, వాటియొక్క ఫలములను ఏ పరమేశ్వరునకు సమర్పణము

చేయకుండిన, అవి నిందార్హములై ఆపదలను తెచ్చిపెట్టునవిగా పరిణమించునో, అట్టి అపరిమితుడును, పాపవిమోచనుడును, భద్రకీర్తనుడును అయిన ఆ ప్రభువును భజించెదను.

మ. తపముల్ సేసిననో మనో నియతినో దానవ్రతవృత్తినో
జపమంత్రంబులనో శ్రుతిస్మృతులనో సద్భక్తినో యెట్లు ల
బ్ధపదుం డౌ నని బ్రహ్మరుద్రముఖరుల్ భావింతు రెవ్వాని న
య్యపవర్గాధిపుఁ డాత్మమూర్తి సులభుం డౌఁగాక నా కెప్పుడున్

తపములు చేసియా, లేక మనస్సును నియంత్రించియా లేక దానవ్రతముల జేసియా, లేక జపమంత్రములు పఠించియా, లేక శ్రుతి స్మృతులను వల్లించియా, లేక ఉత్తమ భక్తిప్రక్రియల చేతనా, లేక యింకేమైనను చేసియా, యని బ్రహ్మరుద్రాది దేవతలు ఆ దివ్యసన్నిధి నెట్లు చేరగలమా యని ఎల్లప్పుడు అన్వేషించుచుందురో, ఆ మోక్షప్రభువు, ఆత్మస్వరూపుడు, నా కెల్లవేళలా సులభుడగుగాక!

క. శ్రీపతియు యజ్ఞపతియుఁ బ్ర
జాపతియున్ బుద్ధిపతియు జగదధిపతియున్
భూపతియు యాదవశ్రే
ణీపతియున్ గతియు నైన నిపుణు భజింతున్

శ్రీదేవికిని, యజ్ఞములకు, ప్రజలకును, బుద్ధికి, జగత్తునకును, భూమికి, యాదవశ్రేణులకును, పతియు, గతియునైన ప్రభువును నేను సేవించెదను.

మ. అణువో కాక కడు న్ మహావిభవుఁడో యచ్ఛిన్నుఁడో ఛిన్నుఁడో
గుణియో నిర్గుణుడోయటంచు విబుధుల్ గుంఠీభవత్తత్త్వమా
ర్గణు లై యేవిభుపాదపద్మభజనో త్కర్షంబులం దత్త్వవీ
క్షణముం జేసెద రట్టివిష్ణుఁ బరమున్ సర్వాత్ము సేవించెదన్

ఆ పరమాత్ముడు అణుస్వరూపుడా లేక సర్వవ్యాపియైన మహాస్వరూపుడా; అతడు దేశకాలాదులచే పరిచ్ఛిన్నుడా (పరిమితుడా) లేక అప్రమేయుడా;

సగుణుడా (త్రిగుణములతో కూడియున్నవాడా) లేక నిర్గుణుడా (ఎట్టి గుణములు లేనివాడా) అని పండితులు వ్యర్థమైన తత్త్వాన్వేషణచేసి చేసి తెలుసుకొనలేక చివరకు ఏ విభుని పాదపద్మములను మిక్కిలిగా భజించి తత్త్వార్థమును కాంచెదరో అట్టి సర్వాత్మకుడైన పరాత్పరుని నేను భజించెదను.

అని స్తుతించి, శుకయోగీంద్రుడు పరీక్షిత్తుతో నిట్లు చెప్పెను: రాజా! ఒకనాడు నారదమహర్షి, భగవంతుని గురించి చెప్పుమని బ్రహ్మదేవుని ప్రార్థింపగా బ్రహ్మ ఇట్లు చెప్పెను:

నాయనా, నారదా! ఆ భగవంతుని మాయాశక్తిని గుఱించి పూర్తిగా తెలుసుకొనుటకు నాకును సాధ్యపడలేదు. ఇకనితరులకెట్లు సాధ్యపడును?

క. ఆయీశుఁ డనంతుఁడు హరి
నాయకుఁ డీ భువనములకు నాకున్ నీకున్
మాయకుఁ బ్రాణివ్రాతము
కీయెడలన్ లేదు నీశ్వ రేతరము సుతా

కుమారా! ఆ పరమేశ్వరు డనంతుడు. ఆ శ్రీహరి సమస్తలోకములకును, నాకును, నీకును, మాయకును ప్రాణి సముదాయములకును ప్రభువు. ఆయన కంటె అన్యమైన దేదియును ఎచ్చటను లేదు పుత్రా!

విశ్వమే తన రూపముగనున్న ఆ పరమేశ్వరుడు, సర్వులకు నాశ్రయమై యుండగోరి, ఈ బ్రహ్మాండమును వివరముగ చతుర్దశ భువనములుగ విభజించెను.

పుత్రా! సర్వము విష్ణుమయమే. వేయేల! బ్రహ్మాండమతని జేనలోన ఇమిడియుండును. భూతభవిష్యద్వర్తమాన త్రికాలములతని యందే యుండును. ఆ పరమేశుని బుద్ధిద్వారా నెఱుంగ శక్యముకాదు. సూర్య మండలములో నున్న భాస్కరుడు జగములకు వెలుగునిచ్చునట్లు, ఆ పరమేశుడు బ్రహ్మాండము నందంతటను నిండియుండి, బహిరంతరముల యందు తన చైతన్య తేజమును నింపును.

క. అగుణుం డగుపరమేశుఁడు
జగములఁ గల్పించుకొఱకుఁ జతురత మాయా
సగుణుం డగుఁ గావున హరి
భగవంతుం డనఁగ బరఁగె భవ్యచరిత్రా

నామరూప గుణములేవియులేని నిర్గుణ పరమాత్మ, జగములను సృష్టించుటకొఱకు, మిక్కిలి నేర్పుతో, మాయను వినియోగించి, నామరూప గుణముల వహించి సగుణరూపము ధరించి, భగవంతుడనబడి వెలసెను.

క. విశ్వాత్ముఁడు విశ్వేశుఁడు
విశ్వమయుం డఖిలనేత విష్ణుఁ డజుం డీ
విశ్వములోఁ దా నుండును
విశ్వము దనలోనఁ జాల వెలుఁగుచు నుండన్

విశ్వాత్ముడును (విశ్వమే తానై యున్నవాడును), విశ్వేశుడును (విశ్వమునకు ప్రభువును) విశ్వమయుడును (విశ్వమంతట వ్యాపించియున్నవాడును) సర్వమునకు అధినాయకుడును, జన్మయేలేనివాడును యగు మహావిష్ణువు, ఈ విశ్వము తనలోన ప్రకాశించుచుండగ, నా విశ్వమునందు తాను వసించు చుండును.

నారదా! ఆ పరమేశునిచే నియమింపబడి, నేను చరాచర జీవరాసుల సృష్టిని విస్తృతముగ చేయుదును, ప్రభవిష్ణుడు పోషించును, శివుడు లయకార్యమును చేయును. పద్మనాభుడైన శ్రీహరి, అచ్యుతుడు, త్రిమూర్తుల శక్తులను వహించి మూలపురుషుడై ఆదిమూర్తిగ నుండును.

శ్రీహరి భగవంతుడు, అనంతుడు, కరుణాసాగరుడు, సృష్టికి కార్యకారణహేతువై యున్నవాడు, ఆ విభునికంటె గొప్పవాడింకెవ్వడును ఎంత వెదకినను కానరాడు తండ్రీ!

ఆ పరమాత్ముడు జన్మలేనివాడు; ఈ జగమును, ప్రతికల్పమునందును, సృష్టించి, పోషించి, లయింపజేయునట్టి పవిత్రుడు; అట్టి పరబ్రహ్మమును, నిత్యుని, కేవలుని, అద్వితీయుని, జగమంతా నిండియున్నవానిని, విశుద్ధజ్ఞాన

స్వరూపుని సర్వాత్ముని, ఆదియంతములు లేనివానిని, నిర్గుణుని, నేను మనసా స్మరించెదను.

అందుచేత, నారదా! నిత్యశాంతుడు, విశ్వమయుడు, కేవలజ్ఞాన స్వరూపుడు, శుద్ధాత్ముడు, సర్వేశ్వరుడు, శాశ్వతుడు, సముడు, అయిన ఆ పరమేశుని, నీవు నీ హృదయములో సదా ప్రతిష్ఠించుకొని యుంచుము. అప్పుడు మాయనీ దరిజేరదు. శ్రీహరిని మనస్సులో స్థిరముగ నిలుపుకొన్నవారు శోకములేని సుఖస్థితిని పొందెదరు. అటువంటి బుద్ధిమంతులు భగవత్ స్మరణ వినా ఇంకేమియును చేయరు. ఆ భగవంతుడు సర్వశరణ్యుడు, కర్మఫలప్రదాత, సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపి, కల్పాంతమున సర్వమూ లయించినను, తాను మాత్రము నిర్వికారుడై నిలిచియుండును.

నాయనా! అంతటికిని ఆ విష్ణువే కారణభూతుడు. ఆయన వినా ఆశ్రయింపదగిన వారింకెవ్వరును లేరు. భగవంతుడు, అనంతుడు, విశ్వమును సృష్టించే ఉదార స్వభావుడు అయిన ఆ పరమేశుని సద్గుణములను గొప్ప మనస్సుతో కొనియాడలేకున్నచో, ప్రకృతికి అతీతమైన నిర్గుణ బ్రహ్మమును చిత్తము చేరలేదు. ఆయన మహిమల నెల్లప్పుడును స్తుతించుచుండవలెను. ఇతరులు స్తుతించుచుండగా వినవలెను. మనస్సులో ఆ మహిమలను మననము చేయుచు ఆనందించాలి. ఆ విధముగ నాచరించువారు దేవుని మాయకు లోబడరు.

అని నారదమహర్షికి బ్రహ్మ బోధించెను.

శ్రీశుకవాణి సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

3. ధ్రువస్తుతి

స్వాయంభువ మనువు పుత్రుడైన ఉత్తానపాదునకు సునీత సురుచి యను భార్యలుండిరి. సునీతకు ధ్రువుడను పుత్రుడును, సురుచికి ఉత్తముడను పుత్రుడును కలిగిరి. రాజుకు చిన్నభార్యయందుండు వ్యామోహముచేత నతడు ఉత్తమునే మిక్కిలి ప్రేమించుచుండెను. ఒకనాడు ధ్రువుడు తన తండ్రి తొడపై కూర్చొనుటకు ముచ్చటపడి, తండ్రివద్ద చేరెను. తండ్రి ఆ చిన్నారి బాలుని నిరాదరణతో తిరస్కరించెను. అది చూచి, సురుచి, తన గర్భమున పుట్టినవానికే తండ్రి ఒడిలో కూర్చొను అర్హత యుండునని యీసడించుకొని ఆ బాలుని యీడ్చివేసి "పోయి, నా గర్భమున నిన్ను పుట్టించుమని ఆ భగవంతుని వేడుకో" అని గద్దించి, పొమ్మనెను. తీవ్రముగ గాయపడిన మనస్సుతో నా బాలుడు తల్లియైన సునీతవద్దకు పోయి ఏడ్వగా, సార్థకనామయైన ఆ తల్లి, అందరికీ ఆ భగవంతుడే శరణ్యమని ఊరడించినను ధ్రువుడు తృప్తిజెందక ఆ భగవంతునే వేడుకొనవలెనను పట్టుదలతో అరణ్యములో వడివడిగా పోవుచుండగా నారదమహర్షి ఎదురయ్యెను. భగవంతుని దర్శింపవలెనను దృఢనిశ్చయము, పట్టుదలను గుర్తించిన నారదుడు సంతసించి ద్వాదశాక్షరీ మంత్రము నుపదేశించి, బాలుని, మధువనమునకు పోయి, శ్రీమన్నారాయణ నామజపము చేయుచు దీక్షగా తపస్సు చేయుమని చెప్పి, తపోనిష్ఠను బోధించెను.

ధ్రువుడు మధువనములో తీవ్రముగ తపము చేయనారంభించెను. ఆరునెలలు నిద్రాహారములు మాని ఒంటికాలిపై చేసిన ఘోరతపస్సు కారణముగ నుత్పన్నమైన దివ్యతేజస్సు, మూడు లోకములను నింపివేసెను. అతని కాలిబొటనవ్రేలి ఒత్తిడికి భూమి ఇటునటు ఊగసాగెను. ప్రాణవాయువును నిరోధించి పరమేశ్వరునితో ననుసంధానము చేయుటచేత విశ్వము కంపించెను. ఊపిరాడక తల్లడిల్లుచున్న దేవతలు ప్రార్థింపగా శ్రీమహావిష్ణువు గరుడ వాహనుడై మధువనం చేరెను. అప్పుడు ధ్రువుడు తన హృదయకమలమందు ప్రకాశించుచున్న శ్రీహరిని తన్మయుడై దర్శించుచుండెను. గావున తన యెదుటనే ప్రత్యక్షమైయున్న ప్రభువును

గాంచలేదు. శ్రీహరి, బాలుని హృదయమునుండి అంతర్ధాన మవగా నాతడు కన్నులు తెఱచి, ఆ కరుణామూర్తిని కన్నులపండువుగ తిలకించెను. పులకించి పోయెను, ఆనందబాష్పధారలలో కరిగిపోయెను. సాష్టాంగ దండప్రణామములు చేసెను.

ఆనందముతో నుబ్బి తబ్బిబ్బు అయిపోవుచుండెనా ఐదేళ్ల బాలుడు. ఏమనాలో తెలియక నోరునుూగపోయినది. స్తుతించుటకు విద్యాసంస్కారములు లేవు. భాషచాలదు. చేతులు జోడించి నిల్చుండిపోయెను. కరుణామయుడు కనికరించి, వేదమయము, నాదబ్రహ్మము నయిన తన శంఖముతో బాలుని చెక్కిళ్లను స్పృశించి నిమిరెను. దానితో వేదవాఙ్మయ పదజాలములతో సహా ఆత్మతత్త్వ పరతత్త్వములతో కూడిన వాక్యములతో ఆ పరమేశునిట్లు స్తుతించెను:

ఓ దేవాదిదేవా! నీవు అఖిల శక్తి సంపన్నుడవు, స్తంభించిపోయిన నా యొక్క ఇంద్రియములకు, వాక్కక్తికి, ప్రాణములకు, సంచలనమును కల్పించిన అంతర్యామివైన నీకు నా ప్రణామములు. పరమాత్మా! సృష్టికి పూర్వము నీ వొక్కడివే యుండి, నీ నుండి విడదీయబడని జగత్తును, నీ సంకల్పముచే, మహత్తు, అహంకారము మొదలైన రూపములలో వ్యక్తపరచితివి. త్రిగుణాత్మకమైన ప్రకృతిచేత నానారూపములను కల్పింపజేసి, వాటియందు జీవునిగా ప్రవేశించి, వాటిని ప్రవర్తింపజేయు ఆత్మస్వరూపుడవైన నీకు వందనములు.

ప్రభో! కల్పాదిలో మేల్కొనిన బ్రహ్మదేవుడు, సృష్టి ప్రక్రియను మఱచి పోయి, నిన్ను శరణువేడి, నీచే అనుగ్రహింపబడిన జ్ఞానముచే సృష్టిరచన చేసెనుకదా! ఈశ్వరా! నీ యొక్క మాయచేత మతిచెడినవారు. నిన్ను ఆశ్రయించినవారై నీవు అనుగ్రహింపగల మోక్షమును కోరక, అవివేకులై, క్షుద్రమైన అర్థకామములనే కోరుకుందురు. వారు కోరుకొను ఐహిక ఇంద్రియ భోగములను కల్పవృక్షమువలె నీవు ప్రసాదించెదవు కూడను.

మ. అరవిందోదర తావకీనచరణధ్యానానురాగోల్లస
చ్చరితాకర్ణనజాతభూరిసుఖముల్ స్వానందకబ్రహ్మమం
దరయన్ లేవఁట దండభృద్భటవిమానాకీర్ణులై కూలు నా
సురలోకస్థులఁ జెప్ప నేల సుజనస్తోమైకచింతామణీ

ఓ పద్మనాభా! నీయొక్క పాదపద్మముల ధ్యానముచే భక్తులు పొందిన పరిపూర్ణ ఆనందగాథలను వినుటవలన లభించిన ఘనసౌఖ్యము, ఆత్మానందము, బ్రహ్మానుభవము నందుకూడను లభించదట, ఏలనన, పుణ్యము క్షీణింపగనే యమభటులచే విమానముల నుండి క్రిందికి త్రోయబడుదురు. ఇక భోగలాలసులైన దేవతలగురించి వేఱుగా చెప్పనేల? సజ్జనుల కోర్కెలను దీర్చు చింతామణి వంటి ఓ దేవదేవా! నీకు నా వందనములు.

చ. హరిభజనీయమార్గనియతాత్మకు లై భవదీయమూర్తిపై
వఱలిన భక్తియుక్తు లగు వారలసంగతిఁ గల్గఁజేయు స
త్పురుషుసుసంగతిన్ వ్యసన దుస్తరసాగర మప్రయత్నతన్
సరసభవత్కథామృతరసంబున మత్తుఁడ నై తరించెదన్

శ్రీహరీ! నిన్ను భజించుట యందు నిష్ఠగలవారై నీ రూపమును ధ్యానించుచుండు నీ యొక్క భక్తుల సాంగత్యమును నా కనుగ్రహింపుము. అట్టి సత్పురుషుల సాంగత్యము వలన వ్యసనములతో కూడియున్న ఈ దుర్భర భవసాగరమును, నీ యొక్క పవిత్రచరితామృతమును గ్రోలుచు, సులువుగ దాటివేయగలను.

చ. నిరతముఁ దావకీనభజనీయపదాబ్జసుగంధలబ్ధి ఎ
వ్వరిమది పొందఁగాఁగలుగు వారలు తత్ప్రియమర్త్య దేహమున్
అరయఁ దదీయదారతనయాదిసుహృద్గృహబంధువర్గమున్
మఱతురు విశ్వతోముఖ రమాహృదయేశ ముకుంద మాధవా

ఓ మాధవా! ముకుందా! ఎల్లప్పుడును నీ యొక్క పూజనీయమైన పాదపద్మముల సుగంధ పరిమళము నాఘ్రాణింపగలుగు సజ్జన భక్తులు,

తాము అంతవఱకు నతిప్రియముగ లాలించి పోషించి యున్నట్టి దేహమును, దానికి సంబంధించిన భార్యాపుత్ర మిత్ర గృహ బంధుజనులతోడి సంబంధమును మఱచిపోవుదురు కదా! విశ్వతోముఖా! రమాపతీ!

ఓ పరమేశ్వరా! దేవ, దానవ, మానవ, జంతు జీవాదులతో నిండియుండి, ప్రకృతి పురుషులతో కూడియున్న నీ యొక్క విరాట్ స్వరూపమును గూర్చియే నేను వినియుంటిని గాని, ప్రభూ! ఇంద్రియగోచరము, ఐశ్వర్యయుతము, శాశ్వతము అయిన నీ యొక్క పరబ్రహ్మస్వరూపమును నేను తెలుసుకొన జాలను కదా!

ఓ సర్వేశ్వరా! కల్పాంతమున సకల సృష్టినీ నీలోనికి తీసుకొని విలీనము చేసుకొనెదవు. ఆదిశేషతల్పముపై యోగనిద్రలో శయనించెదవు. నీ యొక్క నాభి అనే సముద్రమునుండి ఉద్భవించిన స్వర్ణ కమలము నుంచి చతుర్ముఖ బ్రహ్మను పుట్టించెదవు. ఇట్లనేక మాఱులు చేయుచు వినోదించుచుండు నీ యొక్క దివ్యతేజోమయ పరబ్రహ్మ స్వరూపమునకు నేనత్యంత నిష్ఠతో ప్రణమిల్లుచుంటిని. ఓ శ్రీహరీ! శుభచరిత్రా! అనంతశుభంకరా! లక్ష్మీ వల్లభా, అవ్యయానందసాగరా! గోవిందా! ముకుందా! నీకివే నా ప్రణామములు.

ఓ దేవాదిదేవా! నీవు ఆదిపురుషుడవు, మాయాతీతుడవు, పరిశుద్ధుడవు, సర్వజ్ఞుడవు, కూటస్థుడవు, భగవంతుడవు, సాక్షిభూతుడవు, సర్వేశ్వరా! జ్ఞానము, అజ్ఞానము, వైరాగ్యము, వ్యామోహము వంటి పరస్పర విరుద్ధ శక్తులతో కూడియున్న జగత్తుకు కారణభూతుడవు నీవే! అద్వితీయము, అనంతము, ఆద్యము, ఆనందమయము, అవికారము అయిన పరబ్రహ్మవు నీవు. నీకు వందనములు. పరమేశ్వరా! నిష్కాములైన భక్తులు నిన్నే సర్వతోముఖ ఫలముగ భావించెదరు. వారికి నీ పాదపద్మములే సర్వస్వము. సకాములైన భక్తుల కోర్కెలను కూడ కృపతో తీర్చుచు, వారి సంసార భయములను తొలగించే కరుణాసాగరుడవు నీవు. నీకు అనేక నమస్కారములు - అని స్తుతించిన ధ్రువునితో మిక్కిలి సంతసించిన శ్రీహరి యిట్లు పలికెను:

రాజకుమారా! నీ తపస్సుకు సంతసించి, నీకు దర్శనమిచ్చితిని. నీ మనోభీష్టమును నెరవేర్చెదను. గ్రహములు, నక్షత్రములు, ధర్ముడు, అగ్ని,

కశ్యపుడు, శుక్రుడు, సప్తఋషులు, ప్రదక్షిణము చేయుచుండు ధ్రువక్షితి యను మహోన్నత స్థానమును నీవు పొందెదవు. ఈ పదమిదివరకెవ్వరును పొందియుండలేదు. మూడు లోకములు నశించినను అది నశింపదు. నీవు ఇరువది యారువేల సంవత్సరములు నీ తండ్రి విడిచిన రాజ్యమును పాలించిన అనంతరము ధ్రువక్షితిని అధిష్ఠించెదవు. ఇంద్రియములను జయించి ధర్మమార్గమున పరిపాలించెదవు. నీ తండ్రి, వానప్రస్థాశ్రమమునకు వెడలును. నీ తమ్ముడైన ఉత్తముడు వేటకువెళ్లి అడవిలో మరణించును. అతని తల్లి అడవిలో కారుచిచ్చులో నశించును. నీ తల్లి ఉత్తమ లోకమును పొందును. నీవు అనేకమైన యజ్ఞములను చేసి, నన్నారాధించెదవు. మరణకాలమున నీవు నన్ను స్మరించుచు సప్తర్షిమండలము పైనమున్న ఉన్నతస్థానమును పొంది, నన్ను జేరెదవు'' అని చెప్పి, స్వామి గరుడారూఢుడై నిష్క్రమించెను.

విష్ణువు వెళ్లిన పిమ్మట ధ్రువుడు చింతాక్రాంతుడై యిట్లు తలపోసెను: అయ్యో! నేనెంతబుద్ధిహీనుడను! జితేంద్రియులు, మునీంద్రులు, మిక్కిలి భక్తితో, పెక్కుజన్మల సమాధియోగ శక్తిచే ఏ పరమేశ్వరుని చరణకమలములను దర్శింపగలిగెదరో, ఆ శ్రీహరిని నేను ఆరునెలలు సేవించి, సాక్షాత్కారమును పొందినను, మాయామోహితుడనై అనిత్యమైన దానినే ఆశించితిని. తమ్మునికంటెను, ఇతరుల కంటెను, అత్యున్నత పదమునే అజ్ఞాతముగనైనను కాంక్షించి యుంటినేమో! గాని మోక్షప్రదాతయే ప్రత్యక్షమవగా, మోక్షమును కోరక మిన్నకుంటిని. నా యొక్క పూర్వకర్మయే నా బుద్ధిని పెడమార్గము పట్టించి యుండును. విషయవాసనలు విడిచిపెట్టవు కదా! - యని ధ్రువుడు ఊరటజెంది, నిజనగరికి జనెను.

ధ్రువస్తుతి సమాప్తం

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

4. రుద్రగీత

పృథుచక్రవర్తి మనుమడైన బర్హిష్మదునికిని త్రిలోకసుందరియైన శతధృతికిని ఒకేసారి పదిమంది పుత్రులు కలిగిరి. వారందరూ ఒకే నామముతో ప్రచేతసు లనబడి ప్రసిద్ధికెక్కిరి. వారు ధర్మజ్ఞులు, సమదర్శనులు, పుణ్యాత్ములు. తండ్రియొక్క ఆదేశము ప్రకారము, సంతానము కోరి, వారు తపస్సు చేయుటకు పశ్చిమదిశగా పోవుచుండగా ఒక అందమైన పెద్ద సరస్సు కనిపించెను. ఆ సరస్సునుండి మహేశ్వరుడు బైటకు వచ్చెను. ప్రచేతసులు భక్తిపారవశ్యముతో నాయన పాదములపైబడిరి. దయామయుడైన శంకరుడు వారితో నిట్లనెను : "రాజకుమారులారా! మీరెవరో, మీ కోరిక ఏమిటో నాకు తెలుసును. మిమ్ములను అనుగ్రహించు నుద్దేశముతో మీకు దర్శనమిచ్చితిని. శ్రీహరి భక్తులు నాకు మిక్కిలి ఇష్టులు. అతి రహస్యము, పవిత్రము, శుభప్రదము, మోక్షప్రదము అయినట్టి ఒక దివ్యోపదేశమును మీకిప్పుడు చేసెదను. దీనిని జపించి తరింపుడు. పూర్వముబ్రహ్మ తన పుత్రులైన సనక సనందాది మునులు విని నేర్చుకొనుటకు, శ్రీహరి నుద్దేశించి, ఈ విధముగ స్తుతించెను. దీనిపేరు యోగాదేశము. బ్రహ్మచేసిన స్తుతిని మీరు విని, నేర్చుకొనుడు:

"ఓ శ్రీహరీ! ఆత్మజ్ఞాన సంపన్నులకు నీ యొక్క ఉత్కర్షము (అతిశయ శోభ) ఆత్మానందదాయకము. అట్టి ఆనందమును మాకు ప్రసాదింపుము. నీవు పరిపూర్ణానంద స్వరూపుడవు. నీకు మా నమస్కృతులు.

సీ. పఙ్కజనాభాయ సఙ్కర్షణాయ శాన్తాయ విశ్వప్రబోధాయ భూత
సూక్ష్మేన్ద్రియాత్మనే సూక్ష్మాయ వాసుదేవాయ పూర్ణాయ పుణ్యాయ నిర్వి
కారాయ కర్మనిస్తారకాయ క్షేత్ర పాలాయ త్రైలోక్య పాలకాయ
సోమరూపాయ తేజోబలాఢ్యాయ స్వయంజ్యోతిషే దుర న్తాయ కర్మ

తే. సాధనాయ పురాపురుషాయ యజ్ఞ
రేతసే జీవతృప్తాయ పృథ్విరూప

కాయ లోకాయ నభసేన్తకాయ విశ్వ
యోనయే విష్ణవే జిష్ణవే నమోస్తు

ఓ దేవాదిదేవా! నీవు పద్మనాభుడవు, సంకర్షణుడవు, శాంతుడవు, విశ్వమునకు జ్ఞానదాతవు, సూక్ష్మభూతములకు (తన్మాత్రలకు)ను, సూక్ష్మేంద్రియములకును ఆశ్రయమైనట్టివాడవు, సూక్ష్మతముడవు, వాసుదేవ తత్త్వరూపుడవు, పరిపూర్ణుడవు, పుణ్యమూర్తివి, నిర్వికారుడవు (ఎట్టి మార్పులను చెందని వాడవు), కర్మబంధముల నుండి దాటింపగలవాడవు, వేదసంరక్షకుడవు, ముల్లోకములను పాలించువాడవు, మూడు వేదములను పోషించువాడవు, సోమరూపుడవు, తేజోబలసంపన్నుడవు, స్వయంప్రకాశుడవు, అంతములేనివాడవు, నియతకర్మలకు సాధనమైనవాడవు, పురాణ పురుషుడవు, యజ్ఞమునకు బీజరూపుడవు; జీవత్రష్టుడవు, పృథ్వీరూపుడవు, లోకస్వరూపుడవు, ఆకాశమున కతీతుడవు, విశ్వమునకు ఉత్పత్తిస్థానమువు, అంతటను వ్యాపించు విష్ణువు, జయశీలుడవైన జిష్ణుడవు, నీకు మా నమస్కృతులు.

సీ. స్వర్గాపవర్గసుద్వారాయ సర్వరసాత్మనే పరమహంసాయ ధర్మ
పాలాయ సద్దిత ఫలరూపకాయ కృష్ణాయ ధర్మాత్మనే సర్వశక్తి
యుక్తాయ ఘనసాఙ్ఖ్య యోగీశ్వరాయ హిరణ్యవీర్యాయ రుద్రాయ శిష్ట
నాథాయ దుష్టవినాశాయ శూన్యప్రవృత్తాయ కర్మణే మృత్యవే వి

తే. రాట్ఛరీరాయ నిఖిలధర్మాయ వాగ్వి
భూతయే నివృత్తాయ సత్పుణ్యభూరి
వర్చసేఽఖిలధర్మదేవాయ చాత్మ
నేఽనిరుద్ధాయ నిభృతాత్మనేనమోస్తు

ఓ ప్రభూ! స్వర్గప్రాప్తికిని, మోక్షప్రాప్తికిని, నీవే ద్వారమువు (సాధనమువు), సర్వరస స్వరూపుడవు, పరమహంసవు (సూర్యుడవు), ధర్మపాలకుడవు, సజ్జనులకు సత్ఫలప్రదాతవు, శ్రీకృష్ణుడవు, ధర్మాత్ముడవు, సర్వశక్తులతో కూడియున్న వాడవు, గొప్ప సాంఖ్యయోగీశ్వరుడవు (కపిలుడవు), హిరణ్య

గర్భుడవు (బ్రహ్మవు), రుద్రుడవు, శిష్టజన రక్షకుడవు, దుష్టనాశకుడవు, శూన్యప్రవృత్తుడవు (నిరాసక్తుడవు) కర్మస్వరూపుడవు, మృత్యురూప లయకారకుడవు, విరాట్ స్వరూపుడవు, సకలధర్మ స్వరూపుడవు, వాగ్విభూతిగల వాడవు (దివ్యవాక్శక్తి గలవాడవు), కర్మనివృత్తుడవు, పుణ్యశ్రేష్ఠుడవు, తేజోమయుడవు, సర్వధర్మస్వరూపుడవు, ఆత్మస్వరూపుడవు, అనిరుద్ధ తత్త్వరూపుడవు, వృద్ధిక్షయములు లేనివాడవు, నీకు నమస్కృతులు.

తే. సర్వసత్త్వాయ దేవాయ సన్నియామ
కాయ బహిరన్తరాత్మనే కారణాత్మ
నే సమస్తార్థలిఙ్గాయ నిర్గుణాయ
వేధసే జితాత్మకసాధవే నమోఽస్తు

ఓ దేవదేవా! నీవు అంతటను వ్యాపించియున్న శుద్ధసత్త్వస్వరూపుడవు, "సత్"ను నియమించువాడవు, బహిరంత రాళములలో నంతటను నిండియున్న వాడవు, సర్వసృష్టికి కారణభూతుడవు, సమస్త కామితములకు నిలయమైన వాడవు; నిర్గుణుడవు, సృష్టికర్తవు, సాధుసత్తములకు వశమగువాడవు; నీకు నమస్కృతులు.

ప్రభూ! నీవు ప్రద్యుమ్న తత్త్వరూపుడవు, అంతరాత్మవు, సమస్తమునకు అంతిమ కారణుడవు, యజ్ఞస్వరూపుడవు, సర్వజ్ఞుడవు, సర్వమునంతము చేయువాడవు, జ్ఞానప్రియా రూపుడవు, అంతఃకరణ నివాసివి, నీకు నమస్కారములు.

దేవా! పవిత్రాత్మా! భక్తజన ప్రియతమమును, నీలమేఘ సుందరమును అనుపమము (సాటిలేనట్టి), నిత్యమంగళదాయకమును, అయినట్టి నీ యొక్క పాదపద్మముల దర్శనమును మాకు కలుగజేయుము.

స్వామీ! ఆత్మశుద్ధిని కోరువారికి నీ దివ్యమంగళ రూపమే ధ్యేయవస్తువుకదా! స్వర్గరాజ్యాధిపతియైన దేవేంద్రునికి కూడ, నీవే స్మరణీయుడవును పూజనీయుడవును కదా! భక్తియుతులైన భక్తజనులకు సులభుడవైన నీవు, దుష్టాత్ములకు మిక్కిలి దుర్లభుడవు. ఆత్మదర్శనులకు నీవే అత్యంత

గమ్యస్థానమై వెలసియుందువు కదా! పుణ్యచరితా! ఇట్టి ఆరాధనా దుర్లభుడవైన ఓ ప్రభూ! నిన్నెఱుంగుటకు సజ్జనులకైనను సుగమము కాదు కదా, మఱి, నిన్ను పూజించుచుండు భక్తుడెన్నడైనను విడువగలడా సచ్చరిత్రా! ఓ గోవిందా! నీ పాదపద్మములను నిరంతరము భక్తితో సేవించు సజ్జనుడెన్నడును, ఆ సర్వలోక భయంకరుడైన కాలుని పాలపడడు కదా! అటువంటి నీ దివ్యపాదార విందముల నాశ్రయించునట్టి ధన్యుడైన పుణ్యాత్ముడు ఎన్నడైనను పొరపాటున నైనను ఇతర విషయములను మనస్సులో చేరనిచ్చునా ముకుందా! ఓ శ్రీహరీ! నీ యొక్క భక్తులతో ఒక్క అరనిముషమైనను చేయబడిన సత్సాంగత్యముతో మోక్షమైనను సరితూగదు కదా! ఇక క్షుద్రమైన ఈ ప్రాపంచిక సుఖము లేపాటివి? దేవా!భూతదయా సమేతులు, రాగద్వేషాది వికార రహితులు, ఆర్జవము మొదలగు సద్గుణ భూషణులు అయినట్టి భాగవతోత్తముల సాంగత్య లాభమును మాకు కలుగజేయుము. ఇదియే మా ప్రార్థన. ఏలనన, ఓ పద్మనాభా! సత్పురుష సంగముచే భక్తియందు స్థిరపడి, శుద్ధమైన చిత్తము, ఇక బాహ్యావిషయములపైకి వెళ్లదు, తమోగుణము నొందదు; నీ యొక్కమహనీయ తత్త్వమునందే నిలచియుండును.

ఈ విశ్వమును పెక్కుమాఱులు సృష్టి స్థితి లయముల నొందించుచు నుండు నీవే ఆత్మతత్త్వమని యెఱుంగుదుము. యోగపరాయణులగువారు శ్రద్ధాసమన్వితులై క్రియాకలాపముల యందు అంతఃకరణ స్థితుడవైయున్న నిన్నారాధింతురు. వారు వేదాగమతత్త్వజ్ఞానులు, నీవాద్యుడవు, అనాదివి, అద్వితీయుడవు, మాయాశక్తియుక్తుడవు.

దేవదేవా! ఫలమును కోరి, దేవతలను, పితరులను, ఆశ్రయించువారికి నీవు ఆయా దేవతల, పితరుల రూపములలోనే వారి కామ్యముల ననుగ్రహించెదవు. ఏ కోరికలు లేక ఆరాధనా భావముతో కర్మచేయువారిని కూడ అనుగ్రహించెదవు. నీకు నమస్కారములు. నీవు జ్ఞాన స్వరూపుడవు, జ్ఞానదాతవు, జగద్గురువు. నిన్ను ఏకాంత భక్తితో నారాధించువారునీ పాదపద్మములను తప్ప స్వర్గమునుగాని కైవల్యమునుగాని కోరరు. ప్రభూ! శీలము, సరళవర్తనము, సత్త్వగుణము, భూతదయ, కలిగియున్న నీ యొక్క

భక్తుల సహవాసమును, విషయభోగముల యందు విరక్తిని, నీ పాదపద్మముల యందనురక్తిని, పరమభక్తులు నిత్యమూ పూజించు నీ దివ్యదర్శనమును మాకు ప్రసాదింపుము''. అని సనక సనందాదులతో గూడి బ్రహ్మదేవుడు శ్రీమహావిష్ణువును స్తుతించెను.

ప్రచేతసులారా! మీరును, ఈ స్తోత్రమును పలుమార్లు పఠించుచు శ్రీహరిని ధ్యానింపుడు. మీ యభీష్టము నెఱవేరును. మీకు సకల శుభములు కలుగును. పరమపురుషుని స్తుతించు ఈ స్తోత్రమును ప్రాతఃకాలమందు శ్రద్ధతో పఠించినవారు పరమేశ్వరానుగ్రహమునకు పాత్రులగుదురు - అని, రుద్రుడు ప్రచేతసులకు చెప్పి అంతర్ధానమయ్యెను.

రుద్రగీత సమాప్తం

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

5. గోపికల శ్రీకృష్ణప్రేమ

(శ్రీకృష్ణావతార కార్యములో తన సేవార్థము శ్రీమహావిష్ణువు దేవతా స్త్రీ పురుషులను గోకులములో యాదవులై జన్మించ వలసినదిగా ఆదేశించెను. రామావతారములో శ్రీరాముని దివ్యసుందర విగ్రహము నాలింగనము చేసుకొనగోరిన మునుల కాంక్షను శ్రీకృష్ణావతారములో తీర్చెదనని మాట యిచ్చెను. ఆ ప్రకారమే భక్తాభీష్ట వరప్రదాతయైన భగవంతుడా మునుల యొక్కయు, దేవతల యొక్కయు, భగవత్ సాంగత్య కాంక్షను శ్రీకృష్ణావతార లీలల ద్వారా తీర్చసంకల్పించెను. వారికి తమ జన్మసాఫల్యతను అనుగ్రహించెను. నవవిధ భక్తి సాధనలలోని మధుర భక్తికి పరాకాష్ఠయే ఈ గోపికల కృష్ణభక్తి. వారికి శ్రీకృష్ణుడే సర్వస్వము. శ్రీకృష్ణుడులేని జీవనము వారికి నిస్సారము, నిరర్థకమని వారి దృఢవిశ్వాసము. అట్టి అనన్య భక్తియొక్క ప్రకాశమే గోపికల కృష్ణప్రేమ. దానిని అతి అద్భుతముగ రాసలీలలో చిత్రింపబడినది.

భగవంతుడు మూర్తీభవించిన సత్‌చిత్ ఆనందస్వరూపుడు. జీవరాసులకు, వాటియొక్క కర్మ, యోగ్యతలను బట్టి, ఆ ఆనందసాగరము నుండి కొన్ని ఆనందామృత బిందువులను జీవులపై చిలకరించును. అలాంటి ఒకానొక సన్నివేశమే శ్రీకృష్ణావతారములోని రాసలీల.)

అది, శరదృతువులో నొక పున్నమిరాత్రి. శ్రీకృష్ణుడు బృందావనిలో యమునా తీరములో, ముల్లోకములను సమ్మోహింపజేయు, నొక మోహన గీతను మురళిపైనాలాపించెను. ఆ మధుర స్వరమునకు పరవశలైన గొల్లపడుచులు సర్వమూ మఱచిపోయి, తత్తరపాటు చెందిరి. ఏ పనులను చేయుటకు వారికి తోచలేదు. చేస్తున్న పనులను ఎక్కడివక్కడనే విడిచి పెట్టిరి. కొందరు ఆవులకు దూడలను విడువ మరచిరి; విడిచినవారు పాలు పిదుకుట మరచిరి, పిదికినవారు పాలు కాచుట మఱచిరి, పాలు కాచినవారు దించుట మఱచిరి, దింపినవారు పిల్లలకు పెట్టుట మఱచిరి, కొందరు భర్తకు సేవ చెయ్యరు, కొందరు అన్నము వండరు, కొందరు ఆరగించరు, కొందరు

అలంకరించుకొనరు, కొందరు కోకలను సవ్యముగ కట్టుకొనరు, అందరూ ఎవ్వరిమట్టుకువారు ఇళ్లువిడిచి, వేణునాదము వినవచ్చుచోటికి మంత్రముగ్ధలవలె నడచి పోవుచుండగా, ఇంటనున్న పురుషులు వారించి అడ్డుపడినా, ఆ స్త్రీలు, లక్ష్యపెట్టకుండా ముందుకు సాగిపోయిరి. అట్లు త్రోసుకొనిపోలేని ఒకరిద్దరు భామలు, తమ ఇంటనే భర్తలచే బంధింపబడినవారై తమ హృదయములలోనే శ్రీకృష్ణ సాయుజ్యమును పొంది ప్రాణములను విడిచిరి. అంతటి తీవ్రతరమైనట్టిది వారి కృష్ణప్రేమ.

మంత్రముగ్ధలవలె నడచి వచ్చిన పడుచులను మృదువుగా మందలించుచు (ఏడు సంవత్సరముల ప్రాయపు) బాలకృష్ణుడిట్లనెను : "ఓ మానవతులారా! మీరు ఈ చీకటివేళలో, క్రూరమృగములు సంచరించుఈ అడవిలోనికి ఈ విధముగ రావచ్చునా? మీ జాడ తెలియక మీ వారంతా తల్లడిల్లిపోవరా? ఇట్లు సాహసించి వచ్చుట మీకు తగునా? మీ కుటుంబ గౌరవమునకు చేటు కాదా? మిమ్ములను జారిణులని ఎవ్వరైన అన్నచో అవమానము కాదా? మీరంతా ఇళ్లకు మరలిపోయి, మీ మీ పనులను చూచుకొనుడు. నన్ను చూచుచుండుట, నా మాటలు వినుచుండుట, నా పాటలు పాడుకొనుచుండుట, నన్ను స్మరించుచుండుట, చేయుచుండిన చాలును. మీరు ధన్యులయ్యెదరు. ఇక మీరు మీ గృహములకు మరలిపొండు" అని చెప్పిన బాలకృష్ణునితో నా కాంతలిట్లు మొఱవెట్టుకొనిరి: "కృష్ణా! సర్వమూ విడిచిపెట్టి, నీ పాదములచెంత జేరిన మాతో నీవిధముగ మాట్లాడుట నీకు తగునా? కరుణామూర్తివైన నీవు, నిర్దయుడవై మమ్ముల నీవిధముగ తిరస్కరించెదవని మేము కలలోనైనను ఊహింపలేము. కృష్ణా! పతులు, బిడ్డలు, బంధువులు, ఇతరులు, దుఃఖమును తెచ్చిపెట్టు బంధములే కదా! నీవే తల్లివి, తండ్రివి, భర్తవు, బంధువువు, సఖుడవు, గురుడవు, పుత్రుడవు, దైవమువు, సర్వము నీవే యని ధర్మశాస్త్రజ్ఞులు చెప్పెదరు కదా! మరి మేము నీలోనే సకల బాంధవ్యములను కల్పించుకొనుట తగదా స్వామీ! మాకు గృహస్థధర్మములు, నీతి నియమములు తెలియవని బోధించుచుంటివా? మాకు అన్నియును తెలియునులే! ఆనందసాగరుడవైన నీ చెంతకు చేరిన మమ్ముల్ని, మళ్లీ ఆ

సంసార దుఃఖసాగరములో పడియుండ మనెదవా? సర్వమూ త్యజించి, నీ పాదపద్మములనే ఆశ్రయించిన యోగీశ్వరులను స్వీకరించి, అనుగ్రహించెదవు కదా! మఱి మమ్మల్ని ఈ విధముగ నేల తిరస్కరించుచుంటివి? సంసార బంధములు దుఃఖమునే తెచ్చిపెట్టునుగాని, నీతోడి అనుబంధము మాత్రము శాశ్వతమైన బ్రహ్మానందము నిచ్చునట్టిదని గ్రహించి, మేము సర్వమును విడిచిపెట్టి నీ పాదముల చెంత చేరితిమి. మా మనోబుద్ధులు నీకే అంకితమైనవి. అన్యుల నాశ్రయింపవు. మా కాళ్లు మరలిపోవు. మా చేతులు ఇంకేపనిని చేయలేవు; మా చెవులింకెవ్వరి పలుకులను వినలేవు. మా కన్నులు నీ మోహన రూపమును తప్ప ఇంక దేనిని చూడలేవు. నీ పాటలు, మాటలు తప్ప మా నాలుకలు ఇంక నితర శబ్దముల నుచ్ఛరింపలేవు. మనోవాక్కర్మలచే నీలోనే ఐక్యమైపోయిన మమ్మల్ని ఈ విధముగ తిరస్కరించి పొమ్మనుట నీకు న్యాయమేనా స్వామీ? మేము వెనుకకు పోలేము. నీ పాదముల చెంతనే దాసీలుగా పడియుందుము. విరహాగ్ని వేదనలో దహించుకొని పోవుచున్న మాతాపమును, నీ యొక్క మృదుమధుర సంభాషణ స్పర్శలచే చల్లార్పనిచో, ఇక్కడనే భస్మమై పడియుండెదము. కృష్ణా! నిన్నుచూచినా, నీ వేణుగానమును వినినా, గోవులు, మృగములు, పక్షులు, వృక్షములు కూడ పరవశించి పులకించిపోతాయి కదా, మరి మేము ద్రవింపకుండా ఉండగలమా స్వామీ! శ్రీహరి దేవతలను కాపాడుచుండు నటుల, నీవు కరుణతో నీ అభయహస్తమును మా శిరస్సులపై నుంచకున్నచో మేము మూర్ఛపోవుదుము సుమా!" అని ఈ విధముగ దీనాలాపములను చేసిన ఆ గోపవనితల విన్నపములను విని, ఆత్మారాముడైన స్వామి వారి ఆత్మలను రమింపజేయ సంకల్పించెను. వందల సంఖ్యలో నున్న ఆకాంతలు తన స్పర్శకు, ఆలింగమునకు తహతహ లాడుచుండుటను గుర్తించెను. అందరిని అనుగ్రహించు నుద్దేశముతో, ఏ ఒక్కరికిని చిక్కకుండ, తాము కాంక్షించు చుండు అనుభూతులను ప్రతి ఒక్కరికి కలుగజేసి, బ్రహ్మానందమును అందించెను. ప్రతిపడుచు కృష్ణుడు తన వాడేనని, తానే అందరికంటె ధన్యురాలనని మురిసిపోవుచు మైమరచియున్న సమయమున మాయావి అయిన స్వామి అదృశ్యమయ్యెను.

తమచెంతనే యుండిన కృష్ణుని గానక కాంతలందరు వశము తప్పినవారై పోయిరి. నందనందనుని మాటలు, పాటలు, చేష్టలు, చూపులు, వినోదక్రీడలు తలచుకొనుచు, ముచ్చటించుకొనుచు, వారందరు పిచ్చివారివలె ఆ వెన్నెల రాత్రిలో బృందావనమంతటా వెదకసాగిరి. కనిపించిన ప్రతిచెట్టును అడిగిరి తమ హృదయాధి నాథుడెక్కడున్నాడని. “ఓ అశ్వత్థ వృక్షమా! మా మనస్సులను దోచుకొనిపోయిన మాధవుని నీవు చూచితివా? ఓ అశోకవృక్షమా! నీవైనా చూచితివా ఆ మాయావిని? ఓ తులసీ! గోవిందునకు ఇష్టమైనదానవుకదా, నీకు కూడ ఆతని జాడతెలియదా? ఓ భూదేవీ! స్వామి పాదస్పర్శతో పునీతమైన నీకు కూడ అతడెక్కడనున్నాడో తెలియదా!

ఉ. నల్లనివాఁడు పద్మ నయనంబులవాఁడు కృపారసంబు పైఁ
జల్లెడువాఁడు మౌళి పరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రా
జిల్లెడు మోమువాఁ డొకఁడు చెల్వల మానధనంబుఁ దెచ్చెనో
మల్లియలార! మీ పొదలమాటున లేఁడు గదమ్మ! చెప్పరే

నల్లనివాడు, పద్మములవంటి అందమైన కన్నులు గలవాడు, కృపారసము నందరిపైన వెదజల్లువాడు, శిరస్సున చుట్టబడిన కురులకు నెమలి కన్నును తురిమినవాడు, ఎల్లప్పుడును చిరునవ్వు చిందించు ముఖము గలవాడొకడు చెలియల అభిమాన ధనమును దోచుకొని, యిటువచ్చెను. ఓ మల్లియలారా! అతడు వచ్చి మీ పొదలమాటున దాగియున్నాడేమో, మీరైనను, చూచి చెప్పండమ్మా!

ఆ మానసచోరుడు మన్మథుని సహితము మోహింపజేయగల సుందర రూపుడు. మధురమైన వేణునాదము చేయువాడు. మమ్ములను మన్మథపుష్ప బాణముల కాహుతిచేసిన నిర్దయుడు, ఓలవంగ, మాదీఫల, నారంగ వృక్షములారా! మీ వద్ద నతడు లేడు కదా! ఉన్నచో మీరైనను జూపరే! ఈ విధముగ నా యువతులు ఆ వనములోని చెట్లను, లతలను, పుష్పములను, పక్షులను, లేళ్లను అడిగినారు.

వియోగబాధను భరించలేని ఆ వనితలు శ్రీకృష్ణుని అనుకరించుచు, బాలకృష్ణుని లీలలన్నిటిని అభినయించారు. ఒకామె పూతనవలె నటించగా

ఇంకొకామె కృష్ణునివలె చన్ను కుడిచెను. ఒకామె తృణావర్తుడై ఇంకొకామెను నీవు బాలకృష్ణుడవు అని ఎగురవేసుకొని పోయెను. ఒకామె నేను యశోదను అనగా ఇంకొకామె నా నోటిలో విశ్వమున్నది చూడుమని నోరు తెరచెను. ఇంకొకామె నేను కాళీయుని నెత్తిపై నృత్యము చేస్తానన్నది. ఇదిగో నేను గోవర్ధనగిరి నెత్తుచున్నానని చీరచెంగు గొడుగువలె నెత్తి పట్టుకొనె నింకొకామె. ఈ విధముగ వారు, తమ హావభావములను ప్రదర్శించుకొంటూ, గోవిందుని వెదుకుకొంటూ బృందావనమంతా గాలించారు. వెదకి వెదకి శ్రీకృష్ణుని ఎందునూ కానక నిరాశజెంది, ఇసుక తిన్నెలపై చతికిలబడినారు.

తమచిత్తచోరుని ఎక్కడను కానలేక విరహబాధతో గోపికలు ఈ విధముగ విలపించిరి : "స్వామీ! నీవు మా పల్లెకు వచ్చిన పిమ్మట, నిన్ను విడిచి ఉండలేని మహాలక్ష్మి కూడ ఇక్కడనే స్థిరనివాసము చేసుకొన్నదేమో అనిపించుచున్నది. నీవీవిధముగ మాయమైపోయినచో నిక మా గతి ఏమి కాను? నీపైననే మా ప్రాణములన్నీ నిలిచియున్నవి కదా! లక్ష్మి కూడ నిన్ను వెదుకుకొంటూ ఇక్కడినుండి వెళ్లిపోవును కదా! ఓ సుందరాకారుడా! నిన్ను వలచి, మేమంతా నీకు, జీతములేని దాసీలమై పోయితిమికదా! ప్రభూ! మమ్మల్నీ విధముగా వేధించడం నీకు తగునా? కాళియుని విషమునుండి, అఘాసురుని నోటినుండి, ఇంద్రుని రాళ్లవర్షమునుండి, కారుచిచ్చునుండి, ఇంకా ఎన్నో ఆపదల నుండి మమ్మల్ని రక్షించి, ఇప్పుడీ క్రూరుడైన మన్మథుని బాణములకు బలిచేయడం నీకేమైనా న్యాయముగ నున్నదా స్వామీ! నీయొక్క చరణదాసుల సంసార భయమును బాపునట్టిది, లక్ష్మీదేవికి ప్రియమైనట్టిదీ అయిన నీ అభయహస్తమును మా తలలపై నుంచి, మమ్ములను అనుగ్రహింపవా?

ఉ. నీవు యశోద బిడ్డఁడవె నీరజ నేత్ర సమస్త జంతు చే
తో విదితాత్మ వీశుఁడవు తొల్లి విరించి తలంచి లోక ర
క్షావిధమాచరింపు మని సన్నుతి సేయఁగ సత్కులంబునన్
భూవలయంబుఁ గావ నిటు పుట్టితి గాదె మనోహరాకృతిన్

ఓ నీరజాక్షా! నీవు నిజముగ యశోదాదేవి బిడ్డడివేనా? కాదు, మాకు తెలుసు. నీవు సమస్త జీవరాసులకు చేతో విదితాత్ముడవు. (చేతసము ద్వారానే

తెలుసుకొనబడువాడవు), పరమేశుడవు. పూర్వము బ్రహ్మ నిన్ను స్తుతించి, లోకరక్షణ చేయుమని ప్రార్థింపగా, భూమండలమును కాపాడుట కిక్కడ, సద్వంశమందు ఈ మనోహర రూపమున పుట్టితివికదా!

శ్లో॥ తవకథామృతం తప్తజీవనం కవిభిరీడితం కల్మషాపహం ।
శ్రవణమంగళం శ్రీమదదాతతం భువిగృణంతియే భూరిదా జనాః ॥

ప్రభూ! నీ కథామృతము సంసార తాపత్రయ తప్తజీవుల తాపమును హరించివేయు సంజీవని వంటిది. పాపకల్మషమును కడిగివేయునట్టిది. శ్రవణమాత్రమున శుభములను కలుగజేయునట్టిది, నీ స్మరణభాగ్యమును నిత్యము కలిగించునట్టిది. నీ కథామృతమును జనులకు పంచిపెట్టువారు పరమదాతలు. స్వామీ! నీవు గోవులను తోలుకొని గులకరాళ్లపైనను నూదులవంటి గడ్డిక దుబ్బులపైనను నడుచుచున్నప్పుడు సుకుమారసున్నితమైన నీ పాదారవిందములెంతగా కందిపోవునో, ఎంత నొప్పిపెట్టునో కదా! వాటిని మా మెత్తని వక్షములకు హత్తుకొని, సేవచేయుదమనుకుంటే పగలంతా నీవు పశువులతో తిరిగెదవు. రాత్రులందు మాకు వీలుపడదు కదా! హృదయేశ్వరా! మా హృదయముల నింత మృదువుగాను, మెత్తగాను తయారుచేసి, నీ హృదయమును ఇంత కఠినముగ నుంచిన మా యొక్క మందభాగ్యమునకే మేము వాపోవాలి" అని, తమ ఆవేదనను వెలిబుచ్చుకొనుచు, ఆ గోపకాంతలు గోపాలకృష్ణుని స్తుతించుచు, పాటలు పాడుచు, విలపించుచు, అలుగుచు, చేసిన విన్నపములను వినిన స్వామి, త్రిజగన్మోహనుడై, మన్మథ మన్మథుడై, దివ్యసుందర విగ్రహుడై ప్రత్యక్షమయ్యెను. గోపికలందరికి పోయిన ప్రాణములు తిరిగివచ్చినవి. తమ మనోహరుని చుట్టుముట్టిరి. రెప్పలార్పకుండ కన్నులు పండువుగ తమ ప్రాణనాథుని చూచుకున్నారు.

ఒక ముద్దరాలు, కృష్ణుడు తనవాడే అన్నట్లు అతని రెండుచేతులను తీసుకొని తన బుగ్గలకు ఆన్చుకున్నది. ఇంకొకామె ఎఱ్ఱ కలువలవంటి స్వామి పాదములను తన ఎదకు హత్తుకున్నది. ఇంకొక సుందరి స్వామి భుజములు తనవే అన్నట్లు వాలిపోయినది. ఈ విధముగా ఆ మోహనాంగులందరు స్వామిని ఏదో ఒక విధముగ స్పృశించి, ముద్దాడి, తన్మయులై మురిసిపోవాలని

ముందుకు తోసుకుంటూ వచ్చిరి. కొందరు అతనిపై అలకను ప్రదర్శించుచు, దూరముగ నిల్చొని కొంటెచూపులు చూచుచుండిరి. కొందరు "నీవింత నిర్దయుడవని కలలో కూడ ఊహించలేదు" అని నిష్ఠురోక్తులాడిరి. కొందరు శ్రీకాంతుని దివ్యసుందరమూర్తిని చక్షుద్వారముల గుండా హృదయములోనికి ప్రవేశపెట్టి, మళ్లీపారిపోవునేమో యన్నట్లు కన్నులు మూసుకొని ఆత్మానందము ననుభవించిరి. స్వామి అందరితోను తగురీతిని అనునయించుచు, ఆనందింప జేయుచుండెను. వారి విరహతాపము శమించెను. భగవంతుని దర్శించిన భాగవతోత్తములవలె, వారంతా బ్రహ్మానందభరితలైరి. ఇకవారు జీవితములో కోరదగిన దేమియును లేదు.

శ్రీకృష్ణుని గురించి ఆ యిసుక తిన్నెపైన ఆ మగువలు తమ ఉత్తరీయములను పరచి ఒక మెత్తని ఆసనమును చేసి అతనిని కూర్చుండబెట్టి, చంద్రుని చుట్టు చేరిన తారకలవలె తాము చుట్టుముట్టిరి. "నీకు మామీద ప్రేమలేద"న్నారు. "అన్నీ దోచుకుని తిరిగి ఏమీ యివ్వని స్వార్థపరుడవు నీవు" అన్నారు. ప్రణయకలహములవంటి సూటిపోటి మాటలననిరి. అన్నీ విని, స్వామి చిరునవ్వుతో నిట్లనెను : "నేను మీ అందరి హృదయములలో నివసించు ఆత్మబంధువును. మీ యొక్క ఆర్తి, అనురాగము, సన్నగిల్లకుండ నుండుటకును, మీరెల్లప్పుడును నన్నే స్మరింపుచుండుటకును, అప్పుడప్పుడు మీ మధ్య నుండి నా రూపము కనుమఱుగగుచుండును. అంతేకాని, నాకు మీయందు ప్రేమలేక కాదు" అని మాధవుడు చెప్పగా ఆ మగువలందరు మహదానందము పొందిరి.

గోపికలకు శ్రీకృష్ణునియందుగల అద్వితీయ, అచంచల, అనిర్వచనీయమైన మధురభక్తిని గురించి, భగవానుడు వారిచేచేయించిన రాసక్రీడ రమణీయతను గురించి, భక్తిశ్రద్ధలతో చదివిన వారికి, వినినవారికి భక్తి ఇనుమడించి, దుఃఖము శమించి, పాపము నశించును అని శుకయోగి పరీక్షిత్తుకు చెప్పెను.

గోపికల శ్రీకృష్ణప్రేమ సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

6. అక్రూరస్తుతి

దేవకి వసుదేవపుత్రులు గోకులమునందు నందుని యింట పెరుగుచుండిరని నారదుని వలన తెలుసుకొని కంసుడు వారినెట్టైనను మధురకు రప్పించి, ధనుర్యాగము నేర్పాటుచేసి, అచ్చట వారిని చంపించుటకు వ్యూహము పన్నెను.నందాదులను, బలరామకృష్ణులను ఆహ్వానించుటకు మధురలోనున్న ఒక యాదవ సజ్జనుడైన అక్రూరుని గోకులము పంపించెను. అక్రూరుడొక మంచి కృష్ణభక్తుడు. అతడు నందాదులను కలుసుకొని, బలరామకృష్ణులను మధురకు తోడ్కొని పోవుటకు వారి అనుమతిని పొంది, ఆ మరునాడు, ఆ బాలురను రథములో కూర్చుండబెట్టుకొని బయలుదేరెను. దారిలో రథము నాపి, బాలుర నక్కడనే ఉండుడని చెప్పి యమునానదిలో స్నానము చేయుటకు వెడలెను. అతడు స్నానము చేయుచుండగా బలరామకృష్ణులు నదిమధ్యనుకనిపించిరి. రథములో నున్న బాలురు నదిమధ్య కెట్లువచ్చిరని ఆశ్చర్యముతో నాతడా రథమువైపు చూడగా అన్నదమ్ములిద్దరు అక్కడనే కూర్చొని నవ్వుకొనుచుండిరి. తికమకచెందిన అక్రూరుడు కన్నులు నులుముకొని నీటిలో మునగగా -

ఆ నదిమధ్యను కనిపించెను. ఫణిరాజైన ఆదిశేషువు. వేయిపడగలతోను, రాజవేషములోను, రత్నమణి భూషణములతో మెఱిసిపోవుచుండెను. శేషశయనముపైన, పీతాంబరధారియై, శాంతాకారుడై, చతుర్భుజుడై, సర్వాలంకార శోభితుడై దర్శనమిచ్చెను నీలమేఘశ్యాముడు. బ్రహ్మరుద్రాది దేవతలు, సనకాది మునులు, నంద సునందాది పార్షదులు, ప్రహ్లాదనారదాది భాగవతోత్తములు, చుట్టూచేరి, దివ్యస్తోత్రములు చేయుచుండిరి. ద్వాదశ శక్తులతో కూడి, శ్రీదేవి సేవ చేయుచుండెను. ఇట్టి అపూర్వమైన అద్భుత దివ్యదర్శనమును గాంచెను మహాభాగ్యశాలియైన అక్రూరుడు. ఒక్కక్షణము పాటు నోటమాట రాక, భక్తిసంభ్రమములతో నిట్లు స్తుతించెను:

"శ్రీమానినీ మానసచోరా! శుభాకారా! ప్రళయ జలధిలో క్రీడించే శ్రీమన్నారాయణా! వటపత్రశయనా! చతుర్ముఖ బ్రహ్మోద్భవ పద్మనాభా! నీ మహిమను తెలుసుకొనుటకు గాని, వర్ణించుటకు గాని, ఆ బ్రహ్మకు కూడను

సాధ్యపడదుకదా! నీవు అంతర్యామివి, సర్వసాక్షివి, ఈశ్వరుడవు. నిన్ను జ్ఞానులు, భక్తులు, యోగులు పలువిధముల కొలిచెదరు. వేర్వేరు మార్గములలో ప్రవహించే నదులన్నీ సముద్రమునే ప్రవేశించునట్లు, అన్నిమార్గముల యొక్క గమ్యము నీవే కదా! నీవు అన్నింటను, అంతటను నిండియుందువు. నీకు అందరును సమానులే. మత్స్యరూపమున వేదములను సంరక్షించితివి, హయగ్రీవుడవై మధుకైటభులను హతమార్చితివి. కూర్మరూపుడవై మందరగిరి నెత్తితివి, వరాహుడవై భూమండలము నుద్ధరించి హిరణ్యాక్షుని అంతము చేసితివి. నరసింహుడవై భక్తశిరోమణియైన ప్రహ్లాదుని రక్షించి, హిరణ్యకశిపుని శిక్షించితివి; వామనుడవై బలిచక్రవర్తి గర్వమణచి, అనుగ్రహించితివి. భార్గవ రాముడవై దుష్టక్షత్రియులను దునుమాడితివి. దశరథరాముడవై దశకంఠ రావణుని హతమార్చితివి. వాసుదేవుడవై వసుంధరయొక్క భారమును బాపనుంటివి; కల్కిరూపుడవై లోకకల్యాణము చేయనుంటివి. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న అనిరుద్ధుల రూపుడవై సృష్టి, స్థితి, సంహార, శాస్త్ర ధర్మరక్షణ నిర్వహణ కార్యములను జరిపెదవు. నీకు నా ప్రణామములు. కృష్ణా! పరమేశ్వరా! నిన్ను తెలుసుకొనలేని అజ్ఞుడనైన నేను, నిన్ను స్తుతింపగల నా స్వామీ! నీ మాయలోనే మునిగి ప్రవర్తించువాడను. సంసారదుఃఖములో మునిగియున్న వాడను. నన్ను కరుణించి అనుగ్రహింపుము శ్రీహరీ! నీకు సాష్టాంగ దండప్రణామములు'' అని స్తుతించిన అక్రూరుని దృష్టినుండి స్వామి తన దివ్యదర్శనము నుపసంహరించుకొనెను.

అక్రూరుడు నదినుండి రథమువద్దకు తిరిగివచ్చెను. అతనిని శ్రీకృష్ణుడిట్లడిగెను: "అక్రూరా! నీవు స్నానమునకు పోయి చాలా సేపయినది కదా, నదికూడ అంతదూరమేమియు కాదు, మరి అక్కడ నీటిలోగాని, భూమిపైనగాని, ఆకాశములోగాని ఏదైనా వింతవిషయము కానవచ్చినదా?'' అని అడుగగా అక్రూరుడిట్లు చెప్పెను: "ఓ మహానుభావా! నీలోలేని వింతలు ఇంకెక్కడనైనను ఉండునా. ఇక నీటిలోగాని, నింగిలోగాని ఎట్లుండును?'' అని ఆ దివ్య దర్శనమును మననము చేసుకొనుచు రథము నడిపెను.

అక్రూర స్తుతి సమాప్తము

హరిః ఓం తత్ సత్

7. కపిలబోధ

బ్రహ్మదేవుని ఛాయనుండి ఉద్భవించిన కర్దముడు (బ్రహ్మ ఆదేశము ప్రకారము) సంతానము కొఱకు తపస్సు చేయుగా, శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమయి, స్వాయంభువ మనువు పుత్రికయైన దేవహూతితో నతనికి వివాహం జరుగుననియు, ఆమె సంతానవతియగుననియు, తానే (విష్ణువే) ఆ పుణ్యదంపతులకు పుత్రుడై జన్మించు ననియు వరమిచ్చెను. అట్లే కర్దమ దేవహూతి దంపతులకు శ్రీహరి పుత్రుడై జన్మించి, మహాజ్ఞానియై సాంఖ్యయోగమును స్థాపించిన కపిల భగవానునిగ ప్రసిద్ధికెక్కెను. కర్దముడు భార్యాపుత్రుల అనుమతిని పొంది సన్న్యసించి అరణ్యములకు వెడలిపోయెను.

ఒకనాడు దేవహూతి కపిలునితో నిట్లనెను: "నాయనా! నీవు నా కుమారుడవే యైనను, మానవుల అజ్ఞానమును బాపుటకై యవతరించిన జ్ఞానభాస్కరుడవైన నారాయణుడవని నాకు తెలుసు. జీవితమంతా ఇంద్రియములను తృప్తిపరచుటకును, నేను, నాది అను భావములను పెంచుకొనుటకును, అజ్ఞానము చేత ప్రయాసపడు నావంటివారు బయటపడు మార్గమును నాకు జూపుమయ్యా" అని వేడుకొన్న తల్లితో కపిలుడిట్లు చెప్పెను:

"మాతా! సూక్ష్మముగ చెప్పవలెనన్న, బంధమును కలిగించుటకుగాని, మోక్షమును పొందుటకుగాని, మనస్సే మూలకారణము. అది, సత్త్వరజస్తమో గుణములతోచేరి, ఇంద్రియ విషయములయందు చరించిన, బంధమేర్పడును. ఆ మనస్సే మాధవుని యందు లగ్నమై సంగమేర్పరచుకొన్నచో మోక్షగామి యగును. "నేను, నాది" యను అహంకార మమకారరూపమైన అభిమానము వలన కామక్రోధాది దోషసమూహములు ఆవిర్భవించును. చిత్తము వానికి లోనుగాకుండ వానినుండి విడువడినప్పుడు పరిశుద్ధమగును. అప్పుడు సుఖము, దుఃఖము ఉండక, జ్ఞానవైరాగ్యము లుదయించును. శరీరము కంటె ఆత్మ భిన్నమైనదని తెలుసుకొనుట జ్ఞానము, ఇంద్రియ విషయాల ననుభవించాలను కోరిక లేకపోవుట వైరాగ్యము. జ్ఞానవైరాగ్యములు కలిగినచో భగవానునియందు భక్తి ఉదయించును. ఆత్మస్వరూపము గోచరించును.

పరమేశ్వరుడు ప్రకృతికి పరుడు, సూక్ష్మరూపుడు, స్వయంప్రకాశుడు, అపరిచ్ఛిన్నుడు, ఉదాసీనుడు. అట్టి పరమాత్మను భక్తి జ్ఞాన వైరాగ్యములతో కూడిన చిత్తముతో దర్శించిన యోగులు, ఆ సర్వాంతర్యామికి సర్వమూ సమర్పించి భక్తిమార్గమే మోక్షప్రాప్తికి ఉత్తమమైన మార్గమని భావించెదరు.

మనస్సు ఇంద్రియ విషయములతో సంగమేర్పరచుకున్నచో బంధకారక మగును. ఆ సంగమే సద్వస్తువు యందేర్పడినచో అంతఃకరణ సంయమము కలిగి తెరుచుకొన్న మోక్షకవాట మగును.

మాతా! భాగవతోత్తములు సహనశీలురై, శాంతులై, సర్వభూతహితులై, కరుణార్ద్ర హృదయులై, కర్మఫలములను త్యజించినవారై, స్వపర భేదభావము లేనివారై, పరమేశుడనైన నన్నాశ్రయించిన వారై, నా గుణగణములను స్మరించుచు, నా చరితములను చెప్పుకొనుచు, వీనులవిందుగ వినుచు, ఎల్లప్పుడు నానందించుచుందురు. వారిని (ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక) తాపత్రయము లంటవు. అటువంటి సర్వసంగ పరిత్యాగులైన పరమభాగవతుల సాంగత్యమే కోరదగినది. అదియే సర్వదోషహారిణి. వారి సాంగత్యమువలన మోక్షప్రదమైన శ్రద్ధాభక్తులుదయించును. అజ్ఞానము నశించును.

తల్లీ! సహజము, నిర్హేతుకము, అయిన భగవద్భక్తి ముక్తికంటెను గొప్పది. అది, జీవులకర్మలను, లింగశరీరమును నశింపజేయును. కొందరు నా పాదసేవ చేయుటయందును, నా గుణగణముల గానము చేయుట యందును, నా దివ్యగాథలను వినుచు, చెప్పుకొనుచు, ఆనందించుచు, ముక్తిని కూడను వాంఛింపరు. కొందరు నా దివ్యమోహనాకారమునే మనస్సులో నింపుకొని, లౌకిక సుఖసంపదలను గాని, స్వర్గలోక బ్రహ్మలోక ప్రాప్తినిగాని, అణిమాది అష్టసిద్ధులనుగాని, ఇంకేమైననుగాని, కోరకుండ, నిత్యానందమున మునిగి యుందురు. అట్టివారు సంపూర్ణ వైభవోపేతము, మహోన్నతము అయిన వైకుంఠ ధామమును చేరుకొందురు, నా యొక్క కాలచక్రమునకు కూడను లోబడరు, ఏలనన, నేనే వారికి తల్లి, తండ్రి, గురువు, దైవము, సర్వస్వము, గనుక. నేను వారిని ఈ జనన మరణ సంసారచక్రమునుండి తప్పించి పైకి తీసుకొని పోయెదను. ప్రకృతి పురుషులకును నేనే అధీశ్వరుడను. నన్ను

శరణుజొచ్చిన వారు తప్ప ఇతరులు సంసార చక్రములో చిక్కుకొనెదరు. నా ఆజ్ఞచేతనే గాలివీచును, అగ్నిమండును, సూర్యుడు ప్రకాశించును, ఇంద్రుడు వర్షించును, మృత్యువు సంహరించును. అందువలన వైరాగ్యముతో కూడిన భక్తియోగముచేతనే, యోగులు నా చరణములను స్మరించుచు నిర్భయముగ నుందురు. భక్తియే మోక్షసాధన మార్గము.

యోగలక్షణములు వివరించెదను వినుము : శక్తికొలది స్వధర్మాచరణము చేయుట, శాస్త్రనిషిద్ధకర్మలను చేయకుండుట, దైవికముగ లభించు ద్రవ్యముతో సంతుష్టిజెందుట, మహాభాగవతుల పాదసేవ చేయుట, నీచకర్మలు చేయకుండుట శుచియైన మితాహారమును భుజించుట, ఎవ్వరిని హింసింపకుండుట, ఇతరులకు చెందినదానిని తీసుకొనకుండుట, న్యాయార్జిత ధనములో తనకెంత అవసరమో అంతే స్వీకరించుట, సత్యవర్తనము, బ్రహ్మచర్యము, తపస్సు, మౌనము, పాటించుట, సద్గ్రంథాధ్యయనము, సర్వేశ్వరార్చనము చేయుట ఇంద్రియ నిగ్రహము పాటించుట, మనస్సును విషయములనుండి ఉపసంహరించి, హృదయమందు నిలుపుట, ప్రాణాయామము, ధారణ, ధ్యానము చేయుట, శ్రీమన్నారాయణుని దివ్యలీలలను మననం చేసుకొనుట, శ్రీహరియే అంతటను నిండియున్నట్లు విశ్వసించుట, ఇవి యోగధర్మములు.

ఓ మాతా! మనుజులయొక్క ఫలాసక్తి, సంకల్పములలోని తారతమ్యముల ననుసరించి, వారిలో భక్తిభావము లుదయించును. అవి, తామసిక భక్తి, రాజసిక భక్తి, సాత్త్వికభక్తి అను మూడు విధములుగ వ్యక్తమగును.

ఇతరులకు హింస కలిగించుచు, దంభము, మత్సరము, రోషము, భేదబుద్ధి, మనస్సులో నుంచుకొని నన్ను కొలుచుట తామసిక భక్తి అనబడును. గొప్ప గొప్ప ఐశ్వర్యములను, కీర్తిని, వస్తువులను,, పదవులను, భూములను కోరుకొనుచు(ఆడంబర ఆర్భాటములతోను, అధిక వ్యయప్రయాసలతోను) నన్ను పూజించుట రాజసిక భక్తి అనబడును. పూర్వకర్మలను పరిహరింప జేయునది భగవద్భక్తి ఒక్కటే యను విశ్వాసముతో, సమస్త కర్మలను భగవదర్పిత భావముతో, లోకులకు మేలు కలిగించు కర్మలు చేయుచు,

భగవంతుని పూజార్చనాది సేవలను చేయుట సాత్త్విక భక్తి అనబడును. నా యొక్క దివ్య నామగుణ వైభవములు చెవులకు సోకినంతనే భక్తిపారవశ్యమును చెందువారు ఉత్తమభక్తులు. నిర్హేతుకముగ నిష్కామముగ నాగురించి చేయబడిన భక్తి ప్రక్రియలే శ్రేష్ఠమైనవి. నిష్కాములైన నా యొక్క భక్తులకు, సాలోక్యము, సామీప్యము, సారూప్యము, సాయుజ్యము, అనబడు ముక్తియే ధ్యేయము. అందుచేత మహాత్ములైన భక్తులు, తమ స్వకార్యములను వెనుకకు నెట్టి నా ఆరాధనలోనే మగ్నులై యుందురు. దీనిని ఆత్యంతిక భక్తియోగమందురు. త్రిగుణముల కతీతుడైన భక్తుడు నా వంటి రూపమునే పొందును.

నా భక్తుడు, సంధ్యాది నిత్యకర్మల యందును లోకకల్యాణార్థము చేయబడు యజ్ఞయాగాది నైమిత్తిక కర్మల యందును అత్యంత శ్రద్ధాసక్తులను కలిగియుండాలి. పాంచరాత్రములలో చెప్పబడినట్లు నిష్కామబుద్ధితో నన్నారాధించాలి. నా రూపము దర్శించుట, స్మరించుట, నా చరిత్ర వినుట, కర్మలలో చిక్కుకొనకుండుట, తనకంటె గొప్పవారిపై నాదరగౌరవములను, తక్కువవారిపైన దయాదాక్షిణ్యములను, సమానులపైన స్నేహానురాగములను కలిగియుండుట, యమనియమములను పాటించుట వంటి సుగుణముల నలవరచుకోవలెను. యోగాభ్యాసము చేయవలెను. శ్రీహరియొక్క దివ్యగుణ కీర్తనలు చేయుచు, భక్తులను నిజాయితీతోను, అనురక్తితోను సేవించు చుండవలెను. అహంకారములేనివాడై నిశ్చలుడై యుండవలెను. ఈ సుగుణములు గలవాడు నన్ను చేరగలడు.

తల్లీ! సర్వజీవుల హృదయకమలముల యందుండు నన్ను అలక్ష్యముచేసి, నా విగ్రహమునే పట్టుకుని ఆడంబరముగ పూజించువాడు మూఢుడు, యథార్థ భక్తితో నన్నారాధింపనివాని పూజలు నిరర్థకములు. సర్వభూతాంత రాత్ముడనైన నా యందును, జీవరాసుల యందును, మాయామోహితులై భేదదృష్టిని పెట్టుకొని, నన్ను పూజించి, ఇతర జీవులను ద్వేషించువారికి మనశ్శాంతి లభింపదు. అటువంటి కుటిలాత్ములు అధికద్రవ్యము వెచ్చించి, ఆడంబరముగ నా పాదపూజలు చేసినను నేను సంతోషించను.

మానవులలో స్వధర్మాచరణలో నిపుణులుత్తములు. వారికంటెను సద్ధర్మపరులు, వారికంటెను, సర్వధర్మములను సర్వస్వభావ విశేషములను, విడిచి, సర్వమును నాకే సమర్పించి, అనన్యభావముతో సర్వత్రా సమవర్తనుడై జీవితమును గడుపు పుణ్యాత్ముడు సర్వశ్రేష్ఠుడు. అటువంటి పుణ్యపురుషుని చూచుచు సమస్త ప్రాణికోటి ఎల్లప్పుడును సంతోషించుచు, అభినందించు చుండును.

కపిలబోధ సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

8. ఋషభదేవుని బోధ

స్వాయంభువ మనువు మునిమనుమడైన నాభికి, మేరుదేవికి, శ్రీమన్నారాయణుడే పుత్రుడై జన్మించెను. అతనిపేరు ఋషభుడు.

ఋషభుడు అవతారపురుషుడే అయినను, సామాన్యునివలె వర్ణాశ్రమ ధర్మములను చక్కగ నాచరించుచు, ప్రజలచే నాచరింపజేయుచుండెను. అతడు రాగద్వేష రహితుడై, సర్వభూతహితుడై యుండెను. అతడు ఆదర్శ ప్రభువుగ చిరకాలము రాజ్యముచేసి, రాజ్యభారమును పుత్రులకు అప్పగించి బ్రహ్మావర్త దేశమునకు వెడల దలచెను. మంత్రులు, మునులు, మహాత్ములు ఉపస్థితులై యుండగా నతడు తన కుమారుల కీవిధముగ నుపదేశించెను.

కుమారులారా! ఈ మానవజన్మ బహుదుర్లభమైనది. దానికి ఒక ఉత్తమ ప్రయోజనమున్నది. జీవరాసులన్నీ నిత్యము చేయుచుండు ఆహార నిద్రా, మైథున కార్యములే కాకుండ, మానవుడు, తనకే ఇవ్వబడిన బుద్ధిని సద్వినియోగ పరచుకొనవలెను. భగవదారాధనచే చిత్తమును శుద్ధపరచుకొని, మోక్షమును పొందవలెను. కామముల ననుభవించుట చేత సంసార బంధములు పెరుగును. మహాత్ముల సేవ మోక్షమునకు దారితీయును. సాధు సజ్జనుల సాంగత్యము చాలా శ్రేయస్కరము. కామప్రేరితమైన స్త్రీ పురుష సాంగత్యము చాలా హానికరము. మహాత్ములు ఎల్లప్పుడును శాంతస్వభావులై యుందురు, వారు సమచిత్తులు, ద్వేషాసూయ క్రోధములు లేనివారుగా నుందురు. వారికి సమస్త జీవుల యందు దయ, కరుణ మెండుగ నుండును. వారికి భగవంతునియందు పరిపూర్ణమైన భక్తిశ్రద్ధలుండును. వారు, విషయ లంపటులకు, దుష్టులకు దూరముగ నుందురు. వారికి యెవ్వరి యందును, దేనియందును వ్యామోహముండదు.

భగవద్భక్తియే జీవితము యొక్క ధ్యేయమని తెలుసుకొనవలెను. దేహేంద్రియ మనోబుద్ధులను సుఖపెట్టవలెనని చేయు కర్మలు, కర్మబంధమును కలుగజేయును. ఆ కర్మలే మఱల దేహధారణకు కారకములగును. ప్రస్తుత శరీరము పూర్వకర్మల ఫలితముగ వచ్చినది. అట్లే

ప్రస్తుత కర్మలు భావిజన్మలకు బీజాంకుర మగును. ఇల్లు, ఇల్లాలు, పిల్లలు, అనుకుంటూ వ్యామోహము, అనుబంధము, పెంచుకొన్నచో, సంసారబంధము లింకను చుట్టుకొనును. తెలుసుకొనవలసినది, ఆశ్రయింపవలసినది, పొందవలసినది, ఈ బంధనములకు భిన్నముగను, అతీతముగను ఉన్న పరమాత్మ తత్త్వమేనని గుర్తించనంతవరకు, ఈ సంసార చక్రభ్రమణము కొనసాగుచునే యుండును. మానవుడు దుఃఖపంకిలములోనే కొట్టుకొను చుండును

మానవుడు, అవిద్యచే - ఈ శరీరమే నేను అని, ఈ శరీరానికి చెందిన భార్య, బిడ్డలు, సంపదలు, అన్ని నావే, యని - అహంకారమమకారములను కల్పించుకొనును. వాటిని తృప్తిపరచుటకు కర్మలు చేయుచు, కర్మఫలముల ననుభవించుచు, వాసనలను పెంచుకొనుచు, క్రొత్తజన్మలకు పునాది వేసుకొనును. వాసనా క్షయమే ముక్తి. ఇది సిద్ధింపవలెనన్న, దృష్టిని ప్రపంచము నుండి మళ్లించి, పరమాత్మయందు లగ్నము చేయవలెను. భాగవతుల సాంగత్యము, భగవద్గుణ కీర్తనము చేయుచుండవలెను. అప్పుడు విషయాసక్తి తగ్గి, మోక్షాసక్తి పెరుగును.

అందుచేత నాయనలారా! మీరెల్లప్పుడును భగవంతునే ఆశ్రయింపుడు. ఈ దృశ్యప్రపంచమంతయు నశాశ్వతమైనట్టిదని గ్రహించి, దానియందెట్టి సంగమును పెంచుకొనవద్దు. బ్రహ్మజ్ఞానము పొందుటకు సాధన చేయుడు. భగవంతునకు శరణాగతులగుడు.

ఈ సాధనలో పాటింపవలసిన కొన్ని సూత్రములున్నవి. భగవానునియందు ప్రేమ, భక్తి కలిగియుండవలెను. భగవంతుని విషయమై ఆసక్తిని, జ్ఞానమును పెంచుకొనవలెను, కోరికలను తొలగించుకొనవలెను, సుఖదుఃఖములయందు సహనము, సమానత్వము కలిగియుండవలెను, జీవులపట్ల సానుభూతి చూపవలెను, భగవంతుని కథలు, గుణగణములు, లీలావైభవములు, వినుచు, కీర్తించుచుండవలెను. అంతటను, అన్ని పరిస్థితులయందును సమబుద్ధిని కలిగియుండవలెను. అహంకార మమకారములను తొలగించు కొనవలెను. ఇంద్రియములను నియంత్రించవలెను, అంతటను, భగవంతుని గాంచవలెను,

ఇట్టి సాధన చేసినచో మనస్సునుండి కర్మవాసనలు తొలగి, కారణదేహము ఆ జీవుని వెంట రాకుండ విడిచిపెట్టును. ఇదియే ముక్తి - భగవంతునియందు అచంచల భక్తి కలిగియున్న వాని సూక్ష్మదేహము ఆ జీవుని వెంట పడదు. ఈ రహస్యమును తలిదండ్రులు బిడ్డలకు, గురువులు శిష్యులకు, రాజులు ప్రజలకు తెలియజెప్పవలెను. అజ్ఞానముచే, దేహపోషణయే పరమావధి యనుకొని, కర్మలలో చిక్కుకొని, నీచజన్మలకు దిగజారనున్నవారిని వారించి సరియైన మార్గము జూపని విజ్ఞులు తమ ధర్మమును తప్పినవారగుదురు.

కుమారులారా! మీరందరును సత్త్వగుణ ప్రధానులు. మీకు కర్మాసక్తితో కూడిన ప్రవృత్తిమార్గము సరిపడదు, భగవద్భక్తియే రుచించును. ద్విజులలో బ్రహ్మజ్ఞాన సంపన్నులే శ్రేష్ఠులు. బ్రాహ్మణులకు అర్పింపబడిన వాటిని భగవంతుడే స్వీకరించును. భగవద్భక్తులైన భాగవతులయందు భక్తికలిగి యుండవలెను. ఈ విశ్వమందున్న స్థావరజంగమ ప్రాణులన్నియు ఆ భగవంతునియొక్క శరీరమేయని గ్రహించి ప్రవర్తించుట, భగవానుని ఆరాధించుటయే యగును. భగవదారాధన యొక్కటే మోక్షసాధనమని తెలుసుకొనుడు. సర్వభూతములయందు భగవానుని ఉనికిని గుర్తించుట, సతతము భగవానుని గురించి ప్రసంగించుట, అంతటను భగవానుని శరీరమును చూచుట ముక్తిసాధనలని తెలుసుకొనుడు.

నాయనలారా! సద్బ్రాహ్మణులను గౌరవించి ఆదరించుట, ప్రజలను బిడ్డలవలె ప్రేమించుట, ధర్మయుతముగ పరిపాలించుట, మీ అన్న అయిన భరతుని, నన్ను గౌరవించునట్లే, భక్తి శ్రద్ధలతో సేవించుట, మీ అందరి యొక్క ధర్మమని మీకు తెలియజేయుచున్నాను - అని ఋషభదేవుడు తన ఉపదేశమును ముగించెను.

ఋషభబోధ సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

9. ఋషభపుత్రుల బోధ

ఋషభచక్రవర్తికి నూర్గురు పుత్రులు. వారిలో పదిమంది పదిఖండములకు రాజులైరి. పెద్దవాడు భరతుడు. అతనిపేరు మీదనే భారతవర్షము ప్రసిద్ధి గాంచినది. తరువాతి ఎనుబదియొక్క మంది, బ్రాహ్మణత్వమును స్వీకరించి, నిత్యకర్మానుష్ఠాన పరులైరి. చివరి తొమ్మిది మంది, బ్రహ్మవిద్యా విశారదులై, ఋషులై, జీవన్ముక్తులై, ముల్లోకములలో స్వేచ్ఛావిహారులై యుండిరి.

ఆ తొమ్మండుగురు, ఒకనాడు విదేహరాజైన నిమి నిర్వహించిన యాగము సమాప్తమగు సరికి అక్కడకు చేరిరి. నిమిచక్రవర్తి వారినాహ్వానించి, పూజించి, సంతృప్తులను జేసి, యిట్లనెను: "మహాత్ములారా! మీ వంటి సాటిలేని జ్ఞానధనులు, విశ్వమంతా శ్రీహరిమయమే యని దర్శింపగలిగిన తత్త్వజ్ఞులు. ఇక్కడికి విచ్చేయుట మా భాగ్యము. నా అజ్ఞానమును బాపగల మహనీయులు మీరేనని నా విశ్వాసము. నా సందేహములను తీర్చి నన్ను ధన్యునిగ చేయుడు:

"మానవజన్మ అతి దుర్లభమైనట్టిది. శ్రీమన్నారాయణుని పాదపద్మముల యందు అనురక్తి కలుగుట ఇంకను కష్టసాధ్యము. ఇటువంటి అమూల్యమైన మానవజన్మను సద్వినియోగపరచుకొనకుండ సంసార పంకిలములోనికే ఇంకను చొచ్చుకొని పోవును మనుజుడు. ఈ సంసార సాగరమును దాటుటకు ఏదైన మార్గమున్నదా? శాశ్వతమైన శ్రేయస్సు ఎట్లు కలుగును? భక్తిప్రపత్తులు గలవారికి విష్ణుసారూప్యమెట్లు కలుగును? తెలవివ్వండి" అని నిమిచక్రవర్తి అడుగగా, ఋషభపుత్రులలోకవి అను ఋషి ఇట్లు చెప్పెను:

కవి : రాజా! కామ క్రోధ లోభ మోహ మదమత్సరములను అరిషడ్వర్గ మందురు. దారేషణ, ధనేషణ, పుత్రేషణలను ఈషణత్రయమందురు. వీనియందు చిక్కుకొన్న మానవునకు మాధవుని పాదపద్మముల నాశ్రయించాలను ఆసక్తి కలుగనేరదు. విజ్ఞాన యుతమైన నిర్మలహృదయము, భక్తిభావనావేశము లేనిచో పరమపదము లభింపదు. మనోవాక్ కాయ సమన్వయముతో చేయబడిన ప్రతికర్మను "కృష్ణార్పణము"గ చేయుటయే సుజ్ఞానమని పరమ మునీంద్రులు చెప్పిరి. జ్ఞాన అజ్ఞానములతో కలత చెందిన మనస్సువలన స్మృతి నశించును. కావున సద్గురు దేవు నాశ్రయించి,

బుద్ధిమంతుడు, ఆ పురుషోత్తమునే చిత్తమందు నిలిపి సేవింపవలెను. ఇచ్ఛలు, మనోరథములు, స్వప్న సదృశ భోగవాంఛలు, మానవుని యందున్న సత్సంకల్పములను చెదరగొట్టి, దైవచింతనను నశింపజేయును గనుక కోర్కెలను రేకెత్తించు సంకల్పముల నడుపులో నుంచి, నిరంతర హరి ధ్యానములో నుండు వ్యక్తికి కైవల్యము సులభ సాధ్యమగును. ఓ రాజా! భక్తుడెల్లప్పుడును శ్రీకృష్ణ సంకీర్తనలు వీనులవిందుగ వినుచుండవలెను; శ్రీహరి గాథలను హర్షముతో నాడుచు పాడుచు వినాలి, వినిపించాలి. శ్రీమన్నారాయణుని దివ్యనామములను ఎల్లప్పుడును స్మరించుచుండవలెను. పద్మలోచను లీలలను అడవులలో సంచరించుచున్నను భక్తియుక్తముగ గానము చేయవలెను. విశ్వమయుని కీర్తించుచు, వెఱ్ఱివానివలె, లోకాతీతుడై యుండవలెను. ఈ విశ్వమంతయు విష్ణుమయమే యని తెలుసుకొనవలెను.

అని కవి చెప్పగా, విదేహరాజు భాగవతదర్మములనగానేమి, భాగవతు లెట్లుండెదరు అని అడిగెను. అప్పుడు కవిసోదరుడైన హరి యిట్లు చెప్పెను:

హరి : రాజా! భగవానుడే కొన్ని భాగవతధర్మములను పంచరాత్రాది గ్రంథములలో వివరించెను. భాగవత ధర్మానుసరణముచే - భగవంతుని యందు సంపూర్ణ విశ్వాసము, శరణాగతి కలిగియుండుట, దేని గురించి యైనను భయములేని ఆత్యంతిక క్షేమభావమును కలిగియుండుట, సర్వమూ ఆ నారాయణ మయమే, నారాయణుని వినా ఇంకేమియును లేదని విశ్వసించుట, తత్త్వజ్ఞానము, భక్తి, వైరాగ్యము, ఇత్యాది సల్లక్షణము లలవడును.

ఉత్తమభాగవతుడు వర్ణాశ్రమ ధర్మ కార్యకలాపములలో తగుల్కొనక భక్తిమార్గము నాశ్రయించి, శ్రీహరి తన యందే కాక సమస్త జగత్తంతటను నిండియున్నవాడని స్థిర నిశ్చయము కలిగియుండును. అతడు ఇతర భక్తులయెడల మైత్రిని, అల్పజ్ఞుల పట్ల సానుభూతిని, విపరీతపు వ్యక్తుల పట్ల ఉపేక్షను కలిగియుండును. పరిపక్వత జెందని భక్తుడు, తాను నమ్మిన ఒకే ఒక మూర్తియందే భగవంతు డున్నట్లును, వేఱెచ్చటను లేనట్లును భావించుచు, తర్కించును. భాగవతోత్తముడు, ప్రియాప్రియములు ఎదురైనప్పుడు రాగద్వేషముల జూపడు, మోదఖేదముల జెందడు. సర్వము విష్ణువేయని, విష్ణు

అధీనమని నమ్మును. జనన మరణములు, ఆకలిదప్పికలు, శ్రమ, వాంఛ, భయము వంటివన్నీ దేహేంద్రియ మనోబుద్ధుల సహజ వికారములుగ తెలుసుకున్నవాడై వాటియందు మోహము జెందడు. అతనికి భగవంతుని పాదపద్మములు తప్ప కోరవలసిన దింకేమియు నుండదు. జన్మచేగాని, కర్మచేగాని, సంస్కార పాండిత్యములచే గాని, తాను అధికుడ నను భావమే అతనికి రాదు. నాది, ఇతరులది అనుభేద భావముండదు. అతడెల్లప్పుడును శాంత, సమచిత్తముతో నుండును. ముల్లోకముల ఐశ్వర్య సంపదలు, భోగభాగ్యములు లభించినను అతడు లోభపడడు. భగవత్పాదారవింద చింతన తప్ప అతని కింకేమియు అక్కరలేదు. అట్టివాడే భాగవతోత్తముడు".

అని హరి చెప్పగా విదర్భరాజు నిమి యిట్లడిగెను : ఋషివర్యులారా! అవిద్యలో మునిగియున్న మానవుడు మాయనుండి ఎట్లు బైటపడగలడు? అప్పుడు ప్రబుద్ధుడను ఋషి యిట్లు చెప్పెను :

ప్రబుద్ధుడు : రాజా! మానవుడు జీవించియున్నన్నాళ్లు, దుఃఖనివృత్తికి సుఖప్రాప్తికై ఏదో నొక కర్మను చేయుచునే యుండును. ఈ కర్మల ద్వారా ధనమార్జించి, భార్యాపుత్ర గృహక్షేత్రాది సంపదలను పొంది ఇహలోక సౌఖ్యముల ననుభవింపగోరును. అట్లే యజ్ఞ, జప తపాదులద్వారా పుణ్యము నార్జించి, పరలోక సౌఖ్యములను పొందగోరును. కాని, తానాశించునట్లు సుఖములను పొందగలుగుచున్నాడా? సుఖరూపమున నున్న దుఃఖమునే పొందుచున్నాడు. ఏలనన, కర్మలచే నార్జింపబడు ఫలములన్నియు నశ్వరములు అనిత్యములు, దుఃఖప్రదములు గనుక. అయితే నిత్యము, సుఖప్రదము, శ్రేయస్కరము అయిన సాధన మార్గమేది? ఒక సద్గురువు నాశ్రయించి, భాగవత ధర్మముల నాచరించుట. ప్రతిదినము సూర్యోదయాస్తమయములతో నాయువు క్షీణించుచుండగా, దేహము, భార్య, బంధు, సంపదలపై మమకారమును వీడలేక, సంసారాంధ కారములో కొట్టుకొనుచు, జన్మ జర రోగ మరణ భయములను సైతము లెక్కచేయక, దేహమే దేవుడని, దానినే పూజించుచు, సుఖపెట్టాలని యాతన పడుచు, దైవమును కూడ విస్మరించి, కాలక్షేపము చేయు వారు మూఢులు. అట్టివారితో సంపర్కము పెట్టుకొనరాదు.

ఆచరింపవలసిన భాగవత ధర్మములివి : సత్త్వగుణము, భూతదయ, హరికథామృత పాన పిపాస కలిగియుండవలెను; బ్రహ్మచర్యము, విషయవిరక్తి, సజ్జనమైత్రి, సాధుసాంగత్యము, వినయశీలము అలవరచుకొనవలెను. బాహ్యాశౌచము, అంతఃశౌచము పాటింపవలెను. తమస్సు, మౌనము, క్షమాశీలత, వేదశాస్త్రాధ్యయనము శాస్త్రానుష్ఠానము ఆచరించవలెను; సుఖదుఃఖాది ద్వంద్వసహిష్ణుత, అహింస, త్రికరణశుద్ధి, సత్యవచన నిష్ఠ, శమదమాది గుణ సాధన అభ్యసింపవలెను. భగవంతుడు సర్వవ్యాపియని విశ్వసింపవలెను. నారవల్కలములను ధరింపవలెను. అప్రయత్నముగ లభించు దానితో సంతుష్టి చెందవలెను. జనసందోహవర్జనము ముముక్షుత్వము, వేదాంత శాస్త్రార్థ జిజ్ఞాస, పెంపొందించుకొనవలెను, ఇతరదేవతానిందను చేయకుండవలెను, గృహా రామ క్షేత్ర కళత్ర పుత్ర విత్తాదులు, హరిదత్తములు గనుక, హరి సమర్పణముగ ననుభవించవలెను; భక్తులు కానివారి చెంత చేరకుండవలెను; మొదలైనవి భాగవతధర్మములు. హరిభక్తులతో చెలిమి చేయుచు, హరిలీలలను తలచుకొనుచు, ఆనందబాష్పములతో మేను పులకించుచు, భక్తిపారవశ్యమున మునుగు భక్తుడు విష్ణుమాయను దాటగలడు" అని చెప్పెను.

ఋషభపుత్రుల బోధ సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

10. శ్రీకృష్ణ బోధ

ఉద్ధవుడు, యాదవులలో నొక సజ్జనశ్రేష్ఠుడు, బృహస్పతి శిష్యుడు, జ్ఞాని శ్రీకృష్ణునికి దగ్గర బంధువే కాక, అత్యంత ప్రియతమ అనుయాయుడు. జ్ఞానబోధను పొందుటకు ఉద్ధవుడే యోగ్యుడని భావించిన భగవానుడు అతనికి తత్త్వబోధ చేసెను. శ్రీకృష్ణుని ఉద్ధవుడిట్లడిగెను :

"ప్రభూ, దేవాదిదేవా! నీ దివ్యసంకల్పము నాకు కొంచెము అర్థమైనది. ఋషుల శాపమువలన జరుగనున్న యాదవకుల నిర్మూలనము పిమ్మట నీవు నీ దివ్యధామమునకు మఱలిపోవ సంకల్పించుకున్నట్లున్నది. నా ఊహయే సరియైనచో, నీ నుండి ఎడబాటును నేను సహింపగలనా స్వామీ! నన్ను కూడ నీతోనే తోడ్కొని పోయినచో నేను నీ పాదసేవ చేసుకొనుచు ఉండెదను. అనుగ్రహింపుము ప్రభో!" అని కన్నీరు మున్నీరుగ ఏడ్చుచున్న ఉద్ధవునితో శ్రీకృష్ణుడిట్లనెను : ఉద్ధవా! నీ ఊహ సరియైనదే. నా అవతార కార్యము సమాప్తమైనది. బ్రహ్మాదిదేవతలు వచ్చి, వైకుంఠమునకు మఱలిరమ్మని వేడుకొనిరి. నేటికి ఏడవదినమున ద్వారకా నగరమును సముద్రుడాక్రమించు కొనును. యాదవకుల నాశముకూడ ఆ నాటికి ముగియును. అప్పటినుండి కలియుగ మారంభమగును. ఈ కలియుగమున, మానవులు, ధర్మమును విడిచినవారు, ఆచారములేనివారు, అన్యాయపరులు, మిక్కిలి రోషావేశపరులు, మందమతులు, అల్పాయుష్కులు, బహురోగపీడితులు, నిష్ఫలమైన పనులు చేయువారు, నాస్తికులు, అయి, ఒకరినొకరు మెచ్చక, నచ్చని వారైయుందురు. కనుక, నీవు బంధుమిత్రుల యందున్న అనుబంధములను వీడి, ఇంద్రియభోగముల యందు తగుల్కొనక, పుణ్యతీర్థములను దర్శించి, పవిత్ర అనుభూతులను పొంది, పంచేంద్రియ విషయవస్తువులు నశించునట్టివని గ్రహించి, వాటిని దరిజేరనీయకుము. ఇంద్రియ మనోవికారములను నిగ్రహించి, ఈషణత్రయమును వర్జించి, మోదఖేదాదుల యందు సమభావముతోమెలగి, ఈ జగమంతా పరమాత్మచే అధిష్ఠింపబడినదిగా తెలుసుకొని, మాయ అతని వశమున నున్నదని తెలుసుకొని, జ్ఞానవిజ్ఞాన యుక్తుడవై, ఆత్మానుభవ సంతుష్టుడవై, విశ్వమంతా నేనే యని యెఱిగి వర్తించవలెను" అని శ్రీకృష్ణుడు బోధించెను.

ఉద్ధవుడు భక్తిశ్రద్ధలతో ప్రణమిల్లి యిట్లనెను :

ప్రభూ! నీ మాయకు లోనైన నావంటి పామరుడైన సంసారులకు వైరాగ్యము, సన్న్యాసము, అంత సులువుగా నబ్బదు కదా, అట్టివారికి గత్యంతరమేమిటి? బ్రహ్మాదిదేవతలును, భ్రాంతులై పోవుచుందురు. నీ భక్తులైన పరమభాగవతులు మాత్రము నీ మాయకు లోబడరు. యోగీంద్రులకైనను, గృహస్థులకైనను, నీ యొక్క నామస్మరణమే మోక్షప్రదము గావున ఓ పరమేశ్వరా! నీ చరణకమలముల శరణమే నే నాశ్రయించు చుంటిని. కృపతో నన్ను గ్రహింపుము'' అని ప్రియభృత్యుడు వేడుకొనగా, స్వామి కరుణతో నిట్లనెను:

"ఉద్ధవా! ఆత్మకు ఆత్మయే గురువు. కుతర్కములలో చొరక, సన్మార్గ వర్తివై నా పరంధామమునకు చేరగలవు. యోగులెల్లప్పుడును, నన్ను పరమ పురుషునిగ ధ్యానించెదరు. జీవ జంతువులలో మానవులుత్తములు, మానవులలో, నిరంతర ధ్యాననిష్ఠులైన యోగులుత్తములు. సంశయగ్రస్తులు నన్ను తెలుసుకొనలేరు. నేను సత్త్వగుణము గలవారిచే గ్రహింపబడగలను అని తెలుసుకొని, తమచిత్తమందు జీవాత్మను పరమాత్మతో నైక్యపరచు కొనగలుగు వారు పరమయోగీంద్రులు; పరమజ్ఞానులు'' అని భగవానుడు చెప్పెను.

బద్ధులు, ముక్తులు : మఱియు, భగవానుడిట్లు చెప్పెను:

ఉద్ధవా! నన్నాశ్రయించి, నాచే నిర్దేశింపబడిన వర్ణాశ్రమ కులాచార, ధర్మములను బాగుగ ననుసరించు మానవుడు, కామప్రేరిత కర్మలను విసర్జించి యమనియమాదులను పాటించుచు, తన నిత్య నైమిత్తిక కర్మలు ఆచరించు చుండవలెను. స్వప్నములోని అనుభవములు సత్యము కానట్లు, ఇహలోకము లోని వ్యవహారము లన్నియు, నాత్మదృష్టితో గాంచినచో స్వప్నతుల్యములే యని తెలుసుకొనవలెను.

కనిపించే విభిన్నతలన్నీ దేహాదుల యందే ఉండునుగాని, అంతటను వ్యాపించియున్న ఆత్మలో లేదు. కట్టెలు వేఱువేఱుగా నున్నను, వాటియందు నిక్షిప్తమైయున్న అగ్ని ఒక్కటే. కట్టెలు కాలి బొగ్గు అయి బూడిదగా మారినప్పుడు, అగ్ని, అనంతాగ్నిలో కలిసిపోవునట్లు, శరీరపతనముతోపాటు

జీవుడు నిష్క్రమించును. కాలుతున్న కట్టెల ఆకారమును అగ్ని తాత్కాలికముగ ధరించునట్లు కనిపించినను, అగ్నికి ఆకారములేనట్లు, ఆత్మకు అనేకత్వముగాని, ఆకారముగాని లేవు. దేహమే తాను అనుభ్రమలో నుండుటచేత, దేహమునకు కలుగు దుఃఖములన్నియును తనవిగానే భావించుచు మానవుడు అనేకమైన బాధలకు గురి అగుచుండును. జననమరణ సంసార చక్రములో చిక్కుకొనును. సద్గురువు నాశ్రయించి, తత్త్వవిచారణచే అవిద్యను బాపుకొని, జ్ఞానాగ్నిచే కర్మలను నశింపజేసుకొని, నన్నుపాసించిన వ్యక్తి, నన్ను జేరును. ఇహలోకపు ఇంద్రియ సుఖములుగాని, పరలోకపు స్వర్గసుఖములుగాని, తాత్కాలిమైనట్టివే కాకుండ, సంసార రూపమైన అంతులేని దుఃఖములను తెచ్చిపెట్టును. బ్రహ్మాదిదేవతలైనను, త్రిగుణముల ప్రేరణచే చేయబడిన కర్మల ఫలములను అనుభవింపక తప్పదు. స్వర్గలోకవాసులును పుణ్యము క్షీణింపగనే పతనమై పునర్జన్మలను పొంది కర్మవలయములో చేరెదరు. నన్ను చేరుకొనువరకు ప్రతిజీవి, ఈ భయంకరమైన సంసార చక్రములో చిక్కుకొని తిరుగుచుండును - అని శ్రీకృష్ణుడు చెప్పగా ఉద్ధవుడిట్లనెను. "ప్రభూ! జీవుడెల్లప్పుడును బంధములో నుండుననియు, ఈశ్వరుడెట్టి బంధములులేని వాడనియు నేను భావించుచుంటిని. మఱి, జీవాత్మ పరమాత్మల ఐక్యత ఎప్పుడు ఎట్లు సంభవించును?" అని అడుగగా భగవానుడిట్లు చెప్పెను: ఉద్ధవా! ప్రకృతియొక్క త్రిగుణముల ప్రేరణచే చేయబడిన కర్మలు బంధమును కలుగజేయును. కర్మఫలము ననుభవించుటకొక శరీరము కావలయును గనుక జన్మ కలుగును. కర్మక్షయ మవగానే ఇక శరీరము యొక్క అవసరముండదు గావున బంధము వీడును, ముక్తి కలుగును. జీవుడు సహజముగ ముక్తుడే, కాని త్రిగుణముల ప్రభావమునకు లోనైన వాడై బద్ధుడగును. మాయ అనబడు ప్రకృతి, నా యొక్క అధీనము నందుండును గనుక దాని ప్రభావము నాపైన నుండదు. నేను బంధమోక్షముల కతీతుడను. అవిద్య, విద్య, నాయొక్క సంకల్పము చేతనే ప్రవర్తించును. అవిద్యవలన కలిగిన బంధము విద్య (జ్ఞానము) వలన తొలగి ముక్తి సిద్ధించును. జీవుడు నాయొక్క అంశభూతుడు. అవిద్యచే దేహమే తానను భ్రమవలన బద్ధుడగును. తానును, నాయొక్క ఆత్మస్వరూపుడే యని

జ్ఞానము ద్వారా జీవి తెలుసుకొన్నంతనే నాతో ఐక్యమగును. జీవేశ్వరుల యథార్థ తత్త్వమును తెలుసుకొన్న జ్ఞాని, కర్మల నాచరించుచున్నను, వాటి యందు ఫలాపేక్ష, ఆసక్తి లేనివాడై యుండును గావున బద్ధుడు కాడు. సూర్యకాంతి అన్నివస్తువులపై సమానముగ ప్రసరించినను, ఆ వస్తువుయొక్క మంచిచెడులు సూర్యునికి అంటనట్లు, సుగంధముపైన వీచినా దుర్గంధముపైన వీచినా, ఆగంధము వాయువునకు చెందనట్లు, తాను నిమిత్తమాత్రునిగ చేయు కర్మలు, కర్మఫలములు, తనకు చెందవు, భగవంతునకే చెందునను విశ్వాసముతో కర్మలను చేయు జ్ఞానికి ఎటువంటి కర్మబంధములు గుణదోషములు అంటవు.

ఉద్ధవా! లౌకికమైన శాస్త్రజ్ఞానము నిరర్థకము. నన్ను గురించి తెలుపునట్టిది, నా వద్దకు చేరుమార్గము చూపునట్టిదే సార్థకమైన జ్ఞానము. జ్ఞాని, నా యొక్క పవిత్రమైన సృష్టి స్థితి లయ విలాసముల గురించి నిరంతరము వినుచు, వినిపించుచు, ఆనందించుచుండును. నా యొక్క లీలాచరిత్ర గాథలను స్మరించుచు, ముచ్చటించుచు, గానము చేయుచు, అందరిని ఆనందింప జేయును. అట్టి పుణ్యాత్ముడు నన్ను చేరగలడు" అని భగవానుడు చెప్పగా ఉద్ధవుడిట్లడిగెను: దేవదేవా! అటువంటి పుణ్యాత్ముడైన భక్తుని లక్షణము లెట్లుండునో నాకు తెలియజెప్పుము" అనగా భగవానుడిట్లు చెప్పెను.

ఉద్ధవా! సాధువైన సత్పురుషునకు ఈ లక్షణములుండును. సర్వభూత దయ, అహింస, సుఖదుఃఖాదులయందు సమభావము, సహిష్ణుత, సత్యభాషణము, ద్వేషాసూయ రాహిత్యము, స్వ, పర, భేదభావములేకుండుట, పరోపకారిత్వము, కోరికలు లేకుండుట, ఇంద్రియనిగ్రహము, బాహ్యాంతః శౌచము, స్వప్రయోజనాభిలాష లేకుండుట, లౌకిక వ్యాపారములను విడుచుట, శరీర పోషణకు అవసరమైనంత ఆహారమునే స్వీకరించుట, విషయాసక్తి లేకుండుట, భగవంతుడే సర్వస్వమని నమ్మియుండుట, భగవంతుని కల్యాణ రూపగుణ వైభవములు సదా స్మరించుచు మననము చేయుట, కష్ట నష్ట శోక మోహములు, ఆకలిదప్పిక, జరా మృత్యు ఆపదరోగములవంటి ప్రతికూలస్థితు లెదురైనప్పుడు ధీరతతో నుండుట; ఇతరులనుండి

సత్కారముల నాశింపకుండుట, అందరియెడల కరుణ, మైత్రి, సత్కారభావము కలిగియుండుట; ఆత్మపరమాత్మల ఏకత్వమును గుర్తించుట - ఇట్టి సత్పురుషుడు నాకు మిక్కిలి ఇష్టుడు. తన స్వధర్మముల నాచరించుచు, సంగము లేకుండ, కర్తృత్వభావమును, ఫలమును, విడిచి, నన్ను భజించువాడు నా భక్తులలో ఉత్తముడు. ఇటువంటి సాధుసత్తముల సహవాసము చేసి, వారి సహచర్యముతో నన్ను భక్తితో నారాధించవలెను. నా మూర్తుల నర్చించుట, నా భక్తులను సేవించుట, నా లీలలను కీర్తించుట, నా కథలను వినుట, నన్ను ధ్యానించుట, సర్వము నాకే అర్పించుట, ఆత్మసమర్పణము చేయుట, నా గురించి ఉత్సవములను చేయుట, నా ఆలయములలో నా యొక్క లీలాగాథలను గానము చేయుట, పుణ్యస్థలములను దర్శించుట, శాస్త్రోక్తమైన వ్రతములను చేయుట, మొదలైన వివిధ సేవలను నా భక్తులు చేయవలెను. కొందరు ఆలయము, తటాకములు, ఉద్యానములు, మండపములు, నిర్మించెదరు. కొందరు నా దాసానుదాసులై ఆలయ సేవలను, నా భక్తుల సేవలను, చేయుచుందురు. తమకు అత్యంత ప్రియమైన వాటినే నా భక్తులు నాకు అర్పించెదరు.

ఉద్ధవా! నన్ను ఈ పదునొక్క స్థానములలో ఆరాధించవలెను. సూర్యుడు, అగ్ని, బ్రాహ్మణుడు, గోవులు, వైష్ణవులు, ఆకాశము, వాయువు, జలము, భూమి, ఆత్మ, సర్వభూతములు, యజ్ఞయాగాదులచే కూడను నన్నారాధించెదరు. సత్పురుషుల సాంగత్యము భక్తుల కెంతో అవసరము. వారి సాంగత్యసేవలలోనే భక్తిని పెంపొందించుకోవలెను. భక్తి కుదురుట అతికష్టతరము. నీవు నా భృత్యుడవు, మిత్రుడవు గావున, నీకీ భక్తిరహస్యమును చెప్పితిని. భక్తిద్వారా నన్ను చేరుట అన్నివర్గములవారికిని సుగమమగునని తెలుసుకొనుము.

ఉద్ధవా! నేను చెప్పిన భక్తిమార్గము ననుసరించువారు పొందగల ఆనందము - నిత్యానందము, దుఃఖమిశ్రితము కానట్టిది. నన్నే స్మరించుచు, నా యందే మనస్సు నిలిపి, యితర విషయములపై ఆలోచనలేక నన్నారాధించువారు నిరతిశయానందము ననుభవించెదు. వారికి ఇంద్రపదవిగాని, బ్రహ్మపదవిగాని, చివరకు మోక్షపదముగాని అక్కరలేదు. వారే నాకు అత్యంత ప్రియతములు.

నా భక్తులెచ్చట నుందురో ఆ ప్రదేశము పవిత్రమగును. వారు, నన్నే అందరియందును అన్నింటియందును చూడగలరు. నా యందు ప్రేమతో, నన్నే స్మరించుచు, నా గాథలను, గుణగణములను గానము చేయుచు, ఇతర భక్తులతో ముచ్చటించుచున్నచో భక్తి క్రమముగ వృద్ధిచెందును. ఉత్తమ సంస్కారములున్న వారింట జన్మించియు, సకలశాస్త్రములు చదివియు, నా యందు భక్తిలేని వానికంటెను, హీనస్థితిలో నుండియు, చదువు సంస్కారములు లేకున్నను నా యందు అచంచల భక్తివిశ్వాసములున్నవాడే శ్రేష్ఠుడు. నిజమైన భక్తునకు భగవన్నామము వినబడినను, భగవత్ స్వరూపము కనబడినను, ఒడలు పులకించును. ఆనందబాష్పములు కురియును, గొంతు గద్గదమగును. హృదయము ద్రవించి పొంగిపోవును. అతడు నవ్వును, ఏడ్చును, గంతులు వేయును, గొంతెత్తి పాడును, మైమఱచి పరవశించిపోవును. అతని కర్మలు కాలిపోవును; అజ్ఞానము తొలగిపోవును. అంతఃకరణము పరిశుద్ధమగును. అతడు ఇంద్రియ విషయలాలస ప్రలోభములకు లోనుగాడు. నిప్పువలె పవిత్రుడై యుండును.

ఉద్ధవా! నీవు అటువంటి భక్తుడవు గావున నాకు ప్రియతముడవు. ఉత్తమభక్తుడే నాకు అత్యంత ప్రియతముడని తెలుసుకొనుము''అని భగవానుడు చెప్పగా భగవంతుని ధ్యానము చేయుపద్ధతిని తెలియజేయుమని ఉద్ధవుడు ప్రార్థించెను. ధ్యానము గురించి కరుణామయుడిట్లు చెప్పెను:

ఉద్ధవా! నీకు ధ్యానపద్ధతిని చెప్పెద వినుము. ధ్యానమునకు ఒక ప్రశాంతమైన, శుభ్రమైన స్థలము నెన్నుకొనవలెను. అది, అతి ఎత్తుగాగాని, అతి పల్లముగాగాని లేనట్టి సమతల స్థానమై యుండవలెను. ధ్యానము చేయువాడు, ఎక్కువ సమయము సుఖముగా కూర్చొనగలుగు ఆసనము నేర్పరచుకొనవలెను. శరీరము, మెడ, తలను, నిటారుగా నుంచుకొని, చేతులను తొడలపై నిడుకొని, నాసికాగ్రముపై దృష్టిని కేంద్రీకరింపవలెను. ప్రాణవాయువు సంచరించు మార్గములైన ఇడపింగళ అనబడు నాడులను, రేచక కుంభక, పూరకములచే శోధింపవలెను. ప్రాణవాయువును నియంత్రించుట అలవాటైన పిమ్మట ఇంద్రియములు మనస్సు అదుపులోనికి వచ్చును. ప్రాణాయామముచే నాడీ శుద్ధిచేసుకొని, ఓంకారమును మందముగ నుచ్చరింపవలెను. ఓంకార

నాదము శరీరమంతటను వ్యాపించి, ఉత్తేజపరచునట్లు అనుభూతి చెందవలెను. ఇట్లు దినమునకు మూడుమార్లు చేయవలెను. ప్రతిసారి పదేసి ప్రాణాయామములు ఓంకారముతోపాటు చేయవలెను. ఓంకారము నుచ్చరించునప్పుడు గంట నాదమువలె నాడీమార్గమున ధ్వని వినిపించును. ఆ ధ్వని లోపలనే లయించిపోవును. తామర కాడలోని చిన్ననాళము గుండా ఆ ధ్వని వచ్చినట్లును, అది, ఇడా పింగళ నాడుల గుండా ప్రవహించుచున్నట్లును గుర్తింపవలెను. ఈ విధముగ అభ్యసించిన ఒక నెలదినములలో శ్వాసవాయువు అదుపులోనికి వచ్చును. ధ్యానము హృదయ కమలముపై చేయవలెను. వికసించుటకు సిద్ధముగ నున్న కమలపుమొగ్గ తలవంచి నట్లు (చెట్టుననున్న అరటిపువ్వువలె) హృదయము ఉండును. అది, తలపైకెత్తి, పూర్తిగ వికసించి, ఎనిమిది రేకులతోను, మధ్యను బంగారు ఛాయలో నున్న కర్ణికతోను ఉన్నట్లుగ భావించాలి. ఆ కమలమందు సూర్యగోళము, దానిముందు పూర్ణచంద్ర బింబము, దానిముందు అగ్నిజ్వాల, తేజరిల్లుచున్నట్లు దర్శించ వలెను. ఆ అగ్నితేజస్సు ముందర దివ్యమంగళ స్వరూపుడైన భగవానుడు కర్ణికపై నిల్చొని యున్నట్లు చూడవలెను. ఆ మూర్తి, శ్యామల వర్ణముగను, ప్రశాంతమైన దివ్యసుందర వదనము గలదిగను, చక్కని కంఠము, కపోలములు కలిగి చతుర్బాహువులతోను, శంఖచక్రగదా పద్మముల ధరించి, పట్టుపీతాంబరము ధరించియున్నట్లుగను, దర్శించవలెను. దివ్యకాంతులను వెదజల్లే మకరకుండలములు, కౌస్తుభమణి, మణిమయ కంకణములు, బంగారు మొలత్రాడు, కాలియందెలు భుజకీర్తులు, కిరీటము, ధరించియున్న భగవానుని దర్శించాలి. వక్షస్థలముపై శ్రీదేవి, శ్రీవత్సచిహ్నము, ఎన్నడును వాడిపోవని వనమాల, ఉన్నట్లుగ చూడవలెను. సర్వాంగసుందర సుకుమార మనోహర రూపముతోను, మందస్మిత ప్రసన్న వదనము, కరుణార్ద్ర పూర్ణమైన కన్నులతోను, ఉన్న భగవానుని, కన్నుల పండువుగా తిలకించాలి. పాదములనుండి కిరీటము వరకు పరిశీలనగా పరికించి, మరల కిరీటము నుండి పాదములవరకు, ప్రతి అంగమును ఆభరణమును, మాటిమాటికి తిలకించుచు, ఆ దివ్యమోహన రూపమును మనఃఫలకముపై ముద్రించుకొని, కన్నుమూసినను, కన్ను తెరచినను, చూడగలుగునట్లు అభ్యసింపవలెను.

ఇంద్రియములను విషయములపై చరింపనివ్వకుండ అరికట్టి, బుద్ధిని పరమాత్మయందు నిలపవలెను. మనస్సును స్వేచ్ఛా సంచారము చెయ్యకుండ నిగ్రహించవలెను. ఈ విధముగ ధ్యానము చేయుచు, సుందరవదనము పైనను, చివరకు మందహాసముపైనను, ధ్యానమును కేంద్రీకరింపవలెను. ఈ విధముగ మనస్సులోనున్న ఆ దివ్యస్వరూపమే విశ్వమంతటను వ్యాపించి యున్నట్లుగ దర్శింపవలెను. అప్పుడు ఇంద్రియ మనోబుద్ధులతో నున్న తన శరీరముగాని, ధ్యానము చేయుచున్న "తాను" గాని, చేయబడుచున్న ధ్యానక్రియగాని, స్పృహలో నుండవు. తన హృదయములో ఆవిర్భవింప జేసుకొన్న తేజస్వరూపుడైన ధ్యేయమూర్తియొక్క తేజస్సులో నైక్యమగును. ఇదే సమాధిస్థితి. ఈ సాధనద్వారా జీవునికి దేహేంద్రియ మనోబుద్ధులతో నున్న తాదాత్మ్యము తొలగిపోవును. ఈ సమాధిస్థితిని అభ్యాసముచే పొడిగించుకొనవలెను. ఇదియే ధ్యాన సాఫల్యము -

అని భగవానుడు చెప్పెను.

చరమ సందేశము : చివరకు భగవానుడిట్లు చెప్పెను:

"ఉద్ధవా! నా అంతిమ సందేశమును వినుము. నీ మనోబుద్ధులను నాకే అంకితము చేయుము. నన్ను సంతోషపెట్టు విధముగా ప్రవర్తింపుము. నీ కర్మలన్నియు నా కొఱకే చేయుము. నన్నే ఎల్లప్పుడు స్మరించుచుండుము. ఎటువంటి భేదభావము లేకుండ నాచే సృష్టింపబడిన జీవరాసులయందు నా యొక్క ఉనికిని గుర్తించి వాటిని గౌరవించవలెను. ఎటువంటి సంకోచము, సిగ్గు లేకుండ, కుక్క, గాడిద, చండాలుడు, గోవు యొక్క పాదములకును, సాష్టాంగ ప్రణామములు చేసి, వాటియందుండు నన్ను నమస్కరించునట్లు భావింపవలెను. విశ్వాసమున్నవారికే నా ఉపదేశములను వినిపింపవలెను. నాస్తికులకు, నమ్మకము లేనివారికేమియు చెప్పవలదు.

"బదరికాశ్రమమునకు పోయి, అలకనందా నదిలో స్నానముచేసి, వృక్ష బెరడులను ధరించి, కందమూలములను భుజించుచు, దేనియందును ఆసక్తి లేనివాడవై, శీతోష్ణాదులను సహింపుచు, నేను చెప్పిన విషయములను గుర్తుంచుకొని, నన్నే నిరంతరము స్మరింపుచుండుము. ప్రకృతి పరిధిని దాటి

నీవు నన్ను చేరగలవు'' - అని చెప్పగా, ఉద్ధవుడు భగవానునికి నమస్కరించి, ప్రదక్షిణముచేసి, ఆనంద బాష్పములతో రుద్ధకంఠముతో నిట్లనెను :

"స్వామీ! యోగీశ్వరా! శ్రీకృష్ణపరమాత్మా! నా యందత్యంత కరుణతో నీవు నాకనుగ్రహించిన జ్ఞానమువలన నా మోహము నశించినది. బంధుజనుల యందున్న మోహము తొలగిపోయినది. నీ ఆదేశము ప్రకారమే చేసెదను'' అని స్వామి పాదములను శిరస్సుపై నుంచుకొని, ఆ పాదములను విడువలేకను, స్వామినుండి దృష్టి మరల్చలేకను, స్వామి పాదుకలను నెత్తిపై పెట్టుకొని ముందుకు నడవని తన పాదములను నెట్టుకొనుచు, ముందుకు సాగిపోయెను మహాత్ముడైన ఉద్ధవుడు. బదరీ విశాల ధామమును చేరి, శ్రీకృష్ణుని ఆదేశానుసారముగ ధ్యానము చేసి పరమపదమును పొందెను -

అని శుకయోగీంద్రుడు పరీక్షిత్తునకు చెప్పి, మఱల నిట్లనెను:

రాజా! శ్రీకృష్ణునిచే ఉద్ధవునకు చెప్పబడిన ఈ భాగవత రహస్యమును గ్రహించి అనుసరించువారును భాగవతోత్తముల సేవా సత్సంగము చేసినవారును, మోహము తొలగినవారై మోక్షపదమును పొందగలరు. ఇందులకు సందేహము లేదు.

భాగవత భక్తితత్త్వము సమాప్తము

హరిః ఓం తత్ సత్

❖ ❖ ❖

బ్రహ్మాదికృత దేవకీ గర్భగత విష్ణు స్తుతిః

సత్యవ్రతం సత్యపరం త్రిసత్యం సత్యస్య యోనిం నిహితం చ సత్యే।
సత్యస్య సత్యమృతసత్యనేత్రం సత్యాత్మకం త్వా శరణం ప్రపన్నాః॥

ఏకాయనోఽసౌ ద్విఫలస్త్రిమూలః చతూరసః పంచవిధః షడాత్మా।
సప్తత్వగష్టవిటపో నవాక్షో దశచ్ఛదీ ద్విఖగో హ్యాదివృక్షః॥

త్వమేక ఏవాస్య సతః ప్రసూతిః త్వం సన్నిధానం త్వమనుగ్రహశ్చ।
త్వన్మాయయా సంవృతచేతసస్త్వాం పశ్యంతి నానా న విపశ్చితో యే॥

బిభర్షి రూపాణ్యవబోధ ఆత్మా క్షేమాయ లోకస్య చరాచరస్య।
సత్త్వోపపన్నాని సుఖావహాని సతామభద్రాణి ముహుః ఖలానామ్॥

త్వయ్యంబుజాక్షాఖిలసత్త్వధామ్ని సమాధినావేశితచేతసైకే।
త్వత్పాదపోతేన మహత్కృతేన కుర్వంతి గోవత్సపదం భవాబ్ధిమ్॥

స్వయం సముత్తీర్య సుదుస్తరం ద్యుమన్
భవార్ణవం భీమమదభ్రసౌహృదాః।
భవత్పదాంభోరుహనావమత్ర తే
నిధాయ యాతాః సదనుగ్రహో భవాన్॥

యేఽన్యేఽరవిందాక్ష విముక్తమానినః
త్వయ్యస్తభావాదవిశుద్ధ బుద్ధయః।
ఆరుహ్య కృచ్ఛ్రేణ పరం పదం తతః
పతంత్యధో నాదృతయుష్మదంఘ్రయః॥

తథా న తే మాధవ తావకాః క్వచిద్ భ్రశ్యంతి మార్గాత్త్వయి బద్ధసౌహృదాః।
త్వయాభిగుప్తా విచరంతి నిర్భయాః వినాయకానీకపమూర్ధసు ప్రభో॥

సత్త్వం విశుద్ధం శ్రయతే భవాన్ స్థితౌ శరీరిణాం శ్రేయ ఉపాయనం వపుః।
వేదక్రియా యోగతపస్సమాధిభిః తవార్హణం యేన జనః సమీహతే॥

సత్త్వం న చేద్ధాతరిదం నిజం భవేత్ విజ్ఞానమజ్ఞానభిదాపమార్జనమ్ ।
గుణప్రకాశైరనుమీయతే భవాన్ ప్రకాశతే యస్య చ యేన వా గుణః ॥

న నామరూపే గుణకర్మజన్మభిః నిరూపితవ్యే తవ తస్య సాక్షిణః ।
మనోవచోభ్యామనుమేయవర్త్మనో దేవ క్రియాయాం ప్రతియంత్యథాపి హి ॥

శృణ్వన్ గృణన్ సంస్మరయంశ్చ చింతయన్
నామాని రూపాణి చ మంగలాని తే ।
క్రియాసు యస్త్వచ్చరణారవిందయోః
ఆవిష్టచేతా న భవాయ కల్పతే ॥

దిష్ట్యా హరేఽస్యా భవతః పదో భువో
భారోఽపనీతస్తవ జన్మనేశితుః ।
దిష్ట్యాంకితాం త్వత్పదకైః సుశోభనైః
ద్రక్ష్యామ గాం ద్యాం చ తవానుకంపితామ్ ॥

న తేఽభవస్యేశ భవస్య కారణం వినా వినోదం బత తర్కయామహే ।
భవో నిరోధః స్థితిరప్యవిద్యయా కృతా యతస్త్వయ్యభయాశ్రయాత్మని ॥

మత్స్యాశ్వకచ్ఛపనృసింహవరాహహంస-
రాజన్యవిప్రవిబుధేషు కృతావతారః ।
త్వం పాహి నస్త్రిభువనం చ యథాధునేశ
భారం భువో హర యదూత్తమ వందనం తే ॥

❖ ❖ ❖